వాచస్పతి



The joy of coining new words!

BLURB

పదనిష్పాదనకళ

The joy of coining new words!

'వాచస్పతి'

హైదరాబాదు

౨౦౧౧ – ౨౦౧౨

PADA NISHPAADANA KALA - ***The joy of coining new words!*** **(**Telugu)

A Treatise on the art and craft of coinage

By 'VAACHASPATHY'

Genre : Creative Grammar/Linguistics

Contact : sreetelungu@gmail.com

Price of a single hard-bound copy on demand: ₹ 500 (incl. postal tariffs within India)

For Electronic downloads : ₹ 250 or US $ 5.00.

PUBLISHED FROM : Hyderabad, India. 2014.

॥ **ఓం శ్రీ సాయినాథాయ నమః** ॥

॥ **ఓం శ్రీ దుర్గాయై నమః** ॥

మున్నుడి

ప్రియమైన పాఠకదేవుళ్ళకి అభివాదాలు.

మిత్రులారా! చాలా సంవత్సరాల క్రితం - అంటే 2007 ప్రాంతంలో వీవెన్ గారూ, తదితర మిత్రులూ కలిసి 'తెలుగు పదం' అనే గూగుల్ గుంపు నెలకొల్పగా నేను కూడా అందులో ఒక ఆహూత సభ్యుడుగా చేఱాను. అప్పటివఱకూ తెలుగులో సమానార్థకాలు లేని ఆంగ్లపదాలకు వాటిని కల్పించడం ఆ గుంపు ఉద్దేశ్యం. ఈశ్వరానుగ్రహంచేత ఆ గుంపు ఇప్పటికీ దిగ్విజయంగా నడుస్తూనే ఉంది. నేను మాత్రం సుమారు ఐదున్నఱేళ్ళ పాటు అందులో అత్యంత క్రియాశీలం గా ఉండి తదుపరి అనివార్య కారణాల దృష్ట్యా విరమించుకున్నాను.

నేనా గుంపులో చేఱిన కొత్తల్లో నూతనాంధ్ర పదావిష్కారాల నిమిత్తం దృష్టిలో ఉంచుకోదగ్గ అంశాల గుఱించి కొన్ని వ్యాసాలు వ్రాసి ఆపేశాను. వాటిని చదివిన మఱో మిత్రులూ, తొలి తెలుగు బ్లాగరూ అయిన శ్రీమాన్ చావా కిరణ్ కుమార్ గారు, "అసలు కొత్త తెలుగుపదాల్ని రూపొందించే పద్ధతులూ, విధివిధానాల గుఱించి ప్రత్యేకంగా ఓ విపుల గ్రంథాన్నే వెలువఱిస్తే బావుంటుం"దన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వారిచ్చిన ప్రోత్సాహంతో 2010-11 ప్రాంతంలో ననుకుంటా, ఈ పుస్తకం వ్రాయడం మొదలుపెట్టాను. తీఱిక దొఱికినప్పుడల్లా వ్రాస్తూ, ఏం వ్రాయాలో తోచక అప్పుడప్పుడు మధ్యలో ఆపేస్తూ, అలా ఆపేసినందుకు వారినుండి సుతారమైన, సుతిమెత్తనైన హెచ్చుఱికలందుకుంటూ, ఆ విధంగా పడుతూ లేస్తూ, ఎలానో మొత్తమ్మీద 2012 అక్టోబర్ నాటికి పూర్తయిందనిపించాను.

నిజానికి పూర్తి కాలేదు. ఎందుకంటే ఇది చాలా పెద్ద ప్రస్తావన (topic). నేను స్పృశించకుండా విడిచిపుచ్చిన అంశాలు ఇంకా చాలానే ఉండి ఉంటాయి. మనకంటే పూర్వమే పలువుఱు నూతన పదనిష్పాదకులున్నారు. చేయితిరిగిన అనువాదకులూ ఉన్నారు. దిగ్దంతుల్లాంటి వైయాకరణ శిరోమణులూ, ఉద్దండులైన భాషాశాస్త్రవేత్తలూ కూడా ఉన్నారు. అలాగే వారు సంతరించిన హస్తభూషణాలూ ఉన్నాయి. సమస్యల్లా ఏంటంటే– ఎన్నున్నా, భాషని ఈ దృష్టితో- అంటే కొత్తపదాల నిష్పాదన దృష్టితో వీక్షిస్తూ, దాన్ని భాషాసాహిత్యవిద్యలో ఓ ప్రధానమైన ప్రత్యేకశాఖగా మన్నిస్తూ వ్రాసిన పుస్తకం ఒక్కటి కూడా నా కంట పడకపోవడం. ఆ రకంగా ఏ విధమైన ప్రాఙ్మార్గ దర్శనాలూ, దృష్టాంతాలూ (prece-

dants) లేని దుర్గమమైన బాటలోకి నేనడుగుపెట్టాల్సి రావడం – కాదు కాదు, ఆ బాటని నేనే పునాదుల నుంచి పటివాల్సి రావడం. అది నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. దీనికసలు 'తెలుగుపదం' అన్న పేరే పెట్టాలని శ్రీ చావా గారి అభిలాష. కానీ ఉదాహరణకి 1983 నుంచి తెలుగుదేశం అన్న పదం ఈ నేలమీద వాడుకలోంచి ఎలా తొలగి పో యిందో గమనించాలి. ఆ విధంగా భాషలో ప్రతిపదమూ దేనికో ఒకదానికి శాశ్వత శీర్షికో, బ్రాండునేమో, ట్రేడుమార్కో అయిపోవడం ఇష్టం లేక నేనే దీనికి పదనిష్పాదన కళ అని పేరుపెట్టాను. ఈ పేరు ఎక్కువమందికి అర్థం కాదని ఆయన అన్నారు. నిజమే కావచ్చు.

ఈ పని నేను కాకుండా ఎవరైనా మహాపండితులు చేపడితే, బహుశా దీనికి తగున్యాయం జరిగుండేది. నా కించిద్ జ్ఞత మూలాన ఇందులో పెక్కు తభావతులు దొర్లి ఉండొచ్చు. విశేషజ్ఞులూ, సహృదయులూ అయిన పాఠకవరేణ్యుల సూచనల మేరకు వాటిని తదుపరి సంస్కరణల్లో అవశ్యం సరిదిద్దుకుంటానని హామీ ఇస్తున్నాను. దయతో ఈ కృతిని పరిశీలించి ఆశీర్వదించాలని వారిని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తకాన్ని చదివినవారు ఇందులోని మార్గదర్శకాల ననుసరించి కనీసం ఒక వెయ్యి ఆంగ్లపదాలకైనా సునిశితమైన సమానార్థకాల్ని కల్పించి వాటిని జనసామాన్యపు వాడుకలోకి తీసు కొస్తే నా కృషి సార్థకమని భావిస్తాను. భవిష్యత్తులో ఈ అంశం మీద ఇంత కంటే మెఱుగైన పుస్తకాలు వెలువడాలని ఆకాంక్షిస్తున్నాను.

హైదరాబాదు — ఇట్లు
శ్రీవిజయ-మార్గశిరం — *భవదీయుడు, బుధజన విధేయుడు*
మకర సంక్రమణం, 2014. — 'వాచస్పతి'

ఎవరో కల్పించిన పదాలు
ఎంతకాలమని వాడతాం ?
పదండి మన పదాలు
మనమే ఇహ కనిపెడదాం !

విషయసూచిక

పదకొండో అధ్యాయం

పన్నెండో అధ్యాయం


పదమూడో అధ్యాయం

పద్నాలుగో అధ్యాయం

పదిహేనో అధ్యాయం

పదహాఱో అధ్యాయం

పదిహేడో అధ్యాయం



పదనిష్పాదన కళ

పదనిష్పాదన కళ

మొదటి అధ్యాయం

మనం కూడా మన మాతృభాషలో కొత్తపదాల్ని నిష్పాదించవచ్చు !

ఈనాడు వివిధ భాషలలో ఉన్న పదాలు ఎక్కణ్ణుంచి వచ్చాయో ఎవటికీ తెలీదు. వేదసంస్కృతంలో వాడబడిన పదజాలంలో కనీసం ఒక వెయ్యింటి అర్థం నేటికీ గమ్యమానం కావడం లేదంటున్నారు పరిశోధకులు. కొన్ని భాషలు ఒకే కుటుంబానికి చెందినప్పటికీ వాటిల్లోని పదాలన్నీ ఒకేలా (cognates) లేవు. ఉదాహరణకు తెలుగులో నీరు అనీ, తమిళంలో *తన్నీర్* అనీ చెప్పబడేదాన్ని మలయాళంలో *వెళ్ళమ్* అంటారు. తఱచి చూస్తే ఇది *వెల్లువ* అనే తెలుగు పదానికి దగ్గఱగా ఉందనిపిస్తుంది. అయితే మిహతా దక్షిణాది భాషలవారంతా *నీరు* యొక్క రూపాంతరాల్ని వాడుతున్నప్పుడు ఒక్క మలయాళీలకే *వెళ్ళమ్* అనాలని ఎందుకు బుద్ధి పుట్టిందనే ప్రశ్నకు మనం సంతృప్తికరమైన సమాధానాన్ని పట్టుకోలేం.

శబ్దార్థాలు (ఒక పదమూ, దాని అర్థమూ) పరస్పరం అవిభాజ్యం (inseparable) అనీ, అనాది అనీ భారతీయ శాబ్దికుల విశ్వాసం. మానవజాతుల్లాగే ఎన్నో భాషలు వాటితో పాటు పుట్టడమూ, కాలక్రమంలో గిట్టడమూ కూడా జఱిగిందని చరిత్ర ద్వారా తెలుసుకుంటున్నాం. అటువంటప్పుడు శబ్దమైనా, దాని అర్థమైనా అనాది ఎలా అవుతాయి ? అని ఒక సందేహం. అలాగే, ఒకే పదానికి విభిన్నభాషలలో విభిన్న అర్థాలుంటాయి. తెలుగులో అత్యంత సాధారణంగా ధ్వనించే ఒక పదం ఇతరులకు అశ్లీలం కావచ్చు. తెలుగు తెలియనప్పుడు, ఎంత అప్యాయంగా ఆహ్వానించినా, “రండి” అంటే ‘వేశ్య’ అని ధ్వనించి ఉత్తరాదివారు ముఖాలు మాడ్చుకుంటారు. అలాగే మనకు బూతైనది ఇతరుల చెవులకు అత్యంత సాధారణంగా ధ్వనించవచ్చు. తెలుగులో పాలు అంటే స్తన్యం. Finnish లో అదే మాటకి గడ (చెక్క/లోహపు స్తంభం) అని అర్థమట. అందాకా అవసరం లేదు. మన భాషలోనే కొన్ని పదాలకి నానార్థాలుండడాన్ని గమనిస్తున్నాం. అలాగే ఒకే భాషాపదం ఒక ప్రాంతపు మాండలికంలో సభ్యమై, ఇంకో మాండలికంలో అసభ్యార్థాన్ని కలిగి ఉండడం కూడా కద్దు. ఉదాహరణకి– రాయలసీమలో ‘బుడ్డలు’ అంటే వేఱుసెనగపప్పులు. మిగతా ప్రాంతాలలో అది ఒక చికిత్సాపేక్షమైన రుగ్మతగా అర్థం చేసుకోబడుతున్నది. అటువంటప్పుడు శబ్దార్థాలు ఏ విధంగా అవిభాజ్యమవుతాయనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది. ఐతే భారతీయ శాబ్దికులు పూర్తిగా పొఱపడలేదేమో ననిపిస్తుంది, ఇటీవలి అభిప్రాయాల దృష్ట్యా! మానవజాతి అనేకభాషల్ని మాట్లాడుతున్నప్పటికీ, ఆయా భాషాపదాలలోనూ, నిర్మాణంలోనూ అంతస్సూత్రంగా ఒక ఉమ్మడి అంతర్జాతీయసరళి (common pattern) ఉందంటున్నారు పరిశోధకులు. ఆ ధ్వనుల సరళే మన అందఱికీ

ఆయా భావాల్ని స్ఫురింపజేస్తోందట. ఉదాహరణకు – కొన్నికొన్ని రకాల భావాల్ని వ్యక్తీకరించే పదాలన్నీ – అవి ఏ భాషకు చెందినవైనప్పటికీ – ఒకే విధమైన అక్షరాలతో నిర్మాణమవుతాయంటున్నారు. పదాలకు భావస్ఫోరకత (భావాల్ని స్ఫురింపజేసే లక్షణం) ఉండడానికి కారణం మనం వాటికి చిరకాలంగా అలవాటుపడడమేనని మనం అనుకుంటున్నది పూర్తిగా నిజం కాకపోవచ్చు.

అంటే దీనర్థం – మనం పదాల్ని ఏ విధమైన శబ్దవ్యాకరణ శిక్షణా, నేపథ్యమూ లేకుండా, ఆ పదాలకి సైతం ఏ విధమైన పూర్వరంగమూ లేకుండా ఊరికే అప్పటికప్పుడు ఆశువుగా గాలిలోంచి సృష్టించినా వాటి నిర్మాణంలోనూ, అర్థస్ఫోరకతలోనూ మనకి తెలియని అదృశ్య సూత్రమేదో పనిచేస్తూనే ఉంటుంది. కాబట్టి ఎవరికి వారు కొత్తపదాల్ని కనిపెట్టడంలో ప్రాథమికంగా తప్పులేదు. ఎందుకంటే, బట్టలు కట్టుకోవడం కూడా తెలియని ఆదిమకాలం నుంచి మానవుడికి భాష తెలుసు, అఱుపుల రూపంలోనో, కేకల రూపంలోనో! ఆనాటికే అతడు దాన్ని కల్పించుకున్నాడు. ఆనాటివారు గుంపులుగా జీవించేవారు కనుక గుంపులుగానే భాషనీ సృష్టించి ఉంటారు. బహుశా ఒకఱున్నదాన్ని ఇంకొకఱు అందిపుచ్చుకుని పలికేవారు. అలా మనిషిని మనిషి అనుకరించేవాడు. పదాన్ని పదం అనుకరించేది. (ఒక పదనిర్మాణాన్ని ఆసరాగా చేసుకొని దాన్ని పోల్తూ ఇంకో పదం పుట్టుకొచ్చేది) భాషాభ్యసనన సామర్థ్యం పెద్దల్లో కంటే పిన్నల్లో మెండు. అలాగే నాగరికదశలో కంటే అనాగరికదశలోనే నూతనపద నిష్పాదన కూడా సులభం కావచ్చు,

కొత్త పదాల్ని ఎందుకు నిష్పాదించాలి ?

కాబట్టి పదనిష్పాదన సామర్థ్యం అనాదిగా యావన్మానవజాతి ప్రతిభాపాటవాలలోనూ అంతర్నిహితం (in-built), ప్రజనన పాటవం (reproductive capability) లానే ! సాధారణమైన స్వాభావిక పరిస్థితుల్లో దాన్ని ఎవఱూ ఇంకొకఱికి పని గట్టుకొని నేర్పే పనిలేదు. అలాగే ఒక జాతి నుంచి ఇంకో జాతి పదాల్ని అరువు దెచ్చుకునే అవసరం కూడా ఏమీ లేదు. అలా అరువు దెచ్చుకున్నందువల్ల ఒనగూడే పక్కా ప్రయోజనం కూడా ఏమీ లేదు. ఎందుకంటే పదాలు వాటికవి ఐకాంతిక సృష్టి (stand-alone creation) కావు. అవి మన స్ఫురణల (ideas) కూ, అభిదర్శనానికీ (perception) ప్రతిబింబాలు. స్ఫురణలు (ideas) కలగడానికి కారణం – చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల ఉన్న ఆసక్తి, సృజనశక్తి (creativity), స్పందన శీలత (responsiveness), పరిశీలన. ఒక భాషలో పదాలు తగినన్ని లేవంటే దానర్థం, దాన్ని మాట్లాడే జాతిలో ఈ నాలుగు లక్షణాలూ తగినంతగా లేవని! మనలో ఈ లక్షణాలు లోపించినప్పుడు మనం ఎన్ని పదాల్ని అడపాదడపా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నా అవి మన చిరకాల శబ్దదారిద్ర్య చరిత్రనే ప్రతిఫలిస్తాయి తప్ప మన భాషను సుసంపన్నం చేయజాలవు. పైపెచ్చు అవి మన భాష యొక్క సజాతీయతనీ, సహజత్వాన్నీ సంస్కరణదుర్లభంగా కలుషితం కావిస్తాయి. కాబట్టి మనం నిజంగా అలవఱచుకోవలసినవి ఈ లక్షణాలనే గానీ విదేశీ పదాల్ని కాదు.

"ఆంగ్లంలోకి అనేక విదేశీ పదాలు వచ్చిచేఱినప్పుడు తెలుగులో ఎందుకు ఉండకూడదు ?" అనే ప్రశ్న వేస్తారు కొంత

మంది. ఆంగ్లానికీ, ఆంధ్రానికీ చాలా తేడా ఉంది. ఆంగ్లం పరిపాలకుల భాష. ఆంధ్రం పరిపాలితుల భాష. ఆంగ్లంలోని విదేశీపదాలు వారు పరిపాలించిన దేశాల నుంచి సంగ్రహించినవి. అవి వారి బహుదేశ పర్యాటకత్వానికి సూచకం. ఆ పదాలతో వారు తమ దేశిపదాల్ని నాశనం చేయలేదు. వారికి నిజంగా అవసరమై తమ భాషలో లేని పరిభావనల (concepts) నీ, వస్తు వర్ణనల్నీ పాలితుల నుంచి సేకరించారు. అది చాలా సహజమైన పరిణామం.

తెలుగుగడ్డ మీద విదేశీ పదాల వెల్లువ సహజ పరిణామమేనా ?

మన విదేశీ పదసంపాదనేమో చాలా కృత్రిమం. ఇది వ్యామోహపూరితమైనటువంటిది. రాజకీయాధికార ప్రాబల్యంతో దేశం మీద విధించినటువంటిది. ఈ సంగతి గ్రహించలేక దీని వెనుక చాలా అపార్థాలూ, భయాలూ, మూఢవిశ్వాసాలూ, లోకజ్ఞాన లేమీ చెలామణిలోకి వచ్చాయి. ఇది మన గతకాల బానిసత్వానికి, దాన్నుంచి మార్పునొల్లని వర్తమాన జడత్వానికీ సూచకం. మనం మన ఆంగ్లపద పరిజ్ఞానంతో దేశి పదజాలాన్ని నిష్కారణంగా ధ్వంసించుకుంటున్నాం. "మీకు ఇంగ్లీషు వచ్చా ?" అని ఎవఱూ మన చొక్కా పట్టుకుని నిలదీయకపోయినా, నిలదీసినట్లే భావించి అవతలివాళ్ళ ముందు అసందర్భంగా ఆంగ్ల వావదూకతా ప్రదర్శన కావించడం మనకొక తరతరాల దురభ్యాసంగా పరిణమించింది. మన భాషలో నిక్షేపంగా *మంచినీళ్ళు* అనే వాడుక పదం ఉండగా *వాటర్* అనేవాళ్ళు పెద్దసంఖ్యలో తయారయ్యారు. ఫలానా ఆమె "నా భార్య/ మా ఆవిడ" అని చెప్పుకోవడానికి సిగ్గుపడి "మా మిసెస్" అని చెప్పుకునేవారే అంతా! ఈ రకంగా మనం తెలుగులో మిశ్రం చేసి వాడే ఆంగ్ల పదజాలంలో ముప్పాతిక మువ్వీసం అనవసరమైనది. అది వృథా విదేశీ పాండిత్యప్రదర్శనే తప్ప దానివల్ల ఈ జాతికీ, భాషకీ నిజంగా ఉపయోగం లేదు. తమ భాషలో ఎన్ని విదేశీ శబ్దాలున్నప్పటికీ ఈ నిరుపయోగమైన పనిని ఇంగ్లీషు వారెన్నడూ చేయలేదు. విదేశీ పదాల మూలాన మౌలిక ఆంగ్లభాషా స్వరూపం ప్రమాదంలో పడలేదు. కానీ తెలుగు పరిస్థితి అలా లేదు. అందుచేత ఇతర విధాలైన పోలికలు లేనప్పుడు ఆంగ్లాన్ని చూసి మనం ధీమాగా వాతలు పెట్టుకోలేం.

విదేశీ పదాలు మన భాషానిర్మాణశైలిలో ఇమడవు. తెలుగు పదాల మధ్య అవి సజాతీయంగా ధ్వనించవు. కోకిలల మధ్య కాకుల్లాగానే ఉంటాయి. వాటిని అనువదించగలమే తప్ప స్వదేశభాషా పరిజ్ఞానంతో విడమర్చి వివరించడం అసాధ్యం. అవి ప్రపంచం పట్ల విదేశీయులకున్న తరతరాల దృక్కోణానికి ప్రతిబింబాలు. అవి వారి సృజనాత్మక శక్తికి సాక్ష్యాలు. అవి ఖచ్చితంగా మన దృక్కోణం కావు. వారి దృక్కోణం వెనుక ఉన్నవి వారి చరిత్రా, వారి సంస్కృతీ! మన దృక్కోణం వెనుక మన చరిత్రా, మన సంస్కృతీ ఉండాలి. అలా ఉండాలంటే మన పదాలు తప్పనిసరిగా మనవే అయ్యుండాలి. మనం మాట్లాడే భాష మన జాతి యొక్క సమష్టి సృజనాత్మక శక్తికి దర్పణం కావాలి.

ఆంగ్ల పదజాలపు వెల్లువ చేసిన/ చేస్తూ ఉన్న నష్టం

పదాల్ని ఏ పదానికి ఆ పదం వేఱువేఱుగా దిగుమతి చేసుకోదగ్గ ఐకాంతిక స్వమూర్తులు (stand-alone entities)

గా చూడడం పొఱపాటు. నిజంగా అవి ఐకాంతిక స్వమూర్తులే అయితే నిరభ్యంతరంగా కావాల్సినన్ని విదేశీ పదాల్ని దిగుమతి చేసుకోవచ్చు, బస్సు, రైలు, సైకిలు మాదిరి! కానీ ఎక్కువ సందర్భాల్లో ప్రతిపదానికీ ఒక ధాతువు (మూల పదం), ఒక ఉపసర్గ, ప్రత్యయం, దాన్నుంచి నిష్పన్నమైన పదాలూ మొదలైన విస్తార "**పద కుటుంబం**" ఒకటుంటుంది. దాన్ని తరతరాల వ్యాకరణ సంప్రదాయాల ఆధారంగా నిర్మిస్తారు. విదేశీపదనిర్మాణాలు వారి వ్యాకరణ సంప్రదాయాల ననుసరించి ఉంటాయి. వారికి అవి తెలుసు కనుక అంతకు ముందునుంచి తమ భాషలో ఉన్న పదాల నుంచి సరికొత్త పదాలూ (derivatives), ఆ కొత్తపదాల నుంచి ఇంకా కొత్తపదాలూ– అలా అనంతంగా పదకల్పన చేసుకుంటూ వెళ్ళగలుగుతారు. అంటే వాళ్ళు తమ భాషలో తదుపరి నిష్పాదన (Further coinage) కూడా చెయ్యగలరు, అది వాళ్ళ భాష కనుక! ఇంగ్లీషులో ఉన్న పదాలు అచ్చమైన ఇంగ్లీషు పదాలే అయితే మనం ఇంగ్లీషు ఒక్కటి నేర్చుకుంటే సరి పోతుంది. కానీ దురదృష్టవశాత్తు అలా లేదు. అ భాషలో 70 శాతం లాటిన్, గ్రీకు పదాలు. ముఖ్యంగా శాస్త్ర–సాంకేతిక పరిభావనల (scientific and technological concepts) కి సంబంధించి 90 శాతం అవే.

మనం ఇంగ్లీషులోని సాంకేతిక పదాల్ని దిగుమతి చేసుకోగలమే తప్ప ఆ పదాల్ని వారిలా వికరించి (modify చేసి) తదుపరి నిష్పాదన (Further coinage) చెయ్యగలమా ? అని ఆలోచించాలి. మనం చెయ్యలేమనేది సుస్పష్టం. మన లో అత్యంత మేధావులూ, విద్యావంతులూ అయినవారు కూడా చెయ్యజాలరు. మనకి ఆంగ్లవ్యాకరణం ఒక్కటే వచ్చు. గ్రీక్, లాటిన్ వ్యాకరణాలు రావు. అవి ఇంగ్లీషు మేదావులకే వచ్చు. శాస్త్ర, సాంకేతిక, వైద్యశాస్త్ర పరిభాషలన్నీ గ్రీక్, లాటిన్‌లతో నిండిపోయి ఉన్నాయి. ఆ శాస్త్రాల్లో మనం పరిశోధనకి దిగితే అక్కడ మనం కనుగొనబోయే కొత్త విషయా లకి పేరుపెట్టడం కోసం, తదుపరి నిష్పాదన కోసం తెల్లవారి మొహాల వైపు చకోరపక్షుల్లా చూడడం తప్ప మనమేమీ చెయ్యలేం. కనుక ఆ భాషాపదాల మీద అంతగా ఆధారపడినప్పుడు అది మనకి ఒక అంగవైకల్యంగా, పరాశ్రయతగా పరిణమిస్తుంది. ఆ విదేశీ పదాల్ని దాటి మన పరిభావనలు (concepts) ఎదిగినప్పుడు ఆ విదేశీభాషలో ఆ భావనలకి వ్యక్తీకరణలు (Expressions) లభించకా, ఆ వ్యక్తీకరణలు చెయ్యడానికి మనకి స్వేచ్ఛ లేకా, గ్రీక్, లాటిన్ వ్యాకరణ సంప్రదాయాల పరిజ్ఞానలోపం వల్ల అది సాధ్యపడకా మన మెదళ్ళు స్తంభిస్తాయి. ఇక్కడ సృజనాత్మకత ఇంగ్లీషువారి చేతిలో బందీగా మారిపోతుందనీ, అది వారి పదాలతో పాటు మనదాకా ప్రవహించదనీ గ్రహించాలి.

దీనికి పరిష్కారం ఏంటి ? మన ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో ఇహముందు ప్రతివారికీ ఇంగ్లీషుతో పాటు గ్రీకూ, ల్యాటిన్ కూడా నేర్పించడం మొదలుపెడదామా ? అది హాస్యాస్పదం అవుతుంది. ఎందుకంటే ఎవఱో కొందఱు మేధావులు తప్ప అచ్చమైన ఇంగ్లీషువారే వాటినిప్పుడు నేర్చుకోవడంలేదు. పాపం, ఎన్నని నేర్చుకుంటారు పిల్లలు బళ్ళల్లో ? భాష నుంచి భౌతిక శాస్త్రం దాకా, లైంగికవిద్య నుంచి యోగా దాకా వారి మెదళ్ళని చితక్కొడుతున్నా రిప్పటికే !

దీనికి అసలైన పరిష్కారం ఉన్నది– మనం ఇంకా ఇంకా విదేశీ పదాల ఱొంపిలోనో, ఱొచ్చులోనో పీకల దాకా దిగ బడ్డంలో కాదు. మన వ్యాకరణ సంప్రదాయాల్ని మనం కూలంకషంగా నేర్చుకోవడంలో! మఱుగున పడ్డ దేశీపదాల్ని నూతన జవసత్త్వాలతో పునరుద్ధరించడంలో! మన దేశీ పదనిర్మాణాల్ని సక్రమంగా అవగాహన చేసుకొని కొత్తపదాల

కల్పనకి ఆ సూత్రాల్ని వినియోగించుకోవడంలో ! అప్పుడు, ఆంగ్లేయులకు తమ భాషలో తదుపరి నిష్పాదన (Further coinage) ఎలా సాధ్యమవుతున్నదో మనవారికీ మన భాషలో అది అలా సాధ్యమవుతుంది. కానీ మనమేం చేస్తున్నాం ? మనం ఇదేదీ చెయ్యకుండా భాషాపరంగా ఒక సోమరిమార్గాన్ని ఎంచుకున్నాం. అదేంటంటే పదాల్ని ఇంగ్లీషు నుంచి అనంతంగా, యథాతథంగా దించుకోవడం, దించుకోవడం, దించుకోవడం... ఈ దించుకోవడా నికి అంతులేదు. ఎందుకంటే మన భావదారిద్ర్యానికి అంతులేదు. దీనివల్ల మన మేధారోగ్యానికి జఱిగిన నష్టం గుఱించి ఎక్కువమందికి అవగాహన లేదు. మనకి పదాలతో పాటు భావాలు కూడా పుట్టడం మానేశాయి. దానిక్కూడా ఆంగ్లే యుల మొహాల కేసి చూస్తున్నాం. ఏ పరిశోధనైనా వారే చెయ్యాలి. వారే అన్నింటికీ పేర్లు పెట్టాలి. ఆ పేర్లనుంచి ఉద్భ వించే కొత్త భావాల క్కూడా వారే పేర్లు పెట్టాలి. మనం పేర్లు పెడితే అది సరైన ఇంగ్లీషు కాదు. మన ఆంగ్ల పదకల్పనలు హాస్యాస్పదం. యు.ఎస్. లోనూ, ఇంగ్లండులోనూ, ఆస్ట్రేలియాలోనూ దేనికి ఏమంటారో, ఎలా పలుకుతారో తెలుసుకుని మనమూ అదే చేయాలి. ఇదీ మన పరిస్థితి.

అంతిమ పిండితార్థం– మన భాషలతో - పదాల్లో గానీ, వ్యాకరణంలో గానీ వాక్య నిర్మాణాల్లో గానీ, వాడుకలో గానీ, ఏ విధమైన పోలికా లేని భాషల నుంచి పదాల్ని అదే పనిగా అప్పుతెచ్చుకోవడం వల్ల మనలో భాషాపరంగానే కాక భావ పరంగా కూడా స్వకీయతా, సృజనాత్మక శక్తీ నశించిపోతాయి. అంతిమంగా మన భాషే నశిస్తుంది. ఎందుకంటే ఆ భాషవారు మనకి నేర్పినదాన్ని మించి ఆ భాషలో మనం ముందుకు వెళ్ళలేం. మన అభిదర్శనం (perception) ఆ భాషాపదాల చేత అలా పరిమితం కావించబడుతుంది. ఏ భాషనైతే ఎంతకాలం పాటు అభ్యసించినా దాని ప్రయోగం మీదా, Further coinage మీదా మనకి అధికారం ఇవ్వబడదో అటువంటి భాషని పదాల కోసం దేవురించడం కేవలం వృథాప్రయాస.

తెలుగు పదజాలానికి మాధ్యమాలు చేస్తున్నది ఉపకారమా ? అపకారమా ?

తెలుగు మాధ్యమాలు మన వాడుకలకున్న అందాన్నీ, అర్థాన్నీ కూడా ఎలా పనిగట్టుకొని చెడగొడుతున్నాయో స్పష్టంగా తెలియజేసే ఉదాహరణ– ఈమధ్య మనం తఱచుగా చూస్తున్న **"న భూతో నభవిష్యత్"** . దీని అసలు రూపం– అనగా ఇటీవలి దాకా తమ రచనల్లో రచయితలంతా వాడిన రూపం **"న భూతో న భవిష్యతి"** అంటే – "జఱగలేదు, జఱగ బోదు" అని అర్థం. ఇప్పుడు మాధ్యమాలు వాడుతున్నది ***"...న భవిష్యత్"*** – అంటే భవిష్యత్తే లేదు. (No future at all) అని ! ఎందుకిలా చేస్తున్నారు ? అంటే కాలమ్ కక్కుర్తి. *(కానీ చూడబోతే ఈ వాడుక విషయంలో పొదుపయ్యేదేమీ లేదు)* అలాగే స్తనశల్యపరీక్షని వట్టి శల్యపరీక్షగా క్లుప్తీకరించారు. అదే విధంగా సభంగశ్లేషల్ని (puns) లక్షించి 'తిరుగుబాటు, లొంగుబాటు' మొదలైన పదాల్ని *తిరుగుబాట, లొంగుబాట* అని మార్చేస్తున్నారు. మాటిమాటికీ అలాగే వాడడం మూలాన, అవ్యుత్ప న్నులైన సాధారణపాఠకులు అవే ప్రామాణిక వ్యాకరణరూపాలేమోనని భ్రమించే పరిస్థితి ఉప్పతిల్లింది. 'సమాధానపత్రాలు' అనే పదంలో ఒక అక్షరం తగ్గితే పంక్తిబారు జాగా (column space) కలిసొస్తుం దని 'జవాబుపత్రా' లనే ఉర్దూ–సంస్కృత మిశ్రమంలోకి దిగారు.

అంతేకాక ముచ్చటైన తెలుగు పదాన్నింటినీ పక్కన బెట్టి, పెద్దపెద్ద అక్షరాల్లో "**టూర్ లో సీయం, గ్రాంటు కి కేబినెట్ నో, రైల్వే సమస్యలకు ఎస్సెమ్మెస్‌తో చెక్**" అంటూ తెలుగులిపిలో సర్వం ఆంగ్లమయం చేస్తున్నారు. అదేమని అడిగితే “మార్పు సహజం” అని బుకాయిస్తున్నారు, ఆ వాడుకలు తమ ప్రమేయమేమీ లేకుండానే వాటంతటవే అచ్చుసిరా పూసుకుని పత్రికల్లోకి వచ్చి కూర్చున్నట్లు! తెలుగుదినపత్రికలలో ఒక్కొక్కదానికీ ఒక్కో విధమైన రాజకీయపట్టింపులూ, కార్యావళీ ఉన్నాయి. ఒకఅంటే ఒకటికి ససేమిరా సరిపడనంత ఆగర్భ శత్రుత్వాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక పత్రిక ఒక ముచ్చటైన తెలుగు వాడుక చేస్తే వారిమీది ద్వేషం కొద్దీ రెండోవారు ఉద్దేశపూర్వకంగా దాన్ని నిర్లక్ష్యం చేసి ఆ పదానికి గల ఆంగ్లసమార్థకాన్నే తమ పత్రికలో కొనసాగిస్తున్నారు. ఈ విధంగా రచనారంగంలో ఉన్నవారికి సైతం భాషాభివృద్ధి కంటే భాషేతర రాజకీయాలే ప్రధానమై కూర్చోవడం శోచనీయం. మఱి వారినుంచి మనం భాషాపరంగా ఎలాంటి మార్గదర్శకత్వమైనా ఆశించగలమా? ఒకప్పుడు ఆశించగలిగేవారమేమో, తెలుగుమాధ్యమంలో చదివి కాకలుతీఱి వచ్చిన మహామహులు ఆ రంగంలో పరిఢవిల్లిన రోజుల్లో ! ఇప్పుడో ? సాధ్యం కాదు.

ఏదేమైనా తెలుగును అభివృద్ధి చేయాలంటే తెలుగుమాధ్యమాల భాషని గ్రుడ్డిగా అనుసరించడమూ, దాన్ని ప్రామాణికంగా తీసుకోవడమూ అపేక్షణీయం కాదేమో! వాటి భాషలో జాతీయతా, సృజనాత్మకతా లోపిస్తున్నాయని గుర్తెఱగాలి. ఆంగ్లపత్రికలలో దర్శనమిచ్చే భాష స్థాయితో దాన్ని ఎంతమాత్రమూ పోల్చడానికి లేదు. కారణం– మనవారు పాత్రికేయత (journalism) లోనే తప్ప తెలుగుభాషలో సుశిక్షితులు కారు. వారసలు తెలుగు పుస్తకాలు చదువుతున్నారా ? అనేదే అనుమానాస్పదం. అదే, ఆంగ్లమాధ్యమాల్లో పనిచేసేవారు ఆ భాషలో సుశిక్షితులనీ, మంచి ప్రామాణిక పరిజ్ఞానం గలవారనీ గమనించాలి.

కొత్త తెలుగు పదాల్ని ఎవఱు నిష్పాదించాలి ?

అనువాదాలకి అవసరమైన సరికొత్త తెలుగు పదజాలాన్ని నిష్పాదించే పని తెలుగు, ఇంగ్లీషు భాషల్ని శ్రద్ధగా అభ్యసించిన సుశిక్షితమైన విద్యావంతవర్గానిదే. ఇతరులు ఈ పనికి సాధారణంగా పూనుకోకూడదు. వారా అభిజ్ఞుల్ని ఆమోదించి, అనుసరిస్తే సరిపోతుంది. ఎందుకంటే, ఒక విద్య నభ్యసించినవారికే దానిమీద అభిమానం ఉంటుంది. వారే దానికి అంకితం కాగలరు. వారే ఆ విద్యకి న్యాయం చేయగలరు. ఆ భాషకి మేలు చేయగలరు. వారికే దాని తలా తోకా తెలుస్తుంది. భాషాసంబంధ వృత్తుల్లో ఉన్నప్పటికీ భాషల్ని ప్రత్యేకంగా అభ్యసించడం కోసం తమ జీవితంలో కొంతకాలమైనా ఖర్చుచేయని వారికి వాటిమీద విశేషమైన అభిమానం కలగడం కష్టం. పదాల్ని నిష్పాదించాలంటే హృదయంలో అగాధమైన, అమాయకమైన, నిస్స్వార్థమైన పదప్రేమ కావాలి. పదోత్సాహం కావాలి. కాస్తో కూస్తో లోతైన పరిజ్ఞానం కావాలి. అన్నింటినీ మించి సృజనాత్మకత కావాలి. ఒక కొత్తపదాన్ని నేర్చుకున్నప్పుడూ, కల్పించినప్పుడూ, దాన్ని ప్రయోగించినప్పుడూ ఒక వందరూపాయలు సంపాదించుకున్నంతగా మనస్సు బ్రహ్మానంద తరంగితం కావాలి. తనువు పులకాంకితం కావాలి. భాష పట్ల ఆ విధంగా దృఢమైన అంకితభావం గలవారు కావాలి. గ్రుడ్డినియమాలూ, వెఱ్ఱిమొఱ్ఱి

పక్షపాతాలూ, శాస్త్రాంతర/ విషయాంతర అభి ముఖ్యమూ పనికిరావు.

జనాదృతావాదం

ఈ సందర్భంగా కొందఱు ఒక తరహా 'జన–ఆదృతావాదాన్ని' లేవదీయడం గోచరిస్తుంది. భాష ప్రజలకు చెందినదనీ, ప్రజలే దానికి ఆద్యులనీ, సృష్టికర్తలనీ, కాబట్టి వారే అంతిమ నిర్ణేతలనీ, వారు ఏది వాడితే అదే ప్రమాణమనీ, "వాడుకలో ఉన్న పదాల్ని ఏ పండితులు సృష్టించారు ?" అని ప్రశ్నిస్తూ వాదించేవారున్నారు. 'ప్రజలు' అనేదొక సామూహిక నామవాచకం (collective noun). అదొక ఏకాండీ స్వరూపం (monolithic entity) కాదు. అదొక నామరూపరహిత స్వమూర్తి (faceless entity). అందులో అందఱం ఉన్నాం. రకరకాలవాళ్ళున్నారు. అనేక తరాలవాళ్ళున్నారు. వాళ్ళల్లో పండితులు కూడా ఉన్నారు. కనుక పండితుడు కూడా ప్రజే. ఆ ప్రజల్లో తెలియని ప్రజ కంటే తెలిసిన ప్రజ ఎక్కువ వరణీయం. రోగం వచ్చినప్పుడు అందఱూ స్పెషలిస్టుల దగ్గఱికే పరిగెడుతున్నారు తప్ప, "అన్ని వైద్యాలకూ పసరువైద్యమే మూలం" అని కోయ వాళ్ళ దగ్గఱికి పోవడం లేదేం? రోగం ఏంటో వైద్యుణ్ణే అడిగి తెలుసుకుంటున్నారు తప్ప దానిగుఱించి పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి ఊరివాళ్ళకి వోటింగ్ పెట్టడం లేదేం? భాష విషయానికొస్తేనే జనాదృతావాదమా? సరే, ఆ వాదాన్ని కాసేపు మాటవరసకి అంగీకరిద్దాం. మఱి ఆనాడు తెలుగు తప్ప వేఱే భాష లేదీ గడ్డమీద. వ్రాతకోతలు తెలియవు. అన్నీ మనసులోనే ధారణ చేసుకొని తరువాతి తరానికి అందించేవారు. మఱి అలా మారుద్దామా ఇప్పటి విద్యావ్యవస్థని కూడా?

కాబట్టి వైద్యానికే కాదు, ఈరోజుల్లో భాషక్కూడా సుశిక్షితులైన విశేషజ్ఞులు (specialists) కావాలి. ఎందుకంటే ఈ రోజుల్లో భాష కూడా ఒక పురోగతశాస్త్రమే (advanced science). ఆ శాస్త్రం తెలిసినవారే దాని మీద సాధికారంగా మాట్లాడడానికీ, దానిలో కాలోచితమైన మార్పులు చేయడానికీ, దానిమీద ఇతరులకు సలహాలివ్వడానికీ అర్హులు. మిగతా వారు కారు. అందఱూ భాషే మాట్లాడుతున్నంత మాత్రాన అది అందఱి స్వామ్యమూ అయిపోదు, పులిని చూసినవాడల్లా వేటగాడు కానట్లే! అందఱికీ రక్షణ అవసరమే గానీ అందుకోసం అందఱి చేతుల్లోనూ తుపాకులు పెట్టలేం. దానికి భటశాఖ (police department) ఉంది. సాఫ్టువేర్లు వాడుకునేవారంతా ఆ శాస్త్రం చదివినవారు కారు. వాహనచోదకులంతా ఆటోమొబైల్ ఎంజినీరింగ్‌లో పట్టభద్రులూ కారు. వారు తమకేం కావాలో తెలిసినవారు మాత్రమే. దాని కోసం ఏం చేయాలో తెలిసినవారు కారు. అలాగే, భాష అంటే అభిమానం ఉండడమూ, దానికి ఏదైనా చేయగలగడమూ ఒకటి కావు. మొదటి దానికి మనసు చాలు. రెండోదానికి శిక్షణ కావాలి.

ఇది కూడా ఆదిమకాలమైతే బావుండేది, అన్నీ ప్రజల చేతుల్లో పెట్టి మనం ఇంట్లో పడుకొని సుఖంగా నిద్రపోయేవారం ! మానవజాతి శైశవదశలో ప్రాకృతికంగా ఎదిగినప్పటి పరిస్థితుల్ని ఇప్పుడు యథాతథంగా అనుకరించలేం, అనుసృజించలేం. ఆనాటి భాషావసరాలూ, ఈనాటి భాషావసరాలూ అచ్చుమచ్చుగా ఒకటి కావు. ఆనాటి అవసరాలు తీర్చడానికి మామూలు ప్రజలు సరిపోయారు. ఇప్పుడు నిపుణులు కావాల్సిందే. ఎంత ప్రజాస్వామ్యమైతే మాత్రం ప్రజలు ఎన్నింటి

గురించి ఆలోచించగలరు ? రోజువారీ బతుకుబండి గురించా ? పర్యావరణం గురించా ? అవినీతి గురించా ? ఎవరి గొడవలు వాళ్ళవి. ఎవరి తిప్పలు వాళ్ళవి. మరోపక్క నాగరికత చాలా ముందుకొచ్చేసింది. సమాజం చాలా వివిధీభవించింది. విశేషజ్ఞతలు (specializations) ముదిరాయి. ఒకరి జీవనరంగం ఇంకొకరికి అర్థం కాదు. అందరినీ భాష గురించి ఆలోచించమని కోరలేం. ఎవరు ఏది ఆలోచించాలో వాళ్ళే అది తప్పనిసరిగా ఆలోచించాలి.

వ్యావహారికవాదం వేస్తున్న వెఱ్ఱితలలతో తెలుగుభాషకీ, నూతన పదనిష్పాదనకీ వాటిల్లుతున్న అపారనష్టం

వ్యావహారికవాదాన్ని మొదట్లో ప్రారంభించిన కీ.శే. గిడుగు రామమూర్తిపంతులుగారు అనుకున్నది వేఱు. ఇప్పటి వ్యావహారికవాదులు చేస్తున్నది వేఱు. మాట్లాడే భాషలోనే 'అన్నీ' వ్రాయాలని గిడుగు రామమూర్తిగారు అనలేదు. మాట్లాడే భాషకి ఉన్న పరిమితులు ఆయనకు తెలుసు. ఆయన కోరినది వ్యాకరణపరమైన వ్యావహారికం (colloquial grammar). పదాలవారీ వ్యావహారికం (colloquial wording) కాదు. పైగా ఆయన వాదంలో అనువాదాంశాలకు అంతగా చోటు లేదు. ప్రాథమికంగా ఆయన కోరినది విద్యావంతులు మాట్లాడే శిష్టవ్యావహారిక ప్రయోగం. అంటే "వచ్చుచున్నాను" అనే పుస్తకశైలికి బదులు "వస్తున్నాను" అని ఉండాలని ఆయన కోరారు. కానీ ఈ రోజున చాలామంది ఆయన పేరుతో తమ సొంత కార్యావళులు అమలుజఱుపుతున్నారు. పుస్తకాలలో ఉన్న అన్ని శాస్త్రసాంకేతిక పదాల్నీ వ్యావహారికం *(ఇప్పుడీ పదాని కర్థం ఇంగ్లీషు)* చేసిపారేయమని ఆయన ఎక్కడా చెప్పలేదు. అదే విధంగా తెలుగు వర్ణమాల (Alphabet) ని కుదించమనీ ఆయనెక్కడా చెప్పలేదు. వ్యావహారికం పేరుతో కులమాండలికాలూ, ప్రాంత మాండలికాలూ వాడమని కూడా ఆయన చెప్పలేదు. ఎలా మాట్లాడుతున్నామో ఆ ఉచ్చారణ విధానాన్నంతా యథాతథంగా లిపిబద్ధం చేసేయమనీ అయన అనలేదు. కానీ ఈ అన్నింటికీ పూనుకుంటున్నారు మన సమకాలీన వ్యావహారికవాదులు. ఒక ఆలోచన మేధావుల సొత్తుగా ఉండేనాటికీ, అది జనంలోకి వెళ్ళేనాటికీ నడుమ ఏ విధంగా రూపుచెడి, గుర్తుపట్టరానంతగా మారిపోతుందో, దానికి ప్రతివారూ ఏ విధంగా తమ తమ సొంతవ్యాఖ్యానాలివ్వడం మొదలుపెడతారో బహుశా ఇదొక నిదర్శనం.

వ్యావహారికవాదం కేవలం తెలుగుభాషకి పరిమితం కాదు. బయట గిడుగు రామమూర్తులు ప్రత్యేకంగా లేకపోయినా, తమిళం మినహా ఈనాడు దాదాపుగా అన్ని భారతీయ భాషల లిఖిత సాహిత్యాలలోనూ వ్యావహారికమే చాలావఱకూ వాడుతున్నారు, అవసరం కొద్దీ ! అయితే ఆయా రాష్ట్రాలవారిని మించిన తప్పుడు అభిప్రాయాలు కొన్ని తెలుగుగడ్డ మీద పాలోమని ప్రచారంలోకి వచ్చేశాయి గడిచిన వందేళ్ళల్లో ! వీటిని సరిదిద్దడానిక్కూడా ఏ ప్రయత్నమూ జఱక్కపోవడం విచారకరం.

౧. కొందఱు వ్యావహారికవాదం పేరుతో ఎదిరివాదంలోని అసమంజస అంశాల్ని ఖండించడానికి పరిమితం కాకుండా వారిని వ్యక్తులుగా ద్వేషించారు. అంటే ఒక సైద్ధాంతిక సమస్యని కాస్తా మానసిక సమస్యగా మార్చుకున్నారన్న మాట.

తదుపరిదశలో వారిని ఒక వర్గంగా ద్వేషించడం జరిగింది. అటుపిమ్మట వారందరినీ ఒక సామాజికవర్గంగా ద్వేషించడం జరిగింది (సదరు ద్వేష్యవర్గంలో అందఱూ గ్రాంథిక రచయితలు కాకపోయినా). తదనంతరం గ్రాంథిక శైలినీ, సాహిత్యాన్నీ ఏకమొత్తంగా ద్వేషించడం మొదలుపెట్టారు, ఆ సాహిత్యం గిడుగు రామమూర్తిగారి కంటేనూ, ఆయన వ్యావహారికవాదం కంటేనూ కొన్ని వందల సంవత్సరాల పూర్వం రచించబడినా కూడా !

కాలక్రమంలో ద్వేషం ఎగతాళిగా కూడా మారింది. ఉదాహరణకి – కొన్ని పాత చలనచిత్రాలలో ప్రతినాయక, విదూషక పాత్రల చేత అటూ–ఇటూ కాని అకటావికటపు గ్రాంథికంలో మాట్లాడించారు. అన్ని మాండలికాలకూ గ్రాంథికాన్ని పోలిన ఒక దేశవ్యాప్త ప్రాచీన వ్యావహారికమే మూలకందమనీ, ఒక కాలపు వ్యావహారికం ఇంకో కాలానికి గ్రాంథికంగా మారుతుందనీ, అందులో ఎగతాళేమీ లేదనీ చెప్పేవారూ, చెబితే వినేవారూ ఈ గడ్డమీద కఱువయ్యారు. అలా అలా నెమ్మదిగా వాడుక భాషపేరు చెప్పి అందఱినీ తెలుగుభాషకూ దానియొక్క సహజమైన తరతరాల ప్రాచీన వారసత్వానికీ విముఖులుగా మార్చారు. గ్రాంథిక–వ్యావహారిక శైలీభేదాలు అన్నిభాషల్లోనూ మామూలేననీ, గ్రాంథికాలనేవి ఆయా జాతుల ప్రాచీన వారసత్వాలనీ, అవి కేవలం తెలుక్కి పరిమితం కావనే వాస్తవం పూర్తిగా మఱుగున పడిపోయింది. ఐతే అన్ని ఇతర భాషలవారూ తమ గ్రాంథికాన్నీ, తమ వ్యావహారికాన్నీ కూడా తమ మాతృభాషగానే మనసారా ప్రేమిస్తున్నారు. సర్వసమగ్రంగా అభిమానిస్తున్నారు. నెత్తిన బెట్టుకుంటున్నారు. బ్రహ్మరథం పట్టుతున్నారు. కేవల గ్రాంథికాభిమానులు గానీ, కేవల వ్యావహారికాభిమానులు గానీ ఇతర జాతుల్లో కనిపించరు. దురదృష్టవశాత్తు అలాంటివారంతా ఇక్కడే దర్శనమిస్తున్నారు.

౨. వ్యావహారికానికి రకరకాలుగా– తమ అవగాహనకీ, పరిమితులకీ, అవసరాలకీ అనుగుణంగా– అపార్థాలూ, వక్ర భాష్యాలూ చెప్పసాగారు. వాటిల్లో కొన్నిటిని పైన పేర్కొనడం జరిగింది. అన్నింటికంటే ముఖ్యమైన, భాషకి అత్యంత వినాశకరమైన వక్రభాష్యాలు రెండు. మొదటిది– సాహిత్యమంతా, అది ఏ రంగానికి చెందిన సాహిత్యమైనా కానివ్వండి – సామాన్యమానవుడికి అందుబాటైన భాషలోనే ఉండాలనేది. రెండోది– వ్యావహారికమంటే సామాన్య మానవుడికి అందుబాటైన భాష కనుక అతనికి ఇప్పటికే ఏయే పదాలు తెలుసునో ఆ పదాల్లోనే యావత్తు సాహిత్యమూ రచించాలి. కొత్తపదాలు అతనికి అర్థం కావు గనుక రచయితలు ఆ జోలికే పోకూడదు. అంటే తెలుగులో కొత్త పదాలనేవే ఉండకూడదు. వాటిని రూపొందించడానికి ఎవఱూ ప్రయత్నించకూడదు. అథవా ప్రయత్నించినా ఆ కొత్తపదాలన్నీ ఇప్పటికే బాగా తెలిసిన పాతపదాల కలయికతోనే ఏర్పడినవై ఉండాలి. ఈ రకంగా పాఠకుల పరిజ్ఞానానికీ, రచయితల సృజనాత్మక స్వేచ్ఛ (creative freedom) కీ తామే నిరంకుశంగా ఎల్లలు నిర్ణయించడం మొదలుపెట్టారు. ఇప్పుడు అమల్లో కొచ్చిన ఆంగ్లమాధ్యమ విద్యావిధానప్రభావం ఫలితంగా ఎక్కువమందికి తెలుగు సాహిత్యంతో సంబంధాలు తెగిపోతున్నాయి గనుక ఇప్పుడు వ్యావహారిక పదాలంటే అర్థం ఇంగ్లీషుపదాలే. అందుచేత ఆ పదాలకి తెలుగు సమార్థకాల్ని ఎవరైనా సూచిస్తే, “అవి వ్యావహారికం కాదనీ, సామాన్య మానవుడికి అర్థం కా”వనీ వంక బెట్టి తిరస్కరించడం జఱుగుతోంది. పై అభిప్రాయాలలో చాలా తొఱ్ఱలున్నాయి. ఈ వాదాలు భాషకి చేసిన, చేస్తూ ఉన్న నష్టం చాలా గొప్పదీ, అనివర్తనీయమూను (irreversible).

(అ) వీరు చెప్పే సామాన్యమానవుడు ఎవఱో సరైన నిర్వచనం లేదు. సాధారణంగా ఒక రంగంలో నిష్ణాతుడైనవాడు ఇంకో రంగంలో బభ్రాజమానం కావచ్చు. ఏ రంగానికీ చెందనివారు ఎవఱూ లేరు సమాజంలో! కాబట్టి అందఱూ తమ తమ రంగాలకు ప్రత్యేకమైన విశిష్ట పదజాలాన్ని వాడేవారే. ఆ రంగానికి చెందనివారిక్కూడా అర్థం కావాలని వ్రాసే వారెవఱూ ఉండరు. వైద్యుడు వైద్యపరిభాషలో పాఠ్యపుస్తకాలు వ్రాస్తాడు. ఎంజినీరు ఎంజినీరింగ్ పరిభాషలో పాఠ్యపుస్త కాలు వ్రాస్తాడు. ఆయా రంగాలలో కొత్త ఆవిష్కారాలు వెలుగులోకి వచ్చినప్పుడు, లేదా కొత్తపరిభావనలు ముందుకొచ్చి నప్పుడు వాటిని వ్యక్తీకరించడానికి కొత్తపదాలు తప్పనిసరిగా కావాలి. ఒకవేళ ఆ కొత్తపదాలు ఒక విదేశీభాషలో ఉన్న పక్షంలో వాటిని సరికొత్త తెలుగుపదజాలంతో అనువదించుకోవాల్సి వస్తుంది. వ్యావహారికానికి వీరు చెప్పే స్వకపోల కల్పిత అపార్థాల్ని నమ్ముకుంటే ఇదేదీ జఱగదు.

(ఆ) అందుబాటుభాష అంటే ఏమిటి ? మన పదపరిజ్ఞానం ఐదేళ్ళవయసప్పుడు ఉన్నట్లు పదేళ్ళ వయసప్పుడు లేదు. పదేళ్ళప్పుడు ఉన్నట్లు పాతికేళ్ళప్పుడు లేదు. అది వయసు గడిచేకొద్దీ పెఱుగుతూ పోతుంది. కాబట్టి అర్థం కావడం అనేది సార్వజనికమూ, సార్వకాలీనమూ కాదు. అది వయోవిశిష్టం (age-specific), వర్గవిశిష్టం (class-specific), ప్రస్తా వనవిశిష్టం (topic-specific) ప్రకరణవిశిష్టం (context-specific). పాతికేళ్ళవాడి అందుబాటుభాష పదేళ్ళవాడికి అందుబాటు కాదు. అలాగే యాభయ్యేళ్ళవాడి అందుబాటుభాష పాతికేళ్ళవాడికి అందుబాటు కాదు. మనుషులు కాస్త ఎక్కువ తెలుసుకుందామనే చదువుతారు. మెఱుగైన కొత్త భాషాప్రయోగాలు కూడా ఈ ఎక్కువ తెలుసుకోవడంలో భాగ మే. అంతేతప్ప, విషయాన్నీ, దాన్ని వ్యక్తీకరించడానికి ఉపయోగించే భాషనీ వేఱు చేసి మాట్లాడడం సరైన జీవన వేదాంతం కాదు. కనుక విషయపరంగానూ, వ్యక్తీకరణల పరంగానూ రోజురోజుకూ ఎదగడమే మంచిమనుషుల లక్షణం. మంచిపాఠకుల లక్షణం. వారు అలా ఎదగడానికి చేయూత నివ్వడమే మంచి రచయితల లక్షణం. మెఱుగైన కొత్తపదజాలం ఈ ఎదుగుదలకు విశేషంగా తోడ్పడుతుంది. ఎందుకంటే ఆయా భావాలకి గల పేర్లు స్థూలంగా తెలి యడం వేఱు. ఆ భావాల్లోని సూక్ష్మ–సూక్ష్మ తారతమ్యాల్ని సైతం నిశితంగా విచక్షించి వ్యక్తీకరించడం వేఱు. అలా విశిష్టంగా వ్యక్తీరించే నిమిత్తం విశిష్టమైన పదాలు తప్పని సరిగా కావాల్సిందే. వాటిక్కూడా మామూలు రోజువారీ పద జాలాన్నే వాడి తృప్తిపడమని ఇతరుల్ని నిర్బంధించే హక్కు ఎవఱికీ లేదు. ప్రపంచంలో 700 కోట్లమంది మనుషులున్నా సరే, ఒకఱికి ఇంకొకఱు ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాదు. అలాగే పర్యాయపదాలే అయినప్పటికీ ఒక పదానికి ఇంకో పదం ఎన్నటికీ సంపూర్ణ ప్రత్యామ్నాయం కాదు. ఒక పదం బదులు ఇంకో పదంతో సరిపెట్టుకోవాల్సినది పరమ సామాన్యులు. విద్యావంతులు కాదు. కాబట్టి కొత్త వ్యక్తీకరణల కల్పన నిరంతరం అఖండ స్రోతస్సుగా కొనసాగుతూ పో వలసిందే.

(ఇ) తెలిసిన పదాల సహాయంతోనే విదేశీపదాల్ని అనువదించాలని భావించడం మఱో పొఱపాటు. ఈ అభిప్రాయం మన వారికే తప్ప ఆ విదేశీపదాల రూపకర్తలకు లేదని గమనించాలి. ప్రతికొత్త పరిభావనకూ ఒక కొత్తపదం అవసరం. తద్విపర్యాసంగా, వాడుకభాష పేరో, సామాన్యమానవుడి పేరో చెప్పి ప్రతి కొత్తభావాన్నీ పాతపదాలతోనే వ్యక్తీకరించాలని చూస్తే కొంతకాలానికి ప్రతిపదానికీ భాషలో డజనో, అఱడజనో అర్థాలు తయారై భాష మొత్తం దురవగాహంగానూ, దుర్భేద్యంగానూ మారిపోతుంది. చాలా అయోమయంగా ఉంటుంది. ఆ పదాల బదులు విదేశీ పదాల వాడకమే నయ

మనే పరిస్థితి కూడా తలెత్తుతుంది. కాబట్టి రచయితలూ, పదనిష్పాదకులూ తమ మాతృభాషాపరిజ్ఞానాన్ని పెంచుకోవడం, కొత్త పదప్రయోగాల ద్వారా కొత్త పరిభావనల్ని పాఠకులకి పరిచయం చేయడం ఆవశ్యకం.

(ఈ) వ్యావహారికవాదం పేరుతో భాషాపండితుల్ని దూషించడం, ద్వేషించడం ఈ గత వందేళ్ళల్లో చాలా ఎక్కువైంది. భాష సరిగా రానివాళ్ళనీ, సరిగా నేర్చుకోనివాళ్ళనీ అనవసరంగా గ్లామరైజ్ చేస్తున్నారు. రొమాంటిసైజ్ చేస్తున్నారు. తెలిసినవాడూ, తెలిసింది చెప్పేవాడూ, సరైన వాడుకలు చేసేవాడూ, తప్పులు సవరించేవాడూ ఈ అసహజమైన వాతావరణంలో విషమయ్యారు. ప్రతిసబ్జెక్టుకూ పండితులున్నప్పుడు, ఆ సబ్జెక్టులకు సంబంధించి వారి మార్గదర్శనాన్ని నిరభ్యంతరంగా స్వీకరిస్తు న్నప్పుడు, వాళ్ళెవ్వఱినీ ద్వేషించనప్పుడు భాషాపండితుల్నే ఎందుకు ద్వేషిస్తున్నారు ? భాషనీ, దాని నియమాల్నీ, పనితీరునీ క్షుణ్ణంగా అర్థం చేసుకున్నవారినీ, పెద్దల మార్గంలో సుశిక్షితులైనవారినీ ద్వేషించి భాషని ఎలా ఉద్ధరిస్తారు? ఎంజినీర్లని ద్వేషించి ఆనకట్టలెలా కడతారు ? ఏ జాతైనా, దేశమైనా తన భాషాపండితుల్ని గౌరవిస్తుంది. వారి రూపంలో తన సభ్యతనీ, సంస్కారాన్నీ భద్రపఱచుకొని భావితరాల కోసం కాపాడుకుంటుంది. ఇక్కడిలా వారిని అవమానించే కుసంస్కారం ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నట్లు వినలేదు.

(ఉ) వ్యావహారికం పేరుతో మనకి సమకాలీనంగా వ్రాతలో దర్శనమిచ్చే భాష ముప్పాతిక మువ్వీసం గ్రాంథికం నుంచి అరువు దెచ్చుకున్నది, లేదా కాపీకొట్టినది మాత్రమే. గ్రాంథికంలోని శక్తిమంతమైన వ్యక్తీకరణల్ని వ్యావహారికంలోకి దిగుమతి చేసుకొని వ్యాప్తిచేయగా దాన్ని ఈరోజు మనం వాడుకభాష అంటున్నాం. అంటే గ్రాంథికాన్నే మనకర్థమైనంత మేఱకు వ్యావహారికమని పిలుస్తున్నాం. అలా వాడుకలోకి రాకుండా పుస్తకాలకే పరిమితమైన ఇంకెంతో శక్తిమంతమైన పదజాలం గ్రాంథికంలో ఉంది. ఆ మిగిలిన గ్రాంథికం కూడా ఇప్పటికీ ఎంతో ఉపయుక్తమే. అలాగే ఏ భావాన్ని కొత్తగా చెప్పాలన్నా, లేదా ఏ కొత్తభావాన్ని అనువదించాలన్నా మళ్ళీ గ్రాంథిక పదబంధాలూ, వాడుకలే మనకి శరణ్యమౌతున్న పరిస్థితి ఉంది. ఇలా అడుగడుగునా గ్రాంథికంపై ఇతోఽధికంగా ఆధారపడుతూ దాన్ని ద్వేషించడం సమంజసం కాదనే స్ఫురణ వ్యావహారికవాదులకి ఈనాటికీ లేదు.

(ఊ) కవులూ, రచయితలూ, శాస్త్రవేత్తలూ అన్నాక వారికి సృజనస్వేచ్ఛ (creative freedom) ఉంటుంది. ఉండాలి కూడా. వైవిధ్యం సృజనస్వేచ్ఛకున్న ప్రధానలక్షణం. ఎంతో కొంత నవనవోన్మేషతనీ, వైవిధ్యాన్నీ చూపలేనిది సృజనే కాదు. తన రచన యొక్క విషయాన్నీ, రూపాన్నీ, శైలినీ నిర్ణయించుకునే హక్కు సృజనకారుడిదే. సృజనకారులు సాధారణంగా జనసామాన్యం కంటే ఎక్కువ తెలిసినవారూ, ఎక్కువ అనుభూతి చెందేవారూ, విషయాలకి ఎక్కువ స్పందించే వారూ అయ్యుంటారు. అలా ఎక్కువ తెలిసినవారి భావాల వ్యక్తీకరణకి ఎక్కువసంఖ్యలో ఉన్న పదాలూ, ఎక్కువస్థాయిలో ఉన్న ప్రయోగాలూ అవసరమౌతాయి. పురోగత సంస్కృతుల్లో ఒక భావాన్ని అనేక కోణాల నుంచి రకరకాలుగా చెప్పడానికి అవకాశం ఉంటుంది. "గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి" అంటాడొకడు. "గుండె జాఱిపోయింది" అంటాడు ఇంకొకడు. "గుండె గొంతు లోకొచ్చింది" అంటాడు వేఱొకడు. "గుండెలో ఱాయి పడింది" అంటాడు మఱొకడు. సరే ! ఇవి వినగానే అర్థమయ్యే వ్యక్తీకరణలనుకోండి. కానీ కొన్నికొన్ని అలా వినగానే అర్థం కావు. ఎందుకంటే కవి పొందిన అనుభూతి అనిదంపూర్వమైనప్పుడూ, దాన్ని అంతకు ముందెవ్వఱూ వెలిబుచ్చనప్పుడూ దాన్ని అనుభూతిలోకి తెచ్చుకుని ఆస్వా

దించడానికి పాఠకుడికి కొంత సమయం పట్టుతుంది. దానికి కొంత మననమూ, శిక్షణా అవసరమవుతాయి. "*ఎందే చిత్తము కందళించు రహిచే నేకాగ్రతన్ బొంది....*" అని పోతనగారు వ్రాసినది గ్రాంథికం తెలిసినవారిక్కూడా మొదటి చూపులో అనుభూతిలోకి రాదు. ఆ పద్యాన్ని మళ్ళీ మళ్ళీ చదివి, మననం చేసుకొని, అలా మనసుకి కొంత సన్నద్ధతా, శిక్షణా కల్పించాక అప్పుడు కవి వివక్షితార్థం ఏంటో అవగతమౌతుంది. అదీ, సదరు చదువరి ఆ పుస్తకం యొక్క లక్షిత పాఠకవర్గానికి (target readership) చెందినవాడైతేనే! అసలు ఆ సబ్జెక్టే అవసరం లేదనేవారి కోసం వ్యావహారికంలో వ్రాసి ప్రయోజనమేంటి ? పద్యభావం అవగతమయ్యాక, ఆ వివక్షితార్థాన్ని మామూలు మాటల్లో చెప్పకుండా కవి మంచిపనే చేశాడనీ, ఆయన ఉద్దేశం వాడుకభాష ద్వారా వ్యంజనీయం కాదనీ గ్రహిస్తాం. తద్విరుద్ధంగా, వ్యావహారిక వాదం పేరిట సృజనస్వేచ్ఛని హరించి, అన్నీ దారినపోయే దానయ్యలక్కూడా అర్థం కావాలని ఒత్తిడిచేయడం మూలాన "ప్రత్యేకవ్యక్తీకరణలూ, విశిష్టపదప్రయోగాలూ చేసేవారంతా సామాన్యపాఠకుల పట్ల ద్రోహులూ, పాండిత్య ప్రదర్శనా లాలసులూ" అనే ఒక అన్యాయప్రచారమూ, దాన్తో పాటు అవహేళనా ప్రబలాయి.

(ఋ) వీరిలోనే మఱికొంతమంది ఇటీవల బయలుదేఱి "తెలుగుభాష స్వాభావికంగా చాలా సరళమైనదనీ, కొత్త పదాల పేరుతో, లేదా ఆంగ్లపదాల అనువాదాల పేరుతో భాషని సంక్లిష్టంగా, గందరగోళంగా అర్థం కాకుండా మార్చేస్తున్నా"రనీ విమర్శించడం మొదలుపెట్టారు. కొత్త తెలుగుపదాలు బాగాలేవని చెప్పడానికి వారెంచుకున్న 'శాస్త్రీయ' మార్గం వాటిని అవహేళన చేయడం. ఎవరైనా పరాయిభాషవారికి తెలుగు నేర్పడానికి ప్రయత్నించి చూడండి, ఈ భాష స్వతహాగా సరళం అవునో కాదో తెలిసిపోతుంది. వీరు సరళాంధ్రం అంటున్నది కూడా తమకి పుట్టుకతో వచ్చినది కాదనే సత్యాన్ని విస్మరిస్తారు. పుట్టి పెఱుగుతూ ఉన్న క్రమంలో కొద్దికొద్దిగా నేర్చుకుంటూ ఏళ్ళ తరబడి పెంచుకున్న పరిజ్ఞానమే అది. "ఆ కృషినే ఇప్పుడు కూడా కొనసాగించండి కొత్తపదాల విషయంలో" అని చెప్పినప్పుడు "ఎందుకు చేయాలి, అదీ ***తెలుగు కోసం?***" ఇదీ వారి మదిలో మెదిలే ప్రశ్న.

ఇటువంటి ఫిర్యాదులు చేసే చాలామందికి కొత్త ఇంగ్లీషుపదాలు నేర్చుకునే విషయంలో మటుకు ఏ ఫిర్యాదులూ లేవని గమనించాలి. వాటి విషయంలో ఎప్పటికప్పుడు 'అప్‌డేట్' అయిపోవాలని తాపత్రయపడడం మామూలు. పైపెచ్చు అర్థమయ్యే భాషలోనే అన్నీ ఉండాలని వాదించే వీరవ్యావహారికవాదులు నరమానవుడికి అర్థం కాని ఇనపగుగ్గిళ్ళ ఇంగ్లీషుశైలిలో వ్రాయడానికీ, మాట్లాడడానికీ ప్రయత్నిస్తూండడం కూడా సర్వసాధారణం. అదేంటో గానీ, అన్ని చిక్కులూ తెలుగుతోనే వస్తాయి. తెలుగుపేరెత్తితేనే బుఱ్ఱ పనిచేయనంటూ మొఱాయిస్తుంది. తెలుగు అంటే చాలు, ఏదో తెలీని ఏవగింపు, కంటగింపు, తిరుగుబాటు భావన వారి హృదయాల్లో చెలరేగుతాయి. ఈ విధంగా వ్యావహారికవాదమనేది మన కాలానికొచ్చేసరికల్లా గుర్తుపట్టలేనంతగా రూపుమార్చుకుని ముసుగేసుకున్న మాతృభాషాద్రోహంగా, ప్రచ్ఛన్నఆంగ్ల వ్యామోహంగా, పక్కా అభివృద్ధినిరోధకంగా, ఆచరణలో యావద్భాషా విధ్వంస కార్యక్రమంగా, సకల వారసత్వానికీ పరశురామప్రీతిగా పరిణమించింది.

సమస్య ఏంటంటే, ఎవఱి వ్యక్తిగత కార్యావళులు (personal agendas) వారికున్నాయి. దురదృష్టవశాత్తు తెలుగు భాషాదేవి శరీరంలో ఒక కాలో, చెయ్యో, ముక్కో, మూతో ప్రేమించేవాళ్ళు మాత్రమే మనకు లభ్యమౌతున్నారు. యావత్తు

తెలుగుభాషనీ సర్వసమగ్రంగా, ఏకమొత్తంగా ప్రేమించేవాళ్ళు కఱువుగా ఉన్నారు. తెలుగులోకి ఇంగ్లీషుని యథేచ్ఛగా దిగుమతి చెయ్యడాన్ని ఆమోదించాలనీ, అలా ఆమోదించనివారు ద్రోహులనీ, ఛాందసులనీ తిట్టే వ్యక్తి ఒకఱు తగిలారు.

వ్యావహారికానికి వ్యాకరణం లేదా ?

కొన్నికొన్ని అభిప్రాయాలు ఎందుకు, ఏ విధంగా ప్రచారంలోకొస్తాయో అర్థం కాదు. అలాంటివాటిల్లో ఒకటి – వ్యావహారికమంటే వ్యాకరణంతో పనిలేని భాష అనీ, లేదా వ్యావహారికంలో వ్యాకరణ నియమాల్ని పాటించనక్కఱలేదనీ, వ్యావహారికమంటే ఎవఱిష్టమొచ్చినట్లుగా వారు చెలరేగిపోతూ భాషాపరమైన అరాచకాన్ని ఆస్వాదించడమేననీ భావించడం. మానవ నాగరికతలోనూ, మానవ కార్యకలాపాల పరిధిలోనూ నియమాలు లేని రంగం ఒకటి కూడా దర్శనీయం కాదు. మనుషుల్ని బ్రతికించడానికీ, చంపడానిక్కూడా కొన్ని నియమాలున్నప్పుడు మేధాజీవి అయిన మనిషి సాలోచనగా మాట్లాడే భాషకి నియమాలు లేవనుకోవడం వివేకవంతం అనిపించుకోదు. కాబట్టి వ్యావహారికానిక్కూడా తన నియమాలు తనకున్నాయి. మనకు తెలియకుండానే వాటిని అనుసరించి సంభాషిస్తాం. మన సస్పృహ సావధానంలోకి రానంత మాత్రాన అవి లేవనుకోకూడదు. ప్రపంచంలో మనకు సంబంధించిన ప్రతీదీ మనకు తెలిసి జఱగదు. మన హృదయస్పందన, జీర్ణ క్రియల్లాగానే! వ్యావహారిక నియమాలు గ్రాంథిక భాషానియమాల్ని అచ్చుమచ్చుగా అనుసరించేవి కాకపోవచ్చు. కానీ అవీ నియమాలే. ఎవఱైనా వాటిని పాటించి తీఱాలి. అది తమకోసం, తమ యొక్కా, ఇతరుల యొక్కా సమీచీన అవబోధ కోసం! మనం బళ్ళలో నేర్చుకునే ఇంగ్లీషు నిజానికి ఆ దేశస్థుల అనునిత్య వ్యావహారికమే. మఱి దానికో వ్యాకరణం ఉందని నేర్చుకుంటున్నాం గదా! వ్యావహారిక తెలుగైనా అంతే !

నియమాలన్నీ మార్పుకూ, ప్రగతికీ అవరోధాలనీ, వాటిని సమర్థించేవారూ, బోధించేవారూ మార్పుకూ, ప్రగతికీ శత్రువులనీ భావించే ధోరణి సరికాదు. మనం కోరుకునే మార్పులూ, పురోగతులూ అమల్లోకొచ్చిన తరువాత వాటిక్కూడా నియమాలేర్పడ తాయి. నియమాల్ని అనుసరించడం ద్వారా మనం ఏం చేస్తున్నాం? మానవచింతనలోని స్వభావసిద్ధమైన క్రమశిక్షణని గౌరవిస్తున్నాం. ఆ భాష మాట్లాడే ప్రజానీకాన్నీ, వారి పూర్వీకుల్నీ, వారి మేధావారసత్వాన్నీ గౌరవిస్తున్నాం. ఆ భాషలో కాలపరీక్షకు తట్టుకుని నిలబడగల హేతుబద్ధ సంప్రదాయాల్ని బ్రతికిస్తున్నాం.

ప్రామాణికత వేఱు – సౌలభ్యం వేఱు (Standards and Convenience)

"వాడుకభాష అంటే సామాన్యప్రజలు వాడేదేననీ, అందులో వినపడే ప్రతి వాడుకా, పదమూ ప్రామాణికమే" ననే వాదన. దీనితో ఏకీభవించడం కష్టం. ఎందుకంటే ప్రామాణికత అంటే అందఱికీ అనుసరణీయమైనది. అది వ్యక్తిగతం కాదు. కానీ సామాన్యప్రజల వాడుక వ్యక్తిగతం.

ఈ పై వాదన కేవలం ప్రామాదికం. మనుషులు సాహిత్యం నుంచీ, ప్రామాణికులైన మేధావుల నుంచి నేర్చుకోవాల్సిన

అవసరాన్నీ, అలా బౌద్ధికంగా ఎదగాల్సిన అవసరాన్నీ ఇది రద్దు చేయబూనుకుంటోంది. ఇది ఎక్కడున్నవారు అక్కడే ఉండాలని ఆశిస్తోంది. ప్రామాణికాలంటూ ఏమీ లేవని, ఉండవని, ఉండకూడదనీ చెప్పడం దీని అంతరార్థంలా తోస్తోంది.

వాడుకలో ఉన్న ప్రతిదీ ప్రామాణికం కాదు. అదే నిజమైతే ఏ భాషాప్రజలకీ తమ భాషావ్యాకరణం అవసరం లేదు. అలాగే వారికి నిఘంటువులు కూడా అవసరం లేదు. ప్రామాణికం అనేదానికున్న అర్థం బహులోతైనది. ఒక పదానికి లేదా వాడుకకి ప్రామాణికత ఎలా సిద్ధిస్తుందో అర్థం చేసుకుంటే ఆ ప్రక్రియ ముందు వాడుక అనేది ఎంత చిన్న విషయమో మనకి అర్థమవుతుంది. పై అభిప్రాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటే ప్రతివారూ తన ఇష్టమొచ్చినట్లు వ్రాస్తూ, పలుకుతూ అలాంటి తప్పుల తడిక భాషని తన అధికారబలాన్ని, మందబలాన్నీ, మందిబలాన్నీ ఉపయోగించి తన అజ్ఞానాన్ని వాడుకభాష పేర ఇతరుల నెత్తిన రుద్దుతూ చెలరేగిపోతారు. (ఇప్పుడు జఱుగుతున్నది అదేననుకోండి) ఆ తరువాత కొద్ది వందల సంవత్సరాల అనంతరం ఆ భాషాప్రజలు వెనక్కి తిరిగి తమ భాష వైపు చూసుకున్నప్పుదు వారసత్వం స్థానంలో ఒక అస్తవ్యస్తపు సాంస్కృతిక అరాచకం గోచరిస్తుంది.

పదస్వరూపాలకి ప్రామాణికత సరైన వ్యుత్పత్తుల (etymologies) ద్వారాను, శబ్దార్థాల యొక్క సమ్యక్ సమన్వయం ద్వారాను సిద్ధిస్తుంది. ఒకే పదానికి అనేక వ్యుత్పన్నాలు (derivatives) ఉన్నప్పుడు వాటిల్లో ఒకదాన్ని మటుకు బొత్తిగా మిగతా వాటితో సంబంధం లేని అర్థంలో వాడుతూంటే, అలా ఎంతమంది వాడినా సరే, అది ప్రామాణికం కాదు. అది సరిచెయ్యదగ్గ పొఱపాటు మాత్రమే. అలాగే పదం యొక్క అసలు వ్యుత్పత్తినే నిర్మూలించే విధంగా కొంతమంది పలుకుతున్నారనే కారణం చేత ఆ దోషభూయిష్ఠ ఉచ్చారణ ప్రామాణికం కాదు. అది సరి చెయ్యదగ్గ పొఱపాటు మాత్రమే. అలా అసాధురూపాలు (incorrect forms) ప్రామాణికం అవాలంటే ఆ భాషకున్న వేలాది సంవత్సరాల చారిత్రిక నేపథ్యం చాలావఱకు (మళ్ళీ లభ్యం కావడానికి వీల్లేని విధంగా) నశించాల్సి ఉంటుంది.

పదస్వరూపాలకి ప్రామాణికత ప్రామాణిక వ్యక్తుల వాడుక ద్వారా, వారు రచించిన ప్రామాణిక గ్రంథాల ద్వారా వ్యాపిస్తుంది. ఒక్కొక్క జీవనరంగంలోను ఒక్కొక్క విధమైన ప్రామాణికులు ఉంటారు. రాజకీయాల్లో ప్రామాణికుడైన వాడు కళల్లో ప్రామాణికుడు కాదు. కళల్లో ప్రామాణికుడైనవాడు వ్యాపారరంగంలో కాదు. అలాగే భాషాసాహిత్యాలలో ప్రామా

ణికులైన వ్యక్తులే పదస్వరూపాలకి ప్రామాణికులు. వారు తమ సొంతుగొంతుగా, సొంత అభిప్రాయంగా, సొంత కల్పనగా వినిపించినవాటిల్లో ఏయే వాడుకలు చేశారో అవే ప్రామాణికం. అంతేగానీ దారిన పోయే ప్రతి దానయ్యా చేసే వాడుకలు ప్రామాణికం కావు, వారు ఎంతమందున్నా సరే ! భాషాసాహిత్య విషయాల్లో వారు ప్రామాణికుల్ని అనుసరించాల్సినవారే తప్ప, అనుసరణీయ-వ్యక్తులు ఎంతమాత్రమూ కారు.

వాడుక ఒక సౌలభ్యం. అంతే తప్ప దానికి ప్రామాణికత లేదు. రెండింటినీ కలిపికొట్టడం, రెండింటికీ అభేదం పాటిం

చడం మాస్ రాజకీయమో, వర్గరాజకీయమో అవుతుంది తప్ప విద్యాపర చర్చ (academic discourse) అనిపించు కోదు. ఒకఋ సోషలైజేషన్ అని పలకలేక సోసలైజేసన్ అంటారు. అది అతని సౌలభ్యం. నాకు తెలిసిన ఒకాయన తొంభై కి టొంబై అనేవాడు. అది ఆయన సౌలభ్యం. అంతే తప్ప అది ప్రామాణికం కాదు.

ఇది ప్రజాస్వామ్యమైనంత మాత్రాన జనం సర్వజ్ఞులు కారు. జనానికి "ఇది తప్పు, ఇది ఒప్పు" అని చెప్పే హక్కూ, బాధ్యతా విషయపరిజ్ఞానులైన మేధావులకి, ప్రామాణికులకీ తప్పనిసరిగా ఉన్నాయి. అంతే తప్ప వారు తమ కంటే తక్కువ తెలిసినవారిని అనుసరించనక్కఱలేదు. ఎందుకంటే విద్యావంత మేధావులు సాంస్కృతిక నాయకులు. సామాన్య ప్రజల తప్పుల్ని సరిదిద్దకపోతే వారు విద్యావ్యవస్థ నుంచి పొందాల్సిన ప్రయోజనాన్ని పొందలేకపోతారు. నమూనా పాత్ర లూ (role models), ప్రామాణికాలూ, మార్గదర్శకాలూ లోపించడం చేత వారిలో సృజనాత్మకత కూడా ఎదగాల్సి నట్లుగా ఎదగదు.

అర్థం కానిది ఎవఱికి ?

శాస్త్రసాంకేతిక సాహిత్యాన్ని తెలుగువారికి తెలుగులో అందించాలని చెప్పినప్పుడు, "తెలుగులో అందుకు తగ్గ సాంకేతిక పదజాలమేది ?" అని ప్రశ్నిస్తారు. "ఇదిగో, ఈ పదాలు మేము సిద్ధం చేశాం" అని చూపించినప్పుడు "ఇవి మా కర్థం కావట్లేదు. ఇవి సద్యఃస్ఫోరకంగా లేవు. ఇప్పటిదాకా ఇంగ్లీషులో మేము అలవాటుపడ్డ పదజాలం వేఱు. వీటిని వింటూం టే మాకు ఆ శాస్త్రం స్ఫురించడం లేదు. (అంటే, మాకు స్ఫురించదు కాబట్టి బహుశా దేశంలో ఎవఱికీ స్ఫురించకపో వచ్చు)" అంటూ ఒక బిక్కమొహాన్ని అభినయిస్తారు. "వీటిని ఈ ఈ అర్థాలలో ఈ క్రమంలో ఈ ఈ సూత్రాల ప్రకారం రూపొందించాం" అని విడమర్చినప్పుడు "మీరు రూపొందించారు సరే! వీటిని వాడేదెవఱు ?" అని మళ్లీ ప్రశ్నిస్తారు. "ఇదుగో, ఈ ఈ రచయితలు ఇప్పటికే వాడడం మొదలుపెట్టారు. వీటిని ఇంకా ఇంకా ప్రచురపఱచడానికి త్వరలో అధి కారుల సహాయం కూడా తీసుకుంటాం" అని చెబుతాం. అంతే! ఆ మాటతో తెలుగువిరోధుల కోపం నషాళానికి అంటు తుంది. చేసేదేమీ లేక అమాంతం అపహాస్యాలకి దిగుతారు.

ఇలాంటివారిని నమ్ముకుంటే పెళ్ళీ కుదరదు. పిచ్చీ కుదరదు. "తెలుగుపదాల్ని వాడడానికి ఆటంకంగా ఉన్నవి మానవ కల్పితమైన, లేదా స్వయంకల్పితమైన మానసిక అవరోధాలే తప్ప నిజంగా తెలుగులో పదాల కొఱత లేదు" అని ఇందు మూలంగా మనకి అవగతమవుతుంది. శాస్త్రసాంకేతిక రంగాలలో తెలుగుపదాలు లేకపోవడానికీ, ఉన్నా వాడకపోవడా నికీ కారణం– తెలుగంటే ఉన్న చిన్నచూపూ, ఆంగ్లమంటే ఉన్న వెఱ్ఱివ్యామోహం– ఇవే యథార్థమైన కారణాలు. తమ వ్యక్తిగత ఇష్టానిష్టా లకు ఆచరణాత్మకత ముసుగు వేస్తున్నారనేది సుస్పష్టం.

ఆంగ్లమాధ్యమాన్ని శతాబ్దాల పాటు జనం మీద రుద్దడం ద్వారా కోట్లాదిమందికి చదువు రాకుండా చేసిన దేశం మనది. ఇక్కడ ఎవఱూ మాట్లాడని, ఎవఱికీ మాతృభాష కాని ఇంగ్లీషుకి కృత్రిమంగా ఒక సామాజిక విలువని సృష్టించారు.

ఇక్కడ ఈరోజున ఆఖరికి "ఇంగ్లీషే అర్థమవుతుంది, తెలుగు కా"దనే విడ్డూరపు వాదన ఊపందుకోవడం విచారకరం. మన ప్రజలు అక్షరాస్యులు కాని రోజుల్లో వారికి ఫలానా పదాలు అర్థం కావంటే అందుకొక మంచి కారణం ఉంది. కానీ జనాలంతా అక్షరాస్యులయ్యే సమయానికల్లా తెలుగుమాధ్యమాన్ని బళ్ళలోంచి బహిష్కరించారు. అందుమూలాన, విదేశాల జనానికి మాతృభాష మీద ఉన్న పట్టు మన జనానికి లేకుండా పోయింది, ఎంత చదువుకున్నా! అదే, మన ప్రజలందఱినీ తెలుగులోనే విద్యావంతుల్ని చేసి ఉంటే, విద్యారంగంలో తెలుగు మీడియం ప్రాముఖ్యం కొనసాగి ఉంటే అప్పుడు మాతృభాషలో మనవారి పదజాల పరిజ్ఞానం ఇంగ్లీషువారిని మించిపోయి ఉండేది. తమ మాతృభాషాపదాలే తమకర్థం కాకుండాపోయి, వాటికి ఆంగ్లానువాదాన్ని ఇవ్వమని కోరుతున్న విచిత్రజనాభా పుట్టుకొచ్చేది కాదు. రంగులూ, అంకెలూ, జంతువులూ, పిలుపులతో సహా అన్ని పదాల్నీ ఇంగ్లీష్ నుంచి అరువుదెచ్చుకుంటూ ఒక నాసిరకం తెలుగు మాట్లాడే పదదారిద్ర్యపు తరం ఉద్భవించేది కాదు. ఈ రకంగా, ఒకపక్కన దేశమంతా వేలాది విద్యాలయాలతో దేదీప్యమానమై వెలిగిపోతూండగా, మఱోపక్కన విరోధాలంకారంలా మన మాతృభాషానిరక్షరాస్యత మాత్రం యథాపూర్వంగా కొనసాగుతోంది.

మనం ఇప్పుడు వ్రాస్తున్న తెలుగు చాలావఱకు మన ప్రాచీనులకి (ఈ అర్థాల్లో) తెలీదు. నిజానికి ఇదొక కొత్త తెలుగు. ఆంగ్లంతో పోటీపడే ప్రక్రియలో భాగంగా, గత వందా-ఇఱవయ్యేళ్ళుగా మనం ఈ తెలుగుకి కొత్తపదాలు కల్పించుకుంటూ వాటిని వ్యావహారికంలోకి జతచేర్చుకుంటూ ఈ స్థాయికి అభివృద్ధి చేశాం. ఆ కృషినే ఇప్పుడు కూడా కొనసాగించడానికి అభ్యంతరమేముంటుంది? ఇంగ్లీషుపదాలు చాలుననీ, వాటికి తెలుగు సమానార్థకాల్ని సృష్టించే పనిలేదనీ మన ముందుతరాల తెలుగువాళ్ళు అనుకుని ఉంటే ఈపాటికి తెలుగుభాష యావత్తూ మరణించి ఉండేది. ఎందుకంటే ఆంగ్ల పదాల్ని అనువదించకుండా అలాగే వాడితే భాషలో ఏ వాక్యంలోనూ తెలుగు ఉండదు. అలాంటి తెలుగు మాట్లాడ్డం కన్నా ఇంగ్లీషు మాట్లాడ్డమే సులభంగా ఉంటుంది. అందుచేత జనం తెలుగుని పూర్తిగా వదిలేస్తారు. స్వకీయత (originality) లేని భాష ఎవఱికీ అవసరం లేదు. కొత్తపదాల్ని సృష్టించలేని స్తబ్ధావస్థకి చేఱుకున్న భాషలు వాడుకలోని పదజాలాన్ని సైతం కోల్పోతాయి. ఎదుగుదలే జీవితం (Growth is life). ఆ ఎదుగుదల ఎప్పుడైతే ఆగిపోతుందో అప్పుడే అంతిమక్షణాలు ఆసన్నమవుతాయి.

చనిపోయిన మనిషినైనా బ్రతికించగలమేమో గానీ, వ్యవహారదూరమైన భాషల్నీ, వాటిల్లోని పదాల్నీ ఎట్టిపరిస్థితుల్లోనూ పునరుజ్జీవింపజేయలేమనీ, అవి శాశ్వతంగా పోయినట్లేననే కఠోరవాస్తవాన్ని తెలుగువారు గుర్తించే రోజు శీఘ్రమే రావాలి. సమకాలీనంగా సాంకేతిక విద్యలో తెలుగుకు స్థానం లేదు. మన ఎంజినీరింగ్ కళాశాలల్లో పాఠాలన్నీ ఇంగ్లీషులోనే జఱుగుతాయి. కనుక ఆ సాంకేతిక పదాలకు తెలుగు సమార్థకాల్ని సృజించాల్సిన ఆవశ్యకత వారికి లేదు. కానీ భవిష్యత్తులో అవే సబ్జెక్టుల్ని తెలుగులో చెప్పాల్సివస్తే మాత్రం తెలుగుపదాలు కావాలి. అర్థం కావడం అనేది ఒక కాలానుగతమైన ప్రక్రియ. పుడుతూనే మనకు ఏదీ అర్థం కాదు. అందఱికీ అర్థం అవుతాయని చెబుతున్న ఇంగ్లీషు పదాలు కూడా శిక్షణాప్రక్రియలో నేర్చుకున్నవే. పుడుతూనే నేర్చుకున్నవి కావు. మన పదజాల పరిజ్ఞానం వయసుతో పాటు పెఱుగుతూ పోతుంది. ఆ పెఱిగే పదజాలంలో తెలుగు ఎందుకు ఉండకూడదు ? ఇంగ్లీషు పదాల పరిజ్ఞానాన్ని మాత్రమే ఎందుకు పెంచుకోవాలి ? మన వర్ధమాన పదజాలంలో తెలుక్కి ఎందుకు స్థానం ఉండకూడదు ?

కాబట్టి కొత్త తెలుగుపదాలు జనానికి అర్థం కావనే వాదాన్ని మనం అంగీకరిస్తే దాని సారాంశం ఏమౌతుందంటే –

౧. తెలుగులో ఏ శాస్త్రానికి సంబంధించీ, ఏ విధమైన సాంకేతిక పదజాలమూ ఉండకూడదు. ***దు,ము,వు**.ల్లాంటివి మాత్రమే ఉండాలి. ఇంగ్లీషుని తెలుగులిపిలో వ్రాస్తే అదే తెలుగు.*

౨. ఉన్నా అది అందఱికీ అర్థం కాకూడదు. (ఎందుకంటే వాళ్ళకు ఏది అర్థం కావాలో ఏది కాకూడదో మనం ముందే నిర్ణయించేశాం. అంతకు మించి వాళ్ళకు ఇంకేమీ అర్థం కాకూడదు)

3. తెలుగులో సాంకేతిక పదజాలాన్ని ప్రచారం చేయకూడదు (ఎందుకంటే మేము ఇదివఱకే ఒక విధమైన ఇంగ్లీషు పదజాలాన్ని ప్రచారం చేసేశాం. దానికి మీరు అడ్డం రావద్దు)

౪. కాబట్టి తెలుగులో సాంకేతిక శాస్త్రాలేవీ వద్దు. అవన్నీ ఇంగ్లీషులోనే ఉండాలి.

౫. ఆ విధంగా తెలుగులో సాంకేతికపదాలూ, సాంకేతిక పదాలూ లేకుండా చేస్తాం కనుక తెలుగు పొట్టపోసుకోవడానికి పనికి రాదు. పోనివ్వండి. మాకు ఇంగ్లీషుంది.

౬. తెలుగు మనకు పొట్టపోసుకోవడానికి పనికిరాదు కనుక మనం అసలు అది మాట్లాడొద్దు. నష్టమేముంది ?

ఇంత కథ ఉంది.

వ్యావహారికం అంటే అర్థం – ఆంగ్లమాధ్యమ జనాల సంకుచిత అవగాహనకి అనుగుణంగా యావత్తు తెలుగుభాషనీ అంతం చేయడం కాదు. ఈమాత్రం ఆంగ్లమాధ్యమం గిడుగువారి కాలంలో కూడా ఉంది. జనానికి అర్థం కావడం అంటే కొత్తపదాల్ని సృష్టించకూడదని కాదు. అర్థమవుతున్న భాషలోనే కొత్త పరిభావనల్నీ, తత్సంబంధిత పదాల్ని మిశ్రమం చేయడమని !

ఇంకో కోణం : అచ్చతెలుగువాదం

ఇదిలా ఉండగా, ఆర్య–ద్రావిడ జాతివాదాల్ని గ్రుడ్డిగా నమ్మేవారు కొందఱున్నారు. అలా నమ్ముతూ, వేలాది సంవత్సరాలుగా ఈ దేశపు శాస్త్రీయ చింతనాధారని పరిపుష్టం కావించిన సంస్కృతాన్ని వారు పరాయిభాషగా పరిగణిస్తారు. ప్రతిదీ అచ్చతెలుగులోనో, తెలుగు మాండలికాల్లోనో, పచ్చివ్యావహారికంలోనో ఉండాలని వారంటారు. ఈ వాదాన్ని కూడా యథాతథంగా ఆమోదించడం కష్టం. ఎందుకంటే ఇప్పటిదాకా నడిచిన చరిత్రని రద్దుచేసి పారెయ్యలేం. ఇప్పటికే భాషలోకి వచ్చిన పదాల్నీ, సంప్రదాయాల్ని వెళ్ళగొట్టలేం. ఎట్టి పరిస్థితుల్లోను కాలం వెనక్కి నడవదు. భాషను అభివృద్ధి చేసు

కోవాలి. తప్పదు. కానీ ఆ క్రమంలో ఇలాంటి హఠాన్ నాటకీయ పరిణామాలు మట్టుకు ఎంతమాత్రమూ పనికిరావు. అలాంటివాటికి దిగితే మనం యావత్తు తెలుగు సాంస్కృతిక వారసత్వాన్నీ తరువాతి తరాలకు అర్థం కాకుండా చేసిన వారమౌతాం. పాత తెలుగుపుస్తకాలూ, పాటలూ, పద్యాలూ, కథలూ తరువాతి తరాలకు అర్థం కావాలి. అలా అర్థమయ్యే లా మన విద్యావిధానమూ మనం రూపొందించే పదాలూ ఉండాలి. మన విద్యావిధానం గతానికీ భవిష్యానికీ వారధిగా పనిచేయాలి. సంస్కృతాన్ని పరాయిభాషగా చూసే ధోరణి సమీచీనం కాదు. అది పూర్తి అవాస్తవికమైనది. దాన్నొక ఊహాలోకంగా అభివర్ణించడానికి నేను సంకోచించను. సంస్కృతం తెలుక్కి కన్నతల్లి కాకపోవచ్చు గాని పెంపుడుతల్లి మాత్రం అవును. సవతితల్లి మట్టుకు కానేకాదు. మన జనాభాలో అత్యధిక సంఖ్యాకులు హిందువులు. ముస్లిములకి అరబ్బీ ఎంతటి పవిత్రభాషో హిందువులకు సంస్కృతం కూడా అలాంటిదే. వారికి సంస్కృత సంపర్కం అత్యంత సహజ మైనది. వారికి ఆ భాషతో దైనందిన అవసరాలు ఉన్నాయని మఱువరాదు.

1. 'అర్థం కావడం' ఒక్కటే మన కృషికి కొలబద్ద కాకూడదు. భాషాసాహిత్యాలనేవి ఏ యుగంలోనూ ఆ కొలబద్ద నను సరించి వర్ధిల్లినవి కావు. ఇంగ్లీషులో సైతం నూటికి 99 పదాలు అది మాతృభాషగా గలవారిక్కూడా అర్థం కావు. అంత మాత్రాన ఆ భాషలో కొత్తపదాల సృష్టి ఆగిపోలేదు. ప్రతి కొత్తప్రచురణ నాటికీ ఆంగ్లనిఘంటువుల రాశి పెఱక్కుండా పూర్వపరిమాణం దగ్గఱే స్తంభించిపోవట్లేదు. ఇప్పుడు అర్థమౌతున్న పదాలు కూడా గాల్లో తేల్తూనో, కలలోనో జనం దగ్గ ఱికి రాలేదు. ఈ అర్థం కావడం వెనుక కొంత ప్రయత్నం ఉంది. కొంత శిక్షణ ఉంది. కొంత ప్రచార ప్రక్రియ ఉంది. ఉండాలి కూడా.

2. అర్థం కావడం అనేది– ఒకఱు ఏ సామాజిక నేపథ్యం నుంచి వచ్చారు? ఏ వృత్తి/ వ్యాపార రంగానికి చెందిన వారు ? ఎంతవఱకు చదువుకున్నారు? ఏ విధమైన అభిరుచి గలవారు? మొదలైన అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. అందుచేత అర్థం కాకపోవడం అనేది ఆ అర్థం కానివారి లోపమే తప్ప పదప్రయోగంలోని లోపం కాదు.

3. కొత్త పదాలు కల్పించడాన్ని ప్రోత్సహిస్తున్నట్లే కొత్త పదాలు నేర్చుకోమని కూడా ప్రోత్సహించాలి.

4. భాషలో పదాలు ఎల్లప్పుడూ అంతకు ముందున్న పదాల నుంచే పరిణామం చెందుతాయి. లేనిది ఎక్కణ్ణుంచీ రాదు. పదం మీద పదం పేఱుకుంటూ (pile up) పోతుంది. అయితే పేర్చేవారు కావాలి. ఆ పేర్చేవారికి అంతకు ముందు పేర్చబడ్డ పదాలూ, అవి పేఱుకున్న విధానం తెలిసి ఉండాలి. అలా తెలిసినవారు ఎంత ఎక్కువమంది ఉంటే అంత తొందఱగా భాష అభివృద్ధి చెందుతుంది.

5. ఇప్పుడు ఇంగ్లీషులో ఉన్న సాంకేతిక పదాలు కూడా మొదట్లో వాడినప్పుడు ఎవఱికీ అర్థం కాని పదాలే. వ్యకాలు (వ్యక్తిగత కలనయంత్రాలు అంటే PCలు) జనం చేతుల్లోకి రాకముందు ఒక పాతికేళ్ళ క్రితం Hard disk అనేది సాధారణ ఆంగ్లేయులక్కూడా హాస్యాస్పదమైన పదమే. మనం కోరుతున్నదల్లా "తెలుగు అనువాదాలన్నీ హాస్యాస్పదమై నవే" అనే ఈ మూఢ విశ్వాసం నుంచి బయటపడమనీ, తెలుగుపదాల్ని కూడా ఇంగ్లీషులాగానే ప్రేమించమనీ ! కొత్త తెలుగుపదాల్ని వాడుతున్న కొద్దీ నవ్వురావడం మానేసి గౌరవభావం కలగడం మొదలవుతుంది. సృష్టిస్తున్నకొద్దీ, వాడు

తున్నకొద్దీ తెలుగు పదాల క్రమబద్ధతనీ, నిర్మాణాన్నీ జనం ఆస్వాదించడం మొదలుపెడతారు. తెలుగులో కూడా గౌరవనీయమైన పదజాలం (vocabulary) విస్తారంగా ఉంది. దాన్ని ఉపయోగించుకోవాలి. భాష యొక్క మౌలిక స్వభావాన్నీ, స్వాతంత్ర్యాన్నీ నిలబెట్టాలి. మన భావదారిద్ర్యానికీ, మాతృభాషాపరమైన అజ్ఞానానికీ ఇంగ్లీషుపదాలతో అతుకు వేసుకున్నంత మాత్రాన గౌరవం పొందుతామనుకోవడం ఒక భ్రమ. ఆ సదరు "గౌరవనీయ పదాలు" కూడా మళ్ళీ మళ్ళీ అందఱూ వాడడం మూలాన కేవలం ఒక్క తరంలోనే అగౌరవనీయాలవుతాయి. అప్పుడు మళ్ళీ మన గౌరవనీయ పదాల వేట యథామామూలే. గతంలో ఎన్నోసార్లు అలా జఱిగింది.

6. స్వకీయత (originality) ద్వారానే ఏ జాతైనా గౌరవాన్ని పొందుతుంది. ఆంగ్లపదాలు ఆంగ్లేయుల స్వకీయతకి నిదర్శనం. మఱి ఒక స్వతంత్ర, విభిన్నజాతిగా మన స్వకీయత సంగతేంటి? భావాలతో పాటు పదాల్ని కూడా అనుకరించి తీఱాల్సిందేనా ? అలా అనుకొని ప్రత్యామ్నాయ తెలుగుపదాల్ని సృష్టించకుండా కేవలం ఇంగ్లీషు పదాలతోనే లాగిద్దామనుకుంటే కొన్ని పంక్తులు వ్రాసేసరికి "దీని బదులు నేరుగా ఇంగ్లీషులోనే వ్రాయడం నయం" అనిపిస్తుంది. ఇక తెలుగెందుకు ? "తెలుగు పదాలు అవసరం లేదు" అనే వాదన ఇంకా ముందుకెళ్ళి "అసలు తెలుగే అవసరం లే"దనే వాదనకి దారితీస్తుంది. ఇప్పుడు జఱుగుతున్నది అదే.

7. ఈత అన్నాక నీళ్ళలోకి దూకి నేర్చుకోవలసిందే. భాష సర్వాంగసుందరంగా అభివృద్ధి చెందాకనే అందులో సాంకేతికాంశాలు రాస్తానంటే కుదఱదు. ముందు రాస్తూ, రాస్తూ, ఆ క్రమంలో కొత్తపదాల్ని కనిపెడుతూ వాడుకలోకి తెస్తూంటేనే భాష అభివృద్ధి చెందుతుంది. సాహిత్యభాష సాంకేతిక భాషగా పరిణామం చెందుతుంది. ఇంగ్లీషు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

మఱో కోణం : తెలుగులో పదాలు లేవనే వాదన

"తెలుగులో పదాలు లేవు. లేదా తెలుగులోకి అనువదించలేం " ఇది సరైన అభిప్రాయమా ? లేక *"మనకు తెలుగు భాషలో సరైన శిక్షణ లేదు, ఇంగ్లీషులో ఉన్నంత"* ఇది సరైనదా ? ఇంగ్లీషుభాషలో ప్రస్తుతం కనిపిస్తున్న ఇంగ్లీషు పదాలన్నీ ఆ భాష పుట్టినప్పటినుంచే అందులో ఉన్నాయా? మధ్యలో ఆ పదజాలాన్ని పెంచడానికి ఆంగ్లమేధావులు చేసిన మానవ ప్రయత్నమేమీ లేదా ? ఆ పదాలు హఠాత్తుగా ఆకాశంలోంచి ఊడిపడ్డాయా ?

మనకి తెలుగులో ఉన్న పూర్వశిక్షణ మనచేత ఈ భాష గొప్పదనాన్ని ప్రశంసింపజేయడానికి సరిపోవడం లేదు. కొత్త తెలుగుపదాల్ని కల్పించడానికి చాలడం లేదు. ఇంగ్లీషుని అనువదించను సహాయపడలేకపోతోంది. మనకి పాఠశాలల్లో తెలుగు నేర్పుతున్న విధానం– మనం పదో తరగతిలో భాషాపరంగా ఏ స్థాయిలో ఉన్నామో ఆ స్థాయిలోనే జీవితాంతం మనల్ని ఉంచుతోంది. తెలుగుపాఠ్యాల బోధనలో ఏ విధమైన కొత్త పద్ధతులూ చోటుచేసుకోవడం లేదు. ముప్పయ్యేళ్ళ క్రితం ఎలాంటి పాఠాలూ, పాఠ్యక్రమమూ, బోధనాపద్ధతీ, మూల్యాంకన విధానమూ ఉండేవో సరిగ్గా వాటినే ఏ మార్పూ లేకుండా కొనసాగిస్తున్నారు. తతిమ్మా అన్ని సబ్జెక్టులలోనూ విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నారు. అథవా, తెలుగు

సబ్జెక్టులో ఏమైనా మార్పులు తెచ్చినా అవి ఈ భాషని నాశనం చేసే దిశలో ఉంటున్నాయి తప్ప బాగుచేసే దిశలో ఉండట్లేదు. మనం ఈ భాషాపరమైన స్తబ్ధత (linguistic stagnation) కి అలవాటుపడి "ఓహో తెలుగంటే ఇదే, ఇంకేమీ లే"దనుకుంటున్నాం. తెలుగుసాహిత్య పఠనం పేరుతో మనం అనంతర జీవితదశాకాలంలో చదివేదంతా వ్యావహారికం, లేకపోతే పచ్చివ్యావహారికం.

ఒకపక్క ఇలా తెలుగులో స్తబ్ధం (stagnate) అయిపోయిన మనం మఱోపక్క మన ఆంగ్లపరిజ్ఞానాన్ని మాత్రం రోజు రోజుకూ పెంచుకుంటున్నాం, ప్రయత్నపూర్వకంగా! మన బహుభాషాపరిజ్ఞానం మన భాషని ఉద్ధరించడానికి క్కాక దాన్ని కించపఱచడానికి దుర్వినియోగమవుతోంది. కొన్నికొన్ని ప్రారంభిక తభావతులు చోటు చేసుకున్నప్పటికీ ప్రయోగశీలతని సాదరంగా ఆహ్వానించాల్సి ఉంది. ప్రయోగాలు చేస్తూ చేస్తూ పోగా వాటిల్లోంచి కొంత మంచి పుట్టే అవకాశం ఉంది. ఒక కొత్తప్రయోగం నచ్చకపోతే ప్రత్యామ్నాయాలు ఆలోచించే స్వేచ్ఛ మనకెప్పుడూ ఉంది. అసలు ప్రయోగాలే చేయొద్దనడం సరైన ధోరణి కాదు.

జీవితం ఒక నిరంతర అభ్యసనా ప్రక్రియ (constant learning process). కొత్తపదాలు సృష్టి అవుతున్నకొద్దీ వాటిని మన పదజాల పరిజ్ఞానంలో భాగంగా చేసుకోక తప్పదు. అది తెలుగైనా, ఇంగ్లీషైనా! అయితే ఇక్కడ ఆచరణాత్మకంగా జఱుగుతున్నది ఏంటంటే– ఆ అభ్యసన ప్రక్రియలో ఇంగ్లీషు ఉండొచ్చుగానీ తెలుగు ఉండకూడదు అని వాదించడం. తెలుగు మాత్రం స్తబ్ధం అవ్వాలి, ఎందుకంటే మనం స్తబ్ధం అయ్యాం కనుక !

ఇహపోతే అర్థం కావడం. ఏ పదానికీ స్వతహాగా సద్యఃస్ఫోరకత (spot understandability) లేదు, తెలుసుకుని, పలికి, అలవాటుపడితే తప్ప! వాడుతూ ఉంటే అంతా వ్యావహారికమే. వాడకపోతే అన్నీ గ్రాంథికమే. మాతృభాష కానటువంటి ఇంగ్లీషులో ఏ కొత్తపదం వచ్చినా ఆబగా అందిపుచ్చుకోవడానికి సద్ధంగా ఉన్న మనం తెలుగు దగ్గఱికొచ్చేసరికి ఆ పని ఎందుకు చేయలేకపోతున్నాం? ఇది తెలుగు తప్పా? మన తప్పా? ఆలోచించాల్సి ఉంది. ఏ కారణాన్నో ఇక్కడ చాలా ప్రతిఘటన (resistence) ఉన్నది, కొత్త పదాల్ని కల్పించుకోవడం పట్ల, వాటిని వాడడం పట్ల ! ఇంగ్లీషుపదాల్ని యథాతథంగా దిగుమతి చేసుకోవడాన్ని అభ్యుదయంగా భ్రమించే వాతావరణం ఉంది.

ఆదాన అనువాదాల పట్ల అపోహలు

ఆంగ్లపదాల ద్వారా వ్యక్తమయ్యే భావాన్ని తెలుగుపదాలతో అనువదించి వాడుతూంటే “మక్కికి మక్కి” అని, “True translation” అనీ పేర్లుపెట్టి వెక్కిరించడం కనిపిస్తోంది. ఈ వెక్కిరింపులకి పాల్పడుతున్నది తెలుగువారే, ఇతరులు కారు. ఆ విధంగా తెలుగులో నూతనపద నిష్పాదకుల్నీ, పదప్రయోక్తల్నీ మానసికంగా క్రుంగదీయాలనే ప్రయత్నమూ, నిరుత్సాహపఱచాలనే వ్యూహమూ, అలా తెలుగుపై ఇంగ్లీషుపదాల బాహుళ్యాన్ని శాశ్వతంగా వ్యవస్థాపించాలనే ఆకాంక్షా వెల్లడవుతున్నాయి. అనువాదాల రూపంలోనైనా సరే, తెలుగు బతికి బట్టగట్టడం వారికి ఇష్టం లేదు.

ఇలా అవహేళనలకి దిగేవారి ఉద్దేశంలో– *"ఆ తెలుగు ప్రత్యామ్నాయాలు ఒరిజినల్ కావు. అవి నకిలీ. కాబట్టి వెకిలి. ఒరి జినల్ ఇంగ్లీష్ ఐడియాస్‌ని ఇలా అనువాదాల రూపంలో దొంగిలించి ఆ ఐడియాస్‌కి మూలపురుషులైన ఇంగ్లీషువారి గొప్పదనాన్ని తెలుగువారు తెలుసుకోకుండా చేసి కప్పిపుచ్చడమూ, అవేవో తెలుగువారి ఒరిజినల్ ఐడియాస్ అయినట్లు ప్రచారమైపోవడమూ ఘోర అన్యాయం, అక్రమం. దురాగతం. తెలుగు తెలివితక్కువ, వెనకబడ్డవాళ్ళ భాష. ఇందులో తెలివైన వ్యక్తీకరణలెలా ఉంటాయి? మా లెక్క ప్రకారం ఉండకూడదు. తెలివైన, నాగరికమైన వ్యక్తీకరణ ఏదైనా ఉంటే దానికి ఇంగ్లీషుముద్ర ఉండాలి. అదే ఆధునికత. అదే అభివృద్ధి. అదే గౌరవనీయత. అదే విజ్ఞానానికీ, నాగరికతకీ, అభ్యు దయ దృక్పథానికీ అసలైన చిహ్నం. మేము సాక్షాత్తూ ఒరిజినల్ ఇంగ్లీషే తెలిసినవాళ్ళం. ఈ నకిలీ (తెలుగు) పదాలతో మాకేం పని ?"*

గ్రహించగలిగితే, ఇంతుంది ఈ ఎగతాళ్ళ వెనక !

అయితే, ఓ విషయం. ఇలా అనుకుంటున్నది, ఇంగ్లీషు అఆకొఆగా నేర్చుకుని తలలెగరేస్తున్న ఒక వర్గం మాత్రమే. ఇంగ్లీషు తెలియని ఆంధ్రులు అనువాద పదాల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ఆంగ్లపదాల బదులు అవే వాడుతున్నారు. ఎందుకంటే వారివఅకూ వాటికి (తెలుగుపదాలకి) ప్రత్యామ్నాయం లేదు. కానీ ఆంగ్లవిద్యావంతులైన ఆంధ్రులవఅకూ ప్రత్యామ్నాయం (ఇంగ్లీషు) ఉంది. తెలుగంటే ఉన్న చిఱాకువల్ల అనవసరమైన మూలవిధేయతని కౌగలించుకుంటు న్నారు. కాబట్టి తెలుగు వారికి ఒక ప్రత్యామ్నాయభాషని చూపించినప్పుడు వారు తెలుగుని వదిలేయడమే కాకుండా దాన్ని కించపఱుస్తారని సూచించబడుతోంది. అందువల్ల భాషాపరమైన మానసిక పరిణతి విషయమై ఇంకా ఎన్నో మైళ్ళు ప్రయాణించాల్సి ఉన్న ఈ జాతికి ఇంత విస్తృతంగా విదేశీభాషాశిక్షణ ఇవ్వడం భస్మాసురహస్తంలాంటిది కావచ్చుననిపి స్తోంది. ఆంగ్లవిద్యావంతుల విషయానికొస్తే, తాము *ఒరిజినల్ ఇంగ్లీష్ ఐడియాస్* అనుకొని వాడుతున్న అనేక పదాలు, వాస్తవానికి ఇతరభాషల నుంచి ఆంగ్లేయులు మక్కికి మక్కి అనువదించుకొని వాడుతున్నవని ఈ బడాయితెగ ఆంధ్రులకి తెలియదు. మచ్చుకు ఈ క్రింది జాబితా పరికించండి :

ఆంగ్లేయులు చైనీయభాష నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని :

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Running Dog	zǒu gǒu.
Brainwashing	xǐ nǎo
Look-see calques	kànjiàn
lose face	diū liǎn
Paper tiger	zhǐ lǎohǔ

ఆంగ్లేయులు పరాసుభాష (ఫ్రెంచి) నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని:

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Adam's apple	pomme d'Adam
Bushmeat	viande de brousse
deaf-mute	sourd-muet
By heart (or off by heart)	par cœur
Governor-General	Gouverneur Général
Free verse	vers libre
Old guard	Vieille Garde (the most senior regiments of
the Flea market	marché aux puces
Marriage of convenience	mariage de convenance
New Wave (artistic period)	Vague
rhinestone	caillou du Rhin "Rhine pebble"
Staircase wit	l'esprit de l'escalier
that goes without saying	cela va sans dire
Point of view	point de vue

ఆంగ్లేయులు ఒలందుభాష (డచ్చి) నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని:

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Masterpiece	meesterstuk
Pineapple calques	pijnappe
Superconductor	Dutch supergeleider[20]

ఆంగ్లేయులు శార్మణ్యభాష (జర్మన్) నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Antibody	Antikörper
Ball lightning	Kugelblitz
Beer garden	Biergarten
Concertmaster	Konzertmeister
Flamethrower	Flammenwerfer
Foreword	Vorwort
Heroic tenor	Heldentenor
Homesickness	Heimweh
Intelligence quotient	Intelligenzquotient

Loan translation	Lehnübersetzung
Loanword	Lehnwort
mercury/quicksilver vapor lamp	Quecksilberdampflampe
Motorway	Autobahn
Overman and superman	Übermensch
Power politics	Machtpolitik
Rainforest	Regenwald
Standpoint (point of view)	Standpunkt
Superego	Überich
Stormtroopers	Sturmtruppen
Subliminal	unterschwellig
Thought experiment	Gedankenexperiment
Watershed	Wasserscheide
Worldview	Weltanschauung
World war	Weltkrieg

ఆంగ్లేయులు యూదీయభాష (హీబ్రూ) నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో ఒకటి.

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Scapegoat	עזאזל (Azazel) (A departing goat)

ఆంగ్లేయులు రోమకభాష (ల్యాటిన్) నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని:

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Commonplace	locus commūnis
Devil's advocate	advocātus diabolī
Wisdom tooth	dēns sapientiae
Milky Way	via lactea
Rest in Peace	requiescat in pace
In a nutshell	in nuce

ఆంగ్లేయులు శ్పానిష్ నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని:

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Blue-blood	sangre azul

Moment of truth — el momento de la verdad

ఆంగ్లేయులు ఇతరభాషల నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని:

ఆంగ్లంలోని ఆదాన అనువాదపదం	దాని మూలపదం
Gospel	evangelion (good news) (Greek)
Hotdish	varmrett/varmrätt (Scandinavian)

ఇంగ్లీషే కాదు, అన్ని భాషల్లోనూ ఆదాన అనువాదాలు మామూలే. అవి లేని భాషే ప్రపంచంలో లేదు. అలాంటప్పుడు కేవలం తెలుగులోనే దాన్నెందుకు తప్పుగా చూడాలో అగమ్యగోచరం. మనం పదాలని అనుకుంటున్నవన్నీ నిజానికి పరిభావనలే. కొన్ని పరిభావనలు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, ప్రత్యేక పరిస్థితుల మధ్య, ప్రత్యేక వాతావరణాల్లో కవితాత్మకంగా అంకురిస్తాయి. జనం వ్యక్తీకరణ అవసరాల్ని పురస్కరించుకొని వాటిని తమ మాతృభాషకి చెందిన కొత్తపదాల్లోనూ, పదబంధాల్లోనూ వెలిబుచ్చుతారు. అవే సందర్భాలూ, పరిస్థితులూ, వాతావరణాలూ తారసిల్లనివారు, లేదా తారసిల్లినప్పటికీ వాటి గుఱించి కవితాత్మక ఊహలు తట్టనివారు ఆ కవితాత్మకత తమకి నచ్చినప్పుడు వాటిని తమ భాషలోకి అనువదించుకోవడం తప్పు కాదు. ఆలోచనల్ని వ్యక్తీకరించనంతవఱకే అవి వ్యక్తివి. ఒకసారి వ్యక్తీకరించడమంటూ జఱిగాక అవి సమాజానివీ, దేశానివీ, ప్రపంచానివీ, యావన్మానవజాతివి కూడా! ఇది వ్యక్తులకే కాదు, భాషలక్కూడా వర్తిస్తుంది.

ప్రతికూల వాతావరణం

తెలుగువారి ఈ మాతృభాషావ్యతిరేక మనస్తత్త్వమూలాలు చాలా లోతైనవి. ఈ సందర్భంలో వాటిని టూకీగానైనా గుర్తు చేసుకోకుండా ఉండలేం. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నిదశాబ్దాలైనా మనం భాషాపరంగా సంపూర్ణ బానిసత్వంలోనే కొనసాగుతున్నాం. నోటిమాటగా ప్రజాస్వామ్యం అంటూ ఊదరగొడుతున్నా, వాస్తవంగా ప్రజాభాషైన తెలుక్కి ఏ విధమైన రాజకీయ, ఆధికారిక హోదా లేకపోవడం వల్ల ఈ భాష పట్ల విస్తారంగా వ్యాపించిన చిన్నచూపూ, హీనభావన చివఱికి ఈ భాషాప్రజలు తమ మాతృభాషాపదాల్ని తాము వాడుకోవడాన్ని కూడా ఓ అప్రాచ్యప్పనిగా, అవహేళనగా, ఎగతాళిగా ఒక రహస్య నిషిద్ధ కార్యకలాపంగా మార్చాయి. నాలుగు ఇంగ్లీషుముక్కలు నేర్చుకున్న ప్రతితెలుగువాడూ తన జాతీయతా మూలాలు మర్చిపోయి “తానో పుట్టు అమెరికన్” అన్నట్లు ప్రవర్తిస్తూ తెలుగుని బహిరంగంగా కించపఱచడానికి వెనకాడ్డం లేదు. నిజంగా అమెరికన్ లై పుట్టినవాళ్ళు కూడా ఇలా చేయరు. ఆంధ్రప్రభుత్వం తెలుగుని ఏ మాత్రమూ పట్టించుకోకపోవడంతో “మొగుడు ముండా అంటే ముష్టివాడు కూడా ముండా అన్నా” డన్నట్లు తయారయింది పరిస్థితి. అలాంటివాళ్ళు అలా కించపఱుస్తూంటే “అది తప్పు. మన మాతృభాషని మనం అలా అనకూడ”దని ఎలుగెత్తి ఖండించేవాళ్ళు కూడా లేకుండాపోయిన దౌర్భాగ్య పరిస్థితుల మధ్య ఈ జాతి జీవిస్తోంది. దేశపౌరుల్ని విదేశాలకీ, విరాష్ట్రాలకీ

సామూహికంగా ఎగుమతి చేయడానికీ, ఆ విధంగా వారిని శాశ్వతంగా ఇక్కణ్ణుంచి లేవగొట్టి వలసపంపడానికీ మాత్రమే ఉద్దేశించిన మన విద్యావ్యవస్థ **మాతృభూమి, మాతృభాష, స్వజాతి** అనే భావనల్ని మనవారిలో లోతుగా నాటడంలో విఫలమవుతోంది. జాతిపరమైన స్వాభిమానమూ, ఆత్మ గౌరవమూ లేకుండా ప్రవర్తించడమే ఆధునికతగా, విశాలహృదయంగా మన మధ్య ప్రచారంలోకి వచ్చేసింది.

దీనికి తోడు పెక్కు అంతర్జాతీయ ప్రసారసంస్థలూ, జాలగూళ్ళూ (websites) తెలుగుని తమ భాషల జాబితాలో చేర్చవు. కానీ ఆ జాబితాలో తమిళం, హిందీ, బెంగాలీ మాత్రం ఉంటాయి. కొన్నిసార్లు ఉర్దూ, గుజరాతీ, పంజాబీ కూడా ఉంటాయి. దీనిక్కారణం, తమిళమూ, హిందీ, బెంగాలీ ఏదో ఒక స్వతంత్ర దేశానికి జాతీయభాషలూ, అధికార భాషలై ఉండడం. తమిళం శ్రీలంక, సింగపూర్, మలేషియా అనే స్వతంత్ర దేశాల్లో (సహ) అధికారభాషగా ఉంది. హిందీ ఇండియాకి అధికార భాషగా ఉంది. బెంగాలీ బాంగ్లాదేశ్‌కి అధికారభాషగా ఉంది. కానీ టోకున పన్నెండుకోట్లమంది తెలుగు భాషులూ, 2000 సంవత్సరాల చరిత్రా, అనేక దేశాలకంటే సువిశాలతరమైన ఒక పెద్దరాష్ట్రమూ ఉన్నప్పటికీ, తెలుగు ఏ దేశానికీ జాతీయభాష గానీ, అధికారభాష గానీ కాకపోవడంతో ప్రపంచభాషల జాబితాలోకి ఎక్కలేని, ప్రపంచానికి పరిచితం కాలేని విచిత్ర నిస్సహాయ పరిస్థితిలో పడిపోయింది.

"పిచ్చి ముదిరింది, రోకలి తలకు చుట్ట"మన్నట్లు ఈ పరిస్థితికి భాషాశాస్త్రవేత్తలమని చెప్పుకునేవారు కొందఱు తోడయ్యారు. భాషని సరిగా నేర్పడం, కాపాడడం, దాన్ని భవిష్యత్తరాలకి భద్రంగా అందించడం– ఇలాంటివాటిమీద సుతరామూ నమ్మకం లేనివారు వీరు. భాషాపరంగా పక్కా శూన్యవాదులూ, భాషానాస్తికులు. భాషావేదాంతులు. వీరు తమ ఆయుర్దాయంలో అనేక సంవత్సరాలు వెచ్చించి చివఱికి నేర్చుకున్నది,*"భాష శాశ్వతం కాదు. భాష నశించిపోతూంటే మనం గుడ్లు మిటకరిస్తూ చూస్తూ కూర్చోవాలి. ఏ భాషైనా ఒకటే. ఏ పదమైనా ఒకటే"* అని! నిజానికి ఇలా ప్రసంగించేవారు భాషాశత్రువులే తప్ప శ్రేయోఽభిలాషులు కారు. కానీ దురదృష్టవశాత్తూ, తెలుగుమీద మాట్లాడడానికి ఈరోజున ఇలాంటివారే గొప్ప ప్రామాణిక విద్వాంసులై కూర్చున్నారు. వీరి వైరాగ్యపూరితమైన దుర్బోధల ఫలితంగా నిజమైన భాషాభిమానులూ, భాష మనుగడ కోసం ఏదో ఒకటి చేయాలనే తపన ఉన్న కార్యశూరులు కూడా తప్పుదోవ పడుతున్నారు, నిరుత్సాహం చెందుతున్నారు. మనం ఒక జాతిలో జన్మించాక దాని భాషా, మత, సంస్కృతుల పట్ల తటస్థంగా ఉండే హక్కుని కోల్పోతాం. ఎందుకంటే ఆ సంస్కృతికి మనం తప్ప వేఱే దిక్కులేదు.

మానసిక అవరోధాల్ని అధిగమించాలి

నా దృష్టిలో ఇది తెలుగూ–ఇంగ్లీష్ గొడవ కాదు. ఇది ఒక మానవ కల్పిత మానసిక అవరోధానికి (mental barrier కి) సంబంధించిన విషయం. నిజానికి తెలుగుపదాలూ మన సృష్టి కాదు. ఇంగ్లీషు పదాలూ మన సృష్టి కాదు. ఈ రెండూ కూడా ఎవఱో, ఎప్పుడో, ఎక్కడో కల్పించగా మనం నేర్చుకుని వాడుతున్నవే. మనకి ఈ విషయంలో ఏ విధమైన నిర్ణయాధికారమూ (judgment) లేదు. కానీ మనం అలా తీర్పుతీర్చబూనుకుంటున్నాం. ఇంగ్లీషుని అందుకోవడానికి

సిద్ధంగా మనం మన మనస్సుల్ని కార్యక్రమించాం. తెలుగు విషయంలో అలాంటి కార్యక్రమణం (programming) జఱగలేదు.

అర్థం కావడమనేది ఒక ఉత్తరోత్తర ప్రక్రియ (incremental process). మనకి పదేళ్ళప్పుడు అర్థం కానివి ఇఱవ య్యేళ్ళప్పుడు అర్థమవుతాయి. ఇఱవయ్యేళ్ళప్పుడు అర్థం కానివి నలభయ్యేళ్ళప్పుడు అర్థమవుతాయి. "జీవితం ఒక నిరం తర అభ్యసనా ప్రక్రియ" అని ఇందాకనే చెప్పుకున్నాం కదా ! అలా కాదు, అన్నీ విన్నవెంటనే అర్థమైపోవాలని పట్టుపట్టితే అది అపరిణతి అవుతుంది. భాష యొక్క ప్రయోజనం అర్థం కావడమొక్కటే కాదు. ఇంకా చాలా పనులు (functions) ఉన్నాయి దానికి ! భాష ఒక జాతి యొక్క దృక్పథాన్ని ఆవిష్కరిస్తుంది. అది ఒక జాతిని సృష్టిస్తుంది కూడా. గతానికీ, వర్తమానికీ వారధిగా నిలుస్తుంది. అలాగే వర్తమానానికీ, భవిష్యత్తుకీ మధ్య కూడా వారధిగా నిలుస్తుంది. అది విజ్ఞానాన్ని అందిస్తుంది. వినోదింపజేస్తుంది. అది సంగీతాది కళలకి ఆలంబన. ఆధ్యాత్మికతకి తొలిమెట్టు. అది ఒక సమాజాన్ని కలుపుతుంది. తెలిసిన పరిభావనల నుంచి తెలియని పరిభావనలకి అది మనల్ని తీసుకెళుతుంది.

తెలుగులో అనేక భాషాపదాలున్నప్పుడు ఇంగ్లీషు పదాలు ఎందుకు ఉండకూడదు ?

అరువు దెచ్చుకున్న పదాలతో తదుపరి పదనిష్పాదన సాధ్యం కాదు. వాటి మూలధాతువులూ, నిర్మాణసరళీ తెలియకపో వడం వల్ల అలాంటి పదాలనుంచి స్వతంత్రంగా పదకుటుంబాల్ని నిష్పాదించే స్వేచ్ఛని జనసామాన్యం కోల్పోతుంది. అందువల్ల ఈ వాదాన్ని ఇంతకుముందే పరాస్తం చేయడం జఱిగింది. ప్రత్యామ్నాయం లేనప్పుడు పరభాషాపదాలు వాడొ ద్దని ఎవఱూ అనరు. పునరుద్ధరించి వాడుకోవడానికీ, కొత్తగా సృజించడానికీ తెలుగులో విస్తారమైన అవకాశ మున్న ప్పుడు కూడా, ఆ ప్రయత్నం ఇసుమంతైనా చేయకుండా బస్తాలకొద్దీ విదేశీపదాల్ని కృత్రిమంగా దిగవెయ్యడాన్నే ప్రశ్నిస్తు న్నాం. కొత్త తెలుగుపదాల్ని కల్పించినప్పుడు "ఆ రూపకర్తలు సొంత పాండిత్యాన్ని ప్రదర్శిస్తున్నా"రని ఆరోపించే ఆంగ్లాభి మానులు తెలుగంతా ఇంగ్లీషుపదాలతో నింపడం ద్వారా తమ ఆంగ్లపాండిత్యాన్ని ప్రదర్శిస్తున్నారు కాదా? భాషా ప్రయో జనమూ, వాడుకా– వీటన్నింటి కంటే ముఖ్యమైనది భాషాభిమానం. అదంటూ అసలుంటే, వాడుక మొదలైనవన్నీ చిన్న విషయాల్లా కనిపిస్తాయి. ఆ అభిమానమే లోపించాక ప్రతి చిన్నవిషయమూ ఓ పెద్దసమస్యై కూర్చుంటుంది. చర్చల స్థానంలో అహంకారప్రదర్శనలు బయల్దేఱతాయి.

"ఇది వాడాలి, అది వాడకూడదు" అని కాదు భాషాభిమానులు చెబుతున్నది. ఈ భాషాజాతిలో జన్మించినందుకు ఈ భాష మీద అభిమానాన్ని పెంచుకోమని చెబుతున్నారంతే. అది మనిషి యొక్క కనీస ధర్మం. కర్తవ్యం కూడా ! భాష అనేదొక వ్యక్తి కాదు, దానంతట అది వృద్ధి చెందడానికి. దాన్ని ఎవఱు మాట్లాడతారో వారే దాన్ని వృద్ధిచేయాలి. ఆ బాధ్యత వారిదే. అన్ని ఇతర భాషల విషయంలోనూ ఇప్పటిదాకా ఇలాగే జఱిగింది. మన ప్రయత్నం లేకుండా మన భాష వృద్ధిచెందదు, వ్యాపించదు. అది వృద్ధి చెందకపోతే ఆ పాపం మనదే. భాషది కాదు.

తెలుగులో ఉన్న పదవైవిధ్యం దాన్ని ఇతరభాషాపదాలతో నింపెయ్యొచ్చు నన్నదానికి సమర్థకం గానీ అనుమతిపత్రం (license) గానీ కాదు. ఒక భాషలో ఉన్న వైవిధ్యం ఆ భాషాప్రజల వైవిధ్యభరిత ఆలోచనావైఖరి (variety thinking) కి నిదర్శనం. భాష ఎంత ఎక్కువ భౌగోళిక విస్తీర్ణంలో మాట్లాడబడితే అంత వైవిధ్యభరితంగా ఉంటుంది దాని లోని పదజాలం ! తద్విరుద్ధంగా ప్రతిపదాన్నీ అరువు దెచ్చుకోవడం సృజనాత్మక శక్తిలోపానికి తార్కాణం. అది కనీసం మూడు విషయాల్ని సూచిస్తుంది.

౧. ఆ వ్యక్తుల్లో సృజనాత్మకత లేదని, స్వకీయంగా (original) గా ఆలోచించడం సంగతలా ఉంచి వారు కనీసం అనువాదాలు కూడా చెయ్యజాలరని !

౨. వారికి తమ భాషపైనే పట్టులేదని! తమ మాతృభాషాపదాల నిర్మాణాల్ని వారు అర్థం చేసుకోలేకపోతున్నారని, వాటి ననుసరించి సరికొత్త పదనిర్మాణాలు చెయ్యడానికి అవసరమైన భాషా-శాబ్దిక-వైయాకరణ-శిక్షణ వారిలో దయనీయంగా లోపించిందని !

౩. అలాంటివారి చేతుల్లో ఉండడం వల్ల ఆ భాష ఎదగాల్సినంతగా ఎదగడం లేదని !

మనం కల్పించిన పదాల్ని తత్క్షణమే వాడడం మొదలుపెట్టాలి. మనం ఇప్పుడు వాడినా అవి విస్తృతంగా వ్యవహారంలోకి రావడానికి చాలా కాలం పట్టుతుంది. మొదలే వాడకపోతే ఇంకా ప్రమాదం. ఔత్సాహిక పదకల్పకులు/ వ్యవహర్తలూ తమ రచనల్లో కొత్త పదాల్ని పతాక శీర్షికలుగా పెట్టి వ్రాస్తే బావుంటుంది. పదాల్ని ప్రచురపఱిచేందుకు చిన్న కిటుకు ఏమిటంటే- ఒక్కొక్క వాక్యంలో ఒకటి, రెండు కన్నా ఎక్కువ కొత్త పదాలు ఉండకూడదు. అలా ఉంటే పాఠకుడిలో "ఈ రచయిత దారే వేఱు" అనే భావన ఏర్పడి మొదటికే మోసమొస్తుంది. కొత్తపదాలు వాటి ఉద్దిష్ట అర్థంలో వెంటనే అర్థం కావడం కష్టం కనుక ప్రతి కొత్త పదానికీ కుండలీకరణాల (brackets) లో దాని ఆంగ్లసమార్థకాన్ని ఇవ్వడం ప్రయోజనకరం. ఇలాంటి జమిలి ప్రయోగాలు చాలాకాలం పాటు తప్పవు. మన రచనలన్నీ ఇలా కుండలీకరణాలతో నిండిపోయినా విచారించకూడదు.

కొత్త పదాల నిష్పాదనకు తెలుగులో ఉన్న వనరులేంటి ?

చాలా భావాల వ్యక్తీకరణకి ఇంగ్లీషులో చేస్తున్న వాడుకలు ఇంగ్లీషు కానేకావు. అవి లాటిన్, గ్రీకు పదప్రత్యయ నిర్మాణాలు. అది వారికి చేతైనప్పుడు మన తెలుగు-సంస్కృత పదప్రత్యయ నిర్మాణాలతో స్వకీయత (originality) కలిగిన దేశీయ ప్రత్యామ్నాయాల్ని రూపొందించడం మనకెందుకు చేతకాదని మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సి ఉంది. మన భాష అంత పదదారిద్ర్యంతో అలమటిస్తున్నది కాదు. తన పదాల్ని నేర్పేవారూ నేర్చుకునేవారూ దూరం చేయబడి అల్లాడుతున్నది మాత్రమే. మన భాషకి ఇంగ్లీషు కంటే ప్రాచీనచరిత్ర ఉంది. ఇంగ్లీషుకంటే ప్రాచీనమైన సాహిత్యమూ ఉంది. పదాలు ఒక జాతి యొక్క మేధశ్చరిత్రని సూచిస్తాయి. పరాయిపదాల్ని భారీగా వాడడమంటే ఒక జాతిగా మనకి బుద్ధి

లేదని, స్వకీయత (originality) శూన్యమనీ ఒప్పుకోవడమే అవుతుంది. తాత్కాలికంగా పని జఱగడం కంటే ఒక భాషాజాతిగా మన అస్తిత్వమూ, మన సంప్రదాయమూ, మన ప్రతిష్ఠ శాశ్వతప్రాతిపదికన నిలబడ్డం ముఖ్యం. ఆ దృష్టి లేనివారూ, రోజువారీ మనుగడ గుఱించీ, "జఱగడాల" గుఱించీ మాత్రమే ఆలోచించే స్థాయిలో ఉన్నవారూ మేధావులు (intellectuals) కాజాలరు. అలాంటివారి చేతుల్లో జాతి భవిష్యత్తు అంధకార బంధురం.

నిఘంటువులు/వ్యాకరణాలూ పనికొస్తాయి, అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ !

1. మనం మర్చిపోయిన పదాల్ని మనకి గుర్తుచేస్తాయి.
2. మనకి పనికొచ్చే/మనం అనుసరించదగ్గ పదనిర్మాణ నమూనాల (word construction models) ని సరఫరా చేస్తాయి.
3. మనం అర్థాన్ని అన్యథాప్రకల్పన చేసి వాడుకోదగ్గ పర్యాయపదాల్నీ, ప్రత్యామ్నాయాల్నీ అందిస్తాయి.
4. మనం కార్యవ్యగ్రులం కావడానికి కావాల్సిన ముడిసరుకుల్ని సమకూఱుస్తాయి.
5. మనం అనవసరశ్రమ తీసుకుంటున్నామా? ఇప్పటికే ఉన్న పదాల్ని మళ్ళీ కష్టపడి కనుక్కుంటున్నామా కాదా ? తనిఖీ చేసుకోవడానికి ఆచూకీలు (references) గా ఉపకరిస్తాయి.

మన జాతి సుదీర్ఘకాలం పాటు నిరక్షరాస్యతలో గడపడం చేత పెక్కు పదాలు వ్యవహారదూరమైపోయాయి. మన వారు అక్షరాస్యులయ్యేలోగా నాగరికతా, సంఘజీవనమూ కూడా మారిపోయి *'వియ్యంకుడు, షడ్డకుడు, ఏరాలు'* లాంటి వరసలూ, *'దబ్బనం, గుండ్రాయి, ఱాతిచిప్ప, గిలక, కొబ్బరికోఱం, మరచెంబు'* మొదలైన సామాన్య గృహోపకరణాల పేర్లు కూడా అర్థం కాని పరిస్థితి దాపురించింది. Dashboard కి 'యుగంధరం' లాంటివి సూచిస్తే "సద్యఃస్ఫోరకాలు (వెంటనే అర్థమయ్యే తరహావి) కావా"లని మొండిపట్టు పట్టుతారు. అన్ని బౌద్ధిక ఉరువుల (intellectual items) కీ వాడుకభాషలో వ్యక్తీకరణలు ఉండవంటే వినరు.

కనుక కొత్తపదాల్ని కనుగొనడం ఒక్కటే కాదు. పాతపదాల్ని పునరుద్ధరించడం కూడా భాషాసేవే.

పదనిష్పాదన కళ

రెండో అధ్యాయం

పదజాలాల ఆవిర్భావ గతం

తెలుగు పదజాలం (Telugu vocabulary) ఎలా పుట్టింది ?

తెలుగులోని పదజాలాన్ని పదిరకాలుగా వింగడించవచ్చు.

౧. అచ్చతెలుగు మూలధాతుజన్యం :- తెలుగుపదాలకు తమవంటూ కొన్ని మూలధాతువులున్నాయి. Dravidian Etymological Dictionary (DED) లో కనపడనంత మాత్రాన అవి లేవనుకోకూడదు. వాటినుంచి వందలాది తెలుగుపదాలు జన్మించాయి. అవి ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. ఉదాహరణకు చెర్ (తడి, నీరు) అనే మూలధాతువు నుంచి *చెఱువు, చెలక, చేను, చేపు, చేద, చెఱుకు, చెక్క, చెమ్మ, చెలమ, చెఱమ, చెత్త, చెట్టు, చెంబు* మొదలుగా గల విస్తారమైన పదకుటుంబం ఆవిర్భవించింది. ఇవన్నీ నీటిలో / నీటితో పెఱిగేవి. లేదా నీరు కలిగినవి. లేదా నీరు అవసర మైనవి. లేదా నీటి కోసం ఉన్నటువంటివి. ఇలాంటి ముప్పై-నలభై మూలధాతువుల నుంచి సుమారు ఒక వెయ్యి పదాల దాకా ఆవిర్భవించాయి.

౨. అచ్చతెలుగు దేశ్యం :- సంస్కృతప్రాకృతాల నుంచి గానీ, తోటి ద్రావిడభాషల నుంచి గానీ, ఉర్దూ-ఇంగ్లీషుభాషల నుంచి గానీ, పరిసర రాష్ట్రాల నుంచి గానీ అరువు దెచ్చుకోకుండా తెలుగుగడ్డపై తెలుగుప్రజల స్వోపజ్ఞామూలకంగా, స్వయంభువుగా వెలసిన పదజాలమే అచ్చతెలుగు దేశ్యం. అయితే వీటికి మూలధాతువులతో నిరుక్తి (etymology) చెప్పడం సాధ్యం కాదు.

ఉదా:- అంచన, అందం, అకరువు, అక్కసు, అచ్చు, అటుకులు, అట్టువ, అతివ, అత్తము, అదనము, అలుసు, ఆకు, గిన్నె, పళ్లెం, గరిటె, మిల్లి మొ॥

3. ద్రావిడ మూలధాతుజన్యం :- దక్షిణ భారత భాషలన్నింటికీ ఉమ్మడిగా ఉన్న మూలధాతువుల నుంచి (తెలుగు ఒక ప్రత్యేకభాషగా ఉనికిలో లేని కాలంలోనే) వచ్చిన పదజాలమిది.

ఉదా :- కాలు, చేయి, కన్ను, గోరు, మ్రాను, కాయ, నీరు, వాన, విన్ను (మిన్ను), ఉప్పు, కడలి, కాదిలి., వచ్చు, పోవు,

తిను మొ॥

౪. అర్వాచీన ద్రావిడ ఆదానం :- తెలుగు తక్కిన ద్రావిడభాషల నుంచి విడిపోయి ఒక ప్రత్యేకభాషగా రూపొందిన అనేక శతాబ్దాలకి వాటిల్లోంచి తెలుగులోకి రాజకీయ, మత, సాంస్కృతిక కారణాల వల్ల మళ్లీ ప్రవహించిన పదజాలం. ఇది ఎక్కువగా తమిళ–కన్నడజన్యం.

ఉదా:– తిరుమణి, అడియేను, మాళిగ, వరుమానం, హొన్ను, హెగ్గడి, హెచ్చు, తౌణికిసలాడు మొ॥

౫. ప్రాకృతసమం మఱియు ప్రాకృతభవం :- సంస్కృతంలోంచి నేరుగా కాకుండా, ముందు ప్రాకృతంగా వికృతి చెంది ఆ ప్రాకృతం నుంచి తెలుగులోకి వచ్చిన పదాలు. ఇవి ఎక్కువగా ఆంధ్రశాతవాహన చక్రవర్తుల కాలంలో వచ్చాయి. కారణం – అది ఆ రాజుల మాతృభాష కావడం. పైగా అదే అప్పుడు దక్షిణాపథానికి రాజభాషగా ఉండడం.

ఉదా :– అగ్గిపెట్టె, సింగారం, సిరి, కంబం, కారం, అయ్య, అమ్మ, తనం, పనస, కకపాల మొ॥

౬. సంస్కృతసమం :- దీనికే తత్సమమని నామాంతరం. సంస్కృతంలోని పదాలకి డు,ము,వు,ల వంటి పదాంత మార్పులు చేసి గానీ, చేయకుండా గానీ చాలావఱకు సంస్కృత వర్ణక్రమాన్నీ, గుణితాలనే అనుసరిస్తూ తెలుగులోకి తెచ్చిన పదజాలం. దీనికి మన భాష యావత్తూ నిలువెత్తు ఉదాహరణే. నిజానికి తెలుగువారి దృష్టిలో తెలుగూ, సంస్కృతమూ రెండు వేఱువేఱు భాషలు కావు. మన కావ్యసంప్రదాయాన్ని అనుసరించి, తెలుగుని యథేచ్ఛగా సంస్కృతపదాలతోనూ, సమాసాలతోనూ నింపి వేయవచ్చు.

౭. సంస్కృతభవం :- దీనికే తద్భవమని నామాంతరం. ముందు సంస్కృతంలోంచి పండితాంధ్రం (Scholarly Telugu) లోకి వచ్చినాక, మళ్ళీ ఆ పండితాంధ్రంలోంచి సామాన్యప్రజల వాడుకలోకి ప్రవహించి, వారి నోళ్ళల్లో కొంత కాలం పాటు నలిగి, కాలక్రమేణా రూపాంతరం చెంది వినపడుతున్న పదజాలమిది.

ఉదా:– అచ్చం, దెయ్యం, రాకాసి, మచ్చరం, వెధవ, తావు, పగ్గాలు, రచ్చ, నిప్పంతు, చక్కెఱ, అక్కరాలు మొ॥

౮. ఇస్లామిక ఆదానం : ఇది వాస్తవానికి ఏకభాషాజన్యం కాదు. అనేక భాషల పదాలు ఆనాటి అధికారభాష అయిన ఉర్దూ ద్వారా తెలుగులోకి ప్రవేశించాయి. ఆ భాషల్లో అరబ్బీ, తుర్కీ, ఫారసీ, హిందూస్థానీ ఉన్నాయి. ఏ ఉర్దూపదానికి ఏ భాష మూలమో మనకి తెలియదు గనుకా, ఈ తెఱగు పదజాలమంతా మహ్మదీయుల ద్వారా మనకి సంక్రమించింది గనుకా వాటన్నింటినీ కలిపి ఇస్లామిక ఆదానాలనే ఒక స్థూల వింగడింపుతో సరిపెడుతున్నాం.

ఉదా :– ఆఖరు, ఆఖరి, ఆజమాయిషీ, ఆబ్కారీ, ఆరిందా, ఆవర్జా, ఆసరా, ఆసామి, ఈనాం, ఇలాఖా, ఉడాయించు, ఉల్టా,

కచ్చేరి, కబురు, కబుర్లు, కబేళా, కమాను, కమామిషు, కలేజా, కలం, ఖరారు, కవాతు, కసరత్తు, కసాయి, ఖాతా, ఖామందు, ఖాయిలా, ఖాళీ, కితాబు, కుమ్మక్కు, కుర్చీ, కిరాయి, కుస్తీ, ఖుషీ, ఖూనీ, ఖైదీ, కైఫీయతు, కొజ్జా, కొత్వాలు, కౌలు మొ॥వి.

౯. ఆంగ్ల ఆదానం :- ఇంగ్లీషు మన దేశంలో గత 200 సంవత్సరాలుగా పరిపాలనాభాషగా, వ్యాపారభాషగా, విద్యా భాషగా ఉండడం వల్ల ఆ భాషాపరిచితీ, పాండిత్యమూ గలవారి ద్వారా సామాన్యప్రజల్లోకి సైతం వందలాది ఇంగ్లీషు పదాలు చొచ్చుకుపోయాయి. ముఖ్యంగా ఇవి ఆధునిక యంత్రసాధనాల వాడకం మూలానా, వృత్తిపరమైన అవసరాల్ని పురస్కరించుకునీ, అంతకంటే ముఖ్యంగా ఇంగ్లీషుపదాల ప్రయోగం ఒక ఉన్నత సామాజిక హోదాని ప్రసాదిస్తుందనే అభిప్రాయం వల్లా వాడుకలోకి వచ్చాయి.

౧౦. ఆంగ్లద్వార ఆదానం : ఇంగ్లీషులో ఉన్నవన్నీ అచ్చ ఇంగ్లీషుపదాలు కావు. తెలుగులో మాదిరే ఇంగ్లీషులో కూడా అనేక భాషల పదాలు ప్రవేశించాయి. అయితే వాటిని ఇంగ్లీషువారు వాడుతున్నారనే కారణం చేత మనం కూడా వాడు తున్నాం. వారియందలి ప్రమాణబుద్ధిని బట్టి వారు వాటిని ఏ అర్థంలో వాడుతున్నారో మనమూ అదే అర్థంలో వాడు తున్నాం, వాటి యథార్థమైన మూలభాషా-అర్థాలు ఏమైనప్పటికీ ! అలాగే వారు వాటిని ఎలా వ్రాసి పలుకుతున్నారో మనమూ అలాగే వ్రాసి పలుకుతున్నాం. ఆంగ్లం ద్వారా మనకి సంక్రమించిన ఈ బహుభాషాపదాల ఆదానాన్ని **ఆంగ్ల ద్వార ఆదానాలు** అని చెప్పుకోవచ్చు.

ఉదా:- సుహో మోటు, సునామి, పీజా, హాంబర్గర్, కిండర్‌గార్టెన్, కంగారూ, కాఫీ, ఆల్కహాల్, క్యారట్, జిరాఫీ, హెన్నా, సిరప్, బ్రాందీ, బండిల్, కోకో మొ॥

ఆంగ్ల పదజాలం ఎలా పుట్టింది ?

తెలుగులో కొత్తపదాల కల్పన చేసేటప్పుడు ఇంగ్లీషు పదాల్ని మక్కికి మక్కి దించుకోవడమో, అనువదించడమో కాక, ఇంగ్లీషులో పదాలు ఏర్పడిన విధానాన్ని ముందు సమగ్రంగా అధ్యయించి ఆ పద్ధతుల వెలుగులో తెలుక్కి వర్తించే సూత్రా ల్ని ఏర్పఱచుకోవాలి. ఇంగ్లీషు పదాలు స్థూలంగా రెండు చారిత్రిక రకాలుగా ఏర్పడ్డాయి.

1. అచ్చ ఇంగ్లీషు పదాలు 2. ఆదానాలు.

వీటిల్లో అచ్చ ఇంగ్లీషు పదాలు నాలుగు రకాలుగా ఏర్పడ్డాయి.

(అ) జెర్మానిక్ పదాలు :- తోటి జెర్మానిక్ భాషలైన డచ్, జర్మన్ ఇత్యాది భాషలతో పోలికలు గల ఇంగ్లీషు పదాలివి. ఉదా :- friend, thanks, good, God, church, round, free మొదలైనవి.

(ఇ) ఆంగ్లో-శాక్సన్ పదాలు :- మొదట్లో Angles అని పిలవబడ్డ ఆదిమ ఇంగ్లీషు వలసదార్లు ఇంగ్లండులోని స్థానిక శాగ్సన్‌జాతివారితో సమ్మేళనమై మాట్లాడ నారంభించిన భాష. ఇంగ్లండులో 11 వ శతాబ్దం దాకా ఈ భాషని మాట్లాడారు. ఉదా :–

an - one siex or syx - six, twentig - twenty, hlaf - bread (loaf)	twa - two seofan – seven hundred–hundred cese – cheese	þreo - three, eahta – eight hwæt - what, scyld – shield	feower– four nigon- nine hwær - where reod - red	fif-five tyn- ten
grene - green	geolu – yellow	man – human	wifman – woman	
modor - mother	fæder - father	dohtor – daughter	sunu – son	
hors – horse nihte – night	cu - cow middæ –midday	bridd – bird	dæg - day,	

(ఉ) కెల్టిక్/ గేలిక్ పదాలు : ఇంగ్లీషుకు పరిసర భాషలైన గాలిష్, ఈరిష్, స్కాటిష్, వెల్ష్ భాషల ప్రభావంతో ఇంగ్లీషు లోకి వచ్చి చేటిన పదాలు. కార్నిష్, కంబ్రిక్ , బ్రెటాన్ భాషల నుంచి కూడా ఇదే విధంగా పదాలు ఇంగ్లీషులోకి దిగుమ తయ్యాయి.

ఉదా :– ఈరిష్ నుంచి - drum, galore, hooligan మొ||
స్కాటిష్ నుంచి - clan, pet, pillion, slogan మొ||
వెల్ష్ నుంచి – crag, flannel మొ||

(ఎ) నోర్డిక్ (Old Norse) **పదాలు :-** వైకింగులు ఇంగ్లండుని పరిపాలించిన కాలంలో వచ్చి చేటిన పదాలు.

ఉదా :– aloft, anger, awe, awkward, axle, bag, bait, ball, band, bark, bask, berserk, birth, bleak, blunder, bulk, bylaw, cake, call, clip, club, call, crook, die, dirt మొ||

ఇంగ్లీషులో రెండో అతిపెద్ద శబ్దవర్గమైన ఆదాన పదాల్ని కూడా 4 రకాలుగా వింగడించవచ్చు.

(అ) ప్రామాణిక ఆదానాలు (Learned Borrowings): సంస్కృత ప్రాకృత భాషల పదాల్ని తెలుగు గ్రహించి నట్లే మత–మతేతర కారణాలవల్ల ముఖ్యంగా పునరుజ్జీవన (Renaissance) కాలంలో లాటిన్, గ్రీకుపదాలు ఇంగ్లీషుని ముంచెత్తాయి. ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది.

(ఇ) చారిత్రిక ఆదానాలు : తెలుగు ఉర్దూరాజుల ప్రభావానికి లోనైనట్లే, ఇంగ్లండుని నార్మన్ రాజులు పరిపాలించిన కాలంలో ఇంగ్లీషు ఫ్రెంచి ప్రభావానికి గుఱైంది. ఫ్రెంచివారిని అనుకరిస్తూ ఇంగ్లీషువారు కూడా పదాల చివఱ ఒక అనవసరమైన e చేర్చి వ్రాయసాగారు. ఉదా :– wyf కాస్తా wife అయింది.

(ఉ) సామ్రాజ్య ఆదానాలు : ఇంగ్లీషువారు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తమ రాజకీయాధికారాన్ని స్థాపించినప్పుడు స్థానిక భాషలు నేర్చుకోవడం, వాటిలోంచి అవసరమైన పదాల్ని గ్రహించడం జఱిగింది.

ఇది తెలుగుని ఇంగ్లీషుతో పోల్చడానికి కాదని అర్థం చేసుకోవాలి. చాలామంది ఆ పొఱపాటు చేస్తారు. నార్మన్ రాజుల కాలంలో తప్ప మిగతా అన్ని కాలాల్లోను ఇంగ్లీషు ఒక దేశానికి అధికార భాషగా ఒక హోదాని వెలగబెడుతూ వచ్చింది. ఒక దేశానికి జాతీయభాషగా రాజపోషణకీ, దానిద్వారా ప్రజాపోషణకీ అది నోచుకుంది. అందుచేత అది ఎన్ని భాషల ప్రభావానికి లోనైనా తన అస్తిత్వానికి ప్రమాదం రాలేదు. తెలుగు పరిస్థితి పూర్తి విరుద్ధం. విజయనగర సామ్రాజ్యం అంతరించాక (క్రీ.శ. 1665 ప్రాంతం) అప్పట్నుంచి ఒక అధికారభాషగా తెలుగు యొక్క అధ్యాయం ముగిసిపోయింది. అయినా ఇప్పటిదాకా ఈ భాష బతికే ఉండడం గొప్ప సర్కస్ ఫీటే. అందుచేత చారిత్రికంగా అడుగడుగునా క్రూరమైన అణచివేతలకు గుఱై, వ్యవస్థాగతంగా అన్యాయానికి బలైన తెలుగుని అభిమానించడం – ఎంత తీవ్రస్థాయిలోనైనా సరే భాషోన్మాదం కాజాలదు.

అందుచేత చిరకాల బాధితురాలైన తెలుగుభాషని నిలబెట్టుకోవడమే మన లక్ష్యంగా ఉండాలనీ, ఆ క్రమంలో భాషని మింగేసే చర్యలకి పాల్పడకూడదనీ, అంతిమంగా మనం మన తెలుగువ్యాప్తికే ఉపయోగపడాలి తప్ప ఇతర భాషల భుజకీర్తులకి మెఱుగులు దిద్దే కార్యక్రమంలో పాలు పంచుకోకూడదనీ చెప్పడానికే ఇదంతా వ్రాశాను.

తెల్లదేశాల్లో వారికి తెలిసిన plain language, layman's vocabulary అనే పదాలకి అర్థం వేఱు. మన దేశంలో layman's language కి అర్థం వేఱు. అక్కడి layman's language మన layman's language కంటే అత్యంత సంపన్నమైనదీ, శక్తిమంతమైనది కూడా. మన దేశంలో వాడుకలో ఉన్న layman's language శాబ్దికంగా ఒక బీదభాష. ఇందులో పదాలు కొద్ది. వ్యక్తీకరణలు పూజ్యం. మన laymen కనీసం ఐదో తరగతి వఱకైనా చదివినవారు కాక పోవడం ఇందుకో కారణం. పదో తరగతి వఱకు చదివినవారిక్కూడా పుస్తక పఠనాసక్తి లేకపోవడం మఱో కారణం. కాబట్టి అలాంటివారిని దృష్టిలో పెట్టుకుని మనం కొత్త పదజాలాన్ని రూపొందించడానికి పూనుకోరాదు. అలా పూనుకుంటే తెలిసిన పదాల గుడుగుడుగుంచంలోనే తిరగాల్సి వస్తుంది.

ఆంగ్లమేధావులు తమ మాతృభాషలో నూతన పదనిష్పాదన ఎలా చేశారు ?

కొందఱు తలపోస్తున్నట్లుగా ఇంగ్లీషులో ఈనాడు మనకి కనిపించే పదాలు ఇతర భాషల నుండి మక్కికి మక్కి దిగుమతి చేసుకున్నవి కావు. ఆకాశం నుంచి హఠాత్తుగా ఊడిపడ్డవీ కావు. అవి మొదట్లో యావత్తు జనసామాన్యానికీ తెలిసినవీ

కావు. వాటి వెనుక ఇంగ్లీషు మేధావుల కృషి చాలా ఉంది. అలాంటి కృషినే ఇప్పుడు మనం కూడా చెయ్యాలనుకుంటు న్నాం. కొత్త పదాల రూపకల్పన చేసేటప్పుడు ఇంగ్లీషు మేధావులు అనుసరించిన పద్ధతులనే మనం ఇప్పుడు చర్చిస్తు న్నాం.

1. **పోలిక (Analogy) :-** అంతకుముందున్న పదాలకి సంబంధించిన కొత్త పదాలు అవసరమైనప్పుడు ఆయా పదాల స్వరూపానికి కొద్దిగా మార్పులూ చేర్పులూ చేసి వేఱే అర్థంలో వాడారు. అంతకుముందు కేవలం uncanny అనే పదం ఒక్క టే ఉండగా canny అనే పదాన్ని కల్పించారు. అంతకుముందు gnostic (ఒక ప్రాచీన క్రైస్తవ శాఖ సభ్యుడు) ఒక్కటే ఉండగా agonstic (అజ్ఞేయవాది, నాస్తికుడు) అనే పదాన్ని కల్పించారు. Outrage అనేది అచ్చమైన ఆంగ్లో–శాగ్జన్ పదం కాగా దానికి విశేషణంగా outrageous అని లాటిన్ శైలిలో కల్పించారు. అంటే ఉన్న పదాల నుండే కొత్తపదాల్ని కల్పించారు. అలా కల్పించడం ఇంగ్లీషు/లాటిన్ వ్యాకరణసూత్రాలకు విరుద్ధమైనా లెక్క చెయ్యలేదు. సూత్రాలు వర్తింప శక్యమైతే పాటించారు. పాటించడానికి అవకాశం లేనిచోట త్రోసిపుచ్చారు.

2. **ధ్వన్యనుకరణ (Imitation) :-** మనుషులు భావోద్వేగపు క్షణాల్లో చేసే అవ్యక్త కాకుస్వరాలకీ, ధ్వనులకీ శబ్దప్రతి పత్తిని కల్పించారు. ఆ ధ్వనులకి– తెలిసిన ప్రత్యయాల్ని జోడించి కొత్త పదాల్ని నిష్పాదించారు. ఆ క్రమంలో lispism, yahoo, pooh-poohing, booing మొదలైన పదాలు పుట్టాయి. మనవాళ్ళు కూడా "చకచక, నిగనిగ" నుంచి చాక చక్యం, నైగనిగ్యం, నిగారింపు మొదలైన పదాల్ని నిష్పాదించారు. అయితే ఈ ప్రక్రియ ఇటీవలి కాలంలో వెనకబట్టింది.

3. **అర్థాంతర ప్రకల్పన (Semantic alteration):-** సాధారణ పరిస్థితుల్లో భాష చనిపోదు. ఇసుమంత మారు తుందంతే ! ఇంగ్లీషువారు అంతకుముందున్న పదాలకే కొత్త అర్థాల్ని అనువర్తించారు. Fan, straw, (cheque) leaf, web, portal మొదలైనవి ఈ కోవకి చెందినవి. కాని ఇలా చెయ్యాలంటే భాషాపటిమ కన్నా మనిషిలో కొంత కవితాత్మకత తోడవ్వాలి.

4. **పునరుద్ధరణ (Revival) :-** భాషలో కొన్ని పదాలు బహు పాతవై ఉంటాయి. అవి నిఘంటువులకి మాత్రమే పరి మితమై ఉంటాయి. వాటిని ఇప్పుడెవఱూ ఏ మాండలికంలోను వాడకపోవచ్చు. వాటికి సమానార్థకాలైన వేఱే పర్యాయ పదాలు ఇప్పుడు లభ్యమవుతూ ఉండొచ్చు. అంతమాత్రాన ఆ పాతపదాలు పనికిమాలినవి కావు. ఈ సత్యాన్ని ఇంగ్లీషు వారు లెస్సగా కనిపెట్టారు. ఆ పదాల పాత అర్థాలకి సరిపోలిన కొత్త అర్థాల్లో వాటిని వాడడం మొదలుపెట్టారు. ఆధుని కంగా లభ్యమౌతున్న పదాలకి తోడు ఈ పాతపదాలు కొత్త అర్థాల సోయగాలతో జతచేటి ఇంగ్లీషుభాషని నవయౌవనం తో పరిపుష్టం చేశాయి. Olympics, carnival, domain మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

5. **మాండలికాల విస్తృత వినియోగం (Universalization of dialects):** ఇంగ్లీషులో ఎన్ని మాండలికాలు ఉన్నాయో ఎవటికీ అంతుచిక్కదు. అయితే ఇంగ్లీషువారు ఆ మాండలికాలన్నింటినీ సందర్భానుసారంగా ఉపయోగించు

కుని భాషని శక్తిమంతం చేసుకున్నారు. మాండలిక పదాలకి ఇప్పటికే ఉన్న అర్థాలకి తోడు కొత్త అర్థాల్ని జతకలిపారు. కొన్ని సందర్భాల్లో Slang నుండి సైతం ప్రామాణిక భాషని సిద్ధం చేశారు. ఉదాహరణకి jazz అనే పదం New Orleans రాష్ట్రంలో ఒక అశ్లీల క్రియాధాతువుగా మాత్రమే వాడుకలో ఉండేది. అదిప్పుడు ఒక గౌరవనీయమైన సంగీత కళారూపానికి నామధేయమైంది.

6. మిశ్రపద నిష్పాదన (Hybrid coinage) :- ఇంగ్లీషులో ఇప్పుడు "చెయ్యదగిన" అనే అర్థంలో క్రియాధాతువుల చివఱ చేర్చబడుతున్న able అనేది నిజానికి ఫ్రెంచి ప్రత్యయం. మొదట్లో ఇది adorable మొదలైన ఫ్రెంచి ఆదాన పదాలకి మాత్రమే చేఱేది. క్రమంగా దాన్ని దేశి ఇంగ్లీషు పదాలక్కూడా యథేచ్ఛగా చేర్చడం మొదలైంది. ఈరోజు think, drink, eat, walk లాంటి అచ్చ ఇంగ్లీషు పదాలక్కూడా ఇలాంటి పరిణామాన్ని చూస్తున్నాం.

7. **వైరిసమాస ఘటనం (Mixed compounds)** మన సంప్రదాయంలో సంస్కృత పదాలతో జతకలిపి తెలుగుతో సహా ఏ ఇతర భాషాపదాలకైనా సరే సంధులూ, సమాసాలూ చెయ్యడం అనాదిగా నిషిద్ధం. కలిసే సమాస అవయవాలు రెండూ సంస్కృత పదాలైతేనే వాటి మధ్య సంధి–సమాసకార్యాలు అనుమతిపాత్రం. ఆ రకంగా అవసరంలేని సంస్కృతపదాలు కూడా తెలుగులోకి సమాసాల రూపంలో యథేచ్ఛగా చొఱబడిపోయాయి ఒకప్పుడు ఇంగ్లీషులో కూడా ఇలాంటి సంప్రదాయమే ఉండేది. లాటిన్ గ్రీకుపదాలతో శుద్ధాంగ్ల పదాల్ని కలపకూడదు. అంతేకాక లాటిన్ సమాసాలు లాటిన్తో జఱగాలి. గ్రీకుసమాసాలు గ్రీకుతోనే జఱగాలి. లాటిన్ పదాలతో గ్రీకుపదాల్ని కలపకూడదు.

కాని ఆధునిక ఆంగ్లమేధావులు ఈ సంప్రదాయాన్ని కావాలనే విశృంఖలంగా ఉల్లంఘించారు. తప్పలేదు, తప్పు లేదు. ఎందుకంటే సమాసంలో రెండో పదం కూడా ఆ భాషాపదమే అయివుండాలంటే, ఎంతమందికి లాటిన్ గ్రీకుల మీద పట్టుంటుంది ? అలా నూతన పదసృష్టి స్తంభించిపోతుంది.

8. సమాస ఘటనం (word compounds) : ఆంగ్ల మేధావులు గత శతాబ్దాల్లో ఉనికిలో లేని కొన్ని వ్యాకరణ సంప్రదాయాల్ని తమ భాషలో ప్రవేశపెట్టారు. వాడుకలో బహుళప్రాచుర్యాన్ని పొందినప్పటికీ ఆంగ్లవ్యాకరణాల్లో మాత్రం ఆ నిర్మాణాలకు ఇప్పటికీ సముచితస్థానం లేదు. వాటిల్లో సమాసాలొకటి. సమాసం రెండు వేఱువేఱు అర్థాలు గల పదాలతో ఏర్పడే మిశ్రమం. ఆ మిశ్రమం నుంచి ఉప్పతిల్లే కొత్తపదం ఒక కొత్త అర్థాన్ని కూడా స్ఫురింపజేస్తుంది. **ఉదా :– రాజభవనం.** ఇది రాజు కంటేనూ, భవనం కంటేనూ వేఱైన ఒక ప్రత్యేకమైన శ్రేణికి చెందిన కట్టడాన్ని సూచిస్తుంది. సమాసాల సౌలభ్యాన్ని ఆంగ్లమేధావులు త్వరగానే గ్రహించారు.ఇప్పుడు సమాసాల్లేకుండా ఇంగ్లీషు మాట్లాడడమే

అసాధ్యం. ఒకవేళ అలా మాట్లా డితే ఇంగ్లీషు రాదేమోనని జాలిపడడం కూడా జఱగొచ్చు.

సమాసం		విగ్రహవాక్యం	సమాసనామం (మన అవగాహనలో)
1. Customer-care	=	Care for customers	చతుర్థీతత్పురుషసమాసం
2. User-friendly	=	Friendly to the user	చతుర్థీతత్పురుషసమాసం
3. User-serviceable parts	=	Parts serviceable by the user	తృతీయాతత్పురుషసమాసం
4. Gas dealer	=	Dealer in gas	సప్తమీతత్పురుషసమాసం
5. Expiry date	=	Date of expiry	షష్ఠీతత్పురుషసమాసం
6. God-forsaken	=	Forsaken by God	తృతీయాతత్పురుషసమాసం
7. Bible-thumping	=	Thumping the Bible	ద్వితీయాతత్పురుషసమాసం
8. A London-bound airliner	=	An airliner bound for London	చతుర్థీతత్పురుషసమాసం
9. Earth-fill	=	Filling with earth	తృతీయాతత్పురుషసమాసం
10. Sky-diving	=	Diving in the sky	సప్తమీతత్పురుషసమాసం
11. Trustworthy	=	Worthy of trust	చతుర్థీతత్పురుషసమాసం
12. Action-packed	=	Packed with action	తృతీయాతత్పురుషసమాసం
13. Painstaking/ breath-taking etc.			

అయితే ఇక్కడ ఒక ఆసక్తికరమైన వైచిత్రి ఉంది. దీన్నొక ప్రత్యేకమైన పదనిర్మాణ భేదంగా గుర్తించినప్పటికీ తాము వాడుతున్నవి సమాసాలు (word compounds) అని ఆంగ్లేయులకి ఇప్పటికీ తెలియదు. అలాంటి మిశ్రమాల్లో మొదటి పదం functional గా adjective అవుతోందని వారు భ్రమిస్తున్నారు. ఆ మాటే తమ వ్యాకరణాల్లో వ్రాసుకుంటున్నారు కూడా! రెండుపదాలు కలుస్తున్నప్పుడు మాయమౌతున్న విభక్తిప్రత్యయాల (prepositions) ని వివరించే వైయాకరణ బాధ్యత (grammarian's burden) గుఱించి మర్చిపోతున్నారు.

సమాసాలే మన భాషక్కూడా బలం. ఇంగ్లీషు వ్యాకరణాల్లా కాకుండా మన వ్యాకరణం సమాసాల్ని క్రోడీకరించి వర్గీకరించింది కూడా. అవి మన భాషలో ఇప్పటికే వందలాదిగా ఉన్నాయి. కాని ఆధునిక అవసరాలకి అవి సరిపోవు. మన భాషకున్న సమాసశక్తిని సక్రమంగా వినియోగించుకుని చాలా కొత్తపదాల్ని సృష్టించుకునే సౌలభ్యం ఉంది.

9. సందర్భాంతర (ప్రకరణాంతర) ప్రయోగాలు : నామవాచకాల్ని క్రియాధాతువులు (programming, airing, parenting, shopping, modelling, typing, cashing, triggering, highlighting, Focussing మొదలైనవి) గా మార్చి ప్రయోగించడం ఇంగ్లీషుకు ఎంత ఊపునిచ్చిందో ఇది కూడా అంతే ఊపునిచ్చింది. సందర్భాంతర ప్రయోగాలంటే– సాంప్రదాయికంగా ఒక సందర్భంలో మాత్రమే వాడాల్సిన పదాల్ని ఇంకొన్ని ఇతర సందర్భాల

క్కూడా అనువర్తించి వాడ్డం. అలాగే ఒక రంగంలో వాడాల్సిన సాంకేతిక పదాల్ని ఇంకో రంగానికి ఆరోపించి వాడడం కూడా! ఉదా:- **screen** (తెఱ) నాటకాలకూ, సినిమాలకూ అన్వయించే మాట. దాన్ని సమా. సాంకే. (IT) రంగంలో కొన్నిరకాల పుటల్ని సూచించడానిక్కూడా వాడుతున్నారు. అలాగే, **campaign** కి ప్రాథమికంగా దండయాత్ర అని అర్థం. కాని ఇప్పుడు దాన్ని ప్రచారయుద్ధం అనే అర్థంలో కూడా వాడుతున్నారు. గుఱ్ఱాల శారీరాన్ని (**horse anatomy**) అందులో భాగాల్నీ కార్లకీ, ఇతర యంత్రాలకీ అన్వయించి ప్రయోగించడం కూడా జటిగింది.



పదనిష్పాదన కళ

మూడో అధ్యాయం

నవీన పదనిష్పాదనకై కొన్ని మార్గదర్శకాలు

విస్తరిస్తున్న ఆధునిక విజ్ఞానానికీ వ్యవహారానికీ, అవసరాలకీ అనుగుణంగా కొత్త తెలుగుపదాల్ని కల్పించుకునేటప్పుడు కొన్ని ఆదర్శసూత్రాల్ని గమనంలో ఉంచుకోవడం అభిలషణీయం.

1. కొత్త వాడుకలు అలతి అలతి పదాలతో ఏర్పడిన చిఱుసమాసాలై ఉంటే మంచిది. పర్యాప్తమైన చిఱుతనాన్ని (optimum smallness) నిర్వచించడం కష్టం. కాని స్థూలంగా–

(అ) తెలుగులిపిలో అయిదు అక్షరాలకి మించని పదాలూ,

(ఇ) ఒకవేళ అయిదు అక్షరాలకి మించినా, ఆఱేడు అక్షరాలు కలిగి ఉన్నా, రెంటి కంటే ఎక్కువ అవయవాలు లేని సమాసాలూ **చిఱువాడుకలు** అని భావించవచ్చు.

2. సాఫీగా అర్థమయ్యే ఇంగ్లీషు పదాల (plain English terms) కి విశేషణాల (adjectives) తో కూడిన వర్ణనాత్మక పదజాలాన్ని సృష్టించడానికి పూనుకోకూడదు. అలాంటి ప్రయత్నం సాధారణంగా కొండవీటి చాంతాడంత సమాసాలకి దారితీస్తుంది. ఉదాహరణకు ధూమశకటం.

3. ఒకవేళ మూల ఆంగ్లపదమే స్వయంగా ఒక సమాసమైనప్పుడు, దాన్ని రచయితలు ఒక ప్రత్యాహార (abbreviation) రూపంలో సూచిస్తున్నప్పుడు తెలుగులో కూడా దాన్ని ఒక సమాసంగా అనువదించి ఆపైన దానికి ఒక తెలుగు ప్రత్యాహార రూపాన్ని ఇవ్వడం తప్పు కాదు.

ఉదా :– Portable Document Format (PDF) = వహణీయ పత్ర సంప్రకారం (వ.ప.సం.)

4. ఆదాన అనువాదాలు (Loan translations - అంటే మూలభాషలోని అర్థాన్ని మనం భాషలోకి అనువదించి పదాలు కల్పించడం) కొన్ని సార్లు తప్పవు. కాని అన్నివేళలా అదే మంత్రం గిట్టుబాటు కాదు. బ్లాగ్ లాంటి పదాల్ని "దాదాపుగా" అలాగే ఉంచి తత్సమాల్లా వాడుకోవడం మంచిది.

5. తెలుక్కి స్వాభావికమైన జాతీయాన్ని నుడికారాన్ని (idiom) భ్రష్టుపట్టించకూడదు. తెలుగులో ఇమడని నిర్మాణాలు (structures) శీఘ్రంగా పరమపదిస్తాయని మఱువరాదు.

6. భాషాపరిశుద్ధతని నిలబెట్టడమే మన అంతిమలక్ష్యం కాదు. భాషని సుసంపన్నం చెయ్యడమూ, ప్రయోగాత్మకతని ప్రోత్సహించడం కూడా మన లక్ష్యాలే. కాబట్టి వైరి సమాసాల్నీ, మిశ్రసమాసాల్ని విఱివిగా అనుమతించాలి. అయితే అవి శ్రవణసుభగంగా (వినసొంపుగా) ఉంటేనే పదికాలాల పాటు నిలుస్తాయి. వికారమైన పదసంయోజనలది అల్పాయుర్దాయం. తప్పనిసరై దిగుమతి చేసుకున్న ఇంగ్లీషు పదాలకి సంస్కృత ప్రత్యయాల (suffixes) నీ, ఉపసర్గల (prefixes) నీ చేర్చి వాడుకోవడం ఆమోదయోగ్యమే. ఉదా : కర్బనీకరణ మొదలైనవి.

7. ఇంగ్లీషులో లాగే తెలుగులో కూడా ప్రత్యాహారాల (abbreviations) ద్వారా ఏర్పడే acronyms ని (వెకిలిగా పరిగణించకుండా) వాటికి ఒక గౌరవనీయస్థానాన్ని కల్పించడం చాలా అవసరం. తెలుగులో ఇప్పటికే అలాంటివి కొన్ని ఉన్నాయి.

ఉదా :- అ.ర.సం (అభ్యుదయ రచయితల సంఘం)
వి.ర.సం (విప్లవ రచయితల సంఘం)
సి.కా.స (సింగరేణి కార్మిక సమాఖ్య)

వీటి సంఖ్య ఇంకా ఇంకా పెఱగాలి. ముఖ్యంగా తెలుగు శాస్త్ర సాంకేతిక రంగాల్లో !

8. మిశ్రపద నిష్పాదన (Hybrid coinage) ని ప్రోత్సహించాలి. అంటే, ఒక భాషకి చెందిన ఉపసర్గల్నీ ప్రత్యయాల్నీ ఇంకో భాషకి చెందిన దేశిపదాలకి చేర్చి కొత్త పదాలు పుట్టించడం. ఉదాహరణకి :- దురలవాటు. ఇందులో "దుర్" అనే ఉపసర్గ సంస్కృతం. "అలవాటు" తేట తెలుగుపదం. ఇలాంటివే **నిస్సిగ్గు, ప్రతివాడు, అతి తిండి** మొదలైనవి. ఇలాంటివి చాలా ఉన్నాయి కాని సరిపోవు. ఇవి వందలూ, వేలుగా పెఱగాలి.

9. అన్నింటి కంటే ముఖ్యమైన విషయం ఒకటుంది. పాతపదాలు, కావ్యభాష, గ్రాంధికం అంటూ కుహనా అభ్యుదయవాద శైలిలో అస్పృశ్యతానామాంకాలు (Labels) వేసి మన ముందటితరంవారు తెలుగుపదాల అనర్ఘ విలువను గుర్తెఱగక నిర్దాక్షిణ్యంగా సంఘబహిష్కరణ చేసిన అచ్చతెలుగు పదజాలం అపారంగా ఉంది. అలాగే అలాంటి సంస్కృత పదజాలం కూడా విపరీతంగా ఉంది.

అభ్యుదయపు చీకటి కోణం
అట్టడుగున పడి కాన్పించని
పదాలన్నీ కావాలిప్పుడు

దాస్తే దాగని భాష ! (మహాకవి శ్రీశ్రీకి క్షమాపణలతో)

ఆ పదజాలాన్నంతా ఇప్పుడు వెలికి తీయక తప్పదు. ఈ సందర్భంగా వ్యావహారికవాదం పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చిన కొన్ని దురభిప్రాయాల్ని కూడా సవరించాలి.

10. సంపూర్ణ సమానార్థకాలు అన్నివేళలా సాధ్యం కాకపోవచ్చు. అటువంటప్పుడు సమీపార్థకాలతో సరిపెట్టుకుందాం. భాష నిరంతర పరిణామశీలి కనుక మనం ఎంపిక చేసినవాటి కన్నా మంచి పదాలు భవిష్యత్తులో ప్రతిపాదనకొస్తాయని ఆశిద్దాం. ఒకే పరిభావనకి ఇద్దఱు–ముగ్గుఱు వేఱువేఱు నిష్పాదకులు రెండుమూడు వేఱువేఱు పదాల్ని కల్పించగా, ఆ అన్ని నిష్పాదనలూ సర్వోత్తమంగా ఉన్నట్లు అనిపిస్తే వాటన్నింటినీ పర్యాయపదాలుగా భావించి స్వీకరిద్దాం.

11. పాతపదాలకి కొత్త అర్థాలు కల్పించడం ద్వారా కొత్తపదాల్ని శూన్యంలోంచి కల్పించే అగత్యం నుంచి బయట పడతాం. కొన్నిసార్లు ఉన్న పదాల్ని *"తగువిధంగా"* రూపాంతరించడం (modifying) ద్వారా కొత్తపదాల్ని కల్పించి భాషని సంపన్నించవచ్చు. మన తెలుగుభాషలో ఇందుకు చాలా ఉదాహరణలున్నాయి.

ఉదా :–

పథం = దారి
పథకం = scheme

పన్నకం = ఉచ్చుల అమరిక
పన్నాగం = కుట్ర

మొలక = మొలిచిన గింజ
మొల్క → మొక్క = చిన్న చెట్టు

సలుపు = ఇబ్బందిపెట్టు
జలుబు = శీతబాధ

జీవితం = బ్రతుకు
జీతం = బ్రతకడానికి సరిపోయే పైకపు చెల్లింపు

కట్టు = చుట్టికట్టేది
గట్టు = సరిహద్దుగా కట్టేది

వంక = ఏఱు
వాక = అదే (ఏఱు)

పోడు – కొంతకాలం వ్యవసాయం చేసి ఆ భూమిని తగలబెట్టడం
బోడు/బోడి – మొక్కలూ గడ్డీ అన్నీ పెఱికి పారేసిన నేల

దిగుబడి = పొలం నుంచి ఇంటికి తెచ్చుకుని దించుకునే పంట
దిగుమతి = ఒడ/పడవ మీదినుంచి దించుకున్న సరుకు

కంప = పొడవైన తీగెలూ ముళ్ళూ గల గుబురు (మూలం = కమ్ము--> కమ్మీ)
గంప = పొడవైన వెదురుకమ్ముల్ని వంచి చేసిన పాత్ర (ఇనుము – ఇనప, ఱొమ్ము – ఱొంప అయినట్లు)

చేకూరు = పోగగు
చేకూరించుకొను = పోగు చేసుకొను --> చేకుఱించుకొను --> సేకరించుకొను (దీన్ని సేకరణ అని సంస్కృతీకరించడం కేవలం అసందర్భం. ఇలాంటి పదమేదీ సంస్కృతంలో లేదు)

పెంట = మానవ శరీర పరిత్యక్తం
పెండ (తెలంగాణాలో వాడుకలో ఉంది) = *జంతుశరీర పరిత్యక్తం*

పచ్చిది = ఉడికించనిది
పచ్చడి = ఉడికించకుండా నూఱి ఉప్పూ, కారమూ, పోపూ వేసిన కూరముక్కలు

కొన్నిపదాల్ని ఇలా రూపాంతరించే ప్రక్రియలో భాగంగా వాటికి చివఱ 'క' చేర్చవచ్చు. (సంస్కృత పదాల విషయం లో కూడా ఆ భాష వ్యాకరణం ఇందుకు అనుమతిస్తోంది) :ఉదా :-

ఒకర్తి – ఒకర్తుక
పడతి – పడతుక
పెంట – పెంటిక
ఎమ్ము – ఎముక మొ॥

12. ఒక పదానికి ఎన్ని అర్థాలైనా ఉంటాయి గనుక ఆ అన్ని అర్థాలకీ ఇంకో భాషలోని దాని సమార్థకం కూడా ప్రాతినిధ్యం వహించాలంటే కుదరదు. సమార్థకాలన్ని సందర్భానుసారమైనవే గాని విదేశీ పదాలకి పూర్తిగా సోదర సమానాలు కావు. ఒక పదాన్ని ఇంగ్లీషులో ఎన్ని సందర్భాల్లో ఎన్ని అర్థాల్లో వాడతారో మన తెలుగుపదం కూడా అన్ని అర్థాల్లో

ఉండాల్సిన అవసరం లేదు. ఆ సందర్భానికి తగిన అనువాదం చెయ్యగలిగితే చాలు. అసలు అలా ఏ భాషలోను ఉండదు. మనం 'ధర్మం' అనే పదాన్ని అనేక అర్థాల్లో వాడతాం. సందర్భాన్ని బట్టి ఇంగ్లీషులో దానికి 'law, natural justice, natural law, morality, duty' అని రకరకాలుగా అనువదిస్తారు. వీటిలో ఏ ఒక్క పదాన్నీ ధర్మానికి ప్రతినిధిగా ఎల్లవేళలా వాడడానికి అవకాశం లేదు.

13. లింగ నిరపేక్షాలు (Gender-neutral words) దొఱికితే మంచిదే. దొఱక్కపోతే ఏం చెయ్యగలం ? అన్ని భాషలూ ఇంగ్లీషులా ఉండాల్సిన పని లేదు. అయినా ఇంగ్లీషులో కూడా వస్తుతః లింగనిరపేక్షాలు లేవు. ప్రాచీన భాషల్లో అన్ని పదాలూ లింగసాపేక్షాలే (Gender-intensive words). (ఆ మాటకొస్తే ఏ భాషలోనూ లేవు). వారు ఒకప్పటి పుల్లింగాల్నే రెండు లింగాలకీ అనువర్తించడం మొదలుపెట్టి "అవే లింగనిరపేక్షాలు, పో"మ్మన్నారు. కనుక తప్పనిసరి సందర్భాల్లో లింగసహితంగానే నిష్పాదించాల్సి ఉంటుంది.

14. ఇప్పటికే ఒక అర్థంలో వాడుకలో స్థిరపడ్డ పదాల్ని ముట్టుకోకూడదు. అర్థమౌతుంది కదా అని ఒక పదాన్ని అనేక అర్థాల్లో వాడడం మొదలుపెడితే అది చివఱికి అర్థం కాకుండానే పోతుంది. ఎందుకంటే కొత్త పరిభావనల *(concepts)* కి ఎప్పుడూ కొత్తపదాలే కావాలి. వాటిని ప్రజలకు నెమ్మదిగా అలవాటు చేయాలి. అంతేతప్ప వ్యావహారికవాద కండూతితో దొఱికిన/ తోచిన పాతపదాలతోనే తాత్కాలికంగా సరిపుచ్చుకుందామని ప్రయత్నించరాదు. అలా చేస్తే భాష ఎదగదు సరికదా, వాడుక పదాలన్నీ అవాంఛితమైన నానార్థాల్ని సంతరించేసుకుంటాయి. వ్యవహారహాని ఘటిల్లుతుంది. ఆఖరికి భాష మొత్తం ఒక పేద్ద విప్పజాలని పొడుపుకథగా, అర్థం చెప్పలేని అభంగశ్లేషగా, పరిష్కరణ దుస్సాధమైన చిక్కుముడిగా మారుతుంది.

ఉదాహరణకు – ఒక దినపత్రికలో booking అనే మాటకు ఖరారు చేసుకోవడం అని వ్రాశారు. book చెయ్యడం, ఖరారు చెయ్యడం (finalization/confirmation) రెండూ ఒకటి కావు. కొంతమంది యాభైవేలు బయానా ఇచ్చి ఒక స్థలాన్ని book చేసుకుంటారు. కానీ వాళ్ళు మొత్తం ధరలో సగమైనా చెల్లిస్తేనే తప్ప ఆ స్థలం వారికి ఖరారు కాదు. booking కి పుస్తకించడం అని అనువదిస్తే బానే ఉంటుంది, అంతకుముందు ఆ పదం మన భాషలో ఏ ఇతర అర్థంలోనూ లేదు గనుక, దాన్ని ఒక కొత్త రూపంతో, ఒక కొత్త అర్థంలో వాడితే ఫర్వాలేదు.

15. పాతపదాల్ని కొత్త సాంకేతికతలకి అన్వయించి వాడుకోవడం అవసరం. ఇందునిమిత్తం కొన్నిసార్లు నిఘంటువుల దుమ్ముదులిపి పాతపదాల్ని కొత్త అర్థాలలో పునరుద్ధరించడానికి వెనుదీయకూడదు. ఉదాహరణకు, Fan అంటే ఒకప్పుడు విసనకఱ్ఱ. ఇప్పుడది ఒక విద్యుద్ యంత్రంగానే గుర్తించబడుతున్నది. కొత్త సంస్కృతపదాల్ని సృష్టించడం కంటే ఉన్న తెలుగుపదాలకి నూతన అర్థావగతిని కల్పించడం, ఆధునికీకరించడం అవసరం. మనం ఈరోజు దాకా చేస్తూ వచ్చినది– అలా ఇబ్బడిముబ్బడిగా సంస్కృత పదాల్ని సృష్టించడం, అవి ఎవరైనా సరిగా పలక్కపోతే పలకలేదని బాధపడ్డం, వాటిని ఇంగ్లీషు పదాల క్లుప్తతతో పోల్చి పరిహసిస్తే ఉడుక్కోవడం. తెలుక్కి నూతనపద నిష్పాదనశక్తి లేదనడం సరైన అవగాహన కాదు. పదనిష్పాదన అనగానే మనం అసంకల్పితంగా సంస్కృతం వైపే పరిగెత్తడానికి అలవాటుపడిపోయాం. ఆ క్రమంలో మన దృష్టంతా –"సంస్కృత సమాసాల/ పదాల పరిశుద్ధతని ఎలా కాపాడాలి? తెలుగుని ఎలా

దూరంగా పెట్టాలి ? హిందీని చూచివ్రాయడానికి అవకాశం ఏమైనా ఉందా ?" ఇలాంటివాటి మీద కేంద్రీకృతమవుతున్నది.

16. ఏదైనా ఒక కొత్త పదాన్ని నిష్పాదించేటప్పుడు దాని క్రియారూపం (verb form), నామవాచక రూపం (noun form), విశేషణ రూపం (adjectival form). కర్తృరూపం (agency). కర్మరూపం (past participle form), ఉపకరణరూపం, కరణీయరూపం, శతృ-శానజ్ రూపం మొదలైన అనేక సంబంధిత రూపాల్ని దృష్టిలో ఉంచుకొని మఱీ నిష్పాదించవలసి ఉంటుంది. ఒకే పదానికి సంబంధించిన ఈ వివిధ నిర్మాణాలను **పదకుటుంబం** అని వ్యవహరించవచ్చు. విద్యావంతుడైన ప్రతితెలుగువాడూ ఈ పదకుటుంబాన్ని స్వయంగా కల్పించేంత ప్రతిభావంతుడు కావాలి. అప్పుడే మనం ఇంగ్లీషుతో పోటీపడగలం. ఉదా :-

క్రియారూపం	బోధించు
నామవాచకరూపం	బోధన
విశేషణరూపం	బౌధనికం, బౌధన్యం (బోధనకు సంబంధించిన)
కర్తృరూపం	బోధకుడు, బోధకి (బోధించేవారు)
కర్తృవిశేషణరూపం	బోధకీయం / బోధకీనం/ బోధకేరం/ బౌధకికం = బోధకుడికి సంబంధించినది
కర్తృసమూహం	బౌధక్యం = బోధకుల సమూహం
కర్మరూపం	బోధితం (బోధించబడిన సబ్జెక్టు)
ఉపకరణరూపం	బోధకం, బోధిత్రం, బోధని (బోధించే సాధనం)
కరణీయ రూపం	బోధనీయం, బోధితవ్యం, బోధ్యం, బోధనాస్పదం, బోధనార్హం, బోధనయోగ్యం (బోధించదగినది)
శతృశానజ్ రూపం	బోధయత్, బోధయంతుడు (అలాగే జీవత్, జీవంతుడు మొ॥)

17. తెలిసిన పదాల నుంచి కొత్త పదాల్ని నిష్పాదించడం సాధ్యం కానప్పుడూ, అలా నిష్పాదించినవి బాలేనప్పుడూ మన భాషాధ్వనికి అనుగుణంగా వినూత్న నామధాతువుల (brand new nominal roots) ని శూన్యంలోంచి సృష్టించాలి. అంటే అలాంటి పదాల విషయంలో మనం మానసికంగా ఆదిమకాలానికి మళ్ళాల్సి వస్తుంది.

నూతన పదాల నిష్పాదనకి మాండలికాల వితరణ

18. ఆంగ్లపదాలకి తెలుగు సమానార్థకాల్ని రూపొందించే క్రమంలో మనం సంస్కృతం మీద హెచ్చుగా ఆధారపడుతూ వస్తున్నాం. దీనికొక కారణం మన సాంస్కృతిక వారసత్వం కాగా, ఇంకో కారణం – మన– అంటే విద్యావంతుల బౌద్ధిక

వాతావరణం దేశి (గ్రామీణ) ప్రజానీకంతో సంబంధాలు కోల్పోయి ఉండడం. మనం ఉండేది నగరాల్లో/ అథవా పట్టణాల్లో ! మనం చదివేది/మాట్లాడేది ఇంగ్లీషు లేదా ప్రామాణిక (శిష్టవ్యావహారిక) తెలుగు మాండలికం లేకపోతే ఇటు ఆంధ్రమూ, అటు ఆంగ్లమూ కానటూవంటి ఒక సంకర తెంగ్లీషు. తద్వారా మనం చాలా కృతక (synthetic) వ్యక్తులుగా మారిపోయాం.

పల్లెపట్లలో చాలా ముచ్చటైన దేశిపదాలు వాడుకలో ఉన్నాయి. వాటిల్లో చాలావఱకు ఇంగ్లీషు పదాలకి సమాధానం చెప్పగలవే. అయితే మనకి అవి తెలియకపోవడం. గ్రామీణులకేమో– అవి మనకి, అంటే పదనిష్పాదకులకి అవసరమని తెలియకపోవడం, ఈ కారణాల వల్ల పరస్పర సమాచారలోపం (communication gap) తీవరించి మనం క్రమంగా అసలైన తెలుక్కి దూరంగా, సుదూరంగా జఱిగిపోతున్నాం. "ఇంగ్లీషు పదాలే original, తెలుగు పదాలంటే మక్కికి మక్కి అనువాదాలు (True Translation), తెలుగంటే సంస్కృతం" అనే అభిప్రాయంలో పడి ఊగిసలాడుతున్నాం. కొన్నిసార్లు కొత్త పదాల్ని నిష్పాదించినవారే వాటిని వాడని పరిస్థితి కూడా లేకపోలేదు.

మాండలికాలు లేకుండా తెలుగు పరిపూర్ణం కాదు. ఆ పదాల్ని ఆయా జిల్లాలకీ, తాలూకాలకీ పరిమితం చెయ్యకుండా శిష్టవ్యావహారికంలోకి, సాహిత్య ప్రధానస్రవంతిలోకి తీసుకురాగలిగితే, అందరికీ వాటి వాడుకని అలవాటు చెయ్యగలిగితే భాషకి మహోపకారం జరుగుతుంది. అనువాదాలు చేసేటప్పుడు గానీ, సమానార్థకాల్ని రూపొందించేటప్పుడు గానీ మన భావదారిద్ర్యమూ, పదదారిద్ర్యమూ వదిలిపోతాయి. అంతకంటే ముఖ్యంగా సమార్థకాలకి కృత్రిమత్వదోషం నివారించబడి సహజ తెలుగుతనపు పరిమళాలు గుబాళిస్తాయి. మూర్త నామవాచకాల్ని (Material Nouns) ని అమూర్త నామవాచకాలు (Abstract Nouns) గా పరివర్తించడం ద్వారా చాలా బౌద్ధిక పదజాలాన్ని (intellectual vocabulary) నిష్పాదించవచ్చు. ఇందునిమిత్తం మనకి వ్యవసాయంతో సహా వివిధ గ్రామీణ వృత్తుల పదజాలాలు సహకరిస్తాయి. వాటిల్లో కొన్ని ఇప్పటికే సాహిత్యభాషలోకి ప్రవేశించాయి. అవి అలా ఇంకా ఇంకా ప్రవేశించాలనీ సాహిత్యానికీ, ప్రజలకీ మధ్య ఏర్పడిన తెంపు (disconnect) రద్దు కావాలనీ ఆశిస్తున్నాను. ఉదా:–

తూర్పారబట్టడం – (భౌతికార్థం) వడ్లు జల్లించడం, (సాహిత్యార్థం) నిందించడం మొ||

మఱో ఉదాహరణ – తూర్పుగోదావరిజిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వాడే "కిట్టింపు" అనే పదాన్ని తీసుకుందాం. లెక్కలో వచ్చే హెచ్చుతగ్గుల్ని సరిపెట్టడానికి ఈ పదాన్ని వాడతారు. ఇది ప్రధానంగా బళ్ళలోను ట్యూషన్లలోను వినపడే పదం. ఎలాగైనా సరే answer వచ్చేలా చెయ్యడమన్నమాట. ఇది సానుకూలార్థం (positive meaning) లో వాడే పదం మాత్రం కాదు. ఇది కిట్టింపు ఎందుకయిందంటే–

కిట్టు = సరిపోవు
కిట్టుబాటు = గిట్టుబాటు
కిట్టించు = సరిపోయేలా చేయు

ఈ రకమైన కిట్టింపు (manipulation of accounts) ని మనం సత్యం కంపెనీ కుంభకోణంలో గమనించాం. మన పాత్రికేయులెవరైనా ఈ పదం వాడతారేమోనని చూశాను. ఎక్కడా కనిపించలేదు. దాన్ని బట్టి చూస్తే మనం (ఆలోచనాపరులం) ప్రజలకి నేర్పాల్సినదాని కన్నా వారినుంచి నేర్చుకోవాల్సిందే ఎక్కువ ఉందనిపిస్తోంది.

సంస్కృతం మీద అతి-ఆధారపాటు (over-dependence)

19. మన పదాల చరిత్ర ఇప్పటిదాకా ఎలా ఉందో టూకీగా సమీక్షించుకుందాం. ఇంగ్లీషు పదాలకి ప్రతిగా మనం ఇలా అనేక సంస్కృత శబ్దాలతో, సమాసాలతో తెలుగుని నింపేయడం, అవి జనానికి నోరు తిరక్కపోవడం, పైగా అవి ఆదాన అనువాదాలు (loan translations) అనే దృష్టితో వాటిని ప్రజలు చిన్నచూపు చూడ్డం, చులకనగా మాట్లాడ్డం, వాళ్ళు ఆదరించడం లేదని మనం బాధపడడం తఱచయింది. దాని బదులు ముచ్చటైన, పలకడానికి సులభమైన, తక్కువ అక్షరాలు గలిగిన తెలుగు ప్రత్యామ్నాయాలు దొరికినప్పుడు వాటినే వాడడం మంచిది. సంస్కృతపదాల కంటే అవి త్వరగా ప్రచారంలోకి వస్తాయి. సంస్కృతపదాల్ని విచ్చలవిడిగా తెలుగులోకి దిగవేయడం (dumping) లో ఉన్న ఇబ్బందుల గుఱించి కాస్త తెలుసుకుందాం.

౧. చాలా సందర్భాల్లో ఇలా దిగవేయబడే పదాలు అర్థరీత్యా తెలుగుపదాల కంటే గొప్పవి కావు.

౨. కానీ వాటికివ్వబడే అనవసరమైన గౌరవం వల్ల అవి తెలుగు పదాల్నీ నీచపఱుస్తాయి (demeaning). అంటే అవి తెలుగులోకి వచ్చినాక వాటి తెలుగు సమార్థకాల్ని నీచార్థంలో వాడడం మొదలుపెడతారు పండితులు. వాళ్ళని చూసి పామరులు కూడా తెలుగుపదాల్ని నీచార్థానికే పరిమితం చేస్తారు. ఉదాహరణకి క్రిందిపదాల్ని గమనించండి.

మట్టి = మృత్తిక
చచ్చిపోయారు = మరణించారు
కంసాలి = విశ్వకర్మ
కంపు = వాసన
బడి = పాఠశాల
ఊరు = పట్టణం
చెట్టు = వృక్షం

ఇలా ఎన్నైనా చెప్పొచ్చు. కనుక ఇలా దిగవేయడం తెలుగు ప్రాధాన్యాన్ని తగ్గించడమే ఔతుంది తప్ప అభివృద్ధి చెయ్యడం అవ్వదు.

౩. దిగవేసిన ప్రతి సంస్కృత పదంతో పాటు అనేక సంస్కృతప్రత్యయాల్ని, ఉపసర్గల్నీ కూడా దిగవేయాల్సి వస్తుంది. ఆ

ప్రత్యయాలూ, ఉపసర్గలూ మన తెలుగువాళ్ళకి తెలిసినవి కావు. వాటి అర్థమూ తెలియదు, వాటిని ఎక్కడ ఎలా అతకాలో కూడా వాళ్ళకి తెలియదు. సంస్కృత వ్యాకరణంలో శాస్త్రీయమైన శిక్షణ లేకపోడం చేత ఒక పదంలో కనిపించే ప్రత్యయాన్ని లేదా ఉపసర్గని ధైర్యంగా ఇంకో పదానికి అన్వయించుకోలేరు. అన్వయించబోతే అన్నీ తప్పులే వస్తాయి. అందుచేత అలా ఎన్నింటిని దిగవేసినా ఇంకా ఇంకా భారీగా దిగవేయాల్సి వస్తూనే ఉంటుంది. ఆ దరిద్రానికి అంతులేదు. దీనిక్కారణం – అవి తెలుగు కాకపోవడం, అవి తెలుగు వ్యాకరణంలో ఇమడకపోవడం. తెలుగు వ్యావహారికశైలిలో అసలే ఇమడకపోవడం. దీనికి పరిష్కారం– సంస్కృతపదాల బదులు కొన్ని సంస్కృత ప్రత్యయాల్నీ, ఉపసర్గల్నీ తెలుగులోకి తెచ్చి వాటిని నేరుగా తెలుగు పదాలకే కలపడం.

ఉదాహరణకి :– *ఉప-అద్దె (sub-rent) , తెలివిమంతుడు, నిష్పూచీ మొ*||

అప్పుడు తెలుగుభాషలో కూడా సంస్కృతంలో మాదిరే పదనిష్పాదన ప్రక్రియ సులువూ, వేగవంతమూ అవుతుంది.

౪. సమాసఘటన చేసేటప్పుడు సంస్కృతపదాల్ని సంస్కృత pపదాలతోనే కలపాలనే చాదస్తం మనవాళ్ళలో చాలా చాలా ఎక్కువ. అలా అవసరం లేకపోయినా ఇబ్బడిముబ్బడిగా సంస్కృతపదాలు సమాసాల ద్వారా తెలుగులోకి వచ్చి తిష్ఠవేశాయి. తిష్ఠవెయ్యడమే కాదు, సమాసాల ద్వారా అలవాటైన సంస్కృతపదాలు కొన్ని సందర్భాలలో అసలైన తెలుగు పదాల్నే భాషలోంచి ఏకమొత్తంగా తుడిచిపెట్టాయి. ఉదా :– ఉత్తరం, దక్షిణం.

మన ముందున్న కార్యావళి (agenda)

20. తెలుగులో కొత్త పదాల్ని కల్పించడమనే కార్యకలాపం నాలుగు దిశల్లో జఱగాల్సి ఉంది.

(అ) ఇంగ్లీషు పదాలకి సమార్థకాల (equivalents) కల్పన/అన్వేషణ

(ఇ) ఇంగ్లీషులో లేనటువంటివి/మన స్థానిక తెలుగుభాషుల (Native Telugu speakers) భావాల వెల్లడింపుకి

ఉపయోగపడేవీ అయిన కొత్త పదాల నిష్పాదన (Coinage)

(ఉ) అన్యదేశ్యాల స్థానికీకరణ (Nativization)

(ఋ) కొత్త పరిభావనల (Concepts) గుర్తింపు మఱియు నామకరణం.

ఔత్సాహిక పదనిష్పాదకులు ఈ పై నాలుగో కార్యకలాపం గుఱించి కొంచెం ప్రత్యేకంగా తెలుసుకోవాలి. మనమిప్పటి దాకా చేస్తూ వస్తున్నది ప్రధానంగా, ఆంగ్ల ఆరోపాలకి తెలుగు సమార్థకాల్ని నిష్పాదించడం. ఈ మార్గంలో మన భాష

ఇంగ్లీషువారి పరిభావనలకి ప్రతిబింబప్రాయం మాత్రమే కాగలదు. పదాలనేవి పరిభావనల వ్యక్తీకరణలు మాత్రమే. అసలు పరిభావనలంటూ ఉంటే పదాలు పుట్టడం కష్టం కాదు. కనుక ముందు సరికొత్త పరిభావనల్ని ఆవిష్కరించే ప్రయత్నం కూడా జఱగాలి. చూడగల కళ్ళుంటే మనచుట్టూ ఉపయుక్తమైన సరికొత్త పరిభావనలు ఉన్నాయి. వాటిని గుర్తుపట్టాలి. అది భాషాస్వకీయత (originality) కీ, సుసంపన్నతకీ దారితీయగలదు. *ఉదాహరణకు –*

౧. చదువు చెప్పేవాడు = ఉపాధ్యాయుడు
చదువుకునేవాడు = విద్యార్థి
చదువు చెప్పించేవాడు (తండ్రి / బడి యజమాని) = ? ? ? ?

౨. భవనం కట్టించేవాడు = కాంట్రాక్టరు, బిల్డర్
భవనం కట్టేవాడు = మేస్త్రి
కట్టించుకునేవాడు = ? ? ? ?

౩. వెలుగు X నీడ
ప్రతిఫలితమైన వెలుగు (reflected light) ని ఏమనాలి ?
అలాగే ప్రతిఫలితమైన వెలుగు వల్ల ఏర్పడే నీడని ఏమనాలి ?

౪. ఎంజిన్ పనిచేస్తున్నది = బండి / యంత్రం కదులుతున్నది
ఇది యాంత్రిక చలనం.
ఇంకో దృగ్విషయం : ఎంజిన్ పనిచేస్తున్నది కానీ బండి / యంత్రం కదలడం లేదు. దీన్నేమనాలి ?

౫. సోదరి కొడుకు మగవారికి మేనల్లుడు.
మఱి తమ సోదరుని కొడుకు వారికి ఏమవుతాడు ? (మేనకొడుకు అందామా ?)
అలాగే సోదరుని కొడుకు ఆడవారికి మేనల్లుడు.
మఱి తమ సోదరి కొడుకు వారి ఏమవుతాడు ?

౬. మన పూర్వీకులు మానవ శరీరంలోని అన్ని భాగాలకీ పేర్లు పెట్టలేదు. కొన్నిటిని వదిలేశారు. వాటికి ఏమని పేర్లు పెడదాం ?

ఏది చెయ్యాలన్నా ముందు మన భాషాస్వరూపం గుఱించి మనకి కొంత అవగాహన ఉండాలి. అది ఏర్పడాలంటే *శబ్దార్థ చంద్రిక* వంటి కోశాలను అనునిత్యం పరిశీలిస్తూ ఏ పదమైనా మనకి పనికొచ్చే లక్షణాలు కలిగి ఉందా ? అని కాస్త మధనపడాలి. రెండోది– *బాలవ్యాకరణాన్నీ, సిద్ధాంతకౌముదినీ* కూడా శోధించాలి. ఎందుకంటే ఒక మహాకవి చెప్పినట్లు *"గతం నాస్తి కాదు నేస్తం, అది అనుభవాల ఆస్తి."*

పాతపుస్తకాల బూజుదులిపి దుర్భిణితో గాలిస్తున్నంత మాత్రాన ప్రతి చాదస్తాన్నీ నెత్తిన వేసుకుంటామనుకోరాదు. 'కొత్త పదాలు' అంటే – ఏ విధమైన కొత్త పదాలు ? పదాల్లో రకాలున్నాయి. ఇంగ్లీషువారు వాటికి Parts of speech అని పేరుపెట్టారు. మన భాషకి సంబంధించినంత వఱకు మనం సిద్ధం చెయ్యాల్సినవి :

1. క్రియాధాతువులు (verb-roots)
2. నామవాచకాలు (nouns)
3. విశేషణాలు (Adjectives)

మళ్ళా వీటిల్లో చాలా రకాలున్నాయి. తెలుగుభాష నామవాచకాల్ని క్రియలుగా ఎలా మారుస్తుంది ? క్రియల్ని నామ వాచ కాలుగా ఎలా మారుస్తుంది ? ఒక నామవాచకంలోంచి ఇంకో నామవాచకాన్ని ఎలా నిష్పాదిస్తుంది ? వీటన్నింటి నుంచి విశేషణాల్ని ఎలా పుట్టిస్తుంది ? మళ్ళీ విశేషణాల్లోంచి నామవాచకాల్నీ, క్రియల్నీ ఎలా రప్పిస్తుంది ?

ఇవన్నీ కూలంకషంగా తెలుసుకుంటే సగం అయోమయంలోంచి బైటపడతాం.

21. తెలుగులో పదనిష్పాదన మఱింత ప్రజాస్వామికం కావాల్సిన ఆవశ్యకత ఉంది. అంటే ఎప్పుడూ ఎవఱో ఒకఱిద్దఱు లేదా ముగ్గుఱు, నలుగుఱు సమార్థకాల్ని సూచించడం, వారి వద్ద మాత్రమే సమాధానాలు ఉండడమూ, మిగతావారివద్ద ప్రశ్నలు మాత్రమే ఉండడమూ తరగతిగదిలాంటి ఈ పరిస్థితి శీఘ్రంగా మారడం మిక్కిలి వాంఛనీయం. ఇది నిజానికి ఒక అభ్యసనాప్రక్రియ. ఇది ఒక ఇబ్బందికరమైన ప్రక్రియ. ఎందుకంటే మనం స్వయంగా నేర్చుకునే కంటే ఇతరులకి నేర్పడానికి ఎక్కువ ప్రయత్నిస్తూంటాం. ఈ వైఖరి మన మనోఽభివృద్ధికి అడ్డుపడుతుంది. అదే సమయంలో భాషాభి వృద్ధికి కూడా !

౧. మఱింతగా పాత–కొత్త తెలుగు–ఇంగ్లీషు పుస్తకాల్ని చదవడం అలవాటు చేసుకోవాలి. అంతకన్నా ముఖ్యంగా **పూర్తిగా తెలుగులోనే ఆలోచించడం, మాట్లాడడం అలవాటు చేసుకోవాలి. ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడడం పనికిరాదు.**

౨. ప్రతిపదానికీ తెలుగు సమార్థకం ఏమై ఉంటుందో అని ఊహించే ప్రయత్నం చేయాలి.

౩. తెలుగు పుస్తకాల్లో దర్శనమిచ్చే పదఘటనా వైచిత్రికి క్షణికంగా ముఱిసిపోయి ఆ తరువాత వాటిని అక్కడికక్కడే మర్చిపోకుండా "అవి ఏ ఆధునిక పద– అవసరాల్ని తీర్చగలవో?" అని ఉత్ప్రేక్షించే ప్రయత్నం చేయాలి.

౪. మాండలిక పదాల్ని ఇతోఽధికంగా అధ్యయనం చేయాలి. అవి కూడా మాండలిక ప్రతిపత్తిని అధిగమించి మఱికొంత ఉన్నతశ్రేణిలో ఏ ఆధునిక పద–అవసరాల్ని తీర్చగలవో అని ఉత్ప్రేక్షించే ప్రయత్నం చేయాలి. కొన్నిసార్లు ప్రామాణిక వాడుకలు చేయజాలని పనిని మాండలిక పదాలు లెస్సగా నెఱవేఱుస్తాయి.

౫. పదనిర్మాణనిమిత్తం తెలుగు-సంస్కృత వ్యాకరణ గ్రంథాల్ని తఱచుగా తిరగేయాలి. వ్యాకరణ పరిజ్ఞానం లేకుండా అర్థవంతమైన, పదునైన పదాల నిష్పాదన సాధ్యం కాదు. ఒక మేస్త్రీ ఎంత గట్టిపనివాడైనప్పటికీ, ఇసుక, ఇటుక, సిమెంటు అనే ఉపచయాలు (inputs) లేకపోతే ఎలాగైతే ఏమీ చెయ్యలేడో అదే విధంగా పద-ధాతు-ప్రత్యయ పరిజ్ఞానం లోపిస్తే ఇతరత్రా ఎంత మేధావులైనా వారు చేయగలది కూడా శూన్యం. పదనిర్మాణాలకి ఒక తార్కికమైన, హేతుబద్ధమైన సుక్రమం (consistency) అవసరం. దాన్ని వ్యాకరణ పరిజ్ఞానమే సమకూర్చగలదు. మనం మాట్లాడే భాషలోని పదాలూ, వాక్యాలూ, వ్యాకరణమూ ఎంత తార్కికంగా ఉంటే మన జాతి యొక్క మేధాశక్తి కూడా అంత హేతుబద్ధంగానూ, నాగరికంగానూ ఉంటుంది. ప్రజలూ, ప్రజాభాష- వీటికి ఆ పరిజ్ఞానం అవసరం లేదనీ, అజ్ఞానమే సుజ్ఞానమనీ, రాచపుండు రాచబాట అనీ వాదించే మహామేధావులకు దూరం నుంచే ఒక నమస్కారం పెట్టవలసినది. ఎందుకంటే వైజ్ఞానికంగా అభివృద్ధి చెందిన ఆంగ్లంలో కూడా ప్రామాణిక శాస్త్రపదజాలమంతటికీ వ్యాకరణం ఉన్నది. అందుచేత వ్యాకరణం లేకుండా ఆంగ్లం లేదు. తెలుగైనా అంతే !

౬. హిందీలాంటి ఇతర భాషల్లో ఇంగ్లీషుకి ప్రతిగా వాడుతున్న సంస్కృత సమార్థకాల్ని యథాతథంగా తెలుగులోకి దింపుదల చేయడంలో ఉన్న సాంస్కృతికమైన ఇబ్బందుల్ని సమీచీనంగా గుర్తెఱగాలి. వారూ, మనమూ వాడుతున్నది గీర్వాణమే అయినప్పటికీ వారి వాడుకా, మన వాడుకా అచ్చుమచ్చుగా ఒకటి కాదు గనుక ఆ పదాలు తెలుగువారికి సద్యఃస్ఫురణ కావని గుర్తించినప్పుడు వాటిని వర్జించి మనం స్వకీయంగా, సరికొత్తగా పదనిష్పాదన చేయడమే వాంఛనీయం.



పదనిష్పాదన కళ

నాలుగో అధ్యాయం

తెలుగులో క్రియాకల్పన సాధనాలు

తెలుగువారి పూర్వీకులు క్రియాకల్పన చేసిన విధానం :

మన ప్రాచీన తెలుగుపూర్వీకులు రెండక్షరాల నామవాచకాలకీ, విశేషణాలకీ కొన్ని ప్రత్యయాలు చేర్చడం ద్వారా వాటిని క్రియాధాతువులుగా మార్చారు. మనం ఇప్పటికీ వాటిని వాడుతూనే ఉన్నాం. ప్రతిమూడక్షరాల తెలుగుక్రియాధాతువూ ఇలా ఏర్పడినదే. వారు చేర్చిన ప్రత్యయాలు–

(i) యు, చు, ఇంచు, ఇల్లు మొ.

యు చేర్చిన పదాలు కొన్ని :–

పులి = పులుపు ;
పులియు = పులుపుగా అగుట

తడి = చెమ్మ
తడియు = చెమ్మగా అగుట

తడ = ఆలస్యం
తడయు = ఆలస్యం చేయు
తడవు = సేపు, కాలవ్యవధి (ఇంత తడవు మొ.)

తెలి = తెలుపు
తెలియు = తెలుపుగా అగుట

విరి = పువ్వు

విరియు = పువ్వులా విచ్చుకొనుట మెఱ = ప్రకాశము

మెఱయు = ప్రకాశవంతమగుట

(ii) "చు" చేఱిన పదాలు కొన్ని :-

మొల = కింద

మొలచు = కింద నుంచి వచ్చు

నెఱ = నేర్పు

నెఱచు --> నేర్చు = అభ్యసించుట

వెఱ = భయం

వెఱచు = భయపడుట (-->వెఱపు)

చెఱ = బంధనం

చెఱచు = బంధించి అనుభవించుట

తల = మెదడున్న శరీరభాగము

తలచు = తలతో పనిచేయుట

వల = ప్రేమ/ శృంగారభావము

వలచు = శృంగారపరముగా ప్రేమించు

కల = అలజడి

కలఁచు = అలజడి కలిగించు (కలఁత)

మల = ఱాయి

మలచు = ఱాతి మీద పనిచేయు

పొద = శరీరం (రూపాంతరం = పొదలు --> ఒడలు)

పొదచు = శరీరములోకి దించుట

కోఱ = పదునైన పక్క పన్ను

కోఱచు --> కఱచు = పంటితో పట్టుకొనుట

నడ = కదలిక (నడపీనుఁగు = కదిలే శవం)
నడచు = కాళ్ళతో కదులుట

తెఱ = అడ్డుగా కట్టిన గుడ్డ
తెఱచు = అడ్డుగా కట్టినవాటిని తీయుట

ముడి = పొడవు-వెడల్పులను తగ్గించుట
ముడుచు = సంకోచింపజేయుట

నిల = నేల
నిలచు = నేలపై ఉండు

(iii) "గు" చేఱిన పదాలు కొన్ని :-

కల = అలజడి
కలఁగు = అలజడికి లోనగు (కలఁత/కలఁక)

నలి = సూక్ష్మం, కృశించుట
నలుగు = ముడతలు పడి కృశించుట (నలఁత = జబ్బు)

వెలి = తెలుపు
వెలుఁగు = తన పరిసరాల్ని తెల్లగా చేయుట

మొఱ = చప్పుడు
మొఱఁగు = (కుక్క) చప్పుడు చేయుట
మ్రోయు/మ్రోగు = చప్పుడు చేయుట

కొఱ్ఱు = పై భాగం
కొఱుగు --> గొఱుగు = పై భాగాన్ని తొలగించు
గొఱగ = గొఱగబడ్డవాడు, శివభక్తుడు (తల గొఱిగించుకున్నవాడు)
(కొఱితి మరన్ (మ్రాన్) --> కొత్తిమెర = ఆకుల పై భాగాలు కోసుగా ఉన్న మొక్క)

(iv) "కు" చేఱిన పదాలు కొన్ని :-

కోఱ = పదునైన పక్క పన్ను
కోఱకు --> కొఱకు = పంటితో గ్రుచ్చు

వెద = విత్తనం
వెదకు = విత్తనాలు ఏరడం

పల్లు = పన్ను
పలుకు = ఉచ్చరించుట

కుఱు = కింద/చిన్న
కుఱుకు --> కూర్కు --> కులుకు = పడుకొనుట
కుఱుంకు = క్రుంకు = సూర్యుడు అస్తమించుట
కుఱుంగు = క్రుంగు = మనిషి తగ్గిపోవుట

ఇవి కాక రెండక్షరాల విశేషణాల (adjectives) **కి 'ఇల్లుక్, ఇంచుక్' చేర్చి క్రియాధాతువుల** (verb-roots) **ని నిష్పాదించారు :**

సన్న + ఇల్లుక్ = సన్నగిల్లు
ఏవ = అసహ్యం (ఇప్పుడు యావ అంటున్నారు)
ఏవ + ఇంచుక్ = ఏవగించు

ఈ చర్చ ఎందుకు చేశామంటే, ఇంగ్లీషులో లాగా తెలుగులో కూడా ఏ నామవాచకాన్నైనా క్రియాపదంగా మార్చి వాడుకునే సౌలభ్యం ఉందని తెల్పడానికే ! సౌలభ్యాలకేం, ఎన్నో ఉన్నాయి సిద్ధాన్నంలా ! కాని వినియోగించుకునేవారే కఱువయ్యారు. ఒకవేళ వినియోగించినా చెవులకేదో కొత్తగా వినిపిస్తోందని వాడడం మానేస్తున్నారు. ఇలాంటి భాషాభేషజాల నుంచి బయటపడి స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా తెలుగుపదాల్ని ప్రయోగించే మంచిరోజులు రావాలని ఆశిద్దాం.

మనం 3 రకాల పదాల్ని కల్పించాల్సిఉందని ఇదివఱకు అనుకున్నాం. వాటిల్లో మొదటి విభాగం క్రియాధాతువులు. ఏ భాషలో నైనా ప్రాథమికక్రియలు కొన్నేఉంటాయి. మిగతా క్రియలన్నీ నామవాచకాల (nouns) నీ, విశేషణాల్నీ (adjectives) రూపాంతరించగా ఏర్పడ్డవై ఉంటాయి. ఇలా క్రియల్ని కల్పించడానికి తెలుగు అందిస్తున్న సౌకర్యాల గుఱించి మనం ఇప్పుడు చర్చిస్తున్నాం.

తెలుగులో క్రియా ధాతువులు అంతమయ్యే విధానాన్ని ముందు అధ్యయించాలి..

1. "చు" తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- కాచు, గీచు, చాచు, తోచు, దాచు, దోచు, పాచు, రాచు, వాచు, వీచు, వేచు మొదలైనవి.

2. అనుస్వార పూర్వకమైన (సున్న ముందు గల) "చు" తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- దంచు, దించు, తెంచు, మించు, ఉంచు, ఎంచు, పంచు, వంచు మొదలైనవి.

3. ద్విరుక్త (వత్తు) "చు" తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- తెచ్చు, గుచ్చు, నచ్చు, నొచ్చు, పుచ్చు మొదలైనవి.

4. "చు" తో అంతమయ్యే మూడు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- నడచు, ఒలుచు, పొడుచు, విడచు మొదలైనవి.

5. "ఇంచుక్" ప్రత్యయంతో అంతమయ్యే అచ్చతెలుగు క్రియాధాతువులు.
ఉదా :- గుఱించు (addressing), ఆకళించు (explain), సవరించు (amend), సవదరించు (edit) మొదలైనవి.

6. "ఇంచుక్" ప్రత్యయంతో అంతమయ్యే ప్రేరణార్థక క్రియా ధాతువులు.
ఉదా :- చేయించు ("చేయు" కు ప్రేరణార్థకం)
కదిలించు ("కదులు" కు ప్రేరణార్థకం) మొదలైనవి.

7. "ఇంచుక్" ప్రత్యయంతో అంతమయ్యే తత్సమ (సంస్కృత/ ప్రాకృత) క్రియా ధాతువులు (ఇవి లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి) :
ఉదా :- ధరించు, బోధించు, సంహరించు మొదలైనవి.

8. "యు" తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- ఏయు, కాయు, కోయు, కూయు, డాయు, తీయు (తివియు), తోయు, మోయు, మ్రోయు, వేయు మొదలైనవి.

9."యు" తో అంతమయ్యే మూడు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- తడియు, వడియు, జడియు, అలియు, తెలియు, పులియు, ఉమియు, విరియు మొదలైనవి.

10. "ను" తో అంతమయ్యే క్రియాధాతువులు.
ఉదా :- తిను, కను, విను, మను, అను, చను, కొను మొదలైనవి.

11. సామాన్య క్రియాధాతువులు

ఉదా :– సాగు, వెళ్ళు, అదురు వదులు, పగులు, మిగులు మొదలైనవి.

12. విశేష క్రియాధాతువులు (special verbs)

ఉదా :– ఉండు, పోవు, చూచు, అగు, వచ్చు, ఇచ్చు, చచ్చు, తెచ్చు మొదలైనవి.

13. కొన్నిసార్లు ఉనికిలో అప్పటికే ఉన్న రెండక్షరాల క్రియాధాతువులకి మళ్ళీ కు, గు ఇత్యాది ప్రత్యయాల్ని అదనంగా చేర్చి కొత్త ధాతువుల్ని నిష్పాదించడం జఱిగింది. ఉదా:

ఉబ్బు + కు = ఉబుకు ;

అద్దు + కు + అదుకు / అతుకు

మెత్తు + కు = మెదుగు

ఒత్తు + గు = ఒదుగు

ఎత్తు + గు = ఎదుగు మొ॥

మఱొక విషయం :– తెలుగులో క్రియలు రెండు విధాలుగా ఉంటాయి. 1. సకర్మక క్రియలు (transitive verbs) 2. అకర్మక క్రియలు (intransitive verbs).

సూత్రం -1. సకర్మక క్రియలకి మాత్రమే చివఱ "ఇంచుక్" ప్రత్యయం వస్తుంది.

అంటే చేయడాన్ని ఇంచుక్ సూచిస్తుంది.

ఉదా :– ధరించు – ఆయన కిరీటం ధరించాడు.

(ఇక్కడ ధరించు అనే క్రియకు కిరీటం కర్మ కనుక ఇది కర్మ గలిగిన సకర్మక ధాతువు)

సూత్రం-2. అకర్మక క్రియలకి చివఱ "ఇల్లుక్" వస్తుంది.

అంటే, కావడాన్ని ఇల్లుక్ సూచిస్తుంది.

ఉదా *:– ఆమె అతని హృదయేశ్వరిగా విరాజిల్లింది.* (ఈ వాక్యానికి కర్మ లేదు కనుక 'విరాజిల్లు' అకర్మక ధాతువు)

ఈ మార్గంలో కల్పించదగిన కొన్ని పదాలు :

సన్నగిల్లు = సన్నగించు (సన్నగా అయ్యేలా చేయు)
పరిఢవించు = పరిఢవిల్లు
తొందఱించు = తొందఱిల్లు మొదలైనవి.

'ఇంచుక్, ఇల్లుక్' లని సమయోచితంగా పదాలకు చేర్చడం ద్వారా అంతులేనన్ని కొత్త క్రియాధాతువుల కల్పనకి తెలుగు భాష అవకాశమిస్తోంది. రెండూ ముఖ్యమైనవే. 'ఇల్లుక్' చేర్పు తెలుగు నుడికారానికి స్వాభావికం కాని కర్మార్థక (passive voice) ప్రయోగాల ఆవశ్యకతని గణనీయంగా తగ్గిస్తుంది.

1. ఉదా (సవరిత వాడుక – modified usage):- *ఆ వేగుతో అతను **హెచ్చఱిల్లాడు** = హెచ్చఱించబడ్డాడు – మేలుకున్నాడు. He got alert with the mail)*

2. ఉదా (నిష్పన్న వాడుక – Coined usage) :- *భవిష్యత్తులో వంద డాలర్ల లోపలే కంప్యూటర్లు అందుబాటిల్లుతాయి. (అందుబాటులోకి వస్తాయి = దొఱుకుతాయి. Future PCS could be accessed/ accessible at just $ 100)*

ఇక్కడ కొన్ని నియమాలు ప్రవర్తిస్తాయి. మనం కల్పించే పదాల శ్రావ్యతని బట్టి వాటిని పాటించడమో మానుకోవడమో చెయ్యొచ్చు.

3. ***ఉర్దూ పదాలకు "ఇంచుక్/ఇల్లుక్" చేర్చడానికి ముందు ఆ పదాల చివర "ఆయ్" చేఱుతుంది.***
*ఉదా :– **ఉడ్ (ఎగరడం)** – ఉడ్ + ఆయ్ = ఉడాయ్ + ఇంచుక్ = ఉడాయించు (to decamp)*
బనా (తయారు చెయ్యడం) *– బనా + య్ = బనాయ్ + ఇంచుక్ = బనాయించు (to frame a criminal charge)*

అభ్యాసకార్యములు

I. *రెండక్షరాల నామధాతువుల్ని క్రియాధాతువులుగా మార్చడం – వ్యాకరణకార్య సూచనలు* ***(grammar hints) :-***

(అ) ప్రత్యయాల్ని చేర్చేముందు రెండో అక్షరం ద్విత్వమైతే ఆ ద్విత్వాన్ని తొలగించాలి.

(ఇ) ఆ అక్షరం కచటతపల్లో ఒకటైతే దాన్ని గసడదవలుగా మార్చాలి.

(ఉ) అది ఏ అచ్చును కలిగి ఉన్నప్పటికీ అంతిమంగా దాన్ని అకారసహితం చేయాలి.

ఉదా:- పెచ్చు= *(విశే.)* హెచ్చు, *అదనం*
పెచ్చు + పు = పెచ్చపు = పెచపు = **పెసపు**
నేను దీనికి ఇస్తున్న అర్థం – మఱింత పదార్థాన్ని, సామగ్రినీ మీద పేర్చి బలోపేతం చేయడం to reinforce.

ఈ అధ్యాయంలోని సూచనల్ని అనుసరించి ఈ క్రింద ఇచ్చిన అచ్చతెలుగు నామవాచకాల్ని క్రియాధాతువులుగా మార్చి మీరు అనుకుంటున్న అర్థాన్ని జోడించండి :

1.అడి = అధికము, వ్యర్థము 2. అని = యుద్ధము 3. అబ్బ== తండ్రి 4. అబ్బి= మనిషి (మగవాడు) 5. అఱ = సగము ***6.*** *అరి = పన్ను 7. అఱ్ఱ = ముసలి ఆవు 8. అల = చిఱుకెఱటం* ***9.*** *అల్ల == మందము* ***10.*** *అవ్వ== తాతభార్య* ***11.*** *ఇడి = సేమియా* ***12.*** *ఇఱ్ఱి = మగజింక* ***13.*** *ఇల్లి = ఉపవాసము* ***14.*** *ఉడ్డ = రాశి* ***15.*** *ఉట్టి = కప్పుకు వ్రేలాడదీసిన పాలకుండ మొ॥* ***16.*** *ఉల్లి = ఒక శాకము* ***17.*** *ఉరి = ఉద్బంధనము* ***18.*** *ఉమ్మ = ఆవిరి* ***19.*** *ఉలి = శిల్పాలు చెక్కే పనిముట్టు 20. ఎడ = చోటు ,అంతరం, మనస్సు, హృదయం, సమయం 21. ఎద = మనస్సు, హృదయం 22. ఎన = సాటి, సమం 23. ఎమ్ము = ఎముక 24. ఎర = బలి, ఆహారము 25. ఎల = లేత, యౌవనములోని* ***26.*** *ఎల్ల = అన్నీ 27. ఎస = మిక్కిలి 28. ఒగి = వరుస, క్రమము* ***29.*** *ఒజ్జ == గురువు* ***30.*** *ఒర = కత్తిని ఉంచే కోశం. 31. బరి – ప్రక్కన 32. గఱి = ఱెక్క 33.అల = చిఱుకెఱటం 34. ఆన = ఒట్టు 35. బాన = గుండ్రని కాగు 36. వాన = వర్షం 37. జేన (జాన) = వయోజనుల (adutls) అరిచేతిని పూర్తిగా చాపినప్పుడు బొటనవేలి కొస నుంచి మధ్యవేలి కొస దాకా వచ్చే పొడవు 38. చెఱ = బంధనం* ***39.*** *అర = కొయ్యసామగ్రిలోని గడి 40. మర = యంత్రం 40. వల = చేపలుపట్టడానికి వాడే అల్లికపని 41. కడ = అంతం 42. వడ = మిన ప్పప్పుతో చేసే ఒక భక్ష్యం 43. తెగ = ఉపజాతి 44. నగ = ఆభరణం* ***45.*** *పగ = ప్రతీకారవాంఛ* ***46.*** *గది = ఇంటి లో ఒక భాగం 47. రొద = రణగుణధ్వని 48. పొద (పొదరు) = మొక్కల గుబురు.* ***49.*** *చెద = తెల్ల పురుగుల గూళ్ళు 50. వెల మూల్యం*

పదనిష్పాదన కళ

అయిదో అధ్యాయం

సంస్కృత పదప్రత్యయాల సహాయంతో క్రియాకల్పన పద్ధతులు

సంస్కృత పదాలకి *ఇంచుక్* చేతే విధానం మనకందఱికీ కొద్దో గొప్పో తెలుసు కనుక సవిస్తరంగా ఆ జోలికి పోను. విశేష వివరణలు కావాల్సినవారు చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణంలోని క్రియా పరిచ్ఛేదం చదవండి. ఐతే ప్రస్తుతం ఈ మార్గంలో కూడా అవసరమైన పదాల కల్పన జఱగడంలేదు. దీనికి సామాజిక కారణాలున్నాయి. మన సమాజంలో సంస్కృత భాషాపరిజ్ఞానం ఎక్కువగా ఒక ప్రత్యేక సామాజిక జనాభాకే పరిమితం. మిగతా ప్రజలకి సంస్కృతంతో సంపర్కమెప్పుడూ లేదు. ఇప్పుడు ఆ జనాభా ఆంగ్లవిద్యాపారీణమైంది. తత్ఫలితంగా మనం గతం నుంచి సాంస్కృతిక తెగతెంపులకి గుఱైన అపస్మారకపు చారిత్రికదశలో బతుకుతున్నామేమో ననిపిస్తుంది. మనం ఆంగ్లపదాలకి దీటైన దేశిపదాల్ని పట్టుకోవడంలో విఫలమవుతున్న దశాపరిణామం గోచరిస్తోంది. ఇక్కడ కొంత ప్రదర్శించడం జఱుగుతోంది. ఈ ఒఱవడినే మిగతా పదాలకి సైతం అనువర్తించి ప్రయత్నించవచ్చు,

ఉదా:– పుస్తకం (book) - పుస్తకించు (booking)
వీణ్ణి జేబుదొంగగా పుస్తకించండి. (నమోదు చెయ్యండి. Book him as a pickpocket)

మార్గం (route) - మార్గించు (routing)
పేపాల్ ద్వారా ఈ చెల్లింపుని మార్గించాను (మార్గం కల్పించాను)
= *పేపాల్ పద్ధతిలో (మార్గంలో) ఈ చెల్లింపుని పంపించాను. (I routed this payment through Paypal)*

'*ఇంచుక్*' ఉపయోగించి ప్రసిద్ధ సంస్కృత వ్యక్తుల/దేవతల పేర్లని కూడా క్రియాధాతువులుగా మార్చొచ్చు. అలాంటివి ఒకటి–రెండు ఇప్పటికే సుప్రసిద్ధం. ఉదా : *భీష్ముడు – భీష్మించుట, శివాలెత్తుట* మొ.

మఱికొన్నింటి క్కూడా అవకాశముంది. కాని అలాంటి క్రియాధాతువులు అర్థం కావాలంటే వారి గుణగణాలు కొంచెమైనా తెలియాలి. చరిత్రలో కొందఱు వ్యక్తులు చేసిన పనులు వారి మనస్తత్వానికి అద్దంపట్టుతాయి. ఆ మనస్తత్వాన్ని అనుసరించి చేసే పనుల్ని వర్ణించడానికి వారి పేరుమీద క్రియాధాతువుల్ని కల్పించవచ్చు. ఉదా :–

విక్రమార్కించు = *పట్టువదలకపోవు*

జయచంద్రించు = *స్వదేశీయులకు ద్రోహం చేసి విదేశీయులకు తోడ్పడు*

కుంభకర్ణించు = *లోకోత్తరంగా నిద్రపోవు మొదలైనవి.*

మన పూర్వీకులు కేవలం సంస్కృత క్రియాధాతువులనే తెలుగులోకి తేలేదు. వారు సంస్కృత నామవాచకాల నెన్నిటినో కూడా తెలుగు క్రియాధాతువులుగా పరివర్తించారని గమనించాలి. ఈ క్రిందిపదాలు పరిశీలించండి :

అంకురం *– అంకురించు ;* ***అంజలి*** *– అంజలించు ;* ***అంతరము*** *– అంతరించు ;* ***అనుకూలం*** *– అనుకూలించు ;* ***అలసం*** *(ఆలస్యం) – అలసించు ;* ***అసహ్యం*** *– అసహ్యించుకొను ;* ***ఆశ*** *= ఆశించు, ;* ***ఆర్భటి*** *– ఆర్భటించు ;* ***కటాక్షం*** *– కటాక్షించు ;* ***కబళం*** *– కబళించు ;* ***కరుణ*** *– కరుణించు ;* ***కష్టం*** *– కష్టించు ;* ***కుసుమం*** *– కుసుమించు ;* ***గోచరం*** *– గోచరించు ; గౌరవం – గౌరవించు ;* ***జన్మ*** *– జన్మించు ;* ***చిత్రం*** *– చిత్రించు ;* ***తటస్థము*** *– తటస్థించు ;* ***తామసం*** *– తామసించు ;* ***తీవ్రం*** *– తీవరించు ;* ***నిర్మూలం*** *– నిర్మూలించు ;* ***నీరసం*** *– నీరసించు ;* ***పరమపదం*** *– పరమపదించు ;* ***పరిపాటి*** *- పాటించు ;* ***ప్రగల్భాలు*** *– ప్రగల్భించు ;* ***ప్రతికూలం*** *– ప్రతికూలించు ;* ***ప్రతిబింబం*** *– ప్రతిబింబించు ; ;* ***ప్రపంచము*** *– ప్రపంచించు ;* ***పురాణం*** *– పురాణించు ;* ***బద్ధకం*** *– బద్ధకించు ;* ***మూర్ఛుడు*** *– మూర్ఛించు ;* ***యోగం*** *– యోగించు ;* ***వల్లి*** *(ఉపనిషత్తులలోని శీక్షావల్లి, ఆనందవల్లి మొదలైన అధ్యాయాలలోని మంత్రాల పఠనం) – వల్లించు ;* ***విగ్రహం*** *(పోట్లాట) – విగ్రహించు ;* ***విషమం*** *– విషమించు ;* ***విహ్వలము*** *– విహ్వలించు* ***శృంగారం*** *- శృంగారించు ;* ***శుష్కం*** *– శుష్కించు ;* ***సమీపం*** *– సమీపించు ;* ***సాహసం*** *– సాహసించు ;* ***స్వాగతం*** *- స్వాగతించు ;* ***హేమం*** *– హేమించు మొ||*

ఇవేవీ సంస్కృతంలో క్రియలుగా వాడరు. కానీ తెలుగుపూర్వీకులు సాహసించారు. వీటిల్లో నామవాచకాలే కాక *అను కూలం, గోచరం, విషమం, విహ్వలం, అసహ్యం, సమీపం* లాంటి విశేషణాలు కూడా ఉన్నాయనేది అవధేయం. దుర దృష్టవశాత్తూ ఆ చొరవ ఈ తరంలో లోపించి పదసృష్టి ఆగిపోయింది. ప్రయత్నించాలే గానీ ఇప్పుడు కూడా ఈ బాట లో పదాల్ని నిష్పాదించే అవకాశం ఇతోఽధికంగా ఉంది.

౧. **ఇలాంటి పదాల్ని క్రియలుగా మార్చేటప్పుడు సర్వ సాధారణంగా చివఱ** *'ఈకరించు'* **అని చేఋస్తారు.** అలా కా కుండా నేరుగా వట్టి 'ఇంచుక్' చేర్చడం ద్వారా కూడా క్రియాధాతువుల్ని నిష్పాదించే వీలుందని పై ఉదాహరణల ద్వారా తెలుసుకోవచ్చు.

నామవాచకాల్ని క్రియాధాతువులుగా మార్చడం : ఎందుకు ? ఏమిటి ? ఎలా ?

ఒక నామవాచకాన్ని క్రియాధాతువుగా మారుస్తున్నామంటే అలా ఎందుకు మారుస్తున్నామో మనలో ఒక స్పష్టమైన అవ గాహన ఉండాలి. అసలు అలా మార్చే అవసరం దానంతట అది కలగాలి. అలా మార్చడం ద్వారా మనం ఏ విధమైన

కొత్త అర్థాన్నీ, వ్యంగ్యధ్వనినీ ఉద్దేశిస్తున్నామో ముందు మనకొక అవగాహన ఉండాలి. సరైన లక్ష్యశుద్ధి లేకుండా ఊరికే ప్రతి నామవాచకాన్నీ క్రియాధాతువుగా మార్చడం వల్ల వచ్చిపడే అదనపు అభివ్యక్తిసౌలభ్యమేమీ లేదు.

౧. సాధారణంగా ఒక పదబంధం (phrase) తో గానీ, శబ్దపల్లవం (idiom) తో గానీ బారుబారుగా చేసే వ్యక్తీకరణలను ఒక్కపదంగా కుదించడం కోసం మారుస్తారు.

ఉదా :– *తెలుగులోకి అనువదించాడు = తెనిగీకరించాడు.*
ఘనపదార్థంలా గట్టిగా మారింది = ఘనీభవించింది.

౨. కొన్నిసార్లు రచనలకి శీర్షికలుగా సమాసాల్ని పెట్టాల్సి వస్తుంది. రచనాశీర్షికలు బారుబారుగా ఉండడం బావుండదు గనుకా, క్లుప్తంగా వ్రాయాలంటే సమాస ఘటన తప్పదు గనుకా, ఆ సమాసాల్లో పదబంధాలూ, శబ్దపల్లవాలూ ఇమడవు గనుకా, ఒక పదాన్ని క్రియాధాతువుగా మార్చి దాని భావార్థకాన్ని (noun form) ఒక అ యవంగా సమాసంలో చొప్పిస్తారు.

ఉదా– *రెండుదేశాలకీ మధ్య మళ్ళీ స్నేహం కలపడం* అని శీర్షిక పెట్టాల్సి ఉందనుకోండి.
ఇఋదేశాల పునర్మైత్రీకరణ అని పెట్టొచ్చు.

౩. సదరు నామవాచకం తన అర్థం ద్వారా సూచించే వ్యక్తిగానో, వస్తువుగానో, పదార్థంగానో, లక్షణంగానో మార్చడాన్ని, లేదా మారడాన్ని తెలియజేయడం కోసం క్రియాధాతువుగా మారుస్తారు.

ఉదా:– దైవం = దేవుడు
దైవీకరించు = దేవుణ్ణి చేసి పూజించు

పిండం = ముద్ద
పిండీకరించు = ముద్దగా చేయు

హేమం = బంగారం
హేమీకరించు = బంగారుమయంగా చేయు

కఠినం = గట్టి
కఠినీకరించు = కఠినత్వమనే లక్షణాన్ని కలిగించు / సంతరించుకొను

ఉద్యానం – తోట

ఉద్యానీకరించు = తోటలాగా మార్చు
ఉద్యానీకరణ – Landscaping (హరితీకరణ అని కూడా అనొచ్చు)

౪. ఒక వస్తువుతో పోల్చడానికి ఆ వస్తువుని క్రియాధాతువుగా మారుస్తారు.

పర్వతం = కొండ (ఇక్కడ పర్వతం పోల్చబడే వస్తువు)
పర్వతీకరించు = పర్వతంలా పెద్దదీ, గొప్పదీ చేసి మాట్లాడు

తృణం = గడ్డిపోచ (ఇక్కడ తృణం పోల్చబడే వస్తువు)
తృణీకరించు = గడ్డిపోచతో పోలుస్తూ దానిలా (తక్కువగా) చూచు

౫. దేన్నయినా/ ఎవఱినైనా ఒకచోట *ఉంచడం/ పెట్టడం* అనే అర్థంలో క్రియాధాతువుగా మారుస్తారు.

వశం = అదుపు
వశీకరించు = అదుపులో పెట్టు

ఉన్నతం = ఎత్తు
ఉన్నతీకరించు = ఎత్తులో/ ఎత్తుగా పెట్టు (to elevate, to promote)

దూరం = దవ్వు
దూరీకరించు = దూరంగా పెట్టు

ఈకరించు

ఈకరించు అని చేర్చి నామవాచకాల్ని క్రియాపదాలుగా మార్చిన కొన్ని పూర్వోదాహరణలు ఈ క్రింద.

ఆంధ్రము = తెలుగుభాష – ఆంధ్రీకరించు
వక్రము = వంకర – వక్రీకరించు
విద్యుత్ = Electricity – విద్యుదీకరించు
పట్టణము = Urban area – పట్టణీకరించు (to urbanize)
క్రమబద్ధము = regular – క్రమబద్ధీకరించు (to regularize)
విపులము = వివరము – విపులీకరించు (to elaborate)

విశదము = తేటతెల్లము – విశదీకరించు (to elucidate)
అధునా = ఇప్పుదు, ఈ సమయము – ఆధునీకరించు (to modernize)
ప్రమాణము = Stanadard - ప్రమాణీకరించు (to standardize)
క్రోడము = ఒడి – క్రోడీకరించు (ఒళ్ళో పెట్టుకున్నట్లుగా ఒకచోట చేర్చుకోవడం)
వాజము = తెక్క / వేగం – వాజీకరణం (వేగాన్ని పెంచే ఔషధం)
సరళం = తేలిక – సరళీకరణం (simplification/ liberalization)
పరాయి = alien ;పరాయీకరించు = పరాయిగా చేయు (alienate)
పరాయీకరణ = alieanation మొ॥

కానీ అన్నిపదాలకీ *'ఈకరించు'* చేర్చడం సాధ్యం కాదు, ముఖ్యంగా ఆకారాంత, ఉకారాంత, యకారాంత శబ్దాలకి !

వివరణ :– ఉకారాంత శబ్దాలంటే పదం చివఱ 'ఉ/ ఊ' అని అంతమయ్యేవి.
ఉదా :– *జిజ్ఞాసువు, పటువు, మధువు* మొ॥వి.

౧. వీటి చివఱి అచ్చుని దీర్ఘం చేసి కరించు అని చేర్చాలి.

అప్పుడు ఇలాంటివి – జిజ్ఞాసూ + కరించు, పిపాసూ + కరించు, జంతూ + కరించు, గురూ + కరించు, పటూ + కరించు, మధూ + కరించు అనే విధంగా మారతాయి.

ఆకారాంత శబ్దాలంటే పదం చివఱ 'ఆ' అనే ఉచ్చారణతో పలికేవి.
ఉదా ఉదా:– *లతా, ప్రక్రియా, శాఖా రేఖా* మొ॥వి.

.యకారాంతాలంటే పదం చివఱ 'య' అనే అక్షరం గలవి.
ఉదా :– *సమయం, వాఙ్మయం, కార్యం* మొ॥వి.

౨. ఆకారాంత, యకారాంతాలకి చివఱ '*ఆపించు*'అని చేర్చి వాటిని క్రియాధాతువులుగా పరివర్తించవచ్చు.
ఉదా:–

ప్రక్రియ = *(n)* process
ప్రక్రియాపించు – *(v)* to process
ఉదా :– ఆంధ్రాలో ఆహారాన్ని ప్రక్రియాపించే పరిశ్రమలు హెచ్చు. (Food-processing units abound in Andhra)

౩. ఒకసారి ఇలా ఒక కొత్త క్రియాధాతువుని నిష్పాదించినాక, దాని నుంచి ఉద్భవించే విస్తారమైన పదకుటుంబం ఇలా ఉంటుంది.

ప్రక్రియాపన = (n) processing

ప్రక్రియాపకం = processor (ఉదా:– పదప్రక్రియాపకం = Word-processor ; ప్రక్రియాపక పరిశ్రమ = processing industry)

ప్రక్రియాపితం = processed (ఉదా:– ప్రక్రియాపిత ఆహారం = processed food)

ప్రక్రియాపకుడు = process maker

ప్రక్రియాపనీయం = processable, processing-worthy

ప్రక్రియాపనీయత = processability

ఇదే విధంగా–

సమయం = (n) time

సమయాపించు = (v) సమయాన్ని ఏర్పఱచు to set a time, to schedule something as to occur at a patricular time.

సమయాపన (n)

ఉదా :– ఈ టపాని వచ్చే వారానికి సమయాపించాను – I have scheduled this post for the next week.

శాఖ = (n) a branch

శాఖాపించు = (v) శాఖగా ఏర్పాటు చేయు, శాఖగా ఏర్పాటగు to set up a branch, to branch out

శాఖాపన (n) = branching out

ఉదా :– ఆ వ్యాపారం ఆంధ్రా అంతటా శాఖాపించింది (శాఖలుగా విస్తరించింది) – The business branched out all over Andhra.

౪. 'ఈకరించు' చేర్చాల్సిన అన్నిచోట్లా మఱొక అర్థంలో కావాలనుకున్నప్పుడు 'ఆపించు' అని చేర్చవచ్చు.

ఉదా :– సామాన్యీకరించు అనేది to generalize అనే అర్థంలో వాడబడుతోంది. ఇది సామాన్య శబ్దానికి *ఈకరించు* అని చేర్చడం ద్వారా ఏర్పడింది. కానీ ఒక సందర్భంలో అదే సామాన్యశబ్దాన్ని ఉపయోగించి మనం ఇంకో అర్థంలో ఒక కొత్త క్రియాధాతువుని నిష్పాదించాలనుకున్నాం. అప్పుడు–

సామాన్యాపించు - *(v)* to reduce someone or something to common level ; to apply something commonly to all. సామాన్యాపన *(n)* – ఇవి నేనిచ్చిన అర్థాలు.

౫ . ఆకారాంతశబ్దాల్ని క్రియాధాతువులుగా మార్చడానికి *డుకృఞ్ (కరించు)* ధాతువుని నేరుగా చేర్చవచ్చు. *ఈకరించు* అవసరం లేదు.

ఉదా :– శాఖాకరించు (శాఖాకరణ),
రేఖాకరించు (రేఖాకరణ),
బాధాకరించు (బాధాకరణ) మొ॥

౬. ఇకారాంత/ ఈకారాంత శబ్దాల విషయంలో కష్టమే లేదు. నేరుగా *ఈకరించు* అని చేర్చవచ్చు.

౭. ఉకారాంత శబ్దాల విషయంలో వాటి చివఱి ఉకారాన్ని దీర్ఘం చేసి ఆ తరువాత *డుకృఞ్* ధాతువునీ, *ఇంచుక్* నీ చేర్చాలి.

1. ఉదాహరణకు :– *అణువు = (n) atom*
అణు + కృ + ఇంచుక్ = అణూ + కర్ + ఇంచుక్
= అణూకరించు = (v) to atomize

దీని పదకుటుంబం ఇలా ఉంటుంది.

అణూకరణ = (n) atomization
అణూకారి/ అణూకర్త = (n) atomizer (స్త్రీలింగం – అణూకారిణి)
అణూకృతం/ అణూకారితం = (past participle) atomized
అణూకరణీయం = (adj) atomizable
వ్యతిరేకార్థకం – అనణూకరణీయం = (adj) non-atomizable
అణూకరణీయత = (n) atomizability

2. పటువు = (adj) hard, strong, powerful, capable
పటూకరించు = (v) to harden, to strengthen, to empower, to enable. to capacitate
పటూకరణ = (n) hardening
పటూకారి/ పటూకర్త = (n) hardener (స్త్రీలింగం – పటూకారిణి)
పటూకృతం/ పటూకారితం = (past participle) hardened
పటూకరణీయం = hardenable

వ్యతిరేకార్థకం – అపటూకరణీయం = (adj) un-hardenable
పటూకరణీయత = (n) hardenability

3. మృదువు = soft, delicate, sensitive
మృదూకరించు = to soften, to sensitize
మృదూకరణ = (n) softening
మృదూకారి/ మృదూకర్త = (n) softener (స్త్రీలింగం – మృదూకారిణి)
మృదూకృతం/ మృదూకారితం – (past participle) softened
మృదూకరణీయం – softenable
వ్యతిరేకార్థకం – అమృదూకరణీయం = (adj) un-softenable
మృదూకరణీయత = (n) softenability

౮. హలంత శబ్దాల్ని ఇలా సకర్మక క్రియాధాతువులుగా మార్చేటప్పుడు ఆ శబ్దాలకి డుకృఞ్ (కరించు) ధాతువు నేరుగా వచ్చి చేఱుతుంది.

బలాత్ = బలంతో ; బలాత్కరించు = ఒత్తిడిచేయు
సత్ = పండితుడు ; సత్కరించు = బాగా తెలిసినవాడనే గౌరవాన్ని చూపించు, సమ్మానించు
తిరస్ = వెనక్కి ; తిరస్కరించు = త్రిప్పిపంపు
సాక్షాత్ = కట్టెదుట ; సాక్షాత్కరించు = ఎట్టెదుట చూపించు
ఛీత్ = ఛీఛీ ; ఛీత్కరించు = ఛీకొట్టు

భవించు/ ఈభవించు

౧౦. భవించు / ఈభవించు అని చేర్చి నామవాచకాల్ని క్రియాపదాలుగా మార్చిన కొన్ని పూర్వోదాహరణలు ఈ క్రింద. *భవించు* అంటే అవ్వడం/ కావడం/ ఉండడం. ఉదా:-

మందం = నెమ్మది, మెల్లన ; మందీభవించు = నెమ్మదించు
అంతర్ = లోపల ; అంతర్భవించు = లోపల భాగంగా ఉండు, అప్రమేయంగా (తనంత తానే) ఉండు. To underlie. శీతలం = చల్లనిది ; శీతలీభవించు = చల్లబడు.
ఉష్ణం = వేడి ; ఉష్ణీభవించు = వేడెక్కు.
ద్రవం = నీటివంటి పదార్థం ; ద్రవీభవించు = నీటిలా పల్చగా ప్రవహించే తత్త్వాన్ని సంతరించుకొను

౧౧. ఈ విధంగా నిష్పాదించిన క్రియాధాతువుల నుంచి ఉద్భవించే విస్తారమైన పదకుటుంబం ఇలా ఉంటుంది.

ద్రవం = (n) liquid
ద్రవీభవించు = (v) to get liquefied = ద్రవంగా మారు
ద్రవీభవనం = (n) liquefication = ద్రవంగా మారడం
ద్రవీభావి = (adj) liquefier = ద్రవంగా మారే స్వభావం గలది (స్త్రీలింగం ద్రవీభావిని)
ద్రవీభూతం = (past participle) liquefied = ద్రవంగా మారినటువంటిది (పుల్లింగం ద్రవీభూతుడు)
ద్రవీభవనీయం = (adj) liquefiable
వ్యతిరేకార్థకం = అద్రవీభవనీయం/ అద్రవనీయం = (adj) non-liquefiable

౧౨. హలంత శబ్దాల్ని ఇలా అకర్మక క్రియాధాతువులుగా మార్చేటప్పుడు ఆ శబ్దాలకి భూ (భవించు) ధాతువు నేరుగా చేఋతుంది. ఉదా :–

ఆరాత్ = దగ్గఱ
ఆరాత్ + భవించు
ఆరాద్భవించు = దగ్గఱ అగు

సరిత్ = నది
సరిత్ + భవించు
సరిద్భవించు = నదిలా మారు

అభ్యాసకార్యములు

I. ఈ క్రింది పదాల్ని క్రియాధాతువులుగా మార్చి వాక్యరూపంలో ఉదాహరణలివ్వండి :

1. విఫలం 2. జయప్రదం 3. ప్రముఖం 4. ప్రతినాయకుడు 5. మానవుడు 6. పశువు 7. ఆస్తికుడు 8. మృత్యువు 9. సాధువు 10. కార్యం 11. సత్యం 12. సేతువు 13. వాఙ్మయం 14. ఐతిహాసికం (చారిత్రికం) 15. గ్రామ్యం 16. వితథం (అబద్ధం) 17. అధ్యాయం 18. సౌమ్యం 19. ధర్మం 20. తత్త్వం (philosophy) 21. సులభం 22. చిహ్నం 23. తేజస్/ తేజో 24. ఓజస్/ ఓజో (బలం) 25. మధువు 26. మరువు (మరుభూమి = ఎడారి) 27.

హిమం 28. ప్రచురం 29. శ్వేతం (తెలుపు) 30. ధూసరం (grey) 31. అరుణం (ఎఱుపు) 32. లోహితం (ఎఱుపు) 33. పాటలం (గులాబీరంగు) 34. హరితం (ఆకుపచ్చ) 35. శ్యామలం (నలుపు) 36. గౌరం (పసుపు) 37. శ్యావం (brown) 38. సుగంధం 39. నిర్జలం (నీళ్ళు లేనిది) 40. దరిద్రుడు 41. సంపన్నుడు. 42. విపణి. 43. సాయుధుడు 44. నిరాయుధుడు 45. నిఘంటువు 46. కోశం 47. వర్ణక్రమం (alphabetical order) 48. క్రమం (order) 49. పద్ధతి (order) 50. వాహిని (channel). 51. పంజరం.

II. ఈ క్రింది ఆంగ్ల క్రియాధాతువులకి సరిసాటి అయిన తెలుగు-సంస్కృత పదాలు ఎంచుకొని క్రియాధాతువులుగా మార్చండి :

సూచన-౧ : ఉదా :- to represent - ఒకటికి / ఒకదానికి **ప్రతినిధి**గా ఉండు

ప్రతినిధి + ఇల్లుక్ = **ప్రతినిధిల్లు.**

సూచన-౨ : దీనికే ఇంచుక్ చేర్చి **ప్రతినిధించు** – To delegate (ప్రతినిధిగా పంపు) అనే అర్థంలో ఇంకో క్రియా ధాతువుని సైతం నిష్పాదించవచ్చు. ఉదా :- ఐ.రా.స. సమావేశాలకి మా తరఫున ఇద్దఱిని ప్రతినిధించాం.

అంటే ఆ ఆంగ్ల క్రియాధాతువుకి ఏ ముఖ్యమైన తెలుగుపదంతో అర్థం చెప్పుకుంటామో దాన్నే కొత్త క్రియాధాతువు గా పరివర్తించాలన్నమాట. పై మచ్చులో **ప్రతినిధి** అలాంటి ముఖ్యమైన పదం.

1. to abbreviate (ప్రత్యాహారముగా కల్పించు)
2. to abdicate -పద (పదవీ) త్యాగము చేయు
3. to abet - నేఱము చేయుటకై సహాయము చేయు
4. to abridge - క్లుప్తముగా చేయు
5. to abrogate - చట్టమును/ శాసనమును/నిబంధనను/ఒప్పందమును రద్దుచేయు (పదం ముందు అ గానీ వి గానీ వాడండి)
6. to accelerate - వేగిరం చేయు, వేగవంతం చేయు, శీఘ్రతరం చేయు
7. acclimatize - ఒక వాతావరణానికి అలవాటు చేయు/ అలవాటుపడు
8. to accommodate - విడిది ఇచ్చు
9. to conceptualize - మనసులో ఒక పరిభావనని / భావనని ఏర్పఱచుకొను
10. to complicate - సంక్లిష్టం చేయు
11. to condescend - ఇతరుల కంటే సర్వోత్తముడైనట్లు ప్రవర్తించు
12. to conscript - బలవంతంగా సైన్యంలో చేర్చుకొను, సైనికుడుగా చేసుకొను
13. to countersign - ఒకఱు ఇప్పటికే సంతకం చేసిన పత్రం మీద తాను మళ్ళీ సంతకం చేయు (పదానికి ముందు

ప్రతిఅనే ఉపసర్గ చేర్చండి)

14. to debilitate - అశక్తం చేయు

*15. to de-glacialize – హిమానీనదాలు లేకుండా చేయడం/ లేకుండా అవడం (అ–**హిమానీ** అనే పదాన్ని వాడండి)*

III. ఈ క్రింది క్రియాధాతువులకి పదకుటుంబాల్ని నిష్పాదించండి :

*1. వర్గీకరించు 2. సులభీకరించు 3. జటిలీకరించు 4. వలసీకరించు 5. పత్రీకరించు **6.** విశదీకరించు 7. నిగూఢీ కరించు (to mystify) 8. వాహినీకరించు (to channelize) **9.** నవలీకరించి (నవలగా వ్రాయు)*

10. కవనీకరించు (ఒక ఆలోచనను కవిత్వంగా మార్చి చెప్పు)

11. తద్భవించు (సంస్కృతశబ్దం కాకపోయినా వినికిడికీ, వ్యాకరణ కార్యాలకీ ఆ విధంగా ప్రవర్తించు : ఉదాహరణకు సేకరణ అనే పదం)

12. వ్యాసీకరించు (ఒక ఆలోచనను వ్యాసరూపంలో రచించి వ్యక్తం చేయు)

13. చిత్రీకరించు (to shoot)

14. క్రియాపించు (క్రియగా మార్చి వ్యక్తం చేయు)

15. సమీకరించు

16. తరూకరించు (పూర్వం ఇది, ప్రస్తుతం ఇది, పరం ఇది అని ఒకదాని కింద ఒకటి సూచిస్తూ ఒక చెట్టులాంటి పటాన్ని గీచు)

17. తటస్థీకరించు (to neutralize)

18. ప్రతీకరించు (పగ తీర్చుకొను)

19. శుద్ధీకరించు (to purify)

20. పవిత్రీకరించు.

పదనిష్పాదన కళ

ఆరో అధ్యాయం

తెలుగు ఉపసర్గల సహాయంతో కొత్త క్రియాధాతువుల నిష్పాదన పద్ధతి

ఉపోద్ఘాతం : ఉపసర్గలంటే ఏంటి ?

ఉప అంటే దగ్గఱ. *సర్గ* అంటే సృష్టించడం. అంటే, మూలధాతువుకి దగ్గఱగా ఉన్న అర్థంలో కొత్త పదాల్ని సృష్టించడానికి ఉపయోగపడేది ఉపసర్గ. ఆంగ్లంలో Prefix అంటున్నారు. ఉదాహరణకి – Reduction, deduction, induction, production మొదలైన పదాలలో అసలు (ల్యాటిన్) క్రియ *ducio*. దానికి *re- de- in-* pro ఇత్యాది కొసఱుపదాల్ని ముందుచేఱిస్తే అర్థం మారుతుంది. అంటే ఉపసర్గల సహాయంతో ఒక క్రియని పదీ–ఇఱవై భిన్న అర్థాలలో రూపాంతరించి వాడుకోవచ్చునన్నమాట. ఫలితంగా, భాషలో పదసంపద పదీ–ఇఱవై రెట్లు పెఱుగుతుంది. అలాగే, ఉదాహరణకి – సంస్కృతంలో **హృఞ్** (తీసుకోవడం) అనేది మూలధాతువు కాగా దానికి ఉపసర్గల్ని చేర్చడం ద్వారా వివిధ అర్థాల్లో వాడుకునే సౌలభ్యం ఉంది.

ఆ + హృ – ఆహర = తిను

వి + హృ = విహర = వాహ్యాళి చేయి

ప్ర + హృ = ప్రహర = కొట్టు

సమ్ + హృ = సంహర = చంపు

ఉప + హృ = ఉపహర = తీసుకురా

ఉప + ఆ + హృ = ఉపాహర = టిఫిన్ చేయి

ఉప + సమ్ + హృ = ఉపసంహర = వెనక్కి తీసుకో

అలాగే, **భూ** అనే మూలధాతువుకి కావడం, ఉండడం అని అర్థాలుండగా, వివిధ ఉపసర్గల మున్‌జేర్పు వల్ల రకరకాల కొత్త క్రియాధాతువులేర్పడి కొత్త అర్థాల్ని ఇస్తాయి. ఉదాహరణకి–

సమ్ + భూ = సంభవతి = జఱుగుతోంది

ప్ర + భూ = ప్రభవతి = చేయగలుగుతున్నాడు

పరి + భూ = పరిభవతి = అవమానిస్తున్నాడు
అను + భూ = అనుభవతి = అనుభవిస్తున్నాడు
వి + భూ = విభవతి = వెలిగిపోతున్నాడు
అభి + భూ = అభిభవతి =తిరస్కరిస్తున్నాడు

ఇవి నామవాచకాలుగా కూడా ఇలాంటి అర్థవైవిధ్యాన్నే సృష్టిస్తాయి.

*ఉదా :- **డుకృఞ్ = కరణే** = చేయుట*
అధికారం, అపకారం, ఉపకారం, ప్రతీకారం, ప్రకారం, వికారం, ఆకారం, సంకరం, అవకరం, అనుకరణం, ప్రకరణం, అధికరణం మొ॥

ఇలా సంస్కృతం, ఇంగ్లీషు భాషల తరహాలో పదాలకు *ముందు చేర్చదగిన* ఉపసర్గలు (prefixes) తెలుగులో లేవు. కారణం– తెలుగుభాష, పదం పక్కన పదం/ ప్రత్యయం చేఱే టర్కిష్ మొదలైన భాషల కోవకి చెందినది. ఈ రకం భాషల్లో పదాలకి ముందు కాక, తరువాత ప్రత్యయాలు చేఱతాయి.

(i) ఉపసర్గలుగా తుమున్నంతాలు :

అయితే తెలుగులో అచ్చం ఉపసర్గల్లాగానే ప్రవర్తించే పదాలున్నాయి. వాటిని తుమున్నంతాలంటారు. తుమున్నంతాలంటే – చెయ్యడానికి, పోవడానికి, చేయుటకు, పోవుటకు (in order to do, in order to go etc.) అని అర్థమిచ్చే క్రియారూపాలు. ఇవి ప్రాచీన తెలుగులో చేయన్, పోవన్, అనన్ అనే విధంగా ఉంటాయి. తుమున్నంతాలు పై అర్థాన్నే కాకుండా "చేసేలా, పోయేలా" (so that/so as to) అనే విధంగా కూడా అర్థాన్నిస్తాయి.

ఉదా:- *పోవన్ + కొట్టు = పోవగొట్టు → పోగొట్టు*
= పోయేలా కొట్టు

చావన్ + కొట్టు = చావగొట్టు (చచ్చేలా కొట్టు)
లేవన్ + కొట్టు = లేవగొట్టు (లేచేలా కొట్టు) మొ.

విడి మొదలైనవి విశేషణాలు గనుక, "విడు" మొదలైనవి వాటి మూల ధాతువులు కనుక, వాటి తుమున్నంత రూపాలైన విడన్ మొ. వాటిని (వేఱుగా అనే అర్థంలో) ఉపసర్గలుగా వాడుకునే సౌలభ్యముంది.

ఉదా:- *విడన్ + కొట్టు = విడగొట్టు*

చెడన్ + కొట్టు = చెడగొట్టు మొ.

ఈ క్రింది ఉదాహరణలు పరిశీలించండి :

ఎగు = ఎక్కుట** ; ఎగన్ + తీయు = **ఎగదీయు
దిగు = దిగుట** ; దిగన్ + తీయు = **దిగదీయు
అలయు = చేసినదే చేసి కష్టపడుట** ; అలియన్ + బడు = అలబడు → అలవడు → **అలవాటు
*అలియన్ + పోవు = అలఁబోవు → అలఁబోక → **అలవోక***
*అలియన్ + ఆడు = అలియాడు **= అల్లాడు***
*అలియన్ + చడి = **అలజడి** (మళ్ళీమళ్లీ చెలరేగుతున్న చప్పుడు)*
తడయు = ఆలస్యము చేయుట** ; తడయన్ + పడు = తడఁబడు → **తడబాటు
పొఱయు = కలఁతపడు** ; పొఱయన్ + పడు = పొఱఁబడు → **పొఱబాటు
ఎడము = దూరము** ; **ఎడయు** = దూరమగు ; ఎడయన్ + పడు = ఎడఁబడు → **ఎడబాటు
***ఒడ్డు = పందెములో పెట్టుట** ; ఒడ్డన్ + పడు = ఒడఁబడు --> **ఒడబాటు** (ఒప్పందము)*
కలియు = కలియు** ; కలియన్ + పడు **= కలఁబడు
*కలియన్ + చూచు = కలియజూచు → **కలజూచు (చుట్టూ చూచు)***
అకు = అగుట** ; అకన్ + చేయు = **కాజేయు (అయ్యేలా చేయడం)
***పోవు =** వెళ్ళుట ; పోవన్ + పడి = పోవబడి → **పోఁబడి** (పోయే చోటు, పోయే మార్గం = జాడ, గమ్యం)*
పోవన్ + కాలం =** పోవగాలం → **పోఁగాలం
*పెనఁగు = అల్లుకొను ; పెనగన్ + వేయు = **పెనవేయు** (పేనేట్లు వేయు)*
*పెనగన్ + కొను = **పెనఁగొను** (పేనుకొను)*

పైన ప్రతిపంక్తిలోనూ చివఱ బాణంగుర్తు తరువాత ఫలితార్థంగా చూపించినవి ఇప్పుడు అందఱికీ తెలిసిన శబ్దస్వరూపాలు. సంధులుగా చూపించినవి ఆ స్వరూపాల మూలరూపాలు. వీటిని పరిశీలించినప్పుడు క్రియాధాతువుల తుమున్నంతాలే తెలుగులో ఉపసర్గల్లా ప్రవర్తిస్తాయని అర్థం చేసుకుంటాం. తుమున్నంతాలంటే –*చెయ్యడానికి, పోవడానికి* అని అర్థమిచ్చే క్రియారూపాలు. ఇవి ప్రాచీన తెలుగులో *చేయన్, పోవన్, అనన్* అనే విధంగా ఉంటాయి. తుమున్నంతాలు పై అర్థాన్నే కాకుండా 'చేసేలా, పోయేలా' అనే విధంగా కూడా అర్థాన్ని ఇస్తాయి. ఉదా:–

పోవన్ + కొట్టు = పోవఁగొట్టు → పోఁగొట్టు
= పోయేలా కొట్టు

నిజానికి ఈ నిర్మాణాలు క్రియాగుచ్ఛాలు లేక మాలికాక్రియలు అనే రకానికి చెందుతాయి. కారణం – తెలుగులో క్రియ

మీద పక్కన క్రియ దండలాగా చేరే సౌలభ్యం ఒకటుంది. ఇతర భారతీయ భాషల్లో కూడా ఉందనుకోండి. కాని తెలుగులో ఉన్నంత విస్తారం కాదు. ఉదా:–

౧. పట్టుకోలేకపోయాడు (ఇందులో పట్టు, కొను, ఉండు–వ్యతిరేకార్థకం, పోవు అనే ధాతువులున్నాయి)
౨. పడగొట్టగలడు (పడు + కొట్టు + కలుగు)

మనం తెలుగులో ఉపసర్గల్ని కల్పించాలంటే ముందు ఇలాంటి క్రియాగుచ్ఛాల్ని కల్పించాలన్నమాట. ఈ సందర్భంగా కొన్ని అంశాల్ని గమనంలో ఉంచుకోవాలి:

(అ) తెలుగు ఉపసర్గలు పైన ఉదాహరించిన పద్ధతిలో తుమున్నంతాలై ఉండాలి.

(ఆ) అవి తెలుగులిపిలో గరిష్ఠంగా మూడు అక్షరాలకు మించనివై ఉండాలి.

(ఇ) అవి ప్రసిద్ధ అర్థాన్నే కాక సంబంధిత వ్యంగ్యార్థాన్ని సైతం ఇవ్వాలి. అంటే ఒకే ఒక్క నిశ్చితార్థాన్ని ఇచ్చే విధంగా ప్రయోగించకూడదు.

(ఈ) ఉపసర్గల్ని ఏర్పఱిచే క్రమంలో పనికొస్తాయనుకున్న పాత ధాతువుల్ని సైతం పునరుద్ధరించడానికి వెనుకాడ కూడదు.

(ఉ) క్లుప్తత నిమిత్తం అక్షరాల్ని కుదించడానికి అనుమతించాలి.

ఉదా: పొఱయన్ + పడు = పొఱబడు

(ఊ) సంస్కృతంలో లాగా తెలుగులో ఉపసర్గ మీద ఉపసర్గ చేర్చడం సాధ్యపడదు. అంటే ఒక క్రియాధాతువుకు ఒక్క ఉపసర్గనే చేర్చగలం.

(ఎ) తెలుగు ఉపసర్గల్ని స్వతంత్రపదాల్లా ప్రయోగించకూడదు. అలా చేస్తే అవి నామవాచకాలవుతాయి. ప్రతి నామ వాచకానికీ ఒక ఖచ్చితమైన అర్థం ఉంటుంది కనుక ఉపసర్గసహిత పదాల అర్థంలో అవి చెడ్డజోక్యాన్ని కలి గించుకుంటాయి.

పూర్వీకుల పద్ధతిలోనే చిఱుధాతువుల తుమున్నంతాల్ని ఉపసర్గలుగా మార్చి నేను కల్పించిన క్రియాధాతువులు కొన్నింటి ని ఇక్కడ ప్రదర్శనకి పెడుతున్నాను.

*1. అలయన్ + పల్కు = అలబల్కు = **అలవల్కు** = (మళ్ళీ మళ్ళీ పలుకు) వాదించు*

2. విడన్ + పల్కు = ***విడఁబల్కు*** *= (విడగొట్టి పలుకు) వివరించు*

3. అకన్ + పల్కు – ***కాఁబల్కు*** *= (అయ్యే విధముగా చెప్పు) జోస్యము చెప్పు*

4. రాన్ + పల్కు = ***రాఁబల్కు*** *= (వచ్చే విధముగా పలుకు) ఆహ్వానించు*

5. (కవ అంటే జంట) కవన్ + కలువు = కలువు = ***కౌఁగల్పు*** *(కౌఁగలించు లాగా) అనుసంధానించు*

వీటినే నామవాచకాలుగా కూడా యథాతథంగా ప్రయోగించవచ్చు.

(ii) ఉపసర్గలుగా విభక్తి ప్రత్యయాలు :

విభక్తి ప్రత్యయాల్ని ఉపసర్గలుగా వాడుకునే సౌలభ్యమొకటి తెలుగులో ఉంది. విభక్తి ప్రత్యయాలంటే నామవాచకాలకు చివఱ వచ్చే తోన్, లోన్, పై, క్రీ (క్రింది), మీన్ (మీఁదు) మొదలైనవి.

ఉదా:– ***తోడ*** *– తోన్ + పుట్టువు = తోఁబుట్టువు (కలిసి పుట్టినవాడు)*

పైన – పైన్ + చరిమి == పైసరము (పైకి జఱుగుట – స్త్రీతో కలయిక)

క్రింద *– క్రిన్ + కంటి = క్రీఁగంటి*

మీద *– మీన్ + కట్టు = మీఁగడ*

మీఁదు *+ కట్టు = మీదుకట్టు, ముడుపుకట్టు to pledge*

(iii) ఉపసర్గలుగా నామవాచకాలు (Nouns) : ఉదా :– కవ = జంట

కవన్ + కలియించు = కవంగలించు → కౌఁగలించు (తన జంటగా చేతేలా చేయు)

నామవాచకాన్ని క్రియాధాతువుతో కలిపి ప్రయోగించే ఇలాంటి ఉదాహరణల్ని **శబ్దపల్లవాలు** (phrasal verbs) అంటారు. కాని కొన్నిసార్లు వీటిల్లో మొదటి పదం మనకు ఉపసర్గ (prefix) గా ఉపయోగపడుతుంది.

మచ్చుకు కొన్ని శబ్దపల్లవాలు :

ఉరితీయు, వలవిసురు, కన్నుమూయు, గుఱిపెట్టు, చేపట్టు, దారితీయు, దారిపట్టు, మనసుపడు, మనసగు, తెఱదించు, మిన్నంటు, గాలిసోఁకు

(iii) ఉపసర్గలుగా విశేషణాలు :– కొన్నిపదాలు ప్రాచీనకాలంలో విశేషణాలుగా ఉండి తరువాత్తరువాత ఉపసర్గల్లా ఉపయోగపడడం మొదలుపెట్టాయి.

ఉదా:– ***మఱు*** *=* ***తరువాతి/ప్రత్యామ్నాయంగా***

మఱు + నాడు = మఱుచటినాడు

పెద + తల్లి = పెత్తల్లి

చెన్ను* = *అందమైన

చెన్ను + కలువ = చెన్ + కలువ = చెంగలువ

ప్రాత + మినుకులు = ప్రాన్ + మినుకులు = ప్రామినుకులు = పాత మాటలు (వేదమంత్రాలు)

ప్రాన్ + చదువులు = ప్రాజదువులు = పాత చదువులు (వేదమంత్రాలు)

క్రొత్త + కారు క్రొ + కారు = క్రొక్కారు (కొత్త ఋతువు)

క్రొత్త + సీమ = క్రొ + సీమ = క్రోసీమ (కొత్తదేశం)

భాష బాగా తెలియాలే గానీ ప్రతి 2 – 3 అక్షరాల పదాన్నీ సంధిసమాస పద్ధతిలో ఉపసర్గలా వాడుకోవచ్చు.

కొన్ని సంస్కృత ఉపసర్గలకి దీటైన తెలుగు ఉపసర్గలు :

వీటిల్లో కొన్ని ప్రాచీనకాలం నుంచి ఉన్నటువంటివి. మఱికొన్ని నేను సూచిస్తున్నవి.

1. అప = చెడన్, చెడు

ఉదా :– అపకరించు = చెడుసేయు, చెడగొట్టు

2. ఉప = తోడు, తోన్, ఒడన్

ఉదా :– ఉపకరించు = ఒడగూర్చు

ఉపమంత్రి = తోడుప్రెగ్గడ

3. సహ = తోడు, తోన్

ఉదా :– సహకరించు = తోడ్పడు

సహోదరి = తోబుట్టువు

4. అవ = దిగన్

ఉదా :– అవమానించు = దిగనాడు

5. అతి = తెగన్, మీఱన్, కడు

ఉదా :– అతిబలం = కడులావు

6. అను = వెన్ (వెను), మఱు

ఉదా :– అనుసరించు = వెనుగొను

7. ని = లోన్

ఉదా :– నిలయం = లోగిలి

8. నిర్/నిస్ = వెలి, కొఱ

ఉదా :– నిర్గమించు = వెలువడు

కొఱలోతు = లోతులేనిది

9. అధి = మీన్, మీదు, పై, మున్

ఉదా :– అధిపతి = మీదుకాడు

10. సు = సరి, మంచి, మేటి, మేల్, బాగు, బాగ, బా

ఉదా :– సురూపం = సరిపోడ, మేల్పోడ

11. దుర్/దుస్ = చెడు, చెడ్డ

ఉదా :– దురహంకారం = చెడ్డ ఏనరితనం

12. ప్రతి = ఎదురు, మాఱు, మఱు

ఉదా :– ప్రతివచనం = మాఱుపలుకు

13. వి = విడన్, విడి, మఱు

ఉదా :– విభజించు = విడగొట్టు

వివాసనం = విడికాపరం

14. సం = కలన్, కూడన్, కవన్ (కౌన్)

సమ్మేళించు = కలగలుపు, సముచ్చారణ = కూడబలుకుకొను

15. పరా = మీఱన్, మీదు, మీన్

16. పరి = చుట్టు, కలయన్, మీన్, మున్.
పరిలోకనం = చుట్టుచూపు, కలయజూపు

17. ఉత్/ ఉద్ = ఎగన్, మీన్, పై


18. ఆఙ్ = ఎల్ల

అభ్యాసకార్యములు

***I.** ఈ క్రింది క్రియాధాతువుల్నీ, నామవాచకాల్నీ ఉపసర్గల్ని చేర్చడం ద్వారా వేఱే అర్థంలోకి మార్చి, ఆ అర్థాన్ని స్పష్టంగా పేర్కొంటూ వాక్యరూపంలో ఉదాహరణలివ్వండి :*

అలన్ (మళ్ళీ మళ్ళీ) :– 1. కఱపు 2. చేయు 3. పాడిక (పాట) 4. క్రుమ్మఱు (తిరుగు) 5. చదువు 6. విఱుపు 7. తుది 8. అందించు 9. తలపు 10. అను

*సమాధానాలు :- అలన్ (మళ్ళీ మళ్ళీ) :– 1. అలగఱపు = శిక్షణ ఇచ్చు 2. **అలజేయు** = పునరావృత్తం చేయు 3. **అలవాడిక** = పల్లవి 4. **అలగ్రుమ్మఱు** = పర్యటించు 5. అలజదువు = అధ్యయనం చేయు 6. **అలవిఱుపు** = వాక్యవిరామం (comma), లేక పద్యంలోని యతి 7. **అలందుది** = శతకపద్యాల్లోని మకుటం 8. **అలందించు** = అంచెలంచెలుగా అందించు (to pass on) 9. **అలదలపు** = ధ్యానించు 10. **అలనను** = జపించు (**అలననికి** = జపం)*



పదనిష్పాదన కళ

ఏడో అధ్యాయం

సంస్కృత ఉపసర్గల సహాయంతో కొత్త క్రియాధాతువుల నిష్పాదన పద్ధతి

సంస్కృతం నుంచి కొత్త క్రియాధాతువుల్ని కల్పించాలంటే ఉపసర్గల (prefixes) గురించి తెలియాలి. ఈ పుస్తకం చివర కొన్ని సంస్కృత ధాతువులు ఇవ్వబడ్డాయి. సంస్కృత ధాతువుల గురించి పూర్తి పాఠం కావాల్సినవారు శ్రీమాన్ భట్టోజి దీక్షితులవారు రచించిన **సిద్ధాంతకౌముది** అనే గ్రంథాన్ని వెతికి పట్టుకోవలసినది.

ఆ ధాతువుల ముందు ఉపసర్గల (prefixes) ని చేర్చడం ఎలాగో తెలిస్తే క్రియాధాతువుల కల్పనలో మనం సగం దూరాన్ని అధిగమించినట్లే. ఈ పని చెయ్యడానికి మీరొక గొప్ప వైయాకరణ శిరోమణి కావాల్సిన పని లేదు. ఇది చాలా సులభం. మన తెలుగువాళ్ళందరికీ సుపరిచితం కూడా. తెలుగులోని పెక్కు క్రియాధాతువుల ముందు ఇప్పటికే వాడుతున్న ఉపసర్గల్ని వాటి అర్థాల్ని పరిశీలించండి. అవి ప్రాథమికంగా 21. అయితే కాలక్రమేణ తరువాత్తరువాత ఇంకొన్ని పదాలు కూడా ఉపసర్గల్లా (క్రియాధాతువులకి ముందొచ్చి) ప్రవర్తించసాగాయి.

శ్లో|| ధాత్వర్థం బాధతే కశ్చిత్ కశ్చిత్ తమనువర్తతే |
తమేవ విశినష్ట్యన్యః ఉపసర్గగతిస్త్రిధా ||

ఉపసర్గ అర్థరీత్యా మూడురకాలుగా ప్రవర్తిస్తుందని ఈ పైశ్లోకంలో చెప్పారు. అది కొన్నిచోట్ల ధాతువు యొక్క అసలర్థాన్ని బాధించి ఇంకో అర్థాన్ని ఇస్తుంది. కొన్నిచోట్ల అసలర్థాన్నే కొద్దో గొప్పో అనుసరిస్తుంది. మరికొన్నిచోట్ల ఆ అర్థాన్ని మరింత ప్రకాశింపజేస్తుంది.

1. అప = తప్పుడుగా, చెడుగా, మినహాయింపుగా, వేఱే దారిలో
2. ఉప = అనుకూలంగా, సుఖంగా, మంచిగా, దగ్గఱగా, తోడుగా
3. అభి = ఎదురుగా
4. అవ = తక్కువగా
5. అతి = దాటి, మించి, మీఱి
6. అను = వెనువెంటనే, తరువాత, అనుసరించి, పోలి ఉండే విధంగా

7. ఆఙ్ = మొదటి నుంచి చివటి దాకా

8. ని = లోపల

9. నిర్/నిస్ = బయటికి, లేకుండా

10. అధి = మీద, పక్కన

11. సు = మంచిగా, చక్కగా, నేరుగా

12. దుర్/దుస్ = చెడ్డగా

13. ప్ర = గొప్పగా, ఎక్కువగా

14. ప్రతి = ప్రత్యామ్నాయంగా, విరోధంగా, ఎదురుగా, తిరిగి, ఒక్కొక్కటి

15. వి = వేఱుగా, లేకుండా, మఱో విధంగా, మఱో దిశలో, విశేషంగా , ప్రత్యేకంగా

16. సం = కలిసి, మొత్తంగా, ఉత్తమంగా

17. పరా = అవతల

18. పరి = చుట్టూ

19. పి/ అపి = రహస్యంగా, కప్పి ఉంచి

20. ఉత్/ ఉద్ = పైకి

21. అ/ అన్ – (వ్యతిరేకార్థకం)

ఇప్పటికే ఈ ఉపసర్గలు చేతిఱ ఉన్న పాతపదాలతో అర్థవిరోధం రాకుండా కొత్త పదాలు కల్పించాలి. రెండు మూడు ఉపసర్గల్ని ఒకేసారి ఒకే ధాతువుకి చేర్చడం కూడా వ్యాకరణ సమ్మతమే. వేదకాలంలో వీటిని వాక్యంలో ఎక్కడ పడితే అక్కడ చేర్చే వారు, నేటి ఇంగ్లీషులో లాగా ! (అహం ఆ...గచ్ఛామి – నేను వస్తున్నాను అనడానికి "ఆ... అహం గమిష్యామి అనేవారు). కావ్యయుగంలో ఇవి క్రియాధాతువుల ముందే స్థిరపడ్డాయి.

కాలక్రమంలో ఈ కింది పదాల్ని కూడా ఉపసర్గలలా వాడడం మొదలుపెట్టారు.

1. కు – కొంచెం, చిన్న, తక్కువ, నీచం, హీనం, చెడ్డగా

2. సకృత్ = అరుదుగా (అసలు అర్థం – ఒక్కసారి once, one time అని. వ్యతిరేకార్థకాలు అసకృత్, బహువార-)

3. ఆరాత్ = దగ్గఱగా

4. పశ్చాత్ = తరువాత, వెనుక

5. సహ = కలిసి, తోడుగా

6. పునస్/ పునర్ – మళ్ళీ

7. సాక్షాత్ = ఎట్టెదుట

8. సదా = ఎల్లప్పుడూ

9. శశ్వత్ = శాశ్వతంగా

10. పురః/ పురస్/ పురో = ముందు
11. తిరః/ తిరస్/ తిరో =వెనుక
12. ప్రాక్ = అంతకుముందు / ఇంతకుముందు, తూర్పుదిక్కు
13. అర్వాక్ – ఇంతకు తరువాత
14. సమ్యక్ = సరిగా
15. ఉపరి = పైన
16. అధః/ అధస్తాత్/అధస్/ అధో/ న్యక్ = కింద
17. ద్రాక్ = త్వరగా
18. శనైర్/ శనైస్ = నెమ్మదిగా (slow)
19. ఉచ్చైర్/ ఉచ్చైస్ = బిగ్గరగా (loudly)
20. బహు/ నానా = ఎక్కువగా, ఎక్కువ
21. మనాక్/ కించిత్/ ఈషత్ = తక్కువగా, కొంచెం
22. సద్యస్/ సద్యో = వెనువెంటనే, అదే రోజున (instantly, spot, immediately శీఘ్రం)
23. తథ్యం = నిజంగా
24. మృషా = అబద్ధంగా
25. ధ్రువం/ నూనం/ అవశ్యం = తప్పకుండా (sure)
26. ప్రాయః/ ప్రాయస్/ ప్రాయో = తఱచుగా (oft, often)
27. బహిర్/ బహిస్ = బయట
28. అంతర్/ అంతస్ = లోపల
29. యుగపత్/ ఏకదా = రెండూ ఒకేసారిగా (simultaneous)
30. మిథః – ఇద్దఱు కలిసి
31. రహః/ రహస్/ రహో = రహస్యంగా, చాటుగా
32. ప్రసభమ్ / బలాత్ - బలవంతంగా

వీటిని కూడా మనం ఇంకా ఎక్కువ క్రియాధాతువుల ముందు అవసరాన్ని బట్టి చేర్చి సద్వినియోగం చేసుకోవాలి. ఇలా చూసినప్పుడు ఎన్ని క్రియాధాతువులున్నాయో అన్ని యాభైల సంఖ్యలో కొత్త ధాతువుల్ని మనం సిద్ధం చేయగలమన్న మాట. అలాగే అన్ని కొత్తనామవాచకాల్ని కూడా కల్పించగలం.

ఉపసర్గప్రయోగాలకి పూర్వోదాహరణలు (పూర్వీకులు ఎలా ఏ అర్థంలో వాడారు ?)

1. అప = తప్పుడుగా, చెడుగా, మినహాయింపుగా, వేఱే దారిలో

అప + కారం = అపకారం = చెడు చేయడం

అప + ఊహ = అపోహ = తప్పుగా ఊహించు

అప + అర్థం = అపార్థం = తప్పుగా అనుకొను

అప + ప్రథ = అపప్రథ = చెడ్డపేరు

అప + వాదం = అపవాదం = (ఒకటి గురించి) తప్పుగా చెప్పడం

అపవాదం + అపవాదం = మినహాయించి చెప్పడం

2. ఉప = అనుకూలంగా, సుఖంగా, మంచిగా, దగ్గరగా

ఉప + కారం = ఉపకారం = అనుకూలంగా చేయడం

ఉప + చారం = ఉపచారం = అనుకూలంగా చరించడం (ప్రవర్తించడం)

ఉప + నయనం = ఉపనయనం = (గురువుగారి) దగ్గరికి తీసుకెళ్ళడం

ఉప + ఆసనం = ఉపాసన = (దేవుడి) దగ్గర కూర్చోవడం

3. అభి = ఎదురుగా, తనకిష్టమైనట్లు

అభి + శ్రవణం = అభిశ్రవణం = మంత్రపఠనం చేయించుకొని వినడం

అభి + మానం = అభిమానం = ఎదురుగా ఉన్నట్లు తలచుకోవడం (మననం – తలచుకోవడం)

అభి + సరణం = అభిసరణం = ప్రియునికి ఎదురుగా వెళ్ళడం

4. అవ = తక్కువగా, క్రిందుగా, లోతుగా

అవ + మానం = అవమానం = తక్కువగా తలపోయడం

అవ + లోకనం = అవలోకనం = వంగి చూడడం

అవ + ధరించు = అవధరించు = లోతుగా దృష్టిపెట్టు

అవ + గమించు = అవగమించు = అర్థం చేసుకొను *(అవగతం = అర్థమైన విషయం)*

5. అతి = దాటి, మించి, మీరి

అతి + క్రమణం = అతిక్రమణం = దాటి అడుగుపెట్టడం

అతి + ఇతం = అతీతం = దాటి వెళ్ళినది

అతి + వేలం = అతివేలం = వేలను దాటి మీదికొచ్చిన కెరటం (వేల – చెలియలికట్ట)

6. అను = వెనువెంటనే, తరువాత, అనుసరించి, పోలి ఉండే విధంగా

అను + కరించు = అనుకరించు = (ఒకరు చేసిన) తరువాత చేయు

అను + సరించు = అనుసరించు = వెంటవెళ్ళు (అనుయాయి = వెంట వెళ్ళేవాడు ; అనుచరుడు = వెంట వెళ్ళేవాడు)

అను + సంధించు = అనుసంధించు = ఒకదాని కొసని ఇంకొకదానికి తగిలించు
అను + వదించు = అనువదించు = ఒకఋ చెప్పినదాన్నే తరువాత మళ్ళీ చెప్పు
(పూర్వకాలంలో రచనల్ని వ్రాసేవారు కాదు, చెప్పేవారు)

7. ఆఙ్ = (మొదటి) నుంచి, (చివటి) దాకా, మొత్తం, సంపూర్ణంగా
ఆ + పాద మస్తకం = ఆపాదమస్తకం = కాళ్ళ నుంచి తల దాకా
ఆ + నయనం = ఆనయనం = ఒకచోటి నుంచి తీసుకురావడం
ఆ + లోకనం = ఆలోకన = మొదటినుంచి చివటిదాకా చూడడం
ఆ + వాహనం = ఆవాహన = మొత్తం లోపలికి ప్రవహింపజేయడం (ప్రవేశపెట్టడం)

8. ని = లోపల *(అంతర్ అని కూడా వాడతారు)*
ని + ద్రా = నిద్ర = తన లోపలికి తానే పరుగెత్తడం
ని + వేశనం = నివేశనం = లోపలికి ప్రవేశించడం (ఇల్లు)
ని + ధానం = నిధానం (లేక నిధి) = లోపల (దాచి) పెట్టినటువంటిది
ని + నాదం + నినాదం = (తన) లోపలి ధ్వని
ని + మజ్జనం = నిమజ్జనం = (నీటి) లోపల ముంచడం
ని + గ్రహం = నిగ్రహం = లోపల (తనను తాను) పట్టుకొని ఉండడం

9. నిర్/నిస్ = లేకుండా , బయటికి *(బహిర్ అని కూడా వాడతారు)*
నిర్ + లజ్జ = నిర్లజ్జ = సిగ్గులేకుండా
నిర్ + జనం = నిర్జనం = జనం లేనిది
నిర్ + వచించు = నిర్వచించు = పైకి చెప్పు
నిస్ + సంకోచం = నిస్సంకోచం = సంకోచం లేనిది *(ఇలాగే నిస్తంద్రం, నిష్ఫలం, నిర్భయం, నిర్మలం, నిర్దయం, నిష్కారణం మొ.)*
నిశ్ + శబ్దం = నిశ్శబ్దం = శబ్దం లేనిది
నిర్ + గతం = నిర్గతం = బయటికి పోయినది
నిష్ + కాసనం = నిష్కాసనం = బయటికి వెళ్ళగొట్టడం
నిష్ + క్రమించు = నిష్క్రమించు = బయటికి అడుగుపెట్టు

10. అధి = మీద, పక్కన *(ఉపరి అని కూడా వాడతారు)*
అధి + స్థానం = అధిష్ఠానం = ఒకటి మీద నిలిచినది
అధి + కారం = అధికారం = ఒకటి మీద చెలాయించేది

అధి + ఆయం = అధ్యాయం = ఒక విషయం మీదికి పోయి తెలుసుకునేది

అధి + పతి = అధిపతి = ఇతరుల మీద నాయకుడు

11. సు = మంచిగా, చక్కగా, నేరుగా, తేలికగా *(దీన్ని నామవాచకాలకీ, విశేషణాలకీ తప్ప క్రియాధాతువులకి ముందు వాడరు. దీనికి ప్రత్యామ్నాయంగా* ***సత్*** *అని వాడడం కూడా ఉన్నది)*

సు + ప్రతిష్ఠితం = సుప్రతిష్ఠితం = బాగా నిలుపబడినది

సు + కరం = సుకరం = తేలికగా చేయదగినది

సు + లభం = సులభం = తేలికగా లభించేది

సు + గమం = సుగమం = తేలికగా వెళ్ళదగిన ప్రదేశం

సు + బోధం = సుబోధం = తేలికగా అర్థమయ్యేది

సు + నామన్ + ఈ = సునామ్ని = మంచి శ్రావ్యమైన పేరు గల స్త్రీ

సు + ముఖం = సుముఖం = మంచిముఖం (అంగీకార సూచకమైన నవ్వుముఖం)

12. దుర్/ దుశ్/ దుష్ /దుస్ = చెడ్డ, కష్టం, *అసంభవం (దీన్ని కూడా నామవాచకాలకీ, విశేషణాలకీ తప్ప క్రియాధాతువులకి ముందు వాడరు. దీని బదులు కొన్ని సందర్భాలలో* ***కు*** *అనే ఉపసర్గని వాడడం కూడా ఉంది. ఉదాహరణకి కువ్యాఖ్యానం, కుశంక మొ.)*

దుర్ + ముహూర్తం = దుర్ముహూర్తం = చెడ్డ సమయం

దుశ్ + శీలం = దుశ్శీలం = చెడ్డ ప్రవర్తన

దుష్ + కార్యం = దుష్కార్యం = చెడ్డపని

దుష్ + ఫలితం = దుష్ఫలితం = చెడ్డఫలితం

దుస్ + సాహసం = దుస్సాహసం = అసంభవమైన సాహసం

దుర్ + గమం = దుర్గమం = వెళ్ళడానికి కష్టమైన ప్రదేశం

దుస్ + తరం = దుస్తరం = దాటడానికి కష్టమైనది

దుస్ + సాధం = దుస్సాధం = సాధించడానికి అసంభవమైనది

13. ప్ర = గొప్పగా, ఎక్కువగా, ప్రత్యేకంగా, ప్రధానంగా

ప్ర + మాణం = ప్రమాణం = ప్రత్యేకమైన కొలత

ప్ర + వర్ధనం = ప్రవర్ధనం = ఎక్కువ ఎదగడం

ప్ర + స్ఫుటం = ప్రస్ఫుటం = ఎక్కువ స్ఫుటం (ఎక్కువ స్పష్టం)

ప్ర + మాదం = ప్రమాదం = ఎక్కువ మత్తు

ప్ర + యానం = ప్రయాణం = ఎక్కువదూరం వెళ్ళడం/ ఒక ప్రత్యేక ప్రదేశానికి వెళ్ళడం

ప్ర + పంచం = ప్రపంచం = ప్రధానంగా అయిదు కలిగినది (పంచభూతాలు)

అలాగే, గాఢం – ప్రగాఢం ; స్ఫుటం – ప్రస్ఫుటం

14. **ప్రతి = ప్రత్యామ్నాయంగా, విరోధంగా, ఎదురుగా, తిరిగి (మళ్ళీ) , ఒక్కొక్కటి**

ప్రతి + ద్వంద్వి = ప్రతిద్వంద్వి = విరోధియైన జతగాడు

ప్రతి + లేఖనం = ప్రతిలేఖనం = ప్రత్యామ్నాయంగా వ్రాసుకొన్నది

ప్రతి + భా = ప్రతిభ = ఎదురుగా కనిపించే వెలుగు

ప్రతి + అభివాదం = ప్రత్యభివాదం = ఒకళ్ళు తనకి అభివాదం చేయగా వారికి తాను తిరిగి చేసిన అభివాదం

ప్రతి + వాదం = ప్రతివాదం = ఒకటి వాదాన్ని పూర్వపక్షం చేసే ఎదురువాదం

ప్రతి + రాత్రి = ఇ.ప్రతిరాత్రి = ఒక్కొక్క రాత్రి

15. **వి = లేకుండా, విడిగా, వేఱుగా, మఱో విధంగా, మఱో దిశలో, విశేషంగా , ప్రత్యేకంగా (దీనికి వ్యతిరేకార్థకంగా స అని వాడడం ఉన్నది** *ఉదాహరణకి, వికలం X సకలం***)**

వి + మలం = విమలం = మలం (మలినం) లేనిది

వి + కలం = వికలం = కళలు (అంగాలు) పూర్తిగా లేనిది

వి + రక్తి = విరక్తి = రక్తి లేకపోవడం

వి + ధవ = విధవ = ధవుడు (భర్త) లేనిది వితంతువు

వి + శృంఖలం = విశృంఖలం = సంకెళ్ళు లేనిది, సంకెళ్ళను త్రెంచుకున్నది

వి + ప్రియం = విప్రియం = ప్రియం కానిది

వి + చక్షణుడు = విచక్షణుడు = (సమాజంలో తక్కినవారి కంటే విషయాల్ని) వేఱుగా/ మఱోవిధంగా చూసేవాడు = పండితుడు *(చక్ష్ – చూడడం)*

వి + మతం = విమతం = వేఱైన మతం

వి + పక్షం = విపక్షం =వేఱైన పక్షం

వి + లక్షణం = విలక్షణం = వేఱైన లక్షణాలు గలది

వి + రచితం = విరచితం = విశేషంగా రచించబడినది

వి + వాదం = వివాదం = విశేషంగా చేసే వాదం

వి + శారదుడు = విశారదుడు = విశేషమైన శారద (సరస్వతి) గలవాడు (పండితుడు)

16. **సం = కలిసి, ఒకటిగా, మొత్తంగా, ఉత్తమంగా, ఎక్కువగా**

సమ్ + లాపం = సంలాపం (సల్లాపం) = ఇద్దఱు కలిసి ప్రీతిపూర్వకంగా చేసే సంభాషణ

సమ్ + భోగం = సంభోగం = కలిసి సుఖపడడం (రతి)

సమ్ + కరణం = సంకరం = (వేఱువేఱు వస్తువుల్ని) ఒకటిగా కలిపేయడం

సం + జ్ఞానం సంజ్ఞ = (రెండింటిని) ఒకచోట చేర్చి పోల్చి చూసుకొని తెలుసుకోవడం (గుర్తుపట్టడం)

సమ్ + ఉద్రం = సముద్రం = జలజంతువులన్నీ ఒకచోట చేఱిన ప్రదేశం (ఉద్రం = జలజంతువు)

సమ్ + ఆపనం = సమాపనం (సమాప్తి) = మొత్తానికి చేఱుకోవడం (ముగింపు)

సమ్ + మతి = సమ్మతి = (ఇద్దఱు లేదా అంతకంటే ఎక్కువమంది) కలిసి అనుకోవడం (ఒప్పందం)

సమ్ + స్కరణం = సంస్కరణ = ఉత్తమంగా దిద్దడం

సమ్ + పర్కం = సంపర్కం = మిక్కిలి తాకిడి

17. **పరా = అవతల, అతీతంగా**

పరా + క్రమం = పరాక్రమం = అవతలి దరికి దాటడం

పరా + జయం = పరాజయం = జయానికి అవతలగా పడడం

పరా + ఇతుడు = పరేతుడు = (జీవితం నుంచి) అవతలికి వెళ్ళినవాడు (మృతుడు)

పరా + భవం = పరాభవం = అవతల ఉండాల్సిరావడం

పరా + మర్శ = పరామర్శ = అవతల (ఒక సంఘటన జఱిగిన తరువాత) స్పృశించడం

18. **పరి = చుట్టూ, అంతటా, పైన, మొత్తం**

పరి + స్థితి = పరిస్థితి = చుట్టూ ఉన్న స్థితి

పరి + వారం = పరివారం = చుట్టూ ఆవరించినవాళ్ళు

పరి + మాణం = పరిమాణం = చుట్టూ కొలవడం

పరి + పాలనం = పరిపాలన = చుట్టూ చూసుకోవడం

పరి + భ్రమణం = పరిభ్రమణం = చుట్టూ తిరగడం

పరి + అటించు = పర్యటించు = అంతటా తిరుగు

పరి + ఈక్షించు = పరీక్షించు = మొత్తం చూచు

19. **పి/ అపి = రహస్యంగా, కప్పిపెట్టి** *(ఎందుకో గానీ, ఇవి చాలా అరుదుగా వాడారు)*

పి + ధానం = పిధానం = కప్పి ఉంచడం (అపిధానం)

20. **ఉత్/ ఉద్ = పైకి, బిగ్గఱగా, ఆకస్మికంగా**

ఉద్ + గమనం = ఉద్గమనం = పైకి వెళ్ళడం

ఉద్ + హరణం = ఉద్ధరణ = పైకిలాగడం

ఉత్ + పరివర్తనం = ఉత్పరివర్తన = శరీరంలో ఆకస్మికంగా కలిగిన మార్పు (mutation)

ఉత్ + చరించు = ఉచ్చరించు = పైకి బిగ్గఱగా అను

ఉత్ + తేజం = ఉత్తేజం = పైకి ఎగసిన మంట

21. అ/ అన్ – వ్యతిరేకార్థకం *(అచ్చులతో మొదలయ్యే పదాల ముందు అన్ వస్తుంది. హల్లులతో మొదలయ్యే పదాల ముందు అ వస్తుంది)*
ధర్మం కానిది = అ +ధర్మం = అధర్మం
కాలం కానిది = అ + కాలం = అకాలం
పరిశుభ్రం కానిది = అ + పరిశుభ్రం = అపరిశుభ్రం
సందర్భం కానిది = అ + సందర్భం = అసందర్భం
జ్ఞానం కానిది = అ + జ్ఞానం = అజ్ఞానం
ఆదరం కానిది = అన్ + ఆదరం = అనాదరం
ఆసక్తి కానిది = అన్ + ఆసక్తి = అనాసక్తి
ఆలోచితం కానిది = అన్ + ఆలోచితం = అనాలోచితం
ఊహ్యం (ఊహించడానికి వీలుపడేది) కానిది = అన్ + ఊహ్యం = అనూహ్యం

కొన్నిసార్లు 'లేనిది/ లేనివాడు' అని వ్యక్తం చేయడానిక్కూడా (బహువ్రీహి సమాసార్థంలో) ఈ ఉపసర్గల్నే వాడతారు. *ఉదా :– అన్ + అగ్ని = అనగ్ని = రోజూ అగ్నికార్యం (హోమం) చేయనివాడు.*

పూర్వీకుల మార్గంలో ఉపసర్గల సహాయంతో ఏ విధంగా నూతన పదనిష్పాదన చేసి వాడుకోవచ్చు?

అనేక ఆంగ్లవ్యక్తీకరణలకి దీటైన పదాల్ని నిష్పాదించడంలో ఉపసర్గలు చాలా ముఖ్యభూమిక వహించగలవని నేటి ఆంధ్ర రచయితలు గుర్తించాల్సిఉంది. ఎందుకంటే ఆంగ్లంలో ఉన్నఅనేక ఉపసర్గలకి మన ఉపసర్గలు సమాధానం చెప్పగలవు. ఉదాహరణకి ఈ క్రింద గమనించండి :

అప = **mis- dis**
misdirect = అపదేశించు *(అచ్చతెలుగులో **తప్పబంపు** అనొచ్చు)*
misfit = అపయోగ్యుడు
misinform = అపతెల్పు
mislead = అపమార్గించు *(ప్రస్తుతానికి **తప్పుదోవ పట్టించు** అని వాడుతున్నారు. కానీ ఇది కొంచెం బారుగా ఉంది)*
mismanage = అపనిర్వహించు.

అప కే ప్రత్యామ్నాయంగా సందర్భాన్ని బట్టి **దుర్/ కు** అని కూడా వాడొచ్చు. ఎందుకంటే ప్రతి సందర్భానికీ **అప** సరిపోతుందని చెప్పలేం. ఉదా:

misappropriation = దుర్వినియోగం
misinterpret = కువ్యాఖ్యానించు

ఉప **= sub- Vice-**
sub-total = ఉపమొత్తం
subscript = ఉపపాఠ్యం
subculture = ఉపసంస్కృతి
subdivision = ఉపవిభాగం

అవ **= sub- de- dis-**
deflation = అవ + ఉల్బణం = అవోల్బణం
sub అనే ఉపసర్గని కొన్నిసార్లు **ఊన** అని గానీ **నీచ** అని గానీ అనువదించవచ్చు. ఉదా :–
subhuman = నీచమానవుడు
subzero temperatures = అవశూన్య ఉష్ణోగ్రతలు (సున్న కంటే తక్కువ ఉన్న ఉష్ణోగ్రతలు)
subsonic speed = అవశబ్ద వేగం (శబ్దం కంటే తక్కువ వేగం)
దీనికి వ్యతిరేకం : శబ్దాధిక వేగం (లేక) అధిశబ్దవేగం = supersonic speed

అతి **= over- super-**
అను **= post-**
ని **= sub- in-**
*subcutaneous = నైచర్మణం (ని + చర్మన్ = చర్మం లోపలిది) పక్షాంతరంలో **చర్మాంతరికం** అని కూడా అనొచ్చు.*
Submersible = నిమజ్జనీయం/ నిమజ్జకం

నిర్/నిస్ = **ex- -less**
అధి = **super-**
సు = **eu-**
దుర్/దుస్ = **mis-**
ప్ర **= pre- pro-**
ప్రతి = **re- counter-**
వి **= de- dis- se-**

సమ్ = **con- com- co-**
పరి = **circum- peri-**
అ/అన్ = **un- non- de- dis-**

తెలుగులో సంస్కృత ఉపసర్గల ప్రయోగ సరణి :

సంస్కృత ఉపసర్గల్ని తఱచుగా సంస్కృత తత్సమాలకే ముందుచేర్చి ప్రయోగించడం తెలుగుభాషలో ఆనవాయితీ. ఇందుకు సకృత్తుగా అపవాదాలు (rare exceptions) కూడా లేకపోలేదు. ఉదాహరణకి, ఈ క్రింది పదనిర్మాణాల్లో తొలి అవయవం సంస్కృత ఉపసర్గా, మలి అవయవం అచ్చతెలుగుపదమూ కావడాన్ని గమనించండి.

దుర్ + అలవాటు = దురలవాటు = దురభ్యాసం
ని: + సిగ్గుగా = నిస్సిగ్గుగా (నిర్లజ్జగా)
ని: (ర్) + మొహమాటంగా = నిర్మొహమాటంగా (మొహమాటం లేకుండా)
అతి + తిండి = అతితిండి
ప్రతి + వాదు = ప్రతివాదూ మొ.
ని: + పూచీ మనిషి = నిష్పూచీ మనిషి (బాధ్యతారహితుడు)
ని: + పేచీ ఆస్తి = నిష్పేచీ ఆస్తి (చట్టపరమైన పేచీలూ, గొడవలూ లేని నిర్వివాద ఆస్తి)
సమ్ + కూడు = సమకూడు
సమ్ + కూర్చు = సమకూర్చు

సకృత్తే అయినా విశేషాన్ని సామాన్యీకరించే (generalizing the particular) న్యాయం చొప్పున ఈ అరుదయిన పదాల శైలిని ఇతర తెలుగు పదాలకి సైతం విస్తరించాలి. ఈ క్రిందివి నేను ఆ ప్రకారంగా నిష్పాదించినవి. ఉదా:- *ఉపగుంపు (sub-group)*

అపవాదకం (దుర్వినియోగం = abuse),
అపతెల్పు (తప్పుడు సమాచారమిచ్చు = misinform),
అనుకాచు/అనుకాపు (వెంట ఉండి కాయడం = escort),
అ-తెలుగంటి (un-telugu-ish) మొదలైనవి.

అభ్యాసకార్యములు

I. ఉన్న క్రియాధాతువులకి ఉపసర్గల్ని జోడించి ఈ క్రింది అర్థాలలో కొత్త క్రియాధాతువుల్నీ, నామవాచకాల్నీ, భావార్థకాల్నీ కల్పించండి :

1. దగ్గఱికి పిలిచి చెప్పు, సలహా ఇచ్చు (వచించు వాడండి) 2. విశేషంగా శిక్షణ ఇచ్చు 3. పొఱపాటున దండించు 4. పైపైన పుయ్యడం (లేపనం అని వాడండి) 5. పైరేట్ చేయడం (ముద్రించు వాడండి) 6. quarantine చేయడం (వాసించు వాడండి) 7. కాపీ చేయు (లిఖించు వాడండి) 8. రహస్యంగా తిరుగు (చరించు వాడండి) 9. ఆకస్మికంగా చనిపోవడం (మరణం వాడండి) 10. చుట్టూ త్రవ్వడం (ఖననం వాడండి) 11. Lateral thinking చేయు (యోచించు వాడండి) 12. అందఱూ కలిసి డిమాండ్ చేయు (ఆశించు వాడండి) 13. Acknowledge చేయు (తెల్పు వాడండి) 14. Liaison చేయు (సంధించు వాడండి) 15. నేఱానికి మించి ఎక్కువ శిక్షవేయు (దండించు వాడండి) 16. ఏమీ తెలియకుండా ముందే అనుకోవడం (bias – మతం అని వాడండి) 17. Low ambition (కాంక్ష వాడండి) 18. ఇద్దఱు ముగ్గుఱు ఒకే వ్యక్తిని ప్రేమించు 19. లోలోపల ద్వేషించు 20. to perceive - తనకి ఇష్టమైనట్లు చూచు (దర్శించు వాడండి) 21. రహస్యంగా అమ్మడం (విక్రయించు వాడండి) 22. రహస్యంగా కొనడం (క్రయించు వాడండి) 23. తనవాళ్ళని తన ఎదురుగానే కొట్టడం (తాడనం అని వాడండి) 24. అందఱూ కలిసి ఇచ్చిన ఆజ్ఞ 25. అంచనాలకి మించి సాధించడం 26. అంచనాలకి మించి పోగుపడడం/ పోగుచేయడం (సంచయనం లేదా సంగ్రహణం అని వాడండి) 27. ప్రత్యేకమైన సంస్థ 28. ప్రధానమైన భాగం 29. సహాయక వాచకం (supplementary text) 30. తోడుగా పంపు (ప్రేషించు వాడండి) 31. వేళ కాని వేళలో తినడం (ఖాదనం గానీ, భోజనం గానీ వాడండి) 32. to improvise అప్పటికప్పుడు కల్పించు (రచించు వాడండి) 33. తిడితే తిరిగి తిట్టడం (దూషణ అని వాడండి) 34. ఒక సబ్జెక్టుని గానీ పుస్తకాన్ని గానీ ఎక్కువగా చదవడం (పఠన అని వాడండి) 35. కలిసి చదువుకోవడం 36. అనుసరించి కల్పించు 37. ఒకఱు తనని ప్రేమించినాకనే తాను వారిని ప్రేమించడం 38. ఒక భవనాన్ని కడుతూండగానే ఇంకో భవనం కూడా కట్టడం (నిర్మాణం అని వాడండి) 39. అడవిగా మార్చు 40. అడవులు లేకుండా చేయు. 41. ముందుగానే జీతమిచ్చు (వేతనం వాడండి) 42. జీతం తగ్గించు.

పదనిష్పాదన కళ

ఎనిమిదో అధ్యాయం

సమాసాల సహాయంతో క్రియాపదనిష్పాదన

అవ్యయీభావ సమాసాల ద్వారా క్రియాపదాల నిష్పాదన :-

సంస్కృతంలో ఉపసర్గల్ని prepositions లాగా ఉపయోగించే పద్ధతి ఒకటుంది. ఈ క్రింది సాంప్రదాయిక ఉదాహరణల్ని పరిశీలించగలరు.

1. ఉప + హరి = ఉపహరి *(హరికి దగ్గఱగా/ హరికి దగ్గఱగా ఉన్నటువంటిది)*
2. అధి + గంగా = అధిగంగమ్ *(గంగ వద్ద / గంగ వద్ద ఉన్నటువంటిది)*
3. మధ్యే + మార్గమ్ = మధ్యేమార్గమ్ (*దారి నడుమ/ దారి నడుమ ఉన్నటువంటిది, జఱిగినటువంటిది)*
4. ప్రతి + రామ: = ప్రతిరామమ్ *(రాముని గుఱించి /రాముని గుఱించి/ రాముని కొఱకు వ్రాసినది)*

వీటిని అవ్యయీభావ సమాసాలు అంటారు. ఇక్కడ అనుకొన్న అర్థం గలిగిన ఉపసర్గల్ని ఇంగ్లీషు prepositions మాదిరి నామవాచకానికి ముందుచేర్చి అవ్యయీభావ సమాసాలేర్పఱచాలి. అనంతరం కావాల్సిన అర్థంలో వాటికి 'ఇల్లుక్/ ఇంచుక్' చేర్చుకుని క్రియాధాతువులుగా రూపొందించి పని పూర్తిచేసుకోవచ్చు. వీటికీ విస్తారమైన పద కుటుంబం ఉంటుంది.

ఉపసర్గ, నామవాచకాల మిశ్రణతో కల్పించిన కొన్ని నూతన అవ్యయీభావ క్రియలు :

*1. అప + మార్గం = మార్గం కంటే వేఱుగా - **అపమార్గించు** = తప్పుదోవ పట్టించు (hijack) ; **అపమార్గణ** (n)*

*2. అవ + నావమ్ = అవనావం = **అవనావం** = నౌక నుంచి కిందికి - **అవనావిల్లు** = నావలో నుంచి దిగు (disembark) ; అపనావన (n)*

*3. ఇంచుక్ చేర్చగా, **అవనావించు** = నావలోంచి కిందికి దించు (to haul)*

*4. అను + రూపమ్ = **అనురూపం** = ఉన్న రూపాన్ని అనుసరించినది*

***అనురూపిల్లు** = to conform*

*5. **అనురూపించు** = ఉన్నరూపాన్ని అనుసరించి ఇంకో రూపాన్ని తయారుచేయు to replicate, to customize*
***అనురూపణ** (n) ; (అనురూపత = conformity)*

*6. అభి + నది - అభినది = నదికి ఎదురుగా (river-front) = **అభినదించు** = నదికి ఎదురుగా నిర్మించు.*
***అభినదన** (n)*

*7. సమ్ + కాలౌ – సంకాలం = రెండు కాలాలు కలగలిసినది = **సంకాలించు** to synchronize*
సంకాలనం = (n) synchronization

8. ప్రతి + పాలం – ప్రతిపాలం = పాలకునికి పోటీగా ఉన్నది
***ప్రతిపాలించు** = పాలకునికి పోటీగా ప్రవర్తించు. (సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పఱిచి పన్నులు వసూలు చేయు)*

9. వి + జనం – విజనం = జనం లేనిది
***విజనించు (విజనీకరించు)** = జనం లేకుండా చేయు. to de-populate.*
(వ్యతిరేకార్థకం – సజనీకరించు లేక జనాపించు. to populate.

10. పరి + నగరం – పరిణగరం = నగరం చుట్టూ ఉన్నది
***పరిణగరించు** = నగరాన్ని చుట్టుముట్టు, నగరం చుట్టూ ఏర్పఱచు.*

మఱికొన్ని ఇలా :

*సహ + ఫలం – ఫలంతో కూడుకొని – **సఫలిల్లు/సఫలీభవించు** = ఫలించు/సఫలమగు*

(అలాగే ఇంచుక్ చేర్చగా) ***సఫలించు/సఫలీకరించు** = విజయవంతం చేయు*

స్వ + స్థలం – స్వస్థలించు/స్వస్థలీకరించు = (v) స్వస్థలానికి పంపు (repatriate) ;

***స్వస్థలీకరణ** = (n) repatriation*

బహువ్రీహిసమాసాన్ని **'కలిగి ఉన్న/ కలిగి లేని'** అనే అర్థంలో వాడతారు. *ముక్కంటి, తమ్మిచూలి, పుల్లుమావి* మొదలైన తెలుగుపదాల్లోను, *త్రినేత్రుడు, చక్రపాణి, మృగనయని* మొదలైన సంస్కృత పదాల్లోను, heavy weight, feather-weight, south paw (left-hander) మొదలైన ఇంగ్లీషుపదాల్లోనూ మనకు ఇలాంటి నిర్మాణం కనిపిస్తుంది. సమాసం లో కలుస్తున్న రెండు పదాలకు విడివిడిగా ఉన్న అర్థం కన్నా భిన్నమైన కొత్త అర్థాన్ని బహువ్రీహి ఇస్తుంది. కలుస్తున్న పదాల్ని కాకుండా వాటిద్వారా వాటికంటే భిన్నమైన ఒక మూడో వస్తువుని/ వ్యక్తిని అది సూచిస్తుంది.

బహువ్రీహిలో పదసమ్మేళనాలు (word combinations) స్థూలంగా మూడురకాలుగా ఉంటాయి.

1. నామవాచకం + నామవాచకం

ఉదా:-శూలపాణి = శూలము పాణియందు గలవాడు

2. విశేషణం + నామవాచకం

ఉదా:- ఆర్ద్ర హృదయుడు = తడిసిన/ చల్లని హృదయం గలవాడు

3. క్రియావిశేషణం (past participle/ present participle) **+ నామవాచకం**

ఉదా:- నతగాత్రుడు = వంగిన గాత్రం (శరీరం) గలవాడు.

బహువ్రీహినే కాదు అసలు ఏ చిఋసమాసాన్నయినా మనం క్రియాధాతువుగా మార్చేసి వాడుకోవచ్చు. high-lighting, gate-crashing, hitch-hiking, tape-recording మొదలైన పదాల విషయంలో ఇంగ్లీషువారు అవలంబించిన విధానమిదే. శబ్దపల్లవాల రూపంలో తెలుగులో కూడా ఎప్పట్నుంచో ఈ పద్ధతి వాడుకలో ఉంది. ఈ క్రింది పదాలు ఉదాహరణల కోసం నిష్పాదించినవి:

*1. సమయ పాలన – **సమయపాలించు** = నిర్ణీత సమయాన్ని పాటించు*
*2. వ్యాసరూపం – **వ్యాసరూపించు** (అలాగే, **గద్యరూపించు** – paraphrasing) –వ్యాసంగా వ్రాయు*
*3. లిప్యంతరం = మఱో లిపి ; **లిప్యంతరించు** = మఱో లిపిలోకి మార్చు*
*4. ఉరిశిక్ష – **ఉరిశిక్షించు** = ఉరివేసి శిక్షించు*
*5. **క్రమశిక్షణించు** = క్రమశిక్షణలో పెట్టు (to discipline somebody)*
*6. **మున్‌తేదించు** = ముందటి తేదీ వేయు (pre-date)*
*7. **మఱుతేదించు** = మఱుసటి తేదీ వేయు (post-date) మొ. (మఱుతేదీ చెక్కు – post-dated cheque)*
*8. **స–తేదించు** = అదే (ఉన్న) తేదీ వేయు.*

బహువ్రీహితో కూడా మనం ఇలాంటి ప్రయోగాలు చెయ్యొచ్చు.

*1. హతాశుడు – **హతాశించు/హతాశీకరించు** (హతాశుడుగా చేయు) to frustrate*
హతాశితుడు = frustrated
*అలాగే, **నిరాశించు** = **నిరాశపఱచు** (to disappoint)*

*2. (వారసించు = వారసుడుగా చేయు x) **అవారసించు** = వారసత్వానికి అనర్హుడుగా చేయు disinherit)*
తన చిన్నభార్య సంతానాన్ని అవారసిస్తూ విల్లు వ్రాశాడు. అతని చిన్నభార్య సంతానం అవారసితులు.
*అలాగే, **నిర్వారసించు** = వారసులు లేకుండా చేయు మొ ||*

*అలాగే, **నిర్వంశించు** = నిర్వంశనం = వంశనాశనం*

అతని కొడుకును అపహరించి, చంపేసి అతన్ని నిర్వారసించాడు. (నిర్వంశించాడు)

*3. **దృఢదీక్షిల్లు** – గట్టి పట్టుదల పట్టు*

ఉదా:– ఎంజినీరింగ్ లో చేఱాలని ఆమె దృఢదీక్షిల్లింది.

*(సకర్మకంగా అయితే –**దృఢదీక్షించు** = గట్టి పట్టుదల పట్టేలా చేయు)*

***ఉదా** :– ఎన్నికల్లో పోటీచేయాలని వాడు వీణ్ణి దృఢదీక్షించాడు.*

*4. **కృతనిశ్చయిల్లు** – కృతనిశ్చయుడు/రాలు అగు*

(సకర్మకంగా అయితే–కృతనిశ్చయించు = గట్టి నిర్ణయం తీసుకునేలా చేయు)

***5.** వేగవంతించు – వేగిరపఱచు (to expedite, to accelerate)*

బహువ్రీహి అంటే 'పెక్కు వరిపంటలు' అని అర్థం. వరిలో ఎన్ని రకాలున్నాయో బహువ్రీహిలో అన్నిరకాలు ఉన్నాయట. మఱో రకం బహువ్రీహి ఇలా ఉంటుంది.

*ఉప + దశ - ఉపదశ = పదికి దగ్గఱగా **(9** కావచ్చు, **11** కావచ్చు)*

దీన్నుంచి మనం నిష్పాదించగల క్రియాధాతువు : **ఉపదశించు** – పదికి దగ్గఱగా పూర్ణాంకం వేయు (round figure చేయు)

ఇదే క్రమంలో – ***ఉపశతించు*** *(వందకు దగ్గఱగా)*

***ఉపసహస్రించు** (వెయ్యింటికి దగ్గఱగా)*

***ఉపాయుతించు** (పదివేలకు దగ్గఱగా)*

***ఉపలక్షించు** (లక్షకు దగ్గఱగా)*

ఉదా:= అతని జీతం ఈ మధ్య ఉపలక్షిల్లింది. (లక్షకి దగ్గఱగా పెఱిగింది.. సుమారు లక్ష అయింది)

***ఉపకోటించు** (కోటికి దగ్గఱగా)*

***ఉపశతకోటించు** (బిలియనుకు దగ్గఱగా) మొ.*

ఉదా:– అతని వ్యాపార పరిమాణం (turnover) ఇటీవల ఉపశతకోటిల్లింది. (బిలియన్ కి దగ్గఱయింది. సుమారొక బిలియన్ అయింది)

అభ్యాసకార్యములు

I. ఈ క్రింద ఇచ్చిన వాక్యాల్లోని ముఖ్యమైన పదాల్ని (సమాసించి) క్రియాధాతువులుగా మార్చి వాక్యాల్ని తిరగ వ్రాయండి.

1. ఆమె దేవుడికి ధూపదీపాలతో పూజ చేసింది 2. వాళ్ళిద్దఱూ జుట్టూ జుట్టూ పట్టుకుని కొట్టుకున్నారు. (కేశాకేశి అని వాడండి) 3. వాళ్ళిద్దఱూ ఒకఱినొకఱు గోళ్ళతో ఱక్కుకున్నారు (నఖానఖి అని వాడండి) 4. ఆపద్ధర్మాల్ని నిత్యనైమిత్తికాలుగా మార్చకూడదు 5. నిత్యనైమిత్తికాల్ని ఆపద్ధర్మాలుగా మార్చకూడదు 6. ఈ సంవత్సరం జమా ఖర్చుల పద్దు (budget) పదిలక్షలైంది 7. అధికారం కోసం వారు చాలా నెత్తుఱు చిందించారు (రక్తపాతం అని వాడండి) 8. ఆయన ఆ సంఘానికి చాలాకాలంపాటు కార్యదర్శిగా ఉన్నాడు 9. నింగికెగసే ఊహల్ని నేలదారి పట్టించాలి 10. అతడు ఉపకారం చేసినవాడి పట్ల కృతఘ్నుడిలా ప్రవర్తించాడు 11. ప్రజలు పూలతో మహాత్ముడికి అంజలి ఘటించారు. 12. ఆమె జనన వివరాల్ని తీసుకొని ఆయన గ్రహస్ఫుటం చేశాడు. 13. పని పూర్తిచేయడానికి అధికారులు చిరకాలం తీసుకుంటున్నారు 14. ఆ వార్త విని పరమానందం పొందాను 15. సమయోచితంగా చేయాలి/ ప్రవర్తించాలి. 16. స్వభాషలో మాట్లాడ్డం అభివర్ధితమైన స్వతంత్ర జాతుల లక్షణం 17. పరభాషలో మాట్లాడ్డం వెనకబడ్డ బానిసజాతుల లక్షణం 18. ఆ రోజుల్లో దేశనాయకులంతా ఆ నటుడికి పాదాక్రాంతులయ్యారు. (వశంవదులు అని కూడా వాడొచ్చు) 19. ఒక జాలగూటి లాంఛనాల్ని సమూలంగా మార్చాలంటే దానికి మళ్ళీ మొదట్నుంచీ కార్యక్రమం వ్రాయాల్సి ఉంటుంది 20. పారలౌకిక ఆదర్శాల్ని ఇహలోకానికి అనుగుణంగా మార్చుకోవాలి.

పదనిష్పాదన కళ

తొమ్మిదో అధ్యాయం

వ్యతిరేకార్థకాల నిష్పాదన

ప్రతి భాషలోనూ “ఔనా ?” అంటే, "కాదు" అనడానికీ, “ఉందా ?” అంటే, “లేదు” అనడానికి కావాల్సిన ప్రాథమిక పదసరంజామా తప్పకుండా ఉంటుంది. వీటిని వ్యతిరేకార్థకాలు (antonyms) అంటారు. ధ్రువీకారి వాక్యాల (affirmative sentences) కి వ్యతిరేకార్థకవాక్యాల్ని (negative sentences) అందరూ కూర్చగలరు. కాని సానుకూల పదాల (positive words) ని ప్రతీపశబ్దాలు (negative words) గా మార్చడానికే కొంచెం అభ్యాసం కావాలి. భాషలో కొన్నిసానుకూల పదాలకి వ్యతిరేక పదాలు సహజసిద్ధంగానే లభ్యమవుతాయి.

వెలుగు X చీకటి
మంచి X చెడు మొ.

కానీ అన్నిటికీ ఇలా పూర్వాయత్తం (ready-made) గా లభ్యం కావు. కనుక మనం చాలా పదాలకి ప్రయత్నపూర్వకంగా వ్యతిరేకార్థకాల్ని రూపొందించాల్సి ఉంటుంది. ఇలా లక్షణ (వ్యాకరణ) సహాయంతో కృత్రిమంగా రూపొందించిన వ్యతిరేకార్థకాల్ని ‘లాక్షణిక వ్యతిరేకార్థకాలు’ అంటారు.

అలా రూపొందించడానికి తెలుగుభాష అందిస్తున్న సాధనాలేంటి ?

మనకు రెండురకాల వ్యతిరేకార్థకాలు అవసరమౌతాయి. 1. కానిది 2. లేనిది.

ఉదా:– *అ + విద్య = **అవిద్య** = విద్య **కానిది** (అజ్ఞానం)*
*నిర్ + వివాదం = **నిర్వివాదం** = వివాదం **లేనిది** (సునిశ్చితం)*

ఐతే ఇవి సంస్కృత నిర్మాణాలు. కృత్రిమ వ్యతిరేకార్థకాల కల్పనకి అచ్చతెలుగు అందిస్తున్న లాక్షణిక సౌకర్యాలు అతి స్వల్పం. ‘కానిది’ అని చెప్పే పద్ధతే తెలుగులో లేదు. ‘కాదు, కానిది’ అంటూ వాక్యరూపంగా చెప్పాల్సిందే తప్ప ఆ అర్థం

లో ఉన్న పదాలకి ఎలాంటి మార్పులూ, చేర్పులైనా చెయ్యడానికి తెలుగు అవకాశమివ్వదు. 'లేనిది' అని చెప్పే పద్ధతి మాత్రం ఉంది.

(I) ఇందుకోసం 'ఇడి' లేదా 'ఇండి' అనే ప్రత్యయాల్ని వాడతారు.

ఉదా:- *సిగ్గు + ఇడి (ఇండి) =* ***సిగ్గిడి/ సిగ్గిండి*** *= సిగ్గులేనివాడు / సిగ్గులేనిది*

వాలు + ఇండి (ఇండి) = ***వాలిండి*** *= తోకలేని కోతి (ape / primate)*

ముక్కు + ఇది (ఇండి) = ***ముక్కిడి/ ముక్కిండి*** *= ముక్కు లేనివాడు / ముక్కులేనిది*

వావి + ఇడి = ***వావిడి*** *= వావీ, వరసా పాటించని కాముకుడు. (incestuous person)*

కాని ఇదొక్కటే సరిపోదు. *'ఇడి / ఇండి'* ప్రత్యయాన్ని పునరుద్ధరించి ప్రచురపఅచడానికి సమయం తీసుకుంటుంది. కనుక అలవాటైన సంస్కృతప్రత్యయాలతో ప్రస్తుతానికి పని గడుపుకోవాలి.

(II) సంస్కృతంలో *'కానిది'* అనే అర్థంలో పదానికి ముందు *'అ'* అనే ఉపసర్గ చేఋస్తారు. వ్యాకరణ పరిభాషలో దీనికి *నఞ్* అని పేరు. వైయాకరణులు దీన్నొక తత్పురుషభేదంగా భావిస్తారు. ఉదా :-

అ + జ్ఞానం = ***అజ్ఞానం*** *= జ్ఞానం కానిది*

అ + సహనం = ***అసహనం*** *= సహనం కానిది*

అ + సామాన్యం = ***అసామాన్యం*** *= సామాన్యం కానిది*

అ + సాధారణం = ***అసాధారణం*** *= సాధారణం కానిది*

అ + నాగరికం = ***అనాగరికం*** *= నాగరికం కానిది*

అ + ప్రాచ్యుడు = ***అప్రాచ్యుడు*** *= ప్రాచ్యుడు కానివాడు*

అ + యోగ్యుడు = ***అయోగ్యుడు*** *= యోగ్యుడు కానివాడు*

అ + పాత్రుడు = ***అపాత్రుడు*** *= పాత్రుడు కానివాడు*

అ + సహ్యం = ***అసహ్యం*** *= సహ్యం (ఓర్చుకోదగినది) కానిది*

అ + జేయం = ***అజేయం*** *= జేయం (గెలవదగినది) కానిది*

అ + వాస్తవం = ***అవాస్తవం*** *= వాస్తవం కానిది*

అ + సంభవం = ***అసంభవం*** *= సంభవం కానిది*

అ + సభ్యం = ***అసభ్యం*** *= సభ్యం (సభలో ఉండదగినది) కానిది*

అ + శ్రీలం = ***అశ్రీలం*** *= అశ్లీలం = శ్రీని (లక్ష్మీదేవిని) తీసుకురానిది*

అ + సందర్భం = ***అసందర్భం*** *= సందర్భం కానిది*

కొన్నిసార్లు 'అనుచితమైన' **అనే అర్థంలో కూడా** *'అ'* **అనే ఉపసర్గని చేఱుస్తారు.**

అనుచితమైన (తగని) స్థానం = ***అస్థానం***

అనుచితమైన (తగని) కాలం = ***అకాలం***

కొన్నిసార్లు 'లేనిది' **అనే అర్థంలో కూడా '***అ***' అనే ఉపసర్గని చేఱుస్తారు.**

పారం (అవతలి గట్టు) లేనిది = ***అపారం***
కళంకం లేనిది = ***అకళంకం***
కారణం లేనిది = ***అకారణం***
అన్ + అంతరం = ***అనంతరం*** *= అంతరం (ఎడం) లేనిది*
అన్ + ఆది = ***అనాది*** *= ఆది లేనిది (మొదలెక్కడో తెలియనిది)*
అన్ + అంతం = ***అనంతం*** *= అంతం లేనిది (అంతం ఎక్కడో తెలియనిది)*
అన్ + అర్థం = ***అనర్థం*** *= అర్థం (ప్రయోజనం) లేనిది*
అన్ + అర్గళం = అనర్గళం = అర్గళం లేనిది (గడియ, bolt వేయనిది)

ఇటీవల *నఞ్* **స్థానంలో - ప్రాచీన సాహిత్యంలో చాలా అరుదుగా ప్రయోగించబడ్డ** *'ఇతర'* **అనే పదాన్ని బహుళ ప్రాచుర్యం లోకి తెచ్చారు మన పాత్రికేయులు**. ఉదా :-

మత + ఇతరం = ***మతేతరం*** *= మతం కంటే వేఱైనది అని అసలు అర్థం (irreligious, non-religious)*
రాజకీయ + ఇతరం = ***రాజకీయేతరం*** *= రాజకీయాల కంటే భిన్నమైనది (apolitical).*
వ్యవసాయ + ఇతరం = ***వ్యవసాయేతరం*** *= సాగు కంటే వేఱైనది (non-agro)*

ఈ నిర్మాణాలకి సాంకేతిక అభ్యంతరం లేదు. కాని అన్నిచోట్లా ఇవే వాడడం వల్ల వ్యాకరణం అందించే సౌకర్యాల్ని కొన్ని సార్లు వినియోగించుకోలేకపోతాం. ఉదాహరణకి, ఇలాంటి నిర్మాణాలు సుదీర్ఘమైనవి. ఒక్క 'అ'కారాన్ని పదం ముందు చేర్చిస్తే సరిపోయేదానికి *'ఇతరం'* అని పదాన్ని అనవసరంగా మూడక్షరాలు అదనంగా పొడిగించడం. తత్ఫలితంగా ఏర్పడిన నిర్మాణాల్ని వాటి ఇంగ్లీషు సమార్థకాలతో పోల్చిచూడండి. అర్థమౌతుంది. ఇందులో ఇంకో అసౌకర్యం ఏమి టంటే– ఇది సామాన్య వ్రాతగాళ్ళ పరిజ్ఞానానికి అతీతమైనది. *'ఇతర'* అని చేర్చినప్పుడల్లా ముందు పదంతో సవర్ణదీర్ఘ సంధో, గుణసంధో, యణాదేశసంధో చెయ్యాల్సి వస్తుంది. అంత దూరం పోలేక "కలిపికొట్టు కావేటి రంగా !" అనుకుని *'యేతర'* (ఉదా :- హిందూ + యేతర) అంటూ ఏ సూత్రానికీ కట్టుబడని, తర్కసహం కాని ఒక రూపాన్ని సృష్టించి వాడుతున్నారు. కనుక వ్యతిరేకార్థకంగా నఞ్ ని విస్తృతంగా పునరుద్ధరించాల్సి ఉంది. *'ఇతర'*కి కూడా ప్రాధాన్యం లేక

పోలేదు కానీ దాన్ని సాభిప్రాయంగా, సందర్భానుసారంగా, సమయస్ఫూర్తితో వాడుకోవాలి.

(III) పదం అచ్చుతో మొదలైతే పదానికి ముందు '*అ*'కారం బదులు '*అన్*' వస్తుంది.

ఉదా : *ఆచారం – అన్ + ఆచారం = **అనాచారం** = ఆచారహీనత్వం (ముఖికి అలవాట్లు)*

*అర్హుడు – అన్ + అర్హుడు = **అనర్హుడు** = అర్హుడు కానివాడు*

*ఉచితం (తగినది) – అన్ + ఉచితం = **అనుచితం** (తగనిది)*

*ఊహ్యం (ఊహించదగినది) – అన్ + ఊహ్యం = **అనూహ్యం** (ఊహించరానిది)*

*ఏకం (ఒకటి) – అన్ + ఏకం = **అనేకం** (ఏకం కానిది)*

(ii) లేనిది అనే అర్థంలో :

(I) '*లేనిది*' అనే అర్థంలో పదానికి ముందు '*నిః*' చేఋతుంది. ఉదా :-

*నిః + శేషం = నిశ్ + శేషం = **నిశ్శేషం** = శేషం లేనిది (మొత్తం)*

*నిః + సారం = నిస్ + సారం = **నిస్సారం** = సారం లేనిది*

*నిః + ఫలం = నిష్ + ఫలం = **నిష్ఫలం** = ఫలం లేనిది (వ్యర్థం)*

*నిః + కారణం = నిష్ + కారణం = **నిష్కారణం** = కారణం లేనిది*

*నిః + తంద్ర = నిస్ + తంద్ర = **నిస్తంద్రుడు** = సోమరితనం లేనివాడు*

*నిః + ఆకారుడు = నిర్ + ఆకారుడు = **నిరాకారుడు** = ఆకారం లేనివాడు (భగవంతుడు)*

*నిః + దయ = నిర్ + దయ = **నిర్దయ** = దయలేని స్థితి*

*నిః + మూలం = నిర్ + మూలం = **నిర్మూలం** = మూలం లేనిది (మూలాన్ని పోగొట్టుకున్నది)*

గమనిక :- ఇక్కడ విసర్గ/ ష్టుత్వ/ శ్చుత్వ సంధిసూత్రాలు ప్రవర్తిస్తాయి. అంటే, పరపదం శకార, చకారాలతో మొదలైతే నిః లోని విసర్గ శకార చకారాలుగా మారుతుంది. అదే, షకార, టకారాలయితే అది షకార, టకారాలుగా మారుతుంది. అదే, సకార, తకారాలయితే అది సకారంగా మారుతుంది. పరపదం క, ఖ, ప, ఫ అనే అక్షరాల్లో ఏదో ఒకదానితో మొదలయితే విసర్గకి షకారం ఆదేశమవుతుంది. అచ్చులూ, అనునాసికాలతో సహా మిగతా అన్ని అక్షరాలకీ ముందు విసర్గకి రేఫ (రకా రం) ఆదేశమౌతుంది.

ఇతర ఉదాహరణలు : *నిర్ + మొహమాటం = **నిర్మొహమాటం** = మొహమాటం లేకుండా*

*నిర్ + లక్ష్యం = **నిర్లక్ష్యం** = లక్ష్యం లేకుండా*

*నిర్ + వాసితం = **నిర్వాసితం** = వాసం (ఇల్లు) లేకుండా చెయ్యబడిన మొ.*

తెలుగు పాత్రికేయులు ఇంత సౌకర్యవంతమైన ప్రత్యయాన్ని కూడా వదిలిపెట్టి 'రహిత, హీన' మొదలైన పదాల్ని మాత్రమే ఎంచుకొని ఉచ్చరించలేనంత బారుగా పదాల్ని పొడిగిస్తున్నారు. రహిత, హీన ఇత్యాదులు కూడా భాషకి ఆవశ్యకమేనని అంగీకరిస్తాం. కానీ ఇటువంటి పదనిర్మాణాల్లో ఇమిడున్న ఒక అసౌకర్యమేంటంటే, ఆ పదాల్లోంచి క్రియల్ని కల్పించ లేం, ఇంచుక్ ని ఉపయోగించి కూడా ! ఒకవేళ అలా కల్పించబోయినా ఆ నిర్మాణాలు చాలా వికారంగా, కర్ణకఠోరంగా ధ్వనిస్తాయి. అదే, **'నిః'** అనే ఉపసర్గని గనుక ఉపయోగిస్తే అనేక విశేషణాలతో పాటు క్రియల్ని కూడా నిష్పాదించగలం. ఉదా :

ఛందం = వోటు

నిః + ఛంద + ఇంచుక్ = ***నిశ్ఛందించు (నిశ్ఛందీకరించు)*** *= వోటు లేకుండా చేయు (disenfranchise)*

అలాగే, (నిర్వాసితుడు లాగా) ***నిశ్ఛందితులు*** *= వోటు లేకుండా చెయ్యబడ్డవారు (disenfranchised people)*

అ + గుర్తించు = ***అగుర్తించు*** *(derecognize) మొ||*

(II) రేఫ (రకారం) తో మొదలయ్యే పదాల ముందు *'నిః'* చేఱితే అందులోని విసర్గ లోపించి *'ని'* లోని అచ్చు దీర్ఘ మవుతుంది. ఉదా :-

నిః + రోగం = నిర్ + రోగం = **నీరోగం** = రోగం లేని/ రోగం లేకుండా

నిః + రంధ్రం = నిర్ + రంధ్రం = **నీరంధ్రం** = రంధ్రాలు లేని/ రంధ్రాలు లేకుండా

గమనిక :- *దీన్నుంచి ఒక క్రియాధాతువుని రూపొందించవచ్చు :*

నీరంధ్రించు/ నీరంధ్రీకరించు *= (v. trans. సకర్మకక్రియ) వ్యవస్థలో రంధ్రాలూ, లొసుగులూ లేకుండా చేయు. to make the system foolproof.*

లేదా నీరు, గాలీ, నీరూ చొఱబడకుండా చేయు. To make something air-proof or water-proof.

(III) ***'లేనిది'*** **అనే అర్థంలో కొన్నిసార్లు పదానికి ముందు *'అ'* అనే ఉపసర్గతో పాటు చివఱ *'క'* అనే ప్రత్యయం కూడా చేఱుతుంది.** ఉదా:-

శిరస్ = తల

అ + శిరస్ + క = ***అశిరస్కం*** *= తల లేనిది (మొండెం)*

మనస్ = మనస్సు

అ + మనస్ + క = ***అమనస్కం*** *= మనస్సు లేనిది (మనశ్శక్తుల్ని ఉపయోగించకుండా అనుష్ఠించే ఒకానొక యోగసాధన)*

పుత్రుడు = కొడుకు

అ + పుత్ర + క = ***అపుత్రకుడు*** *= కొడుకులు లేనివాడు   రాజు = ఏకిమీడు, ఏలిక*

అ + రాజ + క = ***అరాజకం*** *= రాజు (నాయకుడు) లేని రాజ్యం సంఖ్య = లెక్క*

అ + సంఖ్యా + క = ***అసంఖ్యాకం*** *= లెక్కలేనిది*

(IV) చకార మహాప్రాణం (ఛ కారం) మొట్టమొదట గల పదాల ముందు ఏదైనా ప్రత్యయం గానీ, ఉపసర్గ గానీ చేటితే ఆ చేటినవాటి తరువాత ఒక అల్పప్రాణ చకారం (సాధారణ చకారం) వస్తుంది.

ఛాయ = నీడ

అ + ఛాయ = అ + చ్ + ఛాయం

అచ్ఛాయం = నీడలేని (నీడనివ్వని) చెట్టు

అభ్యాసకార్యములు

I. 'అ' లేక 'అన్' ఉపయోగించి ఈ క్రిందిపదాలకి 'కానిది' అనే అర్థంలో లాక్షణిక వ్యతిరేకార్థకాల్ని నిష్పాదించండి :

1. పండితుడు 2. వ్యవస్థ 3. కలుషం 4. సంబద్ధం 5. చంచలం 6. న్యాయం 7. అల్పం 8. కల్పితం 9. చతురుడు 10. చిరకాలం 11. ప్రశస్తం 12. చేతనం 13. శుచి 14. వ్యక్తం 15. వాచ్యం 16. వాంఛనీయం 17. అభిలషణీయం 18. అవబోధ్యం (అర్థం చేసుకోదగినది) 19. విధేయత (loyalty) 20. సమ్మతం 21. అంగీకారం 22. సౌఖ్యం 23. సదృశం (similar) 24. అన్యసాధ్యం (ఇతరులకి సాధ్యమైనది) 25. భూతం (జటిగినది) 26. సితం (తెలుపు) 27. ధైర్యం 28. ఆసక్తి 29. ఆదరం 30. స్థిమితం 31. పాక్షికం 32. స్థిరం 33. ఆకారి

II. 'ఇతర' ఉపయోగించి ఈ క్రిందిపదాలకి 'కానిది' అనే అర్థంలో లాక్షణిక వ్యతిరేకార్థకాల్ని నిష్పాదించండి :

1. సాహిత్యం 2. హైందవం 3. క్రైస్తవం 4. మహ్మదీయం 5. జైనం 6. బౌద్ధం 7. ప్రభుత్వం 8. కుటుంబం 9. స్త్రైణం (feminine) 10. పౌంస్నం (masculine) 11. ప్రాంతీయం (regional) 12. అధికపన్నుల్ని విధించడం కంటే వేఱైన అవరోధాలు (non-tariff barriers) (పన్ను అని అకారాంతంగా మార్చండి) 13. ముద్రణ కంటే వేఱైన మాధ్యమాలు 14. ఎలక్ట్రానిక్ కంటే వేఱైన మాధ్యమాలు 15. సంస్కృతి కంటే వేఱైన వేదికలు 16. విద్యుత్తు కంటే వేఱైన శక్తివనరులు (వైద్యుత అని వాడండి) 17. అడవులు కాని ప్రాంతాలు (అటవి అని వాడండి) 18. విద్య కంటే వేఱైన వ్యాపారాలు 19. పరిశ్రమల కంటే వేఱైన ఉపాధిమార్గాలు 20. ఆరోగ్యం కంటే వేఱైన ఇబ్బందులు 21.

శిలాజాల కంటే వేఱైన ఇంధనాలు (non-fossil fuels) 22. కులం కంటే వేఱైన విభజనలు 23. ఆహారం కంటే వేఱైన అవసరాలు 24. తల్లిదండ్రుల కంటే వేఱైన సంరక్షకులు (తల్లిదండ్రులకు 'జనక' అని వాడండి) 25. పండుగల కంటే వేఱైన సెలవులు 26. డబ్బుకంటే వేఱైన లాభాలు (ఆర్థిక అని వాడండి) 27. కెరియర్ కంటే వేఱైన అభిరుచులు (వ్యాసంగం అని వాడండి) 28. పాఠ్యాల కంటే వేఱైన కార్యకలాపాలు 29. దేశి కంటే వేఱైన పదజాలం 30. దక్షిణం కంటే వేఱైన దిశల్లో ఉన్న రాష్ట్రాలు.

III. 'నిః' ఉపయోగించి ఈ క్రిందిపదాలకి 'లేనిది' అనే అర్థంలో లాక్షణిక వ్యతిరేకార్థకాల్ని నిష్పాదించండి :

1. కరుణం 2. సంకోచం 3. కామం 4. పాపం 5. దోషం 6. జలం 7. సారం 8. లక్ష్యం 9. మమకారం (attachment) (మమం అని వాడండి) 10. ఆధారం 11. ఆలంబం (ఊత) 12. అంకుశం (ఏనుగుని కట్టడి చేసే సాధనం) 13. తేజం 14. ఆహారం 15. విరామం 16. ధూమం 17. జీవం 18. శంక 19. సందేహం 20. గుణం 21. దాక్షిణ్యం 22. ఆశ 23. అక్షరాస్యుడు 24. స్వార్థం 25. సంతానం 26. బీజం 27. ఇంద్రియం 28. వీర్యం 29. ఈశ్వరవాదం 30. ఆమయం (రోగం) 31. ఆకరం (source)

IV. '-రహితం, -హీనం, -వర్జితం, -అపేతం, -శూన్యం, -దూరం' అనే పదాల్లో ఏదైనా ఒకటి ఉపయోగించి ఈ క్రింది పదాలకి 'లేనిది' అనే అర్థంలో లాక్షణిక వ్యతిరేకార్థకాల్ని నిష్పాదించండి :

1. రసం 2. పక్షపాతం 3. పదవి 4. విధివిధానం 5. నియమం 6. ప్రమాదం 7. వివేకం 8. అయోమయం 9. ఆందోళన 10. భావం 11. గౌరవం 12. హోదా 13. బాధ 14. కోలాహలం 15. కల్లోలం 16. కాలుష్యం 17. సంబంధం 18. శక్తి 19. ప్రతిభ 20. మార్దవం 21. శృంగారం 22. ప్రాముఖ్యం 23. వివాదం 24. ఆచారం 25. చికిత్స 26. రవాణా 27. పరిజ్ఞానం 28. నైపుణ్యం 29. ఆవాసం 30. ఆశ్రయం 31. రూపం 32. లజ్జ 33. భయం

V. 'అ' ఉపయోగించి ఈ క్రిందిపదాలకి 'లేనిది' అనే అర్థంలో లాక్షణిక వ్యతిరేకార్థకాల్ని నిష్పాదించండి :

1. కల్మషం 2. రోగం 3. భయం 4. అవరోధం 5. కంటకం 6. ఉపమ (పోలిక) 7. కరవాలం (కత్తి) 8. కుసుమం 9. ధూళి 10. సత్త్వం 11. స్వనం (చప్పుడు) 12. మార్గం 13. వర్ణం 14. గంధం 15. గృహం 16. శరణం 17. విధానం 18. నికేతనం (నివాసం) 19. ఈశ్వరుడు 20. పర్ణం 21. వర్షం 22. వైరం 23. వాలం (తోక) 24. రోమం (వెంట్రుక) 25. విపక్షం (శత్రువులు) 26. ఛత్రం (గొడుగు, రక్షణ, ఏల్బడి) 27. ప్రకాశం (వెల్లడి) 28. వంశం 29. భూషణం 30. అపత్యం (సంతానం)

VI. 'అ....కం' ఉపయోగించి ఈ క్రిందిపదాలకి 'లేనిది' అనే అర్థంలో లాక్షణిక వ్యతిరేకార్థకాల్ని నిష్పాదించండి

1. కర్మ 2. నామం 3. మంత్రం 4. పత్త్రం 5. తపస్ 6. ఆయుష్ (బ్రదిమి) 7. వచస్ (మాట) 8. నమస్ 9. రజస్ 10. తమస్ 11. వర్చస్ 12. తేజస్ 13. ఓజస్ 14. శిరస్ 15. వపుష్ (శరీరం) 16. ఏనస్ (పాపం) 17. సతీ (భార్య) 18. లతా (తీగ) 19. శాఖా (కొమ్మ) 20. భర్త (భర్తృ) 21. గురు 22. వ్యాధి 23. నిర్మాత (నిర్మాతృ) 24. దాత (దాతృ) 25. విద్యుత్ 26. సరిత్ (నది) 27. మరుత్ (గాలి) 28. సూత్రం 29. యశస్ 30. దంతం.

పదనిష్పాదన కళ

పదో అధ్యాయం

లాక్షణిక నామవాచకాల నిష్పాదనపద్ధతి

మనకు ఏయే తెఱగుల నామవాచకాలు అవసరమవుతాయి ?

నామవాచకమంటే పేరు. దీన్నే ఆంగ్లంలో Noun అంటారు. వ్యాకరణ సహాయంతో ప్రయత్నపూర్వకంగా నిష్పాదించబడేవాటికి **లాక్షణిక నామవాచకాలు** అని పేరు. వ్యక్తీకరణ (expression) అంతా జ్ఞానం మీద ఆధారపడి ఉంది. జ్ఞానం అనేది, 'ఒకదాన్నుంచి మఱొకటి వేఱు' అనే విచక్షణ మీద ఆధారపడి ఉంది. ఆ విచక్షణ భాష మీదా, ఆ భాష పేర్ల మీదా ఆధారపడి ఉన్నాయి. అందుచేత భాష యొక్క ప్రాథమిక స్వరూపం నామధాతువులే. ఈ పేర్లన్నీ ఒకటి కావు. వీటిల్లో రకాలున్నాయి. 'భాషాభాగాల్లో నామవాచకాలు ఒకటి' అని తెలిసినప్పటికీ ఏ కారణం చేతనో మన పూర్వీకులు వీటిని అర్థరీత్యా వింగడించి చూపడం పట్ల శ్రద్ధ వహించలేదు. వారు లాక్షణిక నామవాచకాల్ని తద్ధితాలలో భాగంగా పరిగణించారు. తద్ధితమంటే **తస్మై హితమ్ = అతని (వక్త) కి హితమైనది** అని నిర్వచించారు. ఎందుకంటే, 'పరిపాలించేవాడు' అని పొడవుగా చెప్పేపని లేకుండా, 'పరిపాలకుడు' అని క్లుప్తంగా వ్యక్తీకరిస్తూ, తద్ద్వారా మాట్లాడేవాడికి సౌలభ్యాన్ని చేకూఱుస్తుంది గనుక! వీటిని ఆంగ్లవ్యాకర్తలు మాత్రం అర్థాన్ని బట్టి 5 రకాలుగా వింగడించారు.

I. సాధారణ నామవాచకాలు (Common Nouns) :– ఇల్లు, గోడ, దారి, తోట, ఆకాశం, రాజు, గురువు, మతం ఇత్యాది.

II. విశిష్ట నామవాచకాలు (Proper Nouns) :– ఇంటిపేర్లు, వ్యక్తుల పేర్లు, **ఊళ్ళ పేర్లు**, వీథుల పేర్లు, రాష్ట్రాల పేర్లు, జిల్లాల పేర్లు, దేశాల పేర్లు, నదుల పేర్లు, సరస్సుల పేర్లు, సముద్రాల పేర్లు, పర్వతాల పేర్లు, పుస్తకాల పేర్లు, పత్రికల పేర్లు, భవనాల పేర్లు, సంస్థల/ సార్థవాహాల పేర్లు, ఉత్పాదనల ముద్రాంకనామాలు (Product brand names) ఇత్యాది.

III. పాదార్థిక నామవాచకాలు (Material Nouns):– గోధుమలు, పెసలు, మినుములు, మట్టి, ప్రత్తి, బంగారం,

నూనె, పెట్రోలు ఇత్యాది.

IV. సమష్టి నామవాచకాలు (Collective Nouns):– పదార్థాల/వస్తువుల/వ్యక్తుల/జీవుల సమూహాన్నీ, మొత్తాన్నీ తెలియజేసే మాటలు. ఉదాహరణకి – మానవాళి, మంద, ప్రజ, జనాభా, సమాజం, సమితి, మండలి ఇత్యాది.

V. అమూర్త నామవాచకాలు (Abstract Nouns):– మూర్తి (ఆకారం) లేనివీ, కంటికి కనిపించనివీ, ఒకవేళ కనిపించినా కేవలం అనుభూతి/ఊహ/పోల్పు (comparison) ద్వారానే అర్థం చేసుకోదగినవీ ఐన భావనల్ని సూచించేవి అమూర్త నామవాచకాలు. గుణగణాలూ, లక్షణాలూ, మనోభావాలూ, సంబంధాలూ, స్థితులూ, కళలూ, శాస్త్రాలూ మొదలైన వాటిని అమూర్త నామవాచకాలుగా పరిగణిస్తారు. ఉదాహరణకి :

౧. **గుణగణాలూ, లక్షణాలూ :** ఎఱుపు, నలుపు, తెలుపు, పొడవు, లావు, సన్నం, మంచితనం, చెడ్డతనం ఇత్యాది
౨. **మనోభావాలు :** ప్రేమ, ద్వేషం, స్నేహం, కోపం, ఇష్టం, విసుగు, చిఱాకు ఇత్యాది.
౩. **సంబంధాలు :** కొడుకు, కారణం, మేనఱికం ఇత్యాది.
౪. **స్థితులు :** యాజమాన్యం, ఆధిపత్యం, పౌరసత్వం, బానిసత్వం ఇత్యాది.
౫. **కళలూ, శాస్త్రాలూ :** సంగీతం, శిల్పం, నాట్యం, సాహిత్యం ఇత్యాది.
౬. **క్రియాధాతుజన్యాలు :** నడక, పడక, రాక, పోక ఇత్యాది.

వీటిని తెలుగులో ఏ విధంగా నిష్పాదించాలో తెలుసుకుందాం. సాధారణ నామవాచకాలనేవి (Common Nouns) వాడుకలో తరతరాలుగా సంక్రమించాల్సిందే తప్ప వాటిని ప్రయత్నపూర్వకంగా నిష్పాదించడం సాధ్యం కాదు. ఐతే కొన్ని పరిభావనలకు సమస్తరూపాల (compounded structures) తోనూ, ప్రత్యయాంత (suffixed) రూపాలతోనూ సమానార్థకాల్ని కల్పించవచ్చు.

I. సాధారణ నామవాచకాలు

వీటిని పదనిష్పాదనదృష్టితో స్థూలంగా 4 తెఱగులుగా విభజించవచ్చు. అవి – **౧. లక్షణాలూ, వృత్తులూ, అలవాట్లూ, పనులూ గలవారు ౨. నిమిత్త కట్టడాలూ, సౌకర్య భవనాలూ ౩. జీవులూ, జంతువులూ ౪. సాధనాలూ, యంత్రాలూ.**

1. వృత్తులూ, అలవాట్లూ, పనులూ, లక్షణాలూ, ఆస్తులూ గలవారు

(అ) తెలుగులో ఈ అర్థాన్ని సూచించడానికి నామవాచకానికి 'అరి/ ఆరి' చేఱుస్తారు. ఉదాహరణకి,

పూజచేసేవాడు = పూజ + ఆరి = పూజారి
తల తీసేవాడు = తల + ఆరి = తలారి

జాలం (వల) వేసేవాడు = జాలం + అరి = జాలరి
మేతమేసేవాడు = మేత + అరి = మేతరి
పోటుపొడిచేవాడు = పోటు + అరి = పోటరి
(పక్షాంతరంలో) పోటీపడేవాడు = పోటి + అరి = పోటరి
విధమెఱిగినవాడు = వితము + అరి = వితమరి
గడుసుదనం గలవాడు = గడుసు + అరి = గడసరి
సొగసు గల ఆమె = సొగసు + అరి = సొగసరి
వెరవు (ఉపాయం) తెలిసినవాడు = వెరవు + అరి = వెరవరి
నేర్పుగలవాడు = నేర్పు + అరి = నేర్పరి
కూర్పుకూర్చేవాడు = కూర్పు + అరి = కూర్పరి
చదువుకున్నవాడు = చదువు + అరి = చదువరి
మదుపు పెట్టేవాడు = మదుపు + అరి = మదుపరి
సున్నం కొట్టేవాడు = సున్న + అరి = సున్నరి → సూనరి

(ఆ) కొన్నిసార్లు 'కారి, కాడు, కత్తె' **అని చేఱుస్తారు.** ఉదాహరణకి,

చక్కగా మాట్లాడేవాడు = మాటకారి
అపకారం (దోసం/ దోషం) చేసేది = దోసకారి
వేటాడేవాడు = వేటకాడు
ఆటాడేవాడు = ఆటకాడు
పొడిచేవాడు = పోటుకాడు
వన్నెగలవాడు = వన్నెకాడు
వ్రాసేవాడు = వ్రాయసకాడు (scribe)
అందం గల ఆమె = అందకత్తె
మోసం చేసే ఆమె = మోసకత్తె
ఉంచుకున్న ఆమె = ఉంపుడుకత్తె
చెలికారం (స్నేహం) చేసే ఆమె = చెలికత్తె
పని చేసే ఆమె = పనికత్తె
మంత్రాలు వేసే ఆమె = మంత్రకత్తె

పుల్లింగ ఏకవచన శబ్దాల చివఱ వచ్చే 'డు' ప్రత్యయం కొంతమంది చెవులకి మర్యాదగా ధ్వనించదు. కనుక కావాల్సిన వారు దాని బహువచన రూపాన్నే ఏకవచనానిక్కూడా వాడుకోవచ్చు. దాన్నే 'డు' ప్రత్యయానికి ఆధునికరూపంగా

భావించవచ్చు. ఉదాహరణకి,

వేటకాడు → వేటకాఱు
ఆటకాడు → ఆటకాఱు

(ఇ) కానీ సమకాలీన పాత్రికేయులు పై ప్రత్యయాల బదులు 'దారు/దారుడు' అనే ప్రత్యయాల్ని తఱచుగా వాడుక చేస్తూ వస్తున్నారు. వీటి అసలు అర్థం 'ధరించేవాడు/ ఆమె' అని ! ఉదాహరణకి,

లబ్ధి పొందేవాడు = లబ్ధిదారు Beneficiary
వినియోగించుకునేవాడు = వినియోగదారు Consumer
ఎగుమతి చేసేవాడు = ఎగుమతిదారు Exporter
పెట్టుబడి పెట్టేవాడు = పెట్టుబడిదారు Capitalist
దోపిడి చేసేవాడు = దోపిడిదారు Exploiter
పంపిణీ చేసేవాడు = పంపిణీదారు Distributor
గుత్తకు తీసుకొని పనులు చేసేవాడు = గుత్తేదారు Contractor
పోటీపడేవాడు = పోటీదారు Contestent/ Competitor
వాహనాన్ని నడిపేవాడు/ యజమాని = వాహనదారు Vehiclist
మద్దతిచ్చేవాడు = మద్దతుదారు Supporter
కొనుగోలు చేసేవాడు = కొనుగోలుదారు Buyer

ఇవి వాస్తవంగా హిందూస్థానీ ప్రత్యయాలే తప్ప, తెలుగు కావు గనుక, దేశ్యాభిమానులు వీటిని పరిమితంగా వాడడం ఉత్తమం. 'అరి, కారి, కాడు, కత్తె' ప్రత్యయాల సహాయంతో ఇంకా ఎన్నో నామవాచకాల్ని రూపొందించడానికి అవకాశం ఉంది. ఉదాహరణకి,

పెద్ద గొంతు గలవాడు	=	*గొంతు + అరి = గొంతరి*	*Stentorian (adj)*
జాడపట్టేవాడు	=	*జాడ + అరి = జాడరి*	*Detective*
జట్టులో సభ్యుడు	=	*జట్టు + అరి = జట్టరి (జట్టుదారు)*	*Team member*
బొగ్గు వెలికి తీసేవాడు	=	*బొగ్గు + అరి = బొగ్గరి*	*Coal miner*
ఇసుక త్రవ్వేవాడు	=	*ఇసుక + అరి = ఇసుకరి*	*Sand quarry worker*
మొదలుపెట్టినవాడు	=	*మొదలు + అరి = మొదలరి*	*Pioneer*
వాడేవాడు	=	*వాడుక + అరి = వాడుకరి*	*User*
నడిచేవాడు	=	*నడక + అరి = నడకరి*	*Walker*

వెంటబడేవాడు	=	*వెంటబాటు + అరి = వెంటబాటరి / వెంటరి*	*Stalker*
కట్టేవాడు	=	*కట్టుబడిదారు*	*Builder*
వెల్లడించేవాడు	=	*వెల్లడిదారు*	*Whistle-blower*
మారుపలికేవాడు	=	*మారుపలుకు + అరి = మారుపలుకరి*	*Responder*
వచ్చేవాడు	=	*రాక + అరి = రాకరి*	*Comer*
ఆలస్యంగా వచ్చేవాడు	=	*ఆలస్య రాకరి*	*Late-comer*
కొత్తగా వచ్చినవాడు	=	*కొత్త రాకరి*	*New-comer*
తడబడేవాడు	=	*తడబాటు + అరి = తడబాటరి*	*Falterer*
వ్రాసేవాడు	=	*వ్రాత + అరి = వ్రాతరి*	*Writer*
తీసుకునేవాడు	=	*తీసుకోలు + అరి = తీసుకోలరి*	*Taker*

(ఈ) ఇది సాంప్రదాయిక పద్ధతి. ఇలా కాకుండా ఇంగ్లీషులో **—er/** –or ప్రత్యయాల మాదిరి దీన్ని నేరుగా క్రియా ధాతువుకే చేర్చడం భవిష్యత్తులో వాంఛనీయం. ఇలా చేసినందువల్ల పదనిష్పాదనలో క్లుప్తతా, స్పష్టతా సిద్ధిస్తాయి. ఉదాహరణకి,

పోయేవాడు = *పోవు+ అరి* → *పోవరి*
కట్టేవాడు = *కట్టు + అరి* → *కట్టరి*
దాటేవాడు = *దాటు+ అరి* → *దాటరి*
ఇచ్చేవాడు = *ఇచ్చు+ అరి* → *ఇవ్వరి / ఈవరి*
ఇసుక త్రవ్వేవాడు = *ఇసుకత్రవ్వు+ అరి* → *ఇసుక-త్రవ్వరి* //ఇత్యాది.

(ఉ) సంస్కృతంలో క్రియాధాతువుకు 'అక' ప్రత్యయాన్ని చేర్చడం ద్వారా ఆ పనిచేసేవారిని సూచిస్తారు. ఉదాహరణకి,

పాలించేవాడు = *పాలకుడు*
సేవించేవాడు = *సేవకుడు*
విసర్జించేది = *విసర్జకం*
చంపేది = *మారకం*
పోషించేది = *పోషకం*
ఇచ్చేది = *దాయకం*
నడిపేవాడు = *నాయకుడు*
వెలిగించేది = *దీపకం*
వెతికేది = *శోధకం*
పవిత్రం చేసేది = *పావకం*

కారేది (ద్రవించేది) = *ద్రావకం*
సంహరించేది = *సంహారకం*
ధరించేవాడు = *ధారకుడు*
భరించేవాడు = *భారకుడు*
రక్షించేవాడు = *రక్షకుడు.*

విశేష పరిజ్ఞాన నిమిత్తం 14 వ అధ్యాయం చూడవలసినది.

(ఊ) కొన్నిసార్లు 'అన/ అణ' ప్రత్యయాన్నే క్రియాధాతువుకు చేర్చడం ద్వారా ఆ పని చేసేవారిని సూచిస్తారు.
ఉదాహరణకి,
శత్రువుల్ని దమించేవాడు = *శత్రుదమనుడు*
పాపాల్ని హరించేది = *పాపహరణం*
తపింపజేసేవాడు = *తాపనుడు*
విదారించే (చీల్చే) వాడు = *విదారణుడు*
వంశాన్ని వర్ధిల్లజేసేవాడు = *వంశవర్ధనుడు*

(ఎ) తఱచూ వృత్తులకి సంబంధించిన వస్తు, పదార్థ సూచక పదాలకి 'కార, కర, కృత్' అనే సమాస అవయవాల్ని చేర్చడం ద్వారా ఆ వృత్తులు చేసేవారిని సూచిస్తారు.

చిత్రాలు గీచేవాడు = *చిత్రకారుడు*
మాలలు (దండలు కట్టేవాడు) = *మాలాకారుడు/ మాలాకరుడు*
కుంభాలు (కుండలు) చేసేవాడు = *కుంభకారుడు*
కర్మ (పని) చేసేవాడు = *కర్మకరుడు (కూలీ)*
ఉద్యమం చేసేవాడు/ అందులో పాల్గొనేవాడు = *ఉద్యమకారుడు*
వ్రాసుకునేవాడు (గుమాస్తా) = *లిపికారుడు*
దినాన్ని (పగటిని) కలిగించేవాడు = *దినకరుడు (సూర్యుడు)*
నిశ (రాత్రి) ని కలిగించేవాడు = *నిశాకరుడు (చంద్రుడు)*
సూపం (పప్పు) వండేవాడు = *సూపకారుడు*
రథం తయారుచేసేవాడు = *రథకారుడు*
(చర్మంతో) చెప్పులు కుట్టేవాడు = *చర్మకారుడు*
బంగారపుని చేసేవాడు = *స్వర్ణకారుడు*

ఇనప్పని చేసేవాడు = లోహకారుడు

2. నిమిత్త కట్టడాలూ, సౌకర్య భవనాలూ (Utility Establishments)

(అ) ఇప్పటికే విస్తృత వాడుకలో ఉన్న ఈ క్రింది పదాల్ని పరిశీలించండి :

Office = కార్యాలయం ; Secretariat = సచివాలయం ; Temple = దేవాలయం ; Museum = సంగ్రహాలయం ; University = విశ్వవిద్యాలయం ; Printing press = ముద్రణాలయం ; Library = గ్రంథాలయం ; Court = న్యాయాలయం, న్యాయస్థానం ; School = పాఠశాల ; College = కళాశాల ; Restaurant = ఫలహారశాల ; Eatery = భోజనశాల ; Cowpen = గోశాల ; Zoo = జంతుశాల ; Gymnasium = వ్యాయామశాల ; Hospital = వైద్యశాల ; Showroom = ప్రదర్శనశాల ; Retail outlet- = విక్రయశాల ; Barracks = స్కంధావారం ; Jail = కారాగారం ; Treasury = కోశాగారం ; Factory = కర్మాగారం ; Study = పఠన మందిరం ; Dining hall = భోజనమందిరం ; Bathroom = స్నానమందిరం ; Art Gallery = కళామందిరం ; Rest house = విశ్రాంతి మందిరం, విశ్రాంతిగృహం ; Guest house = అతిథిగృహం ; Marriage hall = కల్యాణ మంటపం ; Conference hall = సభామంటపం ; Police station = భటనిలయం ; Railway station = రైల్ నిలయం.

పై ఉదాహరణలు ఆధారంగా, ఒక పని కోసం ఉద్దేశించిన, అందటికీ ఉపయోగపడే కట్టడాలకు సందర్భాన్ని బట్టి తెలుగు లో *'ఆలయం, శాల, అగారం, మందిరం, స్థానం, మంటపం, ప్రాంగణం, గృహం, భండారం'* లాంటి సమాసావయవాల్ని ఎక్కువగా వాడతారని తెలుస్తుంది. వీటిని ఉపయోగించి ఇంకా చాలా పదాల్ని కల్పించవచ్చు. ఉదాహరణకి,

Cinema theatre = చిత్రమందిరం ; Waiting room = నిరీక్షామందిరం ; Internet Café = అంతర్జాల మందిరం, జాలమందిరం ; Mint = నాణ్యాగారం ; Lecture hall = ఉపన్యాస మంటపం, ప్రసంగ మందిరం ; Seminar Hall = గోష్ఠీమంటపం ; Farm house = తోట విడిది, తోటబంగళా ; Arcade = దుకాణావళి ; Gas station = ఇంధన నిలయం ; Workshop = కార్యశాల ; Studio = చిత్రశాల.

(ఆ) కొన్నిటికి సహజమైన, సరిసూటి సమానార్థకాలు ఇప్పటికే భాషలో సిద్ధంగా ఉంటే అలాంటివాటికి నూతన పదనిష్పాదన అవసరం లేదు. ఉదాహరణకి,

Shop = కొట్టు, దుకాణం ; Godown = గోదాము ; Store = భాండారం, ఉగ్రాణం ; Cellar = నేలమాళిగ ; Penthouse = విమానం ; Tower = గోపురం ; pen = కొట్టం ; Kitchen = వంటిల్లు ; Corridor = నడవా, వసారా ; Sitout = చావడి/సావడి ; Parliament = పేఱోలగం ఇత్యాది.

(ఇ) సార్వజనీన సౌకర్యాల్ని అందించే కట్టడాల్ని సూచించడానికి ఇటీవల Center, Hub అనే పదాల్ని ఎక్కువగా ప్రయోగిస్తున్నారు. ఉదాహరణకి,

Medical center = వైద్యకేంద్రం ; Center of excellence = ప్రావీణ్యకేంద్రం ; Photostat center = ప్రతిచ్ఛాయణ కేంద్రం ; Diagnostic center = రోగనిదాన కేంద్రం ; Shopping center = క్రయకేంద్రం ; Research center = పరిశోధనాకేంద్రం ; Training centre = శిక్షణాకేంద్రం ; Study center = అధ్యయన కేంద్రం ; Examination center/ Test center = పరీక్షాకేంద్రం ; Industrial hub = పారిశ్రామిక కేంద్రం ; Hub of activity =కార్యకలాపాల కేంద్రం ఇత్యాది.

3. జీవులూ, జంతువులూ

(అ) జీవులకూ, జంతువులకూ పేర్లుపెట్టడానికి ప్రాచీన తెలుగులు 'ఏలు' అనే పదాన్నో, ప్రత్యయాన్నో వాడినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు,

కుందు + ఏలు → కుందేలు = గెంతే జంతువు
తోడు + ఏలు → తోడేలు = ?
తంపు + ఏలు → తంపేలు → తాపేలు → తాబేలు = తంపు (తడి) లో ఉండే జంతువు
పోటు + ఏలు → పొట్టేలు = పొడిచే జంతువు

ఈ ఒరవడి ననుసరించి ఆధునిక కాలంలో కూడా అనేక నూతన జీవజాలానికి పేర్లు పెట్టడానికి అవకాశం ఉంది.

(ఆ) ఇలాగే సంస్కృతంలో కూడా 'భ' అనే ప్రత్యయంతో పశుపక్ష్యాదుల పేర్లు ముగియడం కనిపిస్తుంది. ఉదాహరణకి – *టిట్టిభం, సైరిభం, వృషభం, గార్దభం* ఇత్యాది.

4. సాధనాలూ, యంత్రాలూ

(అ) 'ఒక పనిని చేసే సాధనం, చోటు' అని వ్యక్తీకరించడానికి తెలుగులో సంబంధిత క్రియాధాతువుకు 'ఎన/ ఎల' లేదా, 'అలి' అని చేర్చడం కనిపిస్తుంది. ఉదాహరణకు –

దువ్వే సాధనం = దువ్వు + ఎన = దువ్వెన
వీచే సాధనం = వీచు + ఎన = వీవెన

ఎత్తే సాధనం	= *ఎత్తు + ఎన*	= *ఎత్తెన (చేపలు పట్టే సాధనం)*	
దోఁకే (గడ్డిచెక్కే) సాధనం	= *దోఁకు + ఎన*	= *దొంకెన (ఒక రకం ఈటె)*	
(మొక్కలు) పాఁతే సాధనం	= *పందు + అలి*	= *పందలి → పందిలి → పందిరి*	
పండే సాధనం	= *పండు + అలి*	= *పండలి / వండలి (నేల)*	
నాలుగు దార్లు) కూడే చోటు	= *కూడు + అలి*	= *కూడలి*	

పై పదాల్లాగానే ధ్వనిస్తూ మూల క్రియాధాతువులు తెలీని నిర్మాణాలు : *వంతెన, కందెన, ఉప్పెన, తఱిమెన, బొక్కెన గొల్లెన, గవిసెన, కుచ్చెల, వడిసెల, అంబలి, వేవిలి, వావిలి* ఇత్యాది.

(ఆ) 'ఒక పనిని చేసే సాధనం' అని వ్యక్తీకరించడానికి సంస్కృతంలో సంబంధిత క్రియాధాతువుకు 'త్ర/ ఇత్ర' ప్రత్యయాన్ని చేఱుస్తారు. ఇలా చేర్చినప్పుడు కొన్ని వ్యాకరణ కార్యాలు ప్రవర్తిల్లుతాయి. ఉదాహరణకు,

పావనం చేసే సాధనం	= *పూ + ఇత్రం*	= *పవిత్రం (దర్భ)*
కోసే సాధనం	= *లూ + ఇత్రం*	= *లవిత్రం (కొడవలి)*
చరించడానికి (ఉదాహరణ ఐన) సాధనం	= *చర్ + ఇత్రం*	= *చరిత్రం*
వసించే (తొడుక్కునే) వస్తువు	= *వస్ + త్రం*	= *వస్త్రం*
శాసించే సాధనం	= *శాస్ + త్రం*	= *శాస్త్రం*
వచించే (మాట్లాడే) అవయవం	= *వచ్ + త్రం*	= *వక్త్రం (నోరు)*
మానం (కొలత) వేసే ప్రమాణం	= *మా + త్రం*	= *మాత్ర*
గానం చేసే అవయవం	= *గై + త్రం*	= *గాత్రం (గొంతు)*
గానం చేయబడే దేవత	= *గై + ఇత్రీ*	= *గాయిత్రి*
(ప్రజలు) రాజిల్లే సాధనం	= *రాజ్ + త్రం*	= *రాష్ట్రం (రాజ్యం)*
భ్రజ్జించే (వేపే) సాధనం	= *భ్రజ్ + త్రం*	= *భ్రాష్ట్రం (బాణలి)*
శ్వేతమయ్యే (తెల్లబడే) జబ్బు	= *శ్విత్ + త్రం*	= *శ్విత్రం (బొల్లి)*

(ఇ) పక్షాంతరంలో – క్రియాధాతువుకు 'అక' ప్రత్యయాన్ని చేర్చి ఆ నిర్మాణాన్ని నపుంసక లింగంలో పెట్టడం ద్వారా ఆ పనికి ఉపకరించే సాధనాన్ని సూచించవచ్చు. ఇక్కడ, నపుంసకలింగమంటే పదాన్ని సున్నతో అంతం చేయడం. ఉదాహరణకి,

సేవించేది	= *సేవ్ + అకం*	= *సేవకం*	*Server*
వినిపించేది	= *వాద్ + అకం*	= *వాదకం*	*Player*
మార్చేది	= *పరివర్త్ + అకం*	= *పరివర్తకం*	*Convertor*

ముద్రించేది = ముద్రాప్ + అకం = ముద్రాపకం Printer
తీవ్రం చేసేది = తీవ్రాప్ + అకం = తీవ్రాపకం Amplifier

ఇలా కూడా చేయొచ్చు :
నమోదు చేసేది = నమోద్ + అకం = నమోదకం Recorder

II. విశిష్ట నామవాచకాలు (Proper Nouns) :–

ఏ భాషావ్యాకరణంలోనూ విశిష్ట నామవాచకాల నిర్మాణ నియమాలకి స్థానమిచ్చినట్లు కనిపించదు. కానీ ఇవి కూడా అర్థ వంతమైన పదాలే. ఇతర పదాలలాగానే వీటిని కూడా తఱచూ ఉపయోగించాల్సి వస్తుంది. ఒకే పదం, లేదా సమాసం తో వివిధ వస్తువులకీ, వ్యక్తులకీ, ప్రదేశాలకీ పేరుపెట్టాల్సివస్తుంది. కనుక ఇవి కూడా భాషలో భాగమే. వీటిని నిర్మించా లన్నా కొన్ని నియమాలుంటాయి. వ్యక్తుల పేర్లని వదిలేస్తే సార్వజనీనంగా ఉపయోగపడేలా నిష్పాదించదగ్గ విశిష్ట నామ వాచకాలు 1. ఊళ్ళ పేర్లు 2. పేటల పేర్లు 3. వీథుల పేర్లు.

మనం పుట్టకముందే దేశమంతా ఊళ్ళు ఏర్పడ్డాయి. వాటికి మన పూర్వీకులే పేర్లుపెట్టారు. ఉన్న ఊళ్ళే ఇంకా ఇంకా విస్తరిస్తున్నాయి. అందువల్ల కొత్త ప్రదేశాల్లో కొత్త ఊళ్ళు కట్టే అవసరమూ లేకపోయింది. కనుక మన కాలానికి ఊళ్ళ పేర్లని కొత్తగా నిష్పాదించే ఆవశ్యకతా లేకపోయింది. కానీ ఉన్న ఊళ్ళల్లో కొత్తకొత్త పేటలూ, బస్తీలూ వెలుస్తూనే ఉన్నాయి. అయితే వాటికి పెడుతున్న పేర్లు చాలా సందర్భాల్లో అర్థరహితంగా, వైవిధ్యహీనంగా ధ్వనిస్తున్నాయి. ప్రతీ పేటా ఏదో ఒక 'నగర్' లేదా 'పురం' మాత్రమే. వేఱే విధమైన శైలిలో పేరు కనపడదు. ఇవి ఉత్తర భారతీయుల్ని చూసి పెట్టుకున్న భావదారిద్ర్యపు వాతలని నా అభిప్రాయం. ఉత్తర భారతదేశంలోని ఊళ్ళ పేర్లు వేలాది సంవత్సరాల ఉచ్చారణ ప్రక్రియలో గుర్తుపట్టలేనంతగా అరిగిపోయి, తఱిగిపోయి, విఱిగిపోయి మారిపోయాయి. అందుచేత అవి ఈనాడు అర్థ రహితంగా ధ్వనిస్తాయి. అందుకని ఆధునిక ఔత్తరాహులు తమ ప్రదేశనామాల్ని కాస్త అర్థవంతంగా తీర్చిదిద్దుకునే ప్రయ త్నంలో భాగంగా ప్రముఖుల/ దేవతల పేర్లని 'నగర్, పూర్' అనే పదాలతో సమాసించి పేర్లు పెట్టుకోసాగారు. ఈ క్రమం లో ప్రదేశనామాలన్నీ దేశివాసనల్ని పోగొట్టుకొని మొత్తం సంస్కృతభూయిష్ఠమే అయిపోయాయి. ప్రదేశాలకి నామ కరణం చేయాలంటే వారి భాషల్లో ఇంతకన్నా వేఱే పదాలు లేకపోవడం వల్లనే ఇలా జఱుగుతోందనేది అవబోధ్యం. కానీ ఆ లేమిని మనం ఫ్యాషన్ అనుకోవడమే హాస్యాస్పదం.

గత కొద్దికాలంగా కొంతమంది స్థిరాస్తి వ్యాపారులు పట్టణాల/ నగరాల చుట్టూ ఉన్న శివారు గ్రామాల్లోని ఖాళీ స్థలాల్నీ, పొలాల్నీ ఎకరాల కొద్దీ కొనేసి, వాటికి ఇలాంటి హిందీ, ఇంగ్లీషు పేర్లు పెడుతూ, స్థానిక చరిత్రా, సంప్రదాయమూ భూ స్థాపితం కావడానికి తమ వంతు కృషి చేస్తున్నారు. ఊళ్ళ పేర్లని మార్చడానికీ, తాజ్ మహల్ ని కూలగొట్టడానికీ పెద్ద తేడా ఏమీ లేదని ఇలాంటివారు గ్రహించే రోజు రావాలి. నిజానికి మనకా ఖర్మ లేదు. మన భాషలో ఊళ్ళ పేర్ల కోసం

చాలా పదాలున్నాయి. మనవారు పెట్టిన ఊళ్ళపేర్లలో 'నగర్‌లు' చాలా అరుదు. అలా ఉన్నవి గత 150 ఏళ్ళల్లో మాత్రమే ఏర్పడి ఉండొచ్చు. అక్కడక్కడ కొన్ని 'పురాలు' లేకపోలేదు కానీ తక్కువే.

అచ్చతెలుగు ఊళ్ళపేర్లు అర్థం, పర్థం లేని కేవల శబ్దసౌందర్యాలు కావు. వాటిల్లో ప్రతి ఒక్కటీ ఏదో ఒక గట్టి కారణం చేత ఏర్పడినటువంటిది. అవి అర్థవంతమైనవీ, సప్రయోజనమైనవీ, సహజమైనవి. ఒకప్పటి తెలుగుదేశపు భౌగోళిక స్వరూపమూ, పరిసరాలూ, స్థానిక చరిత్రా, సంస్కృతీ వాటి ద్వారా ద్యోతకమౌతాయి. ఉదాహరణకి – 'కొఱ్ఱపాడు' అంటే ఒకప్పుడు అక్కడ కొఱ్ఱలు పండించేవారని, వఱి తినేవారు కాదనీ తెలుస్తుంది. 'భీమడోలు' అంటే భీముడి ప్రోలు. చాళుక్య రాజవంశానికి చెందిన భీముడనే రాజు కట్టించిన ఊరు అని వెల్లడవుతుంది. కంకణాల పల్లి అంటే ఒకప్పుడు అక్కడ కంకణాల తయారీ పరిశ్రమ ఏదో ఉండేదని అర్థమవుతుంది. ఈ కాలంలో ఇంత వాస్తవికంగా, అర్థవంతంగా పేర్లుపెట్టడం అరుదు. విశాఖలో ఉక్కునగరం, అదిలాబాదులో కాగజ్ నగర్ లాంటివేవో మూణ్ణాలుగు పేర్లు తప్ప ఎక్కువ భాగం అవంతీనగర్, అయోధ్యానగర్ వంటి అసందర్భప్పేర్లే. ఈ అసందర్భ నామాలతో సమస్య ఏంటంటే, ఇవి సదరు ప్రాంతపు వివరాలేవీ భావితరాల కోసం నమోదుచేయవు. పైపెచ్చు ఆ ప్రాంతం ఏదైతే కాదో 'అదే అది' అని భావితరాలు పొఱపడే సంభావ్యత కూడా ఉంటుంది.

తెలుగుదేశంలోని ఊళ్ళపేర్లూ, పేటల పేర్లూ అచ్చతెలుగులోనే ఉండడం వాంఛనీయం. ఈ పేర్లు ఇతరభాషల వారెవఱూ పెట్టుకోరు. మనం కూడా పెట్టుకోకపోతే ఎలా ? వారు మన పేర్లు పెట్టుకోరు కనుక మనం కూడా వారి పేర్లు పెట్టుకో వలసిన అవసరం లేదు. కనుక పేర్ల విషయంలో మనవారు అంటించుకొన్న ఈ సంస్కృత–హిందీ–ఆంగ్ల వ్యామోహాల మిసిమిజిడ్డుని ఇప్పనైనా వదిలించుకోవాలి. తెలుగుపేర్లలో గుబాళించే స్వచ్ఛతనీ, జాతీయతనీ, మన తాతముత్తాతల నిరాడంబరతనీ, మాతృభూమి మట్టివాసననీ ఆస్వాదించడం నేర్చుకోవాలి. ఒడీషా దాటి తెలుగ్గడ్డలోకి రైలుబండి ప్రవే శించినప్పుడు ఒడియా పేర్ల బదులు వరుసగా ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి.... ' అని తెలుగుపేర్లు కనిపించడం మొదలైతే ఆ ఆనందమే వేఱుగా ఉంటుంది. ఏమో, ఎవఱికి తెలుసు ? మనకిప్పుడు ఉన్న ఈ ఒక్క తెలుగు దేశమే కాక, భవిష్యత్తులో ఎన్నో తెలుగుదేశాలు ఏర్పడవచ్చు. అప్పుడు ఆ దేశాలలో కొత్త ప్రదేశాలకి పేర్లు పెట్టేటప్పుడు పూర్వపు తెలుగువారు ఏ పదాల్ని ఉపయోగించారో మనం కూడా అదే పద్ధతిలో పేర్లుపెట్టాలి. అందుకోసం ఉపకరించే 30 ముఖ్యమైన పదాల గుఱించి మనమిక్కడ చర్చిస్తున్నాం. ఈ క్రింది ఉదాహరణల్ని పరిశీలించండి :

అంకి/అంగి : *జలదంకి, పోరంకి, వెల్లంకి, రేలంగి, చొల్లంగి, కోరంగి, మున్నంగి, వడ్డంగి, బాడంగి, బాసంగి, బోణంగి, మేరంగి, పంద్రంగి.*

ఆం : *ఉర్లాం, తెర్లాం, రాజాం, బుద్ధాం, మడపాం, కురుపాం.*

ఊరు : *అబ్బూరు, ఏలూరు, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, కొండూరు, కొమ్మూరు, కోడూరు, కొల్లూరు, పాలమూరు, కైకలూరు, వేమూరు, నండూరు.*

ఏలు : *గుడ్లవల్లేలు, దత్తిరాజేలు, పెదపుల్లేలు, పాలకోడేలు, పాడేలు, పీలేలు, చెయ్యేలు, లావేలు, బాలేలు, కూనేలు, పెల్లేలు, వావిలేలు, మాలుటేలు.*

ఏడు : *కారంచేడు (కాలుమంచి + ఏడు), ఏర్పేడు, జుత్తేడు, పెంచేడు, వెల్చేడు, చౌటపుత్తేడు.*

కల్లు : *ఓరుగల్లు, గుంతకల్లు, కొడవటికల్లు, చెవిటికల్లు, మాగల్లు, పొన్నెకల్లు, నెమలికల్లు, రాయకల్లు, చాగల్లు, మోగల్లు.*

కుంట/గుంట/కుంట్ల/గుంట్ల : *జమ్మికుంట, కర్లకుంట, నీళ్ళకుంట, బిట్రగుంట, రేణిగుంట, దూబగుంట, ఎఱ్ఱగుంట్ల, గోనుగుంట్ల.*

కుప్పం : *పాదిరికుప్పం, బీరకుప్పం, ఏకాంబరకుప్పం, రామకుప్పం.*

కొండ/గొండ : *గోల్కొండ, నల్లగొండ, హనుమకొండ, సింగరాయకొండ, తాడికొండ, కోరుకొండ, మణికొండ, బెల్లం కొండ, ఋషికొండ, ఉరవకొండ, కొలనుకొండ, పత్తికొండ, అలగొండ, కలువకొండ, ధేనువకొండ, పెనుగొండ.*

కొలను : *ఎలకొలను, గుండుగొలను.*

కోట : *మానుకోట, దేవరకోట, సారవకోట, తుమ్మకోట, కాంద్రకోట, దంతవరపు కోట, లక్కవరపు కోట, కామవరపు కోట, రుద్రకోట.*

గిరి : *వెంకటగిరి, పుష్పగిరి, యాదగిరి, ఉదయగిరి.*

గుట్ట : *పంచగుట్ట, చాంద్రాయణగుట్ట, కీసరగుట్ట.*

గూడెం : *హనుమంతునిగూడెం, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, కొత్తగూడెం, కొమ్ముగూడెం, కొయ్యలగూడెం, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం, ఎర్నగూడెం, పంగిడిగూడెం.*

చెఱువు/చెర్ల/జెర్ల : *పొట్లచెఱువు (పటాన్ చెఱువు), దామరచెఱువు, ములకల చెఱువు, మునగచెర్ల, చేజెర్ల, వెలి చెర్ల, వేడిచెర్ల, రెడ్డిచెర్ల.*

పట్నం : *ఇబ్రహీంపట్నం, నిజాంపట్నం, ఆమోదగిరిపట్నం, కృష్ణపట్నం, రామాయపట్నం, విశాఖపట్నం, భీముని పట్నం, మచిలీపట్నం, పురుషోత్తమపట్నం, పెదపట్నం, రాయభూపాలపట్నం, తమ్మినపట్నం, గంగపట్నం, కొత్త పట్నం, ప్రభాగిరిపట్నం.*

పఱ్ఱు/వఱ్ఱు : *డోకిపఱ్ఱు, గణికపఱ్ఱు, పెదపులివఱ్ఱు, చింతపఱ్ఱు.*

పల్లి/పల్లె/బల్లె/మల్లి/వల్లి/విల్లి : *చల్లపల్లి, కొండపల్లి, ముదినేపల్లి, పెద్దపల్లి, లంకపల్లి, రేపల్లె, కళ్ళేపల్లి, తోటపల్లి, కోటిపల్లి, వాడపల్లి, గూడవల్లి, మందవల్లి, కుముదవల్లి, ఖండవల్లి, ఎడవల్లి, ఉత్తరవల్లి, పెనుబల్లి, అరసవిల్లి, భట్ను విల్లి, ఐనవిల్లి, మెతుకుమల్లి.*

పాక/పాకం/వాక : *పందలపాక, తాటిపాక, ఈశ్వరవాక, అక్కఱపాక.*

పాడు : *అడవిరావులపాడు, అన్నవరప్పాడు, అగతవరప్పాడు, తోటరావులపాడు, దొండపాడు, దోసపాడు, మూలపాడు, తక్కెళ్ళపాడు, ముక్కెళ్ళపాడు, తునికిపాడు, ముండ్లపాడు, నల్లపాడు, గోగులంపాడు, కంకిపాడు.*

పాలెం : *చలివేంద్రపాలెం, మర్లపాలెం, కర్లపాలెం, బుఱ్ఱిపాలెం, బుచ్చిరెడ్డిపాలెం, అంకిరెడ్డిపాలెం, ఇసుకపాలెం, తిమ్మాయపాలెం, కమ్మవారిపాలెం, ఎగువరాజుపాలెం, ఉడతావారిపాలెం.*

పూడి/మూడి : *గొల్లపూడి, మామిడిపూడి, గుడిపూడి, చింతలపూడి, కూచిపూడి, మఱ్ఱిపూడి, బేతపూడి, ద్వార పూడి, తుమ్మపూడి , జాగర్లమూడి, వడ్లమూడి, కత్తిపూడి, గొరగనమూడి.*

పేట : *నరసరావుపేట, చిలకలూరిపేట, వేగాయమ్మపేట, మండపేట, రంగంపేట, జగ్గయ్యపేట, జగ్గంపేట, ఆదివార ప్పేట, ఫరీద్ పేట, సీతంపేట, లక్ష్మీనరసుపేట, కామేశ్వరపేట, అక్కులపేట,*

ప్రోలు/ఓలు/వోలు : *రాయప్రోలు, భట్టిప్రోలు, పెనుగంచిప్రోలు, తేలప్రోలు, గొల్లప్రోలు, చిఱువోలు, మల్లవోలు, రాజోలు, ఒంగోలు, చనుమోలు, కనుమోలు, చందవోలు, బేతవోలు, కైకవోలు, ముచివోలు, బోగోలు, పొన్నవోలు, కొప్పోలు..*

మిల్లి : *చెఱుకుమిల్లి, జఱుగుమిల్లి, బంటుమిల్లి, మారేడుమిల్లి, ఎఱ్ఱమిల్లి, జీలుగుమిల్లి.*

వరం/ఆరం : *భీమవరం, ఐతవరం, అన్నవరం, మైలవరం, రాయవరం, చోడవరం, కృష్ణవరం, గంగవరం, మాచవరం, గోకవరం, ముమ్మిడివరం, లింగవరం, పోచారం, మేడారం (మేడివరం).*

వాడ/ఆడ : *గుడివాడ, బెజవాడ, చిఱివాడ, వేములవాడ, పూడివాడ, చదలవాడ, సయ్యద్ వాడ, సిరివాడ, గోవాడ, బీతివాడ, సతివాడ, తొండవాడ, కొణితివాడ, పెన్నాడ, జొన్నాడ, గొల్లల మామిడాడ, దుర్గాడ, కూరాడ, ఉప్పాడ, నిమ్మాడ, అరసాడ, చింతాడ, డెంకాడ, గంగాడ, గంట్యాడ, కొమరాడ, కోనాడ, మెంటాడ, వేపాడ, చిత్రాడ.*

వీడు : కొండవీడు, కన్నెవీడు, గోసవీడు, అర్ధవీడు, సత్యవేడు.

లంక : బొబ్బరలంక, ఏనుగువాని లంక, అన్నవరపు లంక, కొత్తలంక, సానపల్లిలంక, ఊబలంక, గాడిలంక, చెముడు లంక.

వలస : కొత్తవలస, చిట్టివలస, ఆముదాల వలస, రావివలస, మద్దువలస, తాడివలస, జియ్యమ్మవలస, నాత వలస, దొంకినవలస, రెల్లివలస, నారాయణప్పవలస, కూనాయ వలస.

సాగరం/సముద్రం : లింగసముద్రం, తిమ్మసముద్రం, అప్పాసముద్రం, కంపసముద్రం, గోపసముద్రం, అనుమ సముద్రం, రంగసముద్రం, నాగసముద్రం.

పైన పేర్కొన్నవే కాక, గడ్డ, వంచ, లోవ, కోన, తోట, తిన్నె(దిన్నె), తిప్ప, తుఱ్ఱు, మఱ్ఱు, మాను, మంగళం, వేడు/ మేడు, మంచి, కండ్రిక(గ), మిట్ట, బండ, కుదురు, కుఱ్ఱు, కొటిక, మడుగు ' అనే సమాసావయవాలతో కూడా తెలుగు ఊళ్ళపేర్లు ఏర్పడ తాయని గమనించవచ్చు. కానీ ఇవి ఎడాపెడా ఒకే అర్థంలో వాడదగ్గవి కావు. వీటిల్లో ప్రతిదానికీ ఒక ప్రత్యేకమైన అర్థం ఉంది. ఉదాహరణకి – 'లోవ' అంటే లోయ అని అర్థం. 'కోన' అంటే చిట్టడవి. 'కండ్రిగ' అంటే సాగుచేయదగ్గ భూమి. 'వలస' అంటే బయటినుంచి వచ్చినవారు కొత్తగా కట్టుకొని స్థిరపడ్డ ఊరు (colony). 'లంక' అంటే చుట్టూ గానీ, మూడువైపులా గానీ నీళ్ళున్న ప్రదేశం. 'కల్లు' అంటే పెద్ద ఱాయి, కొండ, గుట్ట. ఈ విధంగా వీటికున్న అర్థాల్ని సమీచీనంగా తెలుసుకొని ఆ అర్థంలోనే సమాసించాలి.

IV. సమష్టి నామవాచకాలు (Collective Nouns)

1. సమాసరూపంలో నిష్పాదన

(అ) సమష్టినామవాచకాల్ని లాక్షణికంగా రూపొందించే పద్ధతేదీ తెలుగులో లేదు. కానీ 'గుంపు / సంఘాతం' అని అర్థమిచ్చే *'గమి, గుమి, వరుస, కూటం, కూటువ, తుటుము, దండు, పిండు, కుప్ప, ప్రోవు, దొంతర, కట్ట'* వంటి సమాస అవయవాల్ని నామవాచకానికి చేర్చడం ద్వారా ఈ విధమైన రూపాల్ని కల్పించవచ్చు. ఇది నేను సూచిస్తున్న కొత్తపద్ధతి. పూర్వులైతే వీటిని బహువచన ఔపవిభక్తికానికే చేర్చేవారు. **ఉదాహరణకి –** *ఒప్పుల కుప్ప, గుణముల ప్రోవు* ఇత్యాది. మన నవీన పద్ధతిలో– *పల్లెగమి, మ్రాకువరుస, రైతుకూటం, పిట్టకూటువ, దొంగతుటుము, చీమదండు* ఇత్యాదుల్ని కల్పించవచ్చు.

(ఆ) సంస్కృతంలో సముదాయార్థంలో చాలా పదాలున్నాయి. వాటిని సమాసావయవాలుగా నామవాచకానికి చేర్చడం ద్వారా ఈ విధమైన రూపాల్ని నిష్పాదించవచ్చు. ఉదాహరణకి,

రెండు (ఇద్దఱు) కలిసిన ఉన్న జంట = యుగం, యుగళం, యుగ్మం, ద్వయం, ద్వంద్వం

జంటగా కలిసి ఉన్న స్త్రీపురుష మానవులు గానీ, దేవతలు గానీ, పశుపక్ష్యాదులు గానీ = మిథునం

మూడు (ముగ్గుఱు) కలిసి ఉన్నప్పుడు = త్రయం, త్రితయం

నాలుగు (నలుగుఱు) కలిసి ఉన్నప్పుడు = చతుష్టయం, చతుష్కం

ఐదు (ఐదుగుఱు) = పంచకం

ఆఱు (ఆఱుగుఱు) = షట్కం

ఏడు (ఏడుగుఱు) = సప్తకం

ఎనిమిది (ఎనమండుగుఱు) = అష్టకం

తొమ్మిది (తొమ్మండుగుఱు) = నవకం

పది (పదుగుఱు) = దశకం

వంద (వందమంది) = శతకం

వెయ్యి (వెయ్యిమంది) = సహస్రకం

(ఇ) ఇతర సముదాయార్థకాలు : *జనం, సంఘం, సమాజం, సమూహం, సందోహం, విసరం, వ్రజం, స్తోమం, ఓఘం, నికరం, వ్రాతం, సంఘాతం, చయం, సంచయం, సముదయం, సమవాయం, నికాయం, నివహం, గణం, సంహతి, బృందం, నికురుంబం, కదంబం, వితానం, ప్రకరం, మండలం, చక్రం, చక్రవాళం, పటలం, జాలం, వర్గం. శ్రేణి*

కుప్ప – రాశి, ఉత్కరం, కూటం, పుంజం.

వరుస – ఆళి, ఆవళి, రేఖ, పంక్తి

2. లాక్షణిక నిష్పాదన

(అ) పదాది అచ్చుకు వృద్ధిని ఆదేశించి, పదాంతంలో 'య' ప్రత్యయం చేర్చడం ద్వారా సంస్కృతంలో సమూహార్థకాల్ని ఏర్పఱుస్తారు. ఉదాహరణకి,

బ్రాహ్మణుడు → బ్రాహ్మణ్యం = బ్రాహ్మణుల గుంపు

సమానులు → సామాన్యం = సమానుల గుంపు

జ్యోతిస్ → జ్యౌతిష్యం = వెలుగుల పుంజం

(ఆ) కొన్నిసార్లు పదాదిన వృద్ధినీ, పదాంతంలో 'క' ప్రత్యయాన్నీ చేర్చడం ద్వారా సమూహార్థకాల్ని ఏర్పఱుస్తారు. ఉదాహరణకి,

రాజు → రాజకం = రాజుల సమూహం

దేవత → దైవతకం = దేవతల సమూహం

నటుడు → నాటకం = నటుల సమూహం

(ఇ) కొన్నిసార్లు నామవాచకానికి 'త' లేదా 'త్వం' చేర్చడం ద్వారా సమూహార్థకాల్ని ఏర్పఱుస్తారు. ఉదాహరణకి,

జనం + త = జనత (జనాల సమూహం)

ప్రభువు + త = ప్రభుత (ప్రభువుల సమూహం)

ప్రభువు + త్వం = ప్రభుత్వం (ప్రభువుల సమూహం)

V. అమూర్త నామవాచకాలు (Abstract Nouns)

గుణగణాలూ, లక్షణాలూ, మనోభావాలూ, సంబంధాలూ : **(అ) తెలుగులో వీటిని సూచించడానికి** 'తనం, ఱికం/ అఱికం' **అనే ప్రత్యయాల్ని చేఱుస్తారు. వీటిని నామవాచకాలకైనా చేర్చవచ్చు. విశేషణాలకైనా చేర్చవచ్చు.** ఉదా :–

పిఱికి + తనం = పిఱికితనం

మొండి + తనం = మొండితనం

సోమరి + తనం = సోమరితనం

హుందా + తనం = హుందాతనం

చిన్న + తనం = చిన్నతనం

పెద్ద + ఱికం = పెద్దఱికం

పేద + ఱికం = పేదఱికం

మేన + ఱికం = మేనఱికం

కోడలి + ఱికం = కోడంట్రికం

రాజు + అఱికం = రాజఱికం

నేస్తు + అఱికం = నేస్తఱికం

దాపు + అఱికం = దాపఱికం

(ఆ) కొన్నిసార్లు 'తనం' **అనే ప్రత్యయాన్ని సమూహార్థంలో కూడా ఉపయోగిస్తారు.** ఉదాహరణకి, *దొరతనం = దొరల సమూహం (ప్రభుత్వం).*

(ఇ) సంస్కృతంలో వీటిని సూచించడానికి నామవాచకంలో చేసే మార్పులు సముదాయార్థకాల్లాగానే ఉంటాయి. అంటే, పదాది అచ్చుకు వృద్ధిని ఆదేశించి, పదాంతంలో 'య' ప్రత్యయం చేర్చడం ద్వారా సంస్కృతంలో గుణార్థకాల్నీ, భావార్థకాల్నీ ఏర్పఱుస్తారు. ఉదాహరణకి,

అధిక → ఆధిక్యం = అధికంగా ఉన్నదాని స్థితి
అధిపతి → ఆధిపత్యం = అధిపతి యొక్క స్థితి / భావం
పండిత → పాండిత్యం = పండితుని స్థితి / భావం
లలిత → లాలిత్యం = లలితుని స్థితి
కవి → కావ్యం = కవి యొక్క భావం
స + హిత → సాహిత్యం = హితం (శ్రేయస్సు) గలదాని స్థితి
చపల → చాపల్యం = చంచలుడి స్థితి
విదుష్ → వైదుష్యం = విద్వాంసుడి స్థితి
వికల → వైకల్యం = వికలం (లుప్తం) అయినదాని స్థితి
వివిధ → వైవిధ్యం = వివిధాలైన స్థితి
ఈశ్వర → ఐశ్వర్యం = యజమానుడి స్థితి
దీన → దైన్యం = దీనుడి స్థితి
క్రూర → క్రౌర్యం = క్రూరుడి భావం
దూత → దౌత్యం = దూత యొక్క స్థితి
ఏక → ఐక్యం = ఒక్కటిగా ఉన్నవారి స్థితి / భావం

(ఈ) భావార్థంలో ఉకారాంత నామవాచకాలకు కొన్నిసార్లు పదాదిన వృద్ధి తరువాత పదాంతంలో 'య' ప్రత్యయానికి బదులు 'అ' ప్రత్యయాన్ని చేఱుస్తారు. ఉదాహరణకి,

లఘు → లాఘవం = తేలికగా ఉన్నదాని స్థితి
శత్రు → శాత్రవం = శత్రువు యొక్క భావం
విభు → వైభవం = సంపన్నుడి స్థితి
గురు → గౌరవం = గురువు యొక్క స్థితి / భావం
సుష్ఠు → సౌష్ఠవం = సుష్ఠువుగా ఉన్న స్థితి
ఋతు → ఆర్తవం = ఋతువు యొక్క స్థితి
మృదు → మార్దవం = మృదువుగా ఉన్నదాని స్థితి
శిశు → శైశవం = శిశువుగా ఉన్నప్పటి స్థితి (పసితనం)

(ఉ) కొన్నిసార్లు భావార్థంలో నామవాచకాలకు కొన్నిసార్లు పదాదిన వృద్ధి మాత్రమే చేఋస్తారు. ఉదాహరణకి,

సురభి → *సౌరభం*
పురుష → *పౌరుషం*
వస్తు → *వాస్తవం*
కుశలం → *కౌశలం*

(ఊ) పదనిర్మాణంలో మార్పులేమీ చేయకుండా సులభంగా భావార్థకాల్ని కల్పించాలంటే, పదానికి 'త్వం' లేదా 'త' అనే ప్రత్యయాల్ని చేర్చాలి. ఇవి తెలుగులోని 'తనం, ఋకం' లాంటివాటికి సమానం. ఈ ప్రత్యయాల్ని నామవాచకాలకైనా చేర్చ వచ్చు, విశేషణాలకైనా చేర్చవచ్చు. ఉదాహరణకి,

***మహాన్** – మహత్ + త్వం* → *మహత్త్వం = గొప్పతనం*
***వేధస్** – వేధస్ + త్వం* → *వేధస్త్వం = బ్రహ్మపదవి*
***దేవుడు** – దేవ + త్వం* → *దేవత్వం*
***రాజు** – రాజ + త్వం* → *రాజత్వం*
***భర్త** – భర్తృ + త్వం* → *భర్తృత్వం*
***భార్య** – భార్యా + త్వం* → *భార్యాత్వం*
***ముని** – ముని + త్వం* → *మునిత్వం*
***శిశువు** – శిశు + త్వం* → *శిశుత్వం*

తెలుగు క్రియాధాతువుల భావార్థకాలు

క్రియాధాతువుల నుంచి నిష్పన్నమయ్యే నామవాచకాలు. ఉదాహరణకి,

పోవు → *పోక*
వచ్చు → *రాక*
ఉండు → *ఉనికి*
చచ్చు → *చావు*
ఇచ్చు → *ఈవి*
నడచు → *నడక*
పడచు → *పడక*
ఈదు → *ఈత*
కఋచు → *కాటు*

పొదుచు → *పోటు*
చెరుగు → *చేట*
కొను → *కోలు* ఇత్యాదులు.

పైన చూపినవి అపక్రమ రూపాలు (irreular forms). అంటే వాటిని ఉన్నవి ఉన్నట్లుగా స్వీకరించి ప్రయోగించడమే తప్ప ఒక సూత్రం ప్రకారం అర్థం చేసుకోవడం కుదరదు. అలా కాకుండా, ఎక్కువశాతం క్రియాధాతువులకి కొన్ని నియమాలకి లోబడి వ్యాకరణబద్ధంగా సక్రమమైన భావార్థకాల్ని సాధించను అవకాశముంది.

(అ) యుకార, చుకారాలతో అంతమయ్యే క్రియాధాతువుల తుది వర్ణానికి '-పు' లేదా 'ఉపు' ని ఆదేశించడం ద్వారా భావార్థకాల్ని నిష్పాదిస్తారు. ఉదాహరణకి–

మెఱయు → *మెఱుపు*
బలియు → *బలుపు*
ఒడియు → *ఒడుపు*
జడియు → *జడుపు*
మఱచు → *మఱుపు*
విఱచు → *విఱుపు*
పఱచు → *పఱుపు*
తలచు → *తలపు*
మాయు → *మాపు*

(ఆ) ఈ కోవకు చెందిన ధాతువులకే కొన్నిసార్లు 'త' వర్ణకం ఆదేశమవుతుంది. ఉదాహరణకి,

మేయు → *మేత*
కాయు → *కాత*
పూయు → *పూత*
నేయు → *నేత*
వేయు → *వేత*
కోయు → *కోత*
వ్రాయు → *వ్రాత*
తీయు → *తీత*
చేయు → *చేత*

మ్రోయు → *మోత*

మూయు→ *మూత*

జోయు → *జోత*

(ఇ) 'ఇంచుక్' **తో అంతమయ్యే క్రియాధాతువుల తుది** 'చు' కారానికి **భావార్థంలో** 'పు' **వర్ణకం ఆదేశమవుతుంది.** ఉదాహరణకి,

ఊరేగించు → *ఊరేగింపు*

జోడించు → *జోడింపు*

ఏవగించు → *ఏవగింపు*

ఊఅడించు → *ఊఅడింపు*

సడలించు → *సడలింపు*

మళ్ళించు → *మళ్ళింపు*

(ఈ) 'ఇంచుక్' **తో అంతమయ్యే** కొన్ని **క్రియాధాతువుల** 'చు' కారానికి **భావార్థంలో** 'త' **వర్ణకం ఆదేశమవుతుంది.** ఉదాహరణకి,

అప్పగించు → *అప్పగింత*

కలవరించు → *కలవరింత*

పలవరించు → *పలవరింత*

కేరించు → *కేరింత*

(ఉ) కొన్ని క్రియాధాతువులకి భావార్థంలో 'డు' **వర్ణకం చేఱుతుంది.** ఈ రూపాల్ని నామవాచకాలుగానే కాక కొన్నిసార్లు విశేషణాలుగా కూడా ప్రయోగిస్తారు. ఉదాహరణకి,

రుద్దు → *రుద్దుడు*

దించు → *దింపుడు*

బాదు → *బాదుడు*

గిచ్చు → *గిచ్చుడు*

వాగు → *వాగుడు*

తాగు → *తాగుడు*

నంజు → *నంజుడు*

(ఊ) కొన్ని భావార్థకాల 'డు' వర్ణకం కాలక్రమంలో 'డి/ ఇడి' వర్ణకంగా మారినట్లు గోచరిస్తుంది. ఉదాహరణకి–

తిను → తినుడు → తినిడి → తిండి
దోచు → దోపుడు → దోపిడి
మార్చు → మార్పుడు → మార్పిడి
కట్టు → కట్టుడు → కట్టడి
రాచుడు → రాయిడి ఇత్యాది.

(ఋ) 'గు/ చు' వర్ణకాలతో అంతమయ్యే కొన్ని క్రియాధాతువుల 'గు/ చు' కారాలకి భావార్థంలో 'కువ' ప్రత్యయం ఆదేశమవుతుంది. ఉదాహరణకి–

ఎఱగు → ఎఱకువ = చైతన్యం
మఱచు → మఱకువ = అజ్ఞానం
అణగు → అణకువ = వినయం
తెఱచు → తెఱకువ = స్పష్టత
పొలచు → పొలకువ = జాడ (కనిపించడం)
మెలగు → మెలకువ = మేల్కొని ఉండడం

(ౠ) 'గు' వర్ణకంతో అంతమయ్యే కొన్ని క్రియాధాతువుల 'గు' కారానికి భావార్థంలో 'క' ప్రత్యయం ఆదేశమవుతుంది. ఉదాహరణకి–

మునుగు → మునక
కడఁగు (ప్రయత్నించు) → కడఁక
అలుగు → అలక
మసగు (దట్టమగు, వ్యాపించు) → మసక
తొలగు → తొలక → తొక్క

(ఎ) కొన్ని క్రియాధాతువులకు భావార్థంలో 'ఇక' ప్రత్యయం చేఱుతుంది. ఉదాహరణకి,

అందు → అందిక
పొందు → పొందిక
అమఱు → అమఱిక

బడలు → *బడలిక*
చీలు → *చీలిక*
తేలు → *తేలిక*
పోలు → *పోలిక*
పూను → *పూనిక*
చాలు → *చాలిక*
అల్లు → *అల్లిక*
తీఱు → *తీఱిక*
ఆడు (తిట్టు) → *ఆడిక*
వాడు → *వాడిక (వాడుక)*

(ఏ) కొన్ని క్రియాధాతువులకు భావార్థంలో 'అకం' ప్రత్యయం చేఱుతుంది. ఉదాహరణకి,

అద్దు → *అద్దకం*
అమ్ము → *అమ్మకం*
అల్లు → *అల్లకం*
పాఱు → *పాఱకం (పాఱుదల)*
పెట్టు → *పెట్టకం (పెటకం)*
మారు → *మారకం*

(ఐ) 'డు' కారంతో అంతమయ్యే కొన్ని క్రియాధాతువుల అంత్య 'డు' కారానికి భావార్థంలో 'ట' వర్ణం గానీ, 'టు' వర్ణంగానీ ఆదేశమవుతుంది. ఉదాహరణకి,

ఆడు → *ఆట*
పాడు → *పాట*
పండు → *పంట*
వండు → *వంట*
ఎండు → *ఎంట (ఎండ)*
పడు → *పాటు*
చెడు → *చేటు*
ఓడు → *ఓటు (ఓటమి)*
వీడు → *వీటు (భాగం)*

కూడు → కూట (కూటం, కూటమి)

గమనిక :- '**ఆట**' అనే భావార్థక రూపాన్ని వేటే పదాలతో సమాసించినప్పుడు కొన్నిసార్లు 'ఆటం' గా మారుతుంది. ఉదాహరణకి, పోరాటం ఇత్యాది.

(ఒ) కొన్ని క్రియాధాతువులకి భావార్థంలో 'కడ' ప్రత్యయం గానీ, 'దల' ప్రత్యయం గానీ, 'బడి' ప్రత్యయం గానీ, 'పాటు' ప్రత్యయం గానీ చేఱుతుంది. ఉదాహరణకి,

తీఱు + కడ → తీఱుగడ
చేఱు + కడ → చేఱుగడ
వచ్చు + కడ → రాకడ
పోవు + కడ → పోకడ
పాఱు + దల → పాఱుదల
విడు + దల → విడుదల
ఎదుగు + దల → ఎదుగుదల
పట్టు + దల → పట్టుదల
కట్టు + బడి → కట్టుబడి
చేదు + బడి → చేదుబడి (చేతబడి)
పలుకు + బడి → పలుకుబడి
వచ్చు + బడి → రాబడి
పెట్టు + బడి → పెట్టుబడి
దిగు + బడి → దిగుబడి
తీఱు + బడి → తీఱుబడి
అందు + పాటు → అందుబాటు
అచ్చు + పాటు → అచ్చుబాటు
ఎడయు + పాటు → ఎడబాటు
దిద్దు + పాటు → దిద్దుబాటు
నగు + పాటు → నగుబాటు
కట్టు + పాటు → కట్టుబాటు
జఱుగు + పాటు → జఱుగుబాటు (maintenance)
క్రుంగు + పాటు → క్రుంగుబాటు (depression)

గమనిక :– కర్మార్థక క్రియల (passive voice forms) ని నామవాచకాలుగా మార్చుకోవడానికి, ఆ రకంగా కొత్త అర్థాలలో కొత్తపదాల్ని కల్పించడానికీ ఈ తెలుగు నిర్మాణాల్ని ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకి,

కనబడు → కనబాటు = దృశ్యం, చూసే వీలు
వినబడు → వినబాటు = శ్రవ్యం, వినే వీలు
కాబడు → కాబాటు = సంఘటన, అయ్యే వీలు
పోబడు → పోబాటు = గమ్యం, పోయే వీలు
ఆధారపడు → ఆధారపాటు = ఆశ్రితత్వం (Dependence)

(ఓ) 'జరిగిన/ చేసిన సంఘటన' అనే అర్థంలో క్రియాధాతువులకి 'ఇమి' ప్రత్యయం చేరుతుంది. ఉదాహరణకి,

తాళు → తాళిమి = ఓర్పు
పోవు → పోయిమి = పోయిన సంఘటన
తెలుపు → తెలిపిమి = తెలిపిన వాస్తవం
అను → అనిమి = అన్న సమాచారం
ఎక్కు → ఎక్కిమి = ఎక్కిన (ప్రభుపదవిని అధిష్ఠించిన) సంఘటన
(ఎకిమీడు = రాజు)

గమనిక :– 'ఇమి' ప్రత్యయం చేరినప్పుడు కొన్ని ధాతువుల చివర ఉండే 'గు, యు, చు' వర్ణకాలు లోపించవచ్చు. ఉదాహరణకి,

కలుగు → కలిమి
బలియు → బలిమి
ఓర్చు → ఓరిమి
కూర్చు → కూరిమి (ప్రేమ)
జరుగు → జరిమి (చరిత్ర)
నేర్చు → నేరిమి (విద్య)

(ఔ) 'జరగని/ చేయని వాస్తవం' అనే అర్థంలో క్రియాధాతువులకి 'అమి' ప్రత్యయం చేరుతుంది. ఉదాహరణకి,

పోవు + అమి = పోవమి → పోమి (పోకపోవడం)
లే + అమి → లేమి (లేకపోవడం)

కా + అమి → కామి (కాకపోవడం)

రా + అమి → రామి (రాకపోవడం)

జఱుగు + అమి→ జఱుగమి → జఱగమి (జఱక్కపోవడం)

తిను + అమి → తినమి (తినకపోవడం)

(క) కొన్ని క్రియాధాతువుల తుది 'రు' వర్ణానికి భావార్థకంలో 'ట' వర్ణకం ఆదేశమవుతుంది. ఉదాహరణకి,

వనఱు → వనట (*ఆయాసం*)

తివురు → తివుట (*కోరిక*)

తీఱు → తీట

తేఱు → తేట

వేసఱు → వేసట (*విసుగు ; తెలంగాణ మాండలికంలో 'యాష్ట'*)

మారు → మాట

పేఱు → పేట

ఊఱు → ఊట

పాఱు → పాట → బాట

పోరు → పోట →పోటి

(ఖ) కొన్నిటికి భావార్థంలో ఏమీ చేఱదు. ఉదాహరణకి,

తిట్టు, పట్టు, దూఱు, తన్ను, నాటు, దాటు, గెంతు, కుళ్ళు, పుచ్చు, హెచ్చు, తగ్గు, మొగ్గు, తఱుగు, విఱుగు, తూగు, కప్పు, దెప్పు ఇత్యాది.

సంస్కృత క్రియాధాతువుల భావార్థకాలు

వీటిని 14 వ అధ్యాయంలో విపులంగా ఇవ్వడం జఱిగింది.

VI. స్వీయార్థక రూపాలు

వినడానికీ, అర్థం చేసుకోవడానికీ ఒకేలా ఉంటూ, స్వల్పంగా మాత్రమే భేదించే పదనిర్మాణాలు స్వీయార్థక రూపాలు. ఆంగ్లంలో ఇలాంటివాటిని కల్పించడం కోసం నామవాచకానికి '–let' అనే ప్రత్యయాన్ని చేఱుస్తారు.

Piglet = పందిపిల్ల ; Inlet = చిన్నప్రవేశమార్గం ; Booklet = చిఱుపొత్తం ; Starlet = చిఱుతార (ఎక్కువ

ప్రసిద్ధిలేని నటి) ; Islet = చిఱుదీవి ; Cutlet = మాంసం ముక్క.

తెలుగులోని స్వీయార్థక రూపాలు ఎక్కువభాగం వివిధ మాండలికాల వల్ల ఉనికిలోకి వచ్చినవి. ఉదాహరణకి,
***ఊదు్ప** = ఊకు ; **ఊడిపోవు** = ఊసిపోవు ; **వెయ్యి** (1000) = వెయ్య ; **చదువు** = సతుకు ; **చూపించు** = చూయించు*

ఉచ్చారణ పరిణామం తప్ప పైవాటి విషయంలో వ్యాకరణ సూత్రాలేవీ ప్రవర్తించవు. ఇలాంటివి సంస్కృతంలో కూడా ఉన్నాయి. ఉదాహరణకి,

ఆవాలం = ఆలవాలం (పాదు)
ఉష్ణం = ఊష్మం (వేడి)
వలగ్నం = అవలగ్నం (నడుము)
ఉత్తమం = అనుత్తమం
రిష్టం = అరిష్టం
పృథివి = పృథ్వి (భూమండలం)
పూర్ = పురం (ఊరు)

ఇవి ఇలా ఉండడానికి కారణం తరతరాల వ్యవహారప్రాబల్యమే తప్ప ఇందులో వ్యాకరణ సూత్రాలేవీ ప్రవర్తించడం లేదు. వీటిని రూపాంతరాలుగా భావించడానిక్కూడా అవకాశం ఉంది. తెలుగులో మాదిరి కాకుండా, సంస్కృతంలో స్వీయార్థ కాల్ని లాక్షణికంగా నిష్పాదించవచ్చు. ఈ లాక్షణిక స్వార్థకాలు పై ఉదాహరణల మాదిరి పూర్తిగా స్వార్థకాలు కావు. ఎందుకంటే వ్యాకరణకార్యాల మూలాన వాటి అర్థం మూలశబ్దాన్నుంచి స్వల్పంగా భేదిస్తుంది. అందుచేత ఇవి మూడు రకాలుగా ఉంటాయని చెప్పుకోవచ్చు.

(i) పూర్ణ స్వీయార్థకాలు (పూర్తిగా మూలశబ్దార్థంలోనే ఉండేవి)
(ii) అర్ధ స్వీయార్థకాలు (మూలశబ్దార్థాన్ని సగం వఱకు మార్చేవి)
(iii) పాద స్వీయార్థకాలు (చాలా వఱకూ మార్చేవి)

(i) అర్ధ స్వీయార్థకాలు :- పదానికి 'క' అనే ప్రత్యయాన్ని చేర్చడం ద్వారా స్వార్థకాల్నీ, అర్ధ స్వార్థకాల్నీ కల్పించవచ్చు. ఉదాహరణకి,

క్రీడనం (ఆట) → క్రీడనకం (ఆటవస్తువు)
గృహం (ఇల్లు) → గృహకం (స్వగృహం లాంటిదే కానీ నిత్యనివాసముండే భవనం కాదు)
పథం (దారి) → పథకం (దారిలాంటిది – Scheme)

ఋషి → ఋషిక = స్త్రీఋషి (లేక ఋషిభార్య)
భూమి → భూమిక = నిలబడేందుకు సరిపోయే నేల (ప్రాతిపదిక, ఆధారం)
అస్థి → అస్థిక = చిన్న ఎముక

ఈ మార్గంలోనే చలనకం (movie), భాషణకం (speaker), విహారకం (navigator), చామరకం/వీజనకం (fan) మొదలైన పదాల్ని కల్పించను అవకాశం ఉంది.

(ii) పాద స్వీయార్థకాలు :– నామవాచకానికి 'ఈ' లేదా 'ఇక' అనే ప్రత్యయాన్ని చేర్చడం ద్వారా వీటిని నిష్పాదిస్తారు. ఈ నిర్మాణం ఎల్లప్పుడూ స్త్రీలింగంలోనే ఉంటుంది. దీన్ని సాధారణంగా 'చిన్నది లేదా స్త్రీ' అనే అర్థంలో ప్రయోగిస్తారు. అందుచేత వీటిల్లో మూలశబ్దార్థం ఇంకా మారుతుంది. ఉదాహరణకి,

ఈశ్వర → ఈశ్వరి = ఈశ్వరుని స్త్రీరూపం
వనం → వని / వనిక = చిట్టడవి
కలశం → కలశి = చిన్న చెంబు
స్థలం → స్థలి = పరిమిత ప్రదేశం
పేట → పేటి / పేటిక = చిన్నపెట్టె
వాటం → వాటి / వాటిక = చిన్నబస్తీ
కణం → కణిక = కణం కంటే చిన్నది
మాల → మాలిక =చిన్నపూదండ
నవల → నవలిక = చిన్ననవల

తెలుగులో కూడా 'క' ప్రత్యయంతోనే స్వీయార్థకాలు ఏర్పడతాయని కొన్ని పదాల మూలాన తెలుస్తుంది. ఉదాహరణకి – నిప్పు → నిప్పుక ; పాటు → పాటుక

VII. 'అంతర' రూపాలు

'మఱొకటి' అనే అర్థంలో నామవాచకానికి 'అంతరం' అనే సమాసావయవాన్ని చేఱుస్తారు. ఉదాహరణకి,

గ్రామాంతరం = వేఱే గ్రామం
దేశాంతరం = వేఱే దేశం
విషయాంతరం = వేఱే విషయం

ప్రకరణాంతరం = వేఱే సందర్భం

గత్యంతరం = వేఱే గతి (దారి)

రూపాంతరం = మఱో రూపం ఇత్యాది.

సమాసాలతో పదనిర్మాణం చేయాల్సి వచ్చినప్పుడు ఇలాంటి రూపాలు టూకీతనం కోసం ఉపకరిస్తాయి.

అభ్యాసకార్యములు

I. ఈ క్రింది నామవాచకాలకు 'అరి' ప్రత్యయాన్ని చేర్చి కర్మకారులనూ, యజమానులనూ సూచించండి :

1. ఇల్లు 2. పొలం 3. నేల 4. సొమ్ము 5. చేత 6. వేధింపు 7. మదింపు 8. విధింపు 9. తలపు 10. ముఠా 11. వడ్డింపు 12. జీతం కోత 13. పెద్దల్ని తిట్టడం 14. తిరుగుబాటు 15. బెదిఱింపు 16. అదుపు 17. ఎన్నిక 18. ఎంపిక 19. కూలద్రోపు 20. బరితెగింపు 21. చావు 22. మలుపు.

II. ఈ క్రింది క్రియాధాతువులకు నేరుగా 'అరి' ప్రత్యయాన్ని చేర్చి కర్మకారులను సూచించండి :

1. చంపు 2. నిలుపు 3. నిలబెట్టు 4. తలవంచు 5. తప్పులెంచు 6. మార్చు 7. దిద్దు 8. మంచిచెప్పు 9. పుట్టు 10. బ్రతుకు 11. దుమ్ములేపు 12. ఛీకొట్టు 13. తన్ను 14. మ్రోగు 15. తెల్పు 16. మార్పుతెచ్చు 17. లావెక్కు 18. దాటు 19. మించు 20. బుఱదజల్లు.

III. ఈ క్రింది నామవాచకాలకు 'కారి, కాడు, కత్తె' ప్రత్యయాల్ని చేర్చి కర్మకారులను సూచించండి :

1. వంట 2. ప్రమాదం 3. నాట్యం 4. నేర్పు 5. పాట 6. తీరు 7. జాప్యం 8. ఈవి 9. వలపు 10. కీడు.

IV. ఈ క్రింది క్రియాధాతువులకు 'అక' ప్రత్యయాన్ని చేర్చి కర్మకారులను, కర్మకారకాలనూ సూచించండి :

1. పరిశీలించు 2. సంబోధించు 3. సందేహించు 4. ఆగ్రహించు 5. ఉపసంహరించు 6. కంపించు 7. స్తంభించు 8. భావించు 9. ఆచ్ఛాదించు 10. అభివర్ణించు 11. వందనం చేయు 12. అభినందించు 13. ప్రవహించు 14. బాధించు 15. క్రీడించు 16. ప్రసరించు 17. విధ్వంసించు 18. చికిత్స చేయు 19. ఉపదేశించు 20. కల్పించు 21. ఉత్పాదించు 22. దూషించు 23. నివేదించు 24. విభజించు 25. ఆశీర్వదించు 26. శిక్షణ ఇచ్చు 27. ఉపాసించు 28. పర్యటించు 29. పూరించు 30. విజ్ఞాపన చేయు 31. పరిహసించు.

V. ఈ క్రింది నామవాచకాలకు 'కార, కర, కృత్' అనే సమాస అవయవాల్ని చేర్చి కర్మకారులను సూచించండి :

1. విప్లవం 2. ఆందోళన 3. వినాశం 4. కళ 5. శాస్త్రం 6. ప్రబంధం 7. జ్ఞానోదయం 8. ప్రయోజనం 9. గ్రంథం 10. శక్తి 11. సంపత్ 12. స్వాస్థ్యం 13. క్షీరం 14. వర్ణం 15. ఆలస్యం 16. కీర్తి 17. యశస్ 18. క్షేమం 19. ఆరోగ్యం 20. పుష్టి.

VI. ఈ క్రింది నామవాచకాలకు 'ఆలయం, శాల, అగారం, మందిరం, స్థానం, మంటపం, ప్రాంగణం, గృహం, భండారం, కేంద్రం' అనే సమాస అవయవాల్ని చేర్చి నిమిత్త భవనాల్ని సూచించండి :

1. సామగ్రి (cloak room) 2. ధాన్యం 3. ధ్యానం 4. ఉత్సవం 5. ప్రతీక్ష 6. నాటకం 7. నాట్యం 8. సంగీతం 9. అభ్యసన 10. సమావేశం.

VII. ఈ క్రింది ప్రాణులకు తెలుగులో పేర్లు పెట్టండి :

1. Giraffe 2. Gorilla 3. Panda 4. Rhino 5. Lion 6. Emu 7. Dinosaur 8. Hippo 9. Dolphin 10. Octopus.

VIII. ఈ క్రింది ఆంగ్లపదాలు సూచించే సాధనాలకు తెలుగు సమానార్థకాల్ని కల్పించండి :

1. Printer 2. Screwdriver 3. Dryer 4. Bomber 5. Cooler 6. Transmitter 7. Cotton press 8. Extractor 9. Boiler 10. Capacitor 11. Compressor 12. Connector 13. Plug 14. Tester 15. Mixer.

IX. ఈ క్రింది క్రియాధాతువులకు 'ఎన/ఎల' లేదా, 'అలి' ప్రత్యయాన్ని చేర్చి పనిముట్లను సూచించండి :

1. కడుగు 2. తుడుచు 3. పిడుచు (రసం తీయు) 4. చూపు 5. కుట్టు 6. మొదలుపెట్టు ('మొదలు' అని వాడొచ్చు) 7. తెఱచు 8. వడపోయు 9. మాడ్చు 10. వండు.

X. ఈ క్రింది నామవాచకాలకు 'తనం, ఱికం/అఱికం' ప్రత్యయాల్ని చేర్చి భావార్థకాల్ని కల్పించండి :

1. స్తబ్ధు 2. మామ 3. అన్న 4. చెల్లెలు 5. బండ 6. బిరుసు 7. తీర్పరి 8. స్వంతం 9. ఘాటు 10. లోపాయికారి.

XI. ఈ క్రింది నామవాచకాలకు 'త్వం, త' ప్రత్యయాల్ని చేర్చి భావార్థకాల్ని కల్పించండి :

1. ఆకస్మికం 2. యాదృచ్ఛికం 3. దేశం 4. సానుకూలం 5. ప్రతికూలం 6. హేయం 7. నైతికం 8. వంచకుడు 9. సమదర్శి 10. ఉత్కృష్టం 11. సక్రమం   12. దారుణం.

XII. పదాదివృద్ధినీ, పదాంత 'య' ప్రత్యయాన్నీ, లేదా 'క' ప్రత్యయాన్ని ఉపయోగించి ఈ క్రింది నామవాచకాలకు సముదాయార్థకాల్ని సూచించండి :

1. సేన 2. గోపాలుడు 3. అధ్యాపకుడు 4. యువతి 5. ఉద్యోగిన్ 6. గూఢచారిన్ 7. అధికారిన్ 8. వ్యవహారిన్ 9. విలేఖిన్ 10. క్షేత్రిన్ 11. మంత్రిన్ 12. అర్చకుడు. (వీటికి సమాధానాలు కావాలంటే ఈ అభ్యాసాల చివఱ చూడండి)

XIII. ఈ క్రింది అచ్చతెలుగు క్రియాధాతువులకు భావార్థకాల్ని సూచించండి :

1. కొనసాగు 2. అడుగు 3. జఱిపించు 4. ఒప్పుకొను 5. కలగు 6. జఱుగు 7. విఱుగు 8. నలుగు 9. బ్రతిమాలు 10. విఱగబడు 11. దుఃఖపడు 12. కూలబడు 13. చతికిలబడు 14. వాపోవు 15. వలసపోవు 16. హత్తుకొను 17. వృథాపోవు 18. గుర్తొచ్చు 19. ఆటివచ్చు 20. అందివచ్చు.

XIV. ఈ క్రింది క్రియాధాతువులకు 'చేసిన/జఱిగిన వాస్తవం' అనే అర్థంలో నామవాచకాల్ని కల్పించండి.

1. చేయు 2. అగు   3. తాకు 4. పడు 5. అలుముకొను 6. కఱుగు 7. అరుగు 8. ఆగు 9. ఊగు 10. తెగు.

XV. ఈ క్రింది క్రియాధాతువులకు 'చేయని/జఱగని వాస్తవం' అనే అర్థంలో నామవాచక రూపాల్ని కల్పించండి :

1. ఓపు 2. ఓర్చు 3. గెల్చు 4. తెచ్చు 5. తిను 6. చూచు 7. వండు 8. పండు 9. కునుకు 10. చాలు.

XVI. ఈ క్రింది ఆంగ్లపదాలకు సరియైన తెలుగు/సంస్కృత సమూహార్థకాలతో అనువదించండి :

1. Questionnaire 2. Plumage 3. Foliage 4. Citizenery 5. Gentry 6. Womenfolk 7. Wish-list 8. Sivalik range of moutains 9. Pile of books 10. Bundle of papers.

XVII. ఈ క్రింది పదాల్ని తగిన అవయవాలతో సమాసించి సమూహార్థకాలుగా మార్చండి :

1. వృత్తికారులు 2. పరిశోధకులు 3. రచయితలు 4. నాయకులు 5. కవులు 6. మహిళలు 7. స్త్రీలు 8. పురుషులు 9. దేవతలు 10. యాత్రికులు 11. ఉపాధ్యాయులు 12. అధ్యాపకులు 13. ఆచార్యులు 14. పాత్రికేయులు 15. విలేఖకులు 16. వంచకులు 17. పాచకులు   18. కృషీవలురు 19. బాలురు 20. సృజనశీలురు 21. ఒజ్జలు   22.

చట్టలు 23. ఇళ్ళు 24. ఊళ్ళు 25. ఆణియాలు 26. లోయలు 27. అడవులు 28. చెఱు వులు 29. ఏర్లు 30. వాగులు.

XVIII. ఈ క్రింది నామవాచకాలకు 'క' ప్రత్యయాన్ని చేర్చి స్వీయార్థక రూపాల్ని సూచించండి :

1. సాధనం 2. వాహనం 3. చోదనం 4. యంత్రం 5. చిత్రం 6. హస్తం 7. భవంతి 8. మార్గం 9. తరువు (చెట్టు) 10. కుడ్యం (గోడ) 11. మంజరి (పూలగుత్తి) 12. వల్లి (తీగె) 13. ఓషధి 14. నిధి 15. మహతి (నారదవీణ).

XIX. ఈ క్రింది నామవాచకాలకు 'ఇ' లేదా 'ఇక' ప్రత్యయాన్ని చేర్చి స్వీయార్థక రూపాల్ని సూచించండి :

1. కవనం 2. భవనం 3. గ్రంథం 4. గరిష్ఠం 5. లత 6. రాధ 7. మండలం 8. రాష్ట్రం 9. ప్రాంతం 10. ధార 11. క్షేమం 12. కుశలం.

XX. ఈ క్రింది నామవాచకాలకు 'మఱో' అనే అర్థంలో 'అంతరం' అనే సమాసావయవాన్ని చేర్చండి :

1. కుటుంబం 2. మార్గం 3. సందర్భం 4. కాలం 5. ప్రస్తావన 6. కావ్యం 7. కృతి 8. శాస్త్రం 9. వంశం 10. ఋతువు.

XII అభ్యాసానికి సమాధానాలు

1. సేన – సైన్యం 2. గోపాలుడు – గౌపాల్యం 3. అధ్యాపకుడు — ఆధ్యాపక్యం 4. యువతి — యౌవతకం 5. ఉద్యోగిన్ – ఔద్యోగిన్యం 6. గూఢచారిన్ — గౌఢచారిణ్యం 7. అధికారిన్ — అధికారిణ్యం 8. వ్యవహారిన్ — వ్యావహారిణ్యం 9. విలేఖిన్ – వైలేఖిన్యం 10. క్షేత్రిన్ – క్షైత్రిణ్యం 11. మంత్రిన్ — మాంత్రిణ్యం 12. అర్చకుడు — ఆర్చక్యం.

పదనిష్పాదన కళ

పదకొండో అధ్యాయం

లాక్షణిక విశేషణాల నిష్పాదనపద్ధతి

(అ) అచ్చతెలుగు విశేషణాలు – ఉపోద్ఘాతం

ఒక వస్తువూ, పదార్థం, వ్యక్తిని, ప్రదేశం, భావం, విషయం గుఱించి విశేషించి (ప్రత్యేకంగా) వర్ణనపూర్వకంగా తెలిపే పదాలు **విశేషణాలు**. వీటినే ఆంగ్లంలో Adjectives అంటారు. ఇవి రెండు విధాలు. 1. **సహజ విశేషణాలు.** 2. **లాక్షణిక విశేషణాలు.** అవసరాన్ని బట్టి వ్యాకరణ సూత్రాల సాయంతో క్రొత్తగా కల్పించుకునేవి లాక్షణిక విశేషణాలు.తెలుగులో విశేషణాలకి లింగ–విభక్తి–వచనాలు ఉండవు. తెలుగులో ఒక విశేషణం ఏ పదాన్నైతే వర్ణిస్తుందో ఆ పదానికి తాను ముందొస్తుంది. విశేషణ సహాయంతో వర్ణించబడే పదాన్ని **విశేష్యం** అంటారు. తెలుగులో విశేష్యాలకి మాత్రమే లింగ–విభక్తి–వచనాలు ఉంటాయి. విశేషణాలకి అవి ఉండవు. సాధారణంగా తెలుగులో విశేషణ–విశేష్యాల్ని సమాసంగానూ, విడిగా కూడా వాడతారు. ఒక పదం విశేషణంగా ప్రవర్తించేటప్పుడు, లేదా మారేటప్పుడు దాని మూలస్వరూపానికి కొన్ని మార్పులూ, చేర్పులూ జఱగడం కూడా ఉంది. ఇందుకోసం ఉపయోగపడే ఉపసర్గల్నీ, ప్రత్యయాల్నీ, పదాల్నీ **విశేషకాలు** అనవచ్చు.

I. విశేషణాల విషయంలో తెలుగు రచయితలు తఱచూ చేసే పొఱపాట్లు

ఒక్క విశేషణాల గుఱించే కాదు, తెలుగులో వ్రాసేవారిలో అత్యధిక సంఖ్యాకులకు తెలుగు భాషాభాగాల గుఱించిన అవగాహన తక్కువ. “ఏది నామవాచకం? ఏది భావార్థకం? ఏది సముచ్చయం? ఏది అవధారణార్థకం ? ఏది విశేషణం ?” అని అడిగితే ఎక్కువమంది తెల్లమొహం వేస్తారనడంలో సందేహం లేదు. కాస్తో కూస్తో తెలిసినవారెవఱైనా ఉంటే వారు మహాపండితులుగా మన్నన. అందుచేత వ్యావహారికం పేరుతో ఏ విధమైన తర్కబద్ధతా లేని భాష వ్యాప్తిలోకి తేబడుతోంది. ఆంగ్లప్రాధాన్యాన్ని మాత్రమే నొక్కివక్కాణించే విద్యావ్యవస్థలో మాతృభాష విషయంలో ఈ విధమైన నిర్లక్ష్యపు నీడలూ, అజ్ఞానమేఘాలూ ఆవరించడం ఆశ్చర్యకరం కాదు. కానీ మాతృభాషలో విద్యాభ్యాసం చేస్తున్న పురోగత దేశాల ప్రజలు తమ వాడుకల విషయంలో మనలా లేరనీ, చాలా నిర్దుష్టంగా పట్టింపుగా ఉంటున్నారనీ గమనించాలి. కనుక తెలుగులో ఎలా వ్రాసినా ‘చల్తా హై’ అనే ఈ బౌద్ధిక జులాయితనం పోవాలి.

విశేషణాల విషయానికొస్తే, ఈ మధ్య మన రచయితలు ప్రతి నామవాచకానికీ 'ఆత్మకం' అని చేర్చి అది విశేషణం అనుకుంటున్నారు. అలా *విద్యాత్మకం, సృజనాత్మకం, సకారాత్మకం, నకారాత్మకం, వర్ణనాత్మకం, వివరణాత్మకం* లాంటి పదాల్ని సృష్టించారు. ఇది కొన్ని సందర్భాలకి ఫర్వాలేదు గానీ అన్ని రకాల పిడుగులకీ, బియ్యాలకీ పనికొచ్చే మంత్రం మటుకూ కాదు. ఈ పోకడ బహుశా హిందీకి అనుకరణ కావచ్చు. దీని మూలాన ఆంధ్రవిశేషణాలు ఆంగ్లవిశేషణాల కంటే పలకడానికి బహుకష్టంగా, బారుబారుగా తయారయ్యాయి. మళ్ళీ వీటికి భావార్థక ప్రత్యయాల్ని చేటిస్తే ఇవి మఱింత పొడవూ, మఱింత కష్టమూ అవుతాయి. **ఉదా:–** *ధ్వన్యాత్మకత్వం.* దీనికి టూకీగా *'ధ్వానిక'* అనొచ్చు. ఇలా ప్రతీదానికి ఒక 'ఆత్మ'ని చేర్చడం ద్వారా మన రచయితలు ఒక అనువాద సౌలభ్యాన్నైతే వెతుక్కున్నారు కానీ వీటిని విన్నాక/చదివాక వీటి మూలాంగ్లపదం ఏమిటై ఉంటుందని ప్రత్యేకంగా అడిగి తెలుసుకోవాల్సి వస్తుంది. ఇలాంటి పదనిర్మాణాల్లో జాతీయత లోపించి ఇవి తొలినాళ్ళలోని బైబిల్ అనువాదాల్లా కృతకంగా ధ్వనిస్తున్నాయి. ఒక్కొక్క ప్రత్యేక అర్థానికీ ఒక్కో విభిన్న ప్రత్యయపు, లేదా పద సంయోగపు సహాయంతో విశేషణాల్ని రూపొందించాల్సి ఉంటుంది.

అదే విధంగా, 'గా' (–ly/ as) వర్ణకానికీ, 'లా' (like) వర్ణకానికీ తేడా తెలీని పాత్రికేయులు ఉన్నారు మనకు ! ఉదాహరణకి – ఇటీవల ఒక దినపత్రికలో లింగమార్పు కోసం శస్త్రచికిత్స చేయించుకొన్న వ్యక్తి గుఱించిన వార్తని నివేదిస్తూ పక్కపక్కనే రెండు ఛాయాచిత్రాలు ప్రచురించారు. ఒకటేమో, చేయించుకోక ముందటిది. ఇంకొకటేమో, చేయించుకున్న తరువాతిది. మొదటి ఛాయాచిత్రపు శీర్షిక “మగపిల్లాడిలా” అని వ్రాశారు. తెలుగులో '–లా' వర్ణకం పోలిక (simile) ని సూచించడానికి మాత్రమే ! యథార్థ వస్తుస్థితిని సూచించడానికి '–గా' వర్ణకం వాడతారు. శస్త్రచికిత్స చేయించుకోక ముందు ఆ వ్యక్తి యొక్క యథార్థస్థితి 'మగపిల్లాడిలా' కాదు. అక్కడ మగపిల్లాడితో పోల్చాల్సిందేమీ లేదు. ఎందుకంటే అతనప్పుడు సాక్షాత్తూ మగపిల్లాడే. కాబట్టి అప్పుడు అతనున్నది 'మగపిల్లాడిగా'.

అలాగే, ఇక్కడ అసందర్భమైనప్పటికీ ఇంకో ముక్క చెప్పాలనిపిస్తోంది. తృతీయా విభక్తిప్రత్యయం ('తో') ఉపయోగించకుండా 'సహా' అనే అవ్యయాన్ని వాడ్డం కనిపిస్తోంది మన దినపత్రికల్లో ! ఇది చాలా ఇటీవలి అపభ్రంశం. *'ముఖ్యమంత్రి సహా, రైతులు సహా'* ఇలా ప్రయోగిస్తున్నారు. ఇది కనీసం వాడుకభాషైనా కాదు. ఎందుకంటే వాడుకభాషలో 'సహా' పదానికి ముందు 'తో' అని వాడకుండా ఎవ్వఱూ మాట్లాడం ఇంగ్లీషులో కూడా along with అని వాడతారే తప్ప, **ఈ అర్థంలో** వట్టి along వాడ్డం ఎక్కడైనా చూశామా? నిజానికి ఈ వాడుకకు మూలమైన సంస్కృతంలో కూడా తృతీయ తరువాతే 'సహ' అని ప్రయోగిస్తారు. ఉదాహరణకు, ***రామేణ సహ (రామునితో పాటు).*** ఇలా తృతీయని వదిలేసి *సహా* ప్రయోగం చేయడంలో వీరికి రెండు ఉద్దేశాలు ఉండొచ్చు. ఒకటి – కనీసం ఒక్క అక్షరాన్నయినా వదిలించుకుందామనే పంక్తిబారు (column space) లోభం. రెండోది –'సహా' అనే మాటకు 'తో' అని అర్థమనీ, కాబట్టి వాక్యంలో ఒకే చోట రెండు 'తో' లు ఎందుకు ? అనే భ్రమప్రమాదం. ముందుగా తెలుసుకోవాల్సింది ఏంటంటే, 'సహా' కి అర్థం 'తో' అని కాదు. 'కలిసి/కలిపి' అని అర్థం. *“నాతో సహా ముగ్గుఱు”* అన్నప్పుడు *“నాతో కలిపి ముగ్గుఱు”* అని అర్థం. ఇక్కడ 'సహా' గానీ, 'తో' గానీ అనవసరమైన పదం కాదు. రెండూ అవసరమే. ఏ ఒక్కటి లోపించినా చేయదల్చుకున్న వ్యక్తీకరణ వికలాంగమవుతుంది.

అదే విధంగా ‘మార్పు’నీ, ‘మార్పిడి’నీ ఒకే అర్థంలో వాడుతున్నారు. నిజానికి మొదటిదానికి Change అనీ, రెండోదానికి Exchange అనీ అర్థం. పరభాషా వ్యామోహంలో పూర్తిగా మునిగిపోయి, మన పుస్తకాలు చదవడం మానేసి, అలా మన భాషే మనకర్థం కాని దుర్దశలోకి మనం అడుగుపెట్టామని ఇలాంటివన్నీ సూచిస్తాయి.

II. వాడుకతెలుగులోని సహజ విశేషణాల స్వరూపం

౧. కొన్ని నామవాచకాలకి నేరుగా 'ఐన' అనే క్రియాజన్య విశేషణాన్ని చేర్చడం ద్వారా వాటిని విశేషణాలుగా మారుస్తారు.
ఉదా :– *అందమైన ఇల్లు, నాణ్యమైన సరుకు, అచ్చమైన తెలుగుతనం, పొందికైన కూర్పు, లోతైన బావి, పొడవైన త్రాడు, తీరైన ముక్కు, ఎత్తైన గుట్ట, తేలికైన పని, బరువైన మోపు, వరసైన సంబంధం, మనసైన మొగుడు.*

అంటే, ఇక్కడ గ్రహించాల్సింది– అచ్చతెలుగు నామధాతువులకి విశేషణరూపాలు దొఱక్కపోతే నామవాచక రూపాన్నే విశేషణంలా వాడుకునే సౌలభ్యం తెలుగులో ఉందని !

౨. కొన్ని నామవాచకాలకి ఏ మార్పూ చేయకుండా నేరుగా విశేషణాల్లా ప్రయోగిస్తారు. కానీ ఆంధ్ర వ్యాకరణ సంప్రదాయానుసారం ఇవి విశేష్య–విశేషణ మిశ్రమాలు కావు. వీటిని, రెండు నామవాచకాలతో ఏర్పఱచిన సమాసాలుగానే పరిగణిస్తారు.
ఉదా :– *చెప్పుడుమాటలు, పెట్టుడు ముహూర్తం, తిరుగుడురకం, జారుడుబల్ల, కంపునెయ్యి, వంకరబుద్ధి, సంకరజాతి, అడ్డుగోడ.*

౩. కొన్ని మువర్ణకాంత నామవాచకాలకి పుంప్వాదేశం చేసి వాటిని విశేషణాలుగా మారుస్తారు.
ఉదా *:– పల్లపు చోటు, అబద్ధపు సాక్ష్యం, అనవసరపు ఖర్చు, అడ్డదిడ్డపు నడవడి, మూర్ఖపు వాదన, , పెడసరపు ధోరణి.*

౪. కొన్ని మువర్ణకాంత పదాలు సహజంగానే విశేషణాలైనప్పటికీ, వాటిక్కూడా పుంప్వాదేశం చేస్తారు.
ఉదా : – *దూరపు కొండలు, సరసపుటలుక, విరసపు మాట, నిట్రపు గుట్ట.*

౫. కొన్ని పదాలు స్వతహాగా విశేషణాలే అయినప్పటికీ వాటికి “ఐన” అని చేర్చి ప్రయోగిస్తారు.
ఉదా :– *దట్టమైన అడవి, సుతారమైన తాకు, సున్నితమైన మనస్తత్త్వం, మృదువైన చర్మం, బలహీనమైన శరీరం.*

౬. మఱికొన్నిపదాలు సహజంగానే విశేషణాలైనప్పటికీ, వాటికి “టి, ని” మొదలైన ప్రత్యయాల్ని చేర్చి గానీ, చేర్చకుండా గానీ ప్రయోగిస్తారు.
ఉదా :– *కమ్మతావి = కమ్మని తావి*
చల్లగాలి = చల్లని / చల్లటిగాలి

తెల్లకలువ = తెల్లని / తెల్లటి కలువ
ఇలాగే, *తీయని పండు, గోరువెచ్చని నీళ్ళు, చక్కని చుక్క, నున్నని గచ్చు, సన్నని పొలు, తిన్నని త్రోవ.*

౭. కొన్ని విశేషణాల్ని ఏ మార్పూ చేయకుండానే ప్రయోగిస్తారు.
ఉదా :– *గడుసుపిల్ల, బిరుసుజుట్టు, బిగుతుబట్టలు, పెళుసుకట్టె, చేదుసొర, మంచి మిత్రుడు, చెడుసావాసాలు, హెచ్చుశాతం, వేళకాపరం, దగ్గఅదారి, మోటుమనిషి, పెద్దవెలువు, చిన్న ఊరు, నల్లావాలు, తెల్లవంకాయ, ఎఱ్ఱ ఉల్లి, జడివాన, తడివొళ్ళు, మడిబట్ట, పెనుతుఫాను, పినతల్లి, ఆడపులి, మగసింహం, మేటి నేత, సూటిప్రశ్న.*

౮. కొన్ని రెండక్షరాల విశేషణాలకి "పాటి" అనే ప్రత్యయం చేఱుస్తారు. ఇది కొన్ని ఆంగ్ల విశేషణాలకి చివఱ వచ్చే –ish లాంటి వాడుక. ఇది విశేషణపు టర్థంలోని తీవ్రతనీ, అతిశయాన్నీ కాస్త తగ్గించి చూపుతుంది.
ఉదా :– *కొద్దిపాటి, చిన్నపాటి, సన్నపాటి, లావుపాటి, మందపాటి, ఒకపాటి.*

౯. కొన్ని క్రియాధాతువుల తద్ధర్మార్థక రూపాల్ని విశేషణాలుగా ప్రయోగిస్తారు. మళ్ళీ వీటిల్లో కొన్నింటిని స్వతంత్రంగా నామవాచకాలుగా కూడా వాడే సౌలభ్యం ఉంది.
ఉదా :– *కులుకుప్రాయం, వణుకువయసు, ఉడుకునీళ్ళు, తెల్లవారుజాము, పండువెన్నెల, మండుటెండ, ఎండుమిఱప, తిట్టుకవిత్వం, కట్టుకథ, పట్టుకాఱు, మిగులు నిధులు, వాలు వసార, పేరునెయ్యి, పుచ్చువంకాయ, చచ్చుఘటం, పోరుబాట, బ్రతుకుతెఱువు, త్రాగునీరు, మారుతల్లి, అంటుకత్తెర, మాడన్నం, కుళ్ళువాసన, ముఱుగుకాలువ.*

అంటే, ఇక్కడ గ్రహించాల్సింది– అచ్చతెలుగు క్రియాధాతువుల తద్ధర్మార్థకాల్ని నేరుగా విశేషణాలుగా కూడా ప్రయోగించవచ్చునని !

౧౦. స్వభావార్థంలో కొన్ని పదాలకి మారి, కోరు, దారి లాంటి ప్రత్యయాలు చేఱుస్తారు. ఇలా నిష్పన్నమైన పదాలు సాధారణంగా నిందార్థకాలై ఉంటాయి.
ఉదా :– *తంపులమారి, జగడాలమారి, కజ్జాకోరు, ముఠాకోరు, కోపదారి, మాయదారి.*

౧౧. నామవాచకాలకు ధాతుజన్య భావార్థకాల్ని చేర్చడం ద్వారా కొన్ని విశేషణాలు నిష్పన్నమయ్యాయి.
ఉదా :– *ఏడుపుగొట్టు (ఏడుపు + కొట్టు) = ఏడుపుచేత కొట్టబడ్డవాడు*
లంచగొండి (లంచమును కొనుడు → కొనిడి → కొండి)
దూబఱదిండి (దూబఱ తినుడు → తిన్డు → తిండి)
నెలదాల్పు (నెలను తాల్చువాడు = శివుడు)

౧౨. మొదట్లో వాటివాటి గుణాల్ని బట్టి పూర్వులు విశేషణాలుగా వాడినవి కాస్తా కాలక్రమేణ వాడుకలో నామవాచకాలు

గా పరిణామం చెందినట్లు అనిపిస్తుంది. ఈ క్రమంలో, యుకారాంత క్రియాధాతువులకు "సు/ ఉసు" అనే ప్రత్యయం చేఱింది. అలాగే, "చేయబడేది" అనే అర్థంలో సకర్మక ధాతువులకు "అ" అనే ప్రత్యయం చేఱడం గోచరిస్తుంది. ఉదాహరణకు,

కోయు → కోసు (sharp)
పులియు → పులుసు, పుల్ల
తెలియు → తెలుసు, తెల్ల
వెలియు → వెల్ల
పొలియు → పొలుసు (scale)
నలియు → నలుసు, నల్ల
అలియు → అలుసు (అలసట = బలహీనత)
పెళియు (ఊహితం, ప్రయోగం లేదు) → పెళుసు, పెళ్ళ
చెక్కు → చెక్క (చెక్కబడేది)
కోయు → కొయ్య
ఎఱియు (బాధపడు) → ఎఱియ → ఎఱ్ఱ
(భౌతికంగా బాధపడినప్పుడు శరీరభాగాలు సంతరించుకునే స్థితి)
వ్రయ్యు → వ్రయ్య
కట్టు → కట్ట (bundle)
చుట్టు → చుట్ట (spring/ coil/ spiral)
పట్టు → పట్ట
మెట్టు (కాలెత్తి అడుగుమోపు) → మెట్ట
చాపు (విస్తరించు, పఱచు) → చాప
చేపు (తడియు) → చేప
మీటు → మీట (Switch/ key)
ఎండు → ఎండ
చేదు (నీళ్ళు తోడు) → చేద (నీళ్ళు తోడే చిన్న తాటాకుల బొక్కెన)
పేలు → పేల (పేలాలు)

౧౩. కొన్ని ముపర్ణకాంత పదాల షష్ఠీరూపాల నుంచి కూడా కొన్ని విశేషణాలు నిష్పన్నమై అనంతర కాలంలో నామవాచకాలుగా స్థిరపడ్డాయి. షష్ఠీరూపమంటే *"యొక్క, చెందిన"* అని అర్థమిచ్చే రూపం. ఉదా :–

కొమ్ము → కొంప

(= కొమ్ము గలిగినది ; దక్షిణాది దేవాలయాలకు మల్లే ఒకప్పుడు తెలుగువారి ఇళ్ళ పైభాగాన కూడా కొమ్ముల్లాంటి అలంకారాలు ఉండి ఉండవచ్చు)

జొమ్ము → జొంప

దుమ్ము (మట్టి) → దుంప

తుమ్ము → తుంపురు → తుంపర

చెమ్ము (ఎఱుపు) (ఊహితం, ప్రయోగం లేదు) → చెంప (ఎఱ్ఱబడేది)

కమ్ము (వంకరపుల్ల) → కంప → గంప

పాము (బొడ్డుత్రాడు) → పాప

వేము → వేప

౧౪. కొన్నిసార్లు పదాల యొక్క ఔపవిభక్తిక రూపాల్ని ముందు విశేషణాలుగా వాడి తరువాత వాటినే నామవాచకాలుగా ఖాయం చేయడం జఱిగింది. ఉదాహరణకి :–

చీకు (గుడ్డి) → చీకటి

కుమ్ము (పొగ) → కుంపటి

మూయి (ప్రయోగం లేదు) → మూతి

తుండు (మొలకు చుట్టుకునే గుడ్డ) → తుంటి

బూయి (మర్మాంగం) → బూతి (బహువచనంలో – బూతులు)

కయ్యాలు (కొట్లాటలు) → కయ్యాల → గయ్యాళి (ఈ క్రమంలో – కయ్యాల కంప → గయ్యాళిగంప)

కలువకుఱ్ఱు → కలువకుర్తి

అనపఱ్ఱు → అనపర్తి

తుంగతుఱ్ఱు → తుంగతుర్తి

వివరణ :– ఔపవిభక్తికాలంటే –చే,– తో, –వలన,– లో మొదలైన విభక్తిప్రత్యయాలు చేఱడానికి ముందు పదస్వరూపాన్ని మార్చే ప్రత్యయాలు. ఉదాహరణకి–

పదం	*ఔపవిభక్తిక రూపం*	*విభక్తిప్రత్యయం*	*విభక్తిక రూపం*
ఇల్లు	*ఇంటి +*	*లో*	*= ఇంటిలో*
పన్ను	*పంటి+*	*కి*	*= పంటికి*
నేను	*నా +*	*అందు*	*= నాయందు*
ఊరు	*ఊరి +*	*కంటె*	*= ఊరి కంటె*

ప్రజలు ప్రజల + కోసం = ప్రజల కోసం

౧౫. క్రియాధాతువుల నామవాచకాల నుంచి కొన్నిపదాలు ముందు విశేషణాలుగా నిష్పన్నమై తరువాత స్వతంత్ర నామవాచకాలయ్యాయి. తొలిచూపులో వీటి వ్యుత్పత్తి (etymology) కాస్త దూరాన్వయంగా భాసిస్తుంది. ఉదా :-

తేలు → తేల్చు → తేల్పు → తేల్ప → తెప్ప (raft)
మొలచు → మొల్చు → మొల్ప → మొప్ప (finn)
చీలు → చీల్చు → చీల్పు → చీల్ప → చిప్ప (hemisphere)
కూలు → కూల్చు → కూల్పు → కూల్ప → కుప్ప (rubble)

౧౬. 'వంటి' అనే అర్థంలో నామవాచకాలకు 'అంటి' అనే పదాన్ని చేర్చి విశేషణంగా మారుస్తారు. ఈ 'అంటి' అనే విశేషకం 'వంటి' కి రూపాంతరమే. ఉదా :-
పూవు + అంటి = పూవంటి (పూవును పోలిన)

III. విశేషణాల్ని గుర్తుపట్టడం

తెలుగులో నామవాచకాల్నీ, విశేషణాల్నీ విజ్జోడుగా (ఇది అదిగా, అది ఇదిగా) ప్రయోగించడం కద్దు. ఉదాహరణకి – *అందం, మంచి* మొదలైనవి. కనుక, ఒక తెలుగుపదం పరిపూర్ణ విశేషణమా ? కాదా ? అనేది తెలుసుకోవాలంటే దానికి *తనం (-ness), త్వం* లాంటి భావార్థక ప్రత్యయాల్ని చేర్చి చూడాలి.

అలాగే, ఒక పదాన్ని విశేషణంగా ప్రయోగించవచ్చునా? కూడదా? అనేది తెలుసుకోవాలంటే, ఆ పదానికి 'గా' (ఆంగ్లంలో దీని సమానార్థకం –ly) అనే ప్రత్యయాన్ని చేర్చి అలా దాన్ని అవ్యయం (adverb) గా మార్చి చూడాలి. ఆ ప్రయోగం మన ఉద్దిష్టభావాన్ని వ్యక్తీకరించగలిగితే అది విశేషణంగా పనికొచ్చేదే. లేకపోతే అది కేవలం నామవాచకంగానే ఉపయోగపడుతుందని అర్థం. అయితే అంతమాత్రాన అది యథార్థంగా విశేషణమని కాదు. ఉదాహరణకి ఈ క్రింది వాక్యాల్లో 'నిజాయితీ' ఇత్యాదులన్నీ భావార్థకాలే కానీ వాటిల్లో కొన్ని మాత్రం సందర్భానుసారం విశేషణాల్లా పనిచేస్తాయి.

నిజాయితీగా అంతా చెప్పేశాడు (నప్పింది)
సత్యంగా మాట్లాడాడు (నప్పలేదు)
ఆవేశంగా వెళ్ళిపోయాడు (నప్పింది)
భావోద్వేగంగా వెళ్ళిపోయాడు (నప్పలేదు)
వినయంగా నమస్కరించాడు (నప్పింది)
విధేయతగా నమస్కరించాడు (నప్పలేదు)

బిడియంగా లోపలికొచ్చాడు (నప్పింది)
మొహమాటంగా లోపలికొచ్చాడు (నప్పలేదు)

గమనిక :– కొన్ని నామవాచకాలకు "మయం / భూయిష్ఠం / పూరితం / ప్రాయం" అనే అర్థంలో విశేషణాలకు మల్లే *'గా'* వర్ణకాన్ని చేలుస్తారు. ఉదాహరణకి–

వాతావరణం గాలిగా ఉంది. (వాయుపూరితం)
ఈరోజు ఎండగా ఉంది. (ఆతపమయం)
పెఱుగు మఱీ నీళ్ళగా ఉంది. (జలప్రాయం)

ఇలా వాడేటప్పుడు కొన్నిసార్లు ఈ నామవాచకాల్ని ఆమ్రేడితం (పునరావృత్తం) చేయడం కూడా కద్దు.
ఉదాహరణకి–
వాతావరణం గాలిగాలిగా ఉంది.
ఈరోజు ఎండెండగా ఉంది.
పెఱుగు నీళ్ళనీళ్ళగా ఉంది.
అన్నం గంజిగంజిగా ఉంది.
నేల బంకబంకగా ఉంది.
ఈ కలం సిరా జిగురుజిగురుగా ఉంది.

IV. విశేషణాలూ, తజ్జనిత అవ్యయాల అనువాద పద్ధతి

అవ్యయాలంటే లింగ, వచన, విభక్తులు లేకుండా ఉంటూ, అదే సమయంలో తమ పూర్తి అర్థం కోసం ఇతర పదాల చేతికను అపేక్షించని పదాలు.
ఉదా :– హోరాహోరీ, చటుక్కున, ధడేలున, తఱచూ, రమారమి, అచ్చం, మతానుసారం మొ||

'ఇంద, పద, దా, సై, ఊ (ఓ) ' లాంటి అధాతుకాలైన క్రియారూపాలు కూడా అవ్యయాల్లోకే వస్తాయి. వీటిల్లో 'ఊ (ఓ)' ని కొన్ని కోస్తాజిల్లాల్లో ఉపసర్గలా ప్రయోగిస్తారు.
ఉదా :– *ఊ (ఓ) తిట్టేశాడు = అతిగా తిట్టేశాడు.*

ఆంగ్లంలోంచి తెలుగులోకి విశేషణాల్ని అనువదించేటప్పుడు మక్కికి మక్కి చేయడం పనికిరాదు. ఆంగ్లంలో ఏకైక పదాలతో వ్యక్తీకరించే భావాల్ని తెలుగులో కొన్నిసార్లు పదబంధాల (phrases) తో గానీ, క్రియానిర్మాణాలతో గానీ వెలిబుచ్చుతారు. లేదా ఆంగ్ల పదబంధాలకి దీటుగా తెలుగులో ఏకైక పదాల్నే వాడాల్సిరావచ్చు. ఇది చాలా వఱకూ

సందర్భం మీద ఆధారపడి ఉంటుంది. దానర్థం, తెలుగులో పదాలు లేవని కాదు. ఏది ఎక్కడ ఎలా ప్రయోగించాలో అనువాదకుడు తన యావద్ భాషాపాండిత్యాన్నీ ఉపయోగించి నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. అంతే తప్ప ఆంగ్లాన్ని మక్కికి మక్కి అనువదించలేకపోతున్నామనే దుగ్ధతో, "తెలుగులో పదాలు లే"వంటూ మాతృభాష మీద నెపం వేయ సమకట్టడం సరికాదు. ఆంగ్లంలో విశేషణాలుగా ఉన్నవాటిని తెలుగులో కూడా విశేషణాలుగానే అనువదించడం అన్నివేళలా సాధ్యం కాకపోవచ్చు. కొన్నింటిని నామవాచకాలుగానో, జాతీయాలుగానో అనువదించాల్సి వస్తుంది. ఉదాహరణకు, Callow – *(adj)* Young and inexperienced. దీనికి తెలుగులో *'పిల్లకాకి'* అంటే సరిపోతుంది.

మరో ఉదాహరణ :- He works hard అనే వాక్యాన్ని తీసుకోండి. ఇందులో hard అనే వైశేషణిక అవ్యయాన్ని ఇద్దరు అనువాదకులు తలో రకంగానూ అనువదించారనుకుందాం.

మొదటి అనువాదకుడు – *అతను కష్టంగా పనిచేస్తాడు.* (తప్పు)

రెండో అనువాదకుడు – *అతను కష్టపడి పనిచేస్తాడు* (లేక) కష్టించి పనిచేస్తాడు. (ఒప్పు)

అలాగే, He took shelter in God అనే వాక్యం.

మొదటి అనువాదకుడు – *అతడు భగవంతునియందు ఆశ్రయం తీసుకున్నాడు / పొందాడు.* (తప్పు)

రెండో అనువాదకుడు – *అతడు భగవంతుడికి శరణాగతుడయ్యాడు.* (ఒప్పు)

ఇక్కడ 'శరణాగతు'డనే విశేషణం సమయానికి స్ఫురించడం అవసరం.

కొన్నిటికి మాత్రం అచ్చుమచ్చుగా అతికే సమానార్థకాలు లభిస్తాయి.

ఉదా :- Business is dull.

= *వ్యాపారం మందకొడి గా సాగుతోంది.* (విశేషణాన్ని అవ్యయంగా మార్చి ప్రయోగించాం)

అభ్యాసకార్యములు

I. ఈ క్రింది పదాల్లో నిజమైన విశేషణాల్ని గుర్తుపట్టండి :

1. ప్రసన్నం 2. భక్తి 3. అంకితం 4. దీనం 5. సామరస్యం 6. నిష్కామం 7. నిర్మలం 8. అకారణం 9. ప్రేమ 10. సమైక్యం 11. శ్రద్ధ 12. స్నేహం 13. హాస్యాస్పదం 14. ఖచ్చితం 15. మందం 16. సిగ్గు 17. నేలమట్టం 18. అసహ్యం 19. ఎగుడుదిగుడు 20. బిగ్గఱ.

II. ఈ క్రింది నామవాచకాల్ని సమాస-పదబంధ -వాక్యాది రూపాల్లో విశేషణాలుగా ప్రయోగించండి :

1. వాటం 2. ఒడుపు 3. నెమ్మది 4. పట్టు 5. అందుబాటు 6. ముద్దు 7. పేరు 8. వెడల్పు 9. నమ్మకం 10. అలవాటు 11. తెలివి 12. దట్టం 13. మౌనం 14. సంప్రదాయం 15. కష్టం 16. భారం 17. హాయి 18. విచిత్రం 19. బలం 20.

III. ఈ క్రింది పదాల్ని అవ్యయాలుగా మార్చి ప్రయోగించండి :

1. నిర్లక్ష్యం 2. మనశ్శాంతి 3. విమర్శ 4. భయం 5. అద్భుతం 6. విశ్రాంతి 7. బద్ధకం 8. సరదా 9. బాధ 10. త్వర 11. ధైర్యం 12. చాదస్తం 13. పద్ధతి 14. ఆరాధన 15. విసుగు 16. లాలన 17. మెచ్చుకోలు 18. తృప్తి 19. హడావుడి 20. నిర్ధారణ.

IV. ఈ క్రింది విశేషణాల్ని అవ్యయాలుగా మార్చి ప్రయోగించండి :

1. ముక్కుసూటి 2. బుద్ధితక్కువ 3. గాఢం 4. నిశ్శబ్దం 5. శుభ్రం 6. లౌకికం 7. ఛాందసం 8. అన్యోన్యం 9. స్పష్టం 10. సహేతుకం 11. తార్కికం 12. పవిత్రం 13. కంగారు 14. కర్ణపేయం 15. మందకొడి 16. సరసం 17. చాటు 18. దీటు 19. గట్టి.

(ఆ) తత్సమ విశేషణాలు :

సంస్కృతంలో లాక్షణిక విశేషణ శబ్దాల నిష్పాదనకు గల అవకాశాలు ఏ ఇతర భాష కంటే కూడా లెక్కకు మిక్కిలి. సందర్భాన్ని బట్టీ, అవసరాన్ని బట్టీ, అర్థాన్ని బట్టీ ఏ భాషాభాగం నుంచైనా విశేషణాల్ని నిష్పాదించవచ్చు. ఆధునిక కాలంలో విద్యా విజ్ఞానాల సముపార్జనకు మనం హెచ్చుగా ఆంగ్ల భాండాగారం మీద ఆధారపడుతూండడం వల్ల అందులోని సూక్ష్మార్థ ద్యోతకమైన పదజాలానికీ, పురోగత పరిభావనల (advanced concepts) కూ దీటైన దేశి పదజాలాన్ని రూపొందించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ లక్ష్యం దిశగా మనకు మన సంస్కృత వైయాకరణ సంప్రదాయమే లెస్సగా ఉపకరించగలదు. కాబట్టి మనం సంస్కృత విశేషణాల్ని ఆంగ్లభాషాదృష్టితో ఎలా రూపొందించవచ్చునో ఈ భాగంలో చర్చించబోతున్నాం.

I. విశేషణాల్లో రకాలు

(i) తరతమాలు :– ఆంగ్లవ్యాకరణాన్ననుసరించి ప్రతి విశేషణాన్నీ Comparative degree, Superlative degree (ఔపమికస్థాయి, ఆత్యంతిక స్థాయి) అని ఇంకో రెండు స్థాయిలుగా విస్తరించి చెప్పడానికి అవకాశం ఉంది.

ఉదాహరణకి–

Good (మంచి) better (ఇంకా మంచి) best (అన్నిట్లోకీ/ అందఱికంటే మంచి)
Bad (చెడ్డ) worse (ఇంకా చెడ్డ) worst (అందఱికంటే చెడ్డ)
High (ఎత్తైన) higher (ఇంకా ఎత్తైన) highest (అన్నిటికంటే ఎత్తైన) etc.

సంస్కృతంలో వీటిని **తర, తమ** భేదాలంటారు. ఎందుకంటే — Comparative degree ని సూచించడం కోసం విశేషణ పదానికి -**తరమ్** అనీ, Superlative degree ని సూచించడానికి -**తమమ్** అనీ చేఱుస్తారు.
ఉదా :–
పరమ్ = great
పరతరమ్ = greater
పరతమమ్ = greatest

పైవి నపుంసక లింగరూపాలు. వీటినే స్త్రీలింగ, పుల్లింగ రూపాలుగా కూడా మార్చి వాడుకోవచ్చు. ఉదా :–
పరుడు — పర/ పరురాలు
పరతరుడు — పరతర/ పరతరురాలు
పరతముడు — పరతమ/ పరతమురాలు

తర, తమ ప్రత్యయాల్ని విశేషణాలకే కాకుండా నామవాచకాలక్కూడా చేర్చడం ఉంది. ఇది ప్రధానంగా వైదిక సంప్రదాయం. ఉదాహరణకి–

***రాజతరుడు** — గొప్పరాజు ; **రాజతముడు** — అందఱి కంటే గొప్పరాజు*
***దేవితర** — గొప్ప దేవత ; **దేవితమ** — అందఱి కంటే గొప్ప దేవత*
***నదితర** - గొప్పనది ; **నదితమ** - అన్నిటి కంటే గొప్ప నది*

అర్వాచీన కాలంలో ఇలా నామవాచకాలకి తర, తమాల్ని చేర్చే అభ్యాసం పూర్తిగా మఱుగున పడింది. వాటి బదులు 'ఉత్తమ, రాజ, రత్న, ప్రముఖ, ప్రకాండ, తల్లజ, సత్తమ, అగ్రేసర, శ్రేష్ఠ' ఇత్యాది శబ్దాల్ని సమాసించడం వాడుకలోకి వచ్చింది. ఉదాహరణకి,

బ్రాహ్మణోత్తముడు = గొప్ప బ్రాహ్మణుడు
పండితోత్తముడు = గొప్ప పండితుడు
గ్రంథరాజం = గొప్ప గ్రంథం

శ్లోకరాజం = గొప్ప శ్లోకం
సూక్తిరత్నం = గొప్ప సూక్తి
సుహృద్రత్నం = గొప్ప సుహృత్తు (మిత్రుడు)
వణిక్ ప్రముఖుడు = గొప్ప వ్యాపారి
మునితల్లజుడు = గొప్పముని
ఆచార్యసత్తముడు = గొప్ప ఆచార్యుడు
వీరాగ్రేసరుడు = గొప్ప వీరుడు

స్త్రీలింగ పదాల్ని మాత్రం 'మతల్లి, లేక మతల్లిక' **అనే పదంతో సమాసిస్తారు.** ఉదాహరణకి,

నదీమతల్లి = గొప్పనది
దేవీమతల్లిక = గొప్ప దేవత

ఔపమిక, ఆత్యంతిక స్థాయుల్ని సూచించడానికి సంస్కృతంలో **తర, తమ** ప్రత్యయాలనే కాకుండా **—ఈయస్, -ఇష్ఠ** ప్రత్యయాల్ని సైతం ఉపయోగిస్తారు. అయితే ఇవి సాధారణంగా రెండక్షరాల విశేషణాలకే పరిమితం. ఉదాహరణకి,

అంతిక (దగ్గఱ)	*నేదీయాన్ (నేదీయస్)*	*నేదిష్ఠ*
అల్ప	*కనీయాన్ (కనీయస్)*	*కనిష్ఠ*
గురు	*గరీయాన్ (గరీయస్)*	*గరిష్ఠ*
తను (సన్నటి)	*తనీయాన్ (తనీయస్)*	*తనిష్ఠ*
దీర్ఘ	*ద్రాఘీయాన్ (ద్రాఘీయస్)*	*ద్రాఘిష్ఠ*
దృఢ	*ద్రఢీయాన్ (ద్రఢీయస్)*	*ద్రఢిష్ఠ*
ప్రియ	*ప్రేయాన్ (ప్రేయస్)*	*ప్రేష్ఠ*

ఈ తెఱగు రూపాలు తెలుగులో ఎక్కువగా వాడుకలో లేవు.

(ii) క్రియావిశేషణాలు :– క్రియాధాతువుల నుంచి పుట్టేవి ఇవి. వీటిని తెలుగులో *'అసమాపక క్రియలు'* అంటారు. ఎందుకంటే వీటితో వాక్యం సమాప్తి చెందదు. సంస్కృతంలో మాత్రం, *చేసిన–, చేయబడిన–, చేస్తున్న–, చేసే–, చేయ బోయే–* ఇత్యాదులు క్రియావిశేషణాలు. కారణం **—** ఆ భాషలో వీటికిక్కూడా విశేషణాలకు మల్లే లింగ, వచన, విభక్తులు ఉన్నాయి. ఇక్కడ ఉదాహరణలుగా తెలుగు పదాల్నే ఇస్తున్నాను. కానీ వీటి వివరణల్ని సంస్కృత పదాలకు అన్వయించు కోవలసినది.

చేసిన : దీన్ని *క్తవత్* అంటారు. ఇది మనకు పెద్దగా అవసరపడదు. ప్రాచీన తెలుగుకవులెవఋా దీన్ని ప్రయోగించలేదు.

చేయబడిన : దీన్ని *'క్తాంతం'* అంటారు. ఇంగ్లీషులో Part Participle అంటారు. Past Participles నే విశేషణా ల్లాగా. వాడే అలవాటు ఆ భాషలో ఉంది కనుక వాటిని క్తాంతాలతో అనువదించడం ఉత్తమం.

చేస్తున్న : దీన్ని *శత్రంతం* అంటారు. *శానజంతం* అని కూడా అంటారు.

చేసే : దీన్ని 'లుట్' అంటారు.

చేయబోయే : దీన్ని 'లృట్టు' అంటారు.

వీటి సమాచారాన్ని 14 వ అధ్యాయంలో విపులంగా ఇవ్వడం జఋగింది. పరిశీలించగలరు.

(iii) కొన్నిటిని నేరుగా సహజ (పూర్వ్యాయత్త) విశేషణాలతోనే అనువదించాలి. వాటికోసం క్రొత్తగా లాక్షణిక నిర్మాణాలు చేయడం కృతకంగా ఉంటుంది. ఉదాహరణకి–

addicted to – (కి) మఋగిన, బానిసైన ; casual – యథాలాపం ; chequered – ఎగుడుదిగుళ్ళ ; extempore – ఆశువు ; formal – శిష్ట ; garrulous – వాచాలుడైన ; globular – గుండ్రని ; hardcore–కఋడుగట్టిన ; incidental – అవాంతర– ; mercurial – చంచలమైన random– గ్రుడ్డివేటు ; stentorian–మేఘగంభీర మైన ;

(iv) విశేషణాల ప్రయోగం అవసరం లేని సందర్భాలు :– మూలాంగ్ల నిర్మాణాలలో విశేష్యమూ, దాని విశేషణమూ వేఋవేఋైనప్పటికీ తెలుగులో మాత్రం కొన్నిసార్లు నామవాచకాల్ని నామవాచకాలతోనే సమసించడం ద్వారా విశేషణాల భావాన్ని వ్యక్తీకరించవచ్చు. ఉదాహరణకి, ఈ క్రింది ఆంగ్ల, ఆంధ్ర పదనిర్మాణాల్ని పోల్చండి :

Administration – పరిపాలన	*Administrative officer – పరిపాలనాధికారి*
America – అమెరికా	*American President – అమెరికా అధ్యక్షుడు*
Constitution – రాజ్యాంగం	*Constitutional amendment – రాజ్యాంగ సవరణ*
Discretion – విచక్షణ	*Discretionary powers – విచక్షణాధికారాలు*
Environment – పర్యావరణం	*Environmental clearance – పర్యావరణ అనుమతి*
Family – కుటుంబం	*Familial issues – కుటుంబ సమస్యలు*
Literature – సాహిత్యం	*Literary festival – సాహిత్యోత్సవం*
Mind – మనస్సు	*Mental agony – మనోవేదన*
North – ఉత్తరం	*Northern India – ఉత్తర భారతం*
Law – న్యాయం	*Legal aid – న్యాయసహాయం*

Profession – వృత్తి	*Professional Education – వృత్తివిద్య*
Religion – మతం	*Religious books – మతగ్రంథాలు*

వీటిల్లో తొలి సమాసావయవం విశేషణంలా ప్రవర్తిస్తుంది.

II. మనకు ఏయే అర్థాల్లో విశేషణాలు అవసరమవుతాయి ?

ఆంగ్ల విశేషణాల్ని తెలుగులోకి అనువదించేటప్పుడు ఏదో అస్పష్టమైన అవగాహనతోనో, గ్రుడ్డివేటుగా దొఱికిన పదాల (random words) తోనో అనువదించడం మంచిది కాదు. మూలాంగ్లపదాలు ఎంతగా అందఱికీ తెలిసినవే అయినా ముందు వాటి అసలైన అర్థాల్నీ, ఉపార్థాల్నీ క్షుణ్ణంగా మళ్ళీ తెలుసుకోవాలి. ఆ అర్థాలన్నీ తెలుగులో ఓపిగ్గా వ్రాసుకోవాలి. ఇంగ్లీషులో కాకుండా, తెలుగులో ఆలోచించడం మొదలుపెట్టాలి. మూలానుసారంగానే కాకుండా వైవిధ్యంగా కూడా ఆలోచించాలి. ఆ అర్థాలకు తగ్గ పదాలూ, ప్రత్యయాలూ, సమాస–అవయవాలూ ఏమిటై ఉంటాయా? అని ఊహించుకోవాలి. మన జ్ఞాపకశక్తి మనకు పూర్తిగా సహాయపడకపోతే నిఘంటువుల్నీ, వ్యాకరణ గ్రంథాల్నీ, అలాంటి మార్గదర్శనాల్నీ సంప్రదించే శ్రమ తప్పనిసరిగా తీసుకోవాలి. అప్పుడే ఆ పదాల్ని అనువదించడానికి పూనుకోవాలి.

అనుకున్న అర్థంలో ఏ కొత్తపదమూ రాత్రికి రాత్రే పుట్టదు. ఇంతకు ముందున్న పాతపదాలు ఏ విధంగానైతే పరిణామం చెందుతూ వచ్చాయో, మనం కనిపెట్టిన కొత్తపదాలు కూడా మన మనస్సులలో అలాగే పరిణామం చెందుతాయి. ఉదాహరణకి, triumphant అనే విశేషణానికి మనం మొదట 'విజయగర్వి' అనే సమానార్థకం బావుందని అనుకోవచ్చు. తరువాతి రోజుల్లో దాన్ని 'విజయోత్సాహి' అని మార్చుకోవచ్చు. ఆ తరువాత వేఱొకఱు ఈ రెంటి కన్నా ఇంకా మెఱుగైన పదాన్ని సూచించవచ్చు. ఇందులో మనకు రాగద్వేషాలు ఉండాల్సిన అవసరం లేదు. అలాగే మనం కొత్తపదాల్ని నిష్పాదించేటప్పుడు, ఎవఱో ఏదో అనుకుంటారనో, ఆమోదించరనో, లేక True translation అంటూ ఎగతాళి చేస్తారనో వెనుకంజ వేయకూడదు. పదాలేవీ స్వర్గంలోంచి ఊడిపడవు. వాటిని ఎవఱో ఒక భూలోక మానవుడు కల్పించాల్సిందేనని మఱువరాదు.

౧. ఆంగ్లంలో ఒక గణనీయశాతపు లాక్షణిక విశేషణాల్ని *సంబంధించిన'* **అనే అర్థంలో వాడతారు.** ఉదాహరణకి–

Alpahbet	→	*Alphabetical*	*= వర్ణమాలకు సంబంధించిన (వర్ణమాలేయ / అకారాదిక)*
Bi – party	→	*Bipartite*	*= ఇరుపక్షాలకు సంబంధించిన (ద్వైపాక్షిక)*
Cardio	→	*Cardiac*	*= గుండెకు సంబంధించిన (హార్దిక)*
Cartography	→	*Cartographic*	*= పటరచన (పటకర్మ) కు సంబంధించిన (పాటకర్మిక)*
Cerebrum	→	*Cerebral*	*= మెదటికి సంబంధించిన (మైధసిక)*
Corpus	→	*Corporal*	*= శరీరానికి సంబంధించిన (శారీరిక)*

Corpus	→	*Corporate*	*= సార్థవాహాలకు సంబంధించిన (సార్థవాహిక)*
Culture	→	*Cultural*	*= సంస్కృతికి సంబంధించిన (సాంస్కృతిక)*
Locus	→	*Local*	*= ఒక ప్రదేశానికి సంబంధించిన (స్థానిక/ ప్రాదేశిక)*
Nation	→	*National*	*= జాతికి సంబంధించిన (జాతీయ)*

అదే విధంగా–

Decennial = పదేళ్ళకి సంబంధించిన (దాశాబ్దిక, దశవర్షీయ)

Epidermal = చర్మపు పైపొఱకు సంబంధించిన (పారిచర్మిక)

Electoral = ఎన్నుకునేవారికి సంబంధించిన (వారీతృక)

Fluvial = నదికి సంబంధించిన (నాదేయ)

Royal = రాజుకు సంబంధించిన (రాజకీయ)

Regional = ప్రాంతానికి సంబంధించిన (ప్రాంతీయ)

ఈ అర్థాన్ని స్ఫురింపజేయడానికి సంస్కృతంలో కూడా నామవాచకానికి వివిధ ప్రత్యయాల్ని చేఱుస్తారు. వీటిల్లో ముఖ్యమైనవి ఇకాంతాలూ, ఆదివృద్ధిమాత్ర విశేషణాలూ, యాంతాలూ, ఈయాంతాలూ, ఈనాంతాలూ, ఏరాంతాలూ, పరాంతాలూ.

(i) ఇకాంతాలు :- ఇక ప్రత్యయం చేఱే విశేషణాలు *ఇకాంతాలు.* **ఇది చేఱేటప్పుడు ఆ నామవాచకం యొక్క మొదటి అచ్చుకు వృద్ధి వస్తుంది.** వృద్ధి ముఖ్యంగా నాలుగు తెఱగులుగా ఉంటుంది.

(అ) ఆ పదం అకారంతో మొదలైతే ఆ అకారం దీర్ఘమవుతుంది. పదాది అచ్చు స్వతహాగానే 'ఆ' కారం అయితే మార్పుండదు. ఉదాహరణకి–

అంగం → ఆంగ → ఆంగిక

అధునా → ఆధున → ఆధునిక

అర్థం (డబ్బు) → ఆర్థ → ఆర్థిక

అశ్వం → ఆశ్వ → ఆశ్విక

ఆత్మ → ఆత్మిక

ఆయుధం → ఆయుధిక

కర్మ → కార్మ → కార్మిక

కాలం → కాలిక

గ్రంథం → గ్రాంథ → గ్రాంథిక

పక్షం → *పాక్షికం*
ప్రథమ → *ప్రాథమిక*
మనస్ → *మానస* → *మానసిక*
మాసం → *మాసిక*
వర్షం → *వార్షిక*
వాక్ (చ్) → *వాచిక*
శబ్దం → *శాబ్ద* → *శాబ్దిక*

(ఆ) అది ఇకారం గానీ, ఈకారం గానీ, ఏకారం గానీ అయితే 'ఐ' కారంగా మారుతుంది. అది స్వతహాగానే 'ఐ' కారమైతే మార్పుం డదు. ఉదాహరణకి–

ఇతిహాసం → *ఐతిహాస* → *ఐతిహాసిక*
ఐరావతం → *ఐరావతిక*
గిరి → *గైరిక*
ద్విపక్షం → *ద్వైపక్ష* → *ద్వైపక్షిక*
దేవ → *దైవ* → *దైవిక*
నీతి → *నైతిక*
అటవి → *ఆటవిక*
లింగం → *లైంగ* → *లైంగిక*
వీణ → *వైణిక (వైణికుడు)*
వేదం → *వైద* → *వైదిక*
శైవాలం (నాచు)→ *శైవాలిక*
స్త్రీ → *స్త్రైణ* → *స్త్రైణిక*
సేన → *సైన* → *సైనిక (సైనికుడు)*

(ఇ) అది ఉకారంగానీ, ఊకారం గానీ, ఓ కారంగానీ అయితే 'ఔ' కారంగా మారుతుంది. అది స్వతహాగానే 'ఔ' కారమైతే మార్పుండదు. ఉదాహరణకి–

ఓషధి (మందుమొక్క) → *ఔషధిక*
కుశ (దర్భ) → *కౌశ* → *కౌశిక*
గౌతమ (ఒక ఋషి) → *గౌతమిక*
జ్యోతిస్ (వెలుగు) → *జ్యౌతిష* → *జ్యౌతిషిక*

భూత (పంచభూతాలు) → భౌత → భౌతిక

(ఉ) అది ఋకారమైతే 'ఆర్' గా మారుతుంది. ఉదాహరణకి–

మృదంగం → మార్దంగ → మార్దంగిక (మార్దంగికుడు = మద్దెల వాయించేవాడు)
వృత్తి (వ్యాఖ్య) → వార్తి → వార్తిక

(ఊ) పదాది అక్షరం యకార సంయుక్తం గలదైతే తొలి సంయుక్త అవయవానికి 'ఐ' అనే అక్షరం ఆగమం అవుతుంది.
ఉదాహరణకు– వ్యాకరణం.
ఈ పదాన్ని 'వ్ + య్ + ఆకరణం' అని అర్థం చేసుకోవాలి. ఇందులో పదాది అక్షరమైన 'వ్యా' అనేది వకార – యకారాల సంయుక్తం. ఈ సంయుక్తంలో మొదటి అవయవం వకారం. రెండోది యకారం. విశేషణాన్ని నిష్పాదించేటప్పుడు వకారానికి 'ఐ' అనే ఆగమాన్ని చేర్చాలి. ఆ తరువాతనే పదాంతంలో 'ఇక' ప్రత్యయం వస్తుంది. అప్పుడు–

వైయాకరణ → వైయాకరణిక
న్యాయం → నైయాయ → నైయాయిక
వ్యాసుడు → వైయాస → వైయాసిక
వ్యాఘ్రం → వైయాఘ్ర → వైయాఘ్రిక మొ॥వి.

(ఎ) పదాంత అచ్చు ఉకారమైతే, 'ఇక' ప్రత్యయం చేఅబోయే ముందు అది 'అవ్' గా మారుతుంది. ఉదాహరణకి,

పశు → పాశవిక
వస్తు → వాస్తవిక
మధు → మాధవిక
బంధు → బాంధవిక
జంతు → జాంతవిక

(ii) ఆదివృద్ధిమాత్ర విశేషణాలు :– పైవిధంగా 'ఇక' ప్రత్యయాన్ని చేర్చకుండానే పదాది అచ్చుని వృద్ధిగా మార్చడం ద్వారా **కూడా విశేషణాల్ని నిష్పాదిస్తారు.** ఇలా నిష్పన్నమైనవాటిల్లో కొన్ని కాలక్రమేణా వ్యవహారంలో నామవాచకాలుగా స్థిరపడ్డాయి.

ఉరస్ (హృదయం) → ఔరసుడు (కోరుకుని కన్న కొడుకు)
ఏణం (జింక) → ఐణం (జింకచర్మం)

కర్మ (పని) → కార్ముడు (పనిచేసేవాడు)

కుముదం (తెల్లకలువ) → కౌముది (వెన్నెల = తెల్లకలువల్ని వికసింపజేసేది)

ఛందస్ (వేదం) → ఛాందసుడు (వేదాధ్యయనం తప్ప ఇంకేమీ తెలియనివాడు, ఇంకేదీ ముఖ్యం కానివాడు)

తిల (నువ్వులు) → తైలం (నూనె = మొదట్లో నువ్వుల నుంచి మాత్రమే తీయబడేది)

తేజస్ (అగ్ని) → తైజసం (లోహం = అగ్నిలో కళిగేది)

ధూర్ (కాడి) → ధౌరేయం (కాడి మోసేది = ఎద్దు ; ధౌరేయుడు = సమర్థుడు)

పంథా → పాంథుడు

పయస్ (పాలు) → పాయసం (పాలతో కలిపి వండిన అన్నం)

పురం (ఊరు) → పౌరుడు (ఊరి వాస్తవ్యుడు)

సూరుడు (సూర్యుడు) → సౌర (శక్తి, సౌర కుటుంబం మొ||)

<u>(iii) యాంతాలు :-</u> పదాంత అచ్చు స్థానంలో 'య' ప్రత్యయాన్ని చేఋస్తారు. కానీ ఇలాంటి నిర్మాణాల్లో హెచ్చుశాతం కాలక్రమేణా నామవాచకాలయ్యాయి. ఉదాహరణకి–

అహస్ → అహస్యం (పగటిపూట చేయదగినది)

ఆచారం → ఆచార్యుడు (ఆచారాన్ని నేర్పేవాడు)

ఈశాన → ఈశాన్యం

వాయు → వాయవ్యం

కవి → కావ్యం

రాజా → రాజ్యం

తపస్ → తపస్య (అదే)

నమస్ → నమస్య (అదే)

పథం → పథ్యం (వైద్యుడు సూచించిన ఆహారమార్గం)

పాదం → పాద్యం (కాళ్ళు కడుక్కోవడానికి)

భృతం (జీతం) → భృత్యుడు (జీతం తీసుకుని పనిచేసేవాడు)

రథం → రథ్య (ప్రధాన రహదారి, పలు రథాలు వెళ్ళదగ్గ మార్గం)

రహస్ → రహస్యం (అదే)

వనం → వన్యం (అడవిజంతువు)

వీర (పురుషుడు) → వీర్యం (అతనికి సంబంధించినది)

పదాది అక్షరం సంయుక్తమైతే 'ఇయ' ప్రత్యయాన్ని చేర్చాలి. ఉదాహరణకి,

సముద్రం → సముద్రియం

(iv) ఈయాంతాలు :- (అ) అకారాంత, ఈకారాంత పదాల యొక్క చివఱి అచ్చు స్థానంలో 'ఈయ' ప్రత్య యాన్ని చేఱు స్తారు. ఉదాహరణకి–

అంతరం (మధ్య) → అంతరీయం

(నడుము నుంచి క్రింది వఱకు ధరించబడేది – ధోవతి లేదా చీర)

(కాకమూ, తాళమూ) కాకతాళం → కాకతాళీయం

జిహ్వామూలం → జిహ్వామూలీయం

దేశం → దేశీయం

ప్రాంతం → ప్రాంతీయం

భారతం → భారతీయం

భోజరాజు → భోజరాజీయం

రాష్ట్రం → రాష్ట్రీయం

శతరుద్రం → శతరుద్రీయం

శాస్త్రం → శాస్త్రీయం

స్వం → స్వీయం

స్థానం → స్థానీయం

సింహళం → సింహళీయం

(ఆ) 'ఈయ' ప్రత్యయాన్ని నేరుగా చేర్చడానికి సాధ్యం కాని సందర్భాల్లో 'కీయ' అని చేర్చవచ్చు. ఉదాహరణకి,

రాజ → రాజకీయ

పర → పరకీయ

(ఆ) 'ఆ, ఇ' అనే అచ్చులు అంతంలో గల పదాలకు 'ఈయ' ప్రత్యయం చేఱినప్పుడు మొదటి అక్షరపు అచ్చుకు వృద్ధి వస్తుంది. ప్రత్యయం 'ఏయ' అవుతుంది. ఉదాహరణకి–

రేఖా (గీత) → రైఖేయం (గీతలా సన్నగా, వరుసగా)

లంకా → లాంకేయుడు (లంకారాజ్య వాస్తవ్యుడు)

వినతా → వైనతేయుడు (వినత కుమారుడు = గరుత్మంతుడు)

శిలా (ఱాయి) → శైలేయం (ఱాతి నుండి పుట్టినది)

సరమా (కుక్కలకు ఆదిమాత అయిన దేవత) → సారమేయం (కుక్క)

అగ్ని → *ఆగ్నేయం*
జ్ఞాతి (బంధువు) → *జ్ఞాతేయం (బంధువుల సమూహం)*
వ్రీహి (వఱి) → *వ్రైహేయం (వఱి పండడానికి పనికొచ్చేది = వఱినేల)*
శక్తి → *శాక్తేయం (పరమాత్మను దేవీరూపంగా ఉపాసించే ఒక హిందూ మతశాఖ)*
సురభి (కామధేనువు) → *సౌరభేయి (కామధేనువు యొక్క సంతానం = ఆవు)*

(v) ఈనాంతాలు :- (అ) పదాంత అచ్చు స్థానంలో 'ఈన' ప్రత్యయాన్ని చేఱుస్తారు. ఉదాహరణకి–

అత్యంతం (మిక్కిలి) → *అత్యంతీన (మిక్కిలి వేగంగా వెళ్లే)*
అనుకామం (ఇష్టప్రకారం) → *అనుకామీన (ఇష్టం వచ్చినట్లు వెళ్ళే)*
కాలం → *కాలీన*
నవం → *నవీన*
యుగం → *యుగీన*
విశ్వజనం → *విశ్వజనీన*
సమామ్ సమామ్ (ప్రతిసంవత్సరమూ) → *సమాంసమీన (ప్రతిసంవత్సరమూ జఱిగే)*
సర్వజనం (జనమంతా) → *సర్వజనీన*
హ్యంగవం (నిన్నటి పాలు) → *హైయంగవీనం (వాటినుంచి తీసిన నెయ్యి)*

(ఆ) మూలపదంలో రేఫ ఉంటే 'ఈన' ప్రత్యయం ఈణ' గా మారుతుంది. ఉదాహరణకి,

కర్మ(పని) → *కర్మీణ (పనిచేసే)'*
పారం (అవతలి ఒడ్డు) → *పారీణ (అవతలి ఒడ్డుకు చేఱుకున్న)*

(vi) ఏరాంతాలు :- పదాంత అచ్చు స్థానంలో 'ఏర' ప్రత్యయాన్ని చేఱుస్తారు. ఇది చేఱినప్పుడు పదాది అచ్చుకు వృద్ధి వస్తుంది. ఉదాహరణకి–

కులటా (దుశ్శీల) → *కౌలటేర (దుశ్శీలకు పుట్టిన)*
దాస (పనివాడు) → *దాసేర (పనివాడికి పుట్టిన)*
దేవ (ప్రభువు) → *దేవేరి (ప్రభువు భార్య)*

ఈ తెలుగు నిర్మాణాలు మఱీ ఎక్కువ లేవు. దీన్ని విస్తృత ప్రయోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

(vii) పరాంతాలు :- ఏ పదానికైనా '*పరం*' అని చేర్చడం ద్వారా విశేషణంగా మార్చవచ్చు. దీన్ని 'సంబంధించిన' అనే అర్థంలోనే కాక, 'చెందిన, అధీనమైన, వైపు, కోణం' అనే అర్థంలో కూడా వాడతారు. ఉదాహరణకి,

వ్యక్తి → వ్యక్తిపరం వ్యక్తిపర వైవిధ్యం
సాహిత్యం → సాహిత్యపరం సాహిత్యపర ఆసక్తులు
వృత్తి → వృత్తిపరం వృత్తిపర సూక్ష్మాలు
వాతావరణం → వాతావరణపరం వాతావరణపర అనిశ్చితులు
సమాజపరం → సమాజపరం సమాజపర ఆస్తి
సిద్ధాంతం → సిద్ధాంతపరం సిద్ధాంతపర అభ్యంతరాలు
రక్షణ → రక్షణపరం రక్షణపర సమస్యలు
భద్రత → భద్రతాపరం భద్రతాపర జాగ్రత్తలు

(viii) **ఏ నియమానికీ లోబడని విశేషణకార్యాలు** : ఇవి అనంతంగా ఉన్నాయి. వీటిని ప్రయోగం నిఘంటువుల ద్వారానే గ్రహించను వీలుపడుతుంది. ఉదాహరణకి–

పుంస్ → పౌంస్న (పురుషులకు సంబంధించిన)
స్త్రీ → స్త్రైణ (స్త్రీలకు సంబంధించిన) మొ॥

౨. ఆంగ్లంలో కొన్ని విశేషణాల్ని *'కలిగిన'* **అర్థంలో అనే అర్థంలో వాడతారు.** ఉదాహరణకి–

Ambitious – Ambition కలిగిన
Bashful – Bash (సిగ్గు) కలిగిన
Bicameral – 2 ఛాంబర్లు కలిగిన
Bifocal – 2 ఫోకస్సులు కలిగిన
Binary – రెండు అంగాలు కలిగిన
Brainy – Brain కలిగిన
Cellular – Cells కలిగిన
Cultured – Culture కలిగిన
Leprous – Leprosy కలిగిన
Moneyed – Money కలిగిన

ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి *'క, మతుప్, ఇని, ల'* ప్రత్యయాల్ని నామవాచకానికి తరువాత చేఱుస్తారు.

ఉదాహరణకి–

అర్థం → అర్థక / అర్థవంత.

(i) క ప్రత్యయం :– ఇది అన్ని తెలుగుల నామవాచకాలకీ చివర చేఱుతుంది. ఉదాహరణకి–

పుస్తం (వ్రాత / పూత) → పుస్తక (వ్రాత కలిగిన)
నామ → నామక (పేరు కలిగిన)
సత్తా → సత్తాక (ఉనికి కలిగిన)
పరంపరా → పరంపరాక (ఎడతెగని వరుస కలిగిన)
లతా → లతాక (తీగలు కలిగిన)
శ్రీ → శ్రీక (సౌభాగ్యం కలిగిన)
హేతు → హేతుక (కారణం కలిగిన)
సంపత్తి → సంపత్తిక (సంపద కలిగిన)
ఆయుష్ → ఆయుష్క (ఆయుష్షు కలిగినది)
యశస్ → యశస్క (యశస్సు కలిగిన)
ధనుష్ → ధానుష్క (ధనుర్విద్యకలిగిన = ధనుర్విద్యలో నేర్పరియైన)
తటా → తటాకం (గట్లు కలిగిన = చెఱువు)

(ii) మతుప్ ప్రత్యయం :– ఇది ఇకారాంత, ఋకారాంతాలు కాని నామవాచకాలకు చేఱినప్పుడు 'వంత / వతి' అనే రూపాల్ని పొందుతుంది. పున్నపుంసక లింగాల్ని సూచించేట్లయితే 'వంత' అవుతుంది. స్త్రీలింగాన్ని సూచించేట్లయితే 'వతి' అవుతుంది. ఉదాహరణకి,

గుణం → గుణవంతుడు / గుణవంతం / గుణవతి
విద్య → విద్యావంతుడు / విద్యావంతం / విద్యావతి
తేజస్ → తేజోవంతుడు / తేజోవంతం / తేజోవతి
జ్ఞానం → జ్ఞానవంతుడు / జ్ఞానవంతం / జ్ఞానవతి
భాస్ → భాస్వంతుడు / భాస్వంతం / భాస్వతి
రాజన్ → రాజన్వంతుడు / రాజన్వంతం / రాజన్వతి
కుముద్ → కుముద్వంతుడు / కుముద్వంతం / కుముద్వతి

ఇది ఇకారాంత, ఋకారాంతాలకి చేఱినప్పుడు 'మంత / మతి' అనే రూపాల్ని పొందుతుంది. ఉదాహరణకి–

శక్తి → శక్తిమంతుడు/ శక్తిమంతం/ శక్తిమతి

బుద్ధి → బుద్ధిమంతుడు/ బుద్ధిమంతం/ బుద్ధిమతి

భర్త → భర్తృమంతం/ భర్తృమతి (భర్త గల స్త్రీ)

హ్రీ → హ్రీమతి (తప్పు చేయడానికి సంకోచించం/ తప్పు జఱుగుతుందేమోననే భయం గల స్త్రీ) మొ॥

(iii) ణిని ప్రత్యయం :– ఇది చేఱినప్పుడు అకారాంత నామవాచకపు తుది అచ్చు స్థానంలో 'ఇన్' వస్తుంది. ఈ 'ఇన్' లోని తుది నకారపు పొల్లుని తెలుగులో ఉపయోగించరు. ఉదాహరణకి : శాస్త్రం → శాస్త్రిన్. కానీ తెలుగులో 'శాస్త్రి' అనే అంటారు. ఈ ప్రత్యయాంతాల్లో ఏకవచన పుల్లింగరూపాలే ఏకవచన నపుంసకలింగ రూపాలు కూడా. ఉదాహరణకి,

		పుల్లింగరూపం	స్త్రీలింగ రూపం
అధికారం	→	*అధికారి*	*అధికారిణి*
అర్థం	→	*అర్థి*	*అర్థిని*
గుణం	→	*గుణి*	*గుణిని*
గృహం	→	*గృహి*	*గృహిణి*
జ్ఞానం	→	*జ్ఞాని*	*జ్ఞానిని*
మంత్రం	→	*మంత్రి*	*మంత్రిణి*

(iv) సకారాంత నామవాచకాలు :– వీటికి 'ఇన్' బదులుగా 'విన్' చేఱుతుంది. ఈ 'విన్' లోని తుది నకారపు పొల్లుని తెలుగులో ఉపయోగించరు. ఈ ప్రత్యయాంతాల్లో కూడా పుల్లింగరూపాలే నపుంసకలింగ రూపాలు. ఉదాహరణకి,

		పుల్లింగరూపం	స్త్రీలింగ రూపం
తేజస్	→	*తేజస్వి*	*తేజస్విని*
మనస్	→	*మనస్వి*	*మనస్విని*
ఓజస్	→	*ఓజస్వి*	*ఓజస్విని*
తపస్	→	*తపస్వి*	*తపస్విని*

(v) లాంతాలు :– పదాంతంలో 'ల' ప్రత్యయాన్ని చేఱుస్తారు. సాధారణంగా అకారాంత, ఆకారాంత పదాలకే ఈ ప్రత్యయం చేఱుతుంది. 'ల' ప్రత్యయం చేఱేటప్పుడు పదాంత అచ్చు స్థానంలో కొన్నిసార్లు ఇకారమూ, కొన్నిసార్లు ఆకారమూ వస్తాయి. ఇవి మొదట్లో విశేషణాలుగా మొదలై నామవాచకాలుగా స్థిరపడి ఉండొచ్చు. ఉదాహరణకి,

అనం (ఊపిరి) → *అనిలుడు (ఊపిరి పోసేవాడు = గాలిదేవుడు)*

సికతా (ఇసుక) → *సికతిలం (ఇసుకమయమైన నేల)*

అంసం (మూపు) → *అంసలుడు (దృఢమైన మూపు కలవాడు)*

కుండం (కుండ) → *కుండలం (కుండలా గుండ్రంగా ఉండేది)*

కుంతం (ఒక ఆయుధం) → *కుంతలం (ఆ ఆయుధంలా పొడవుగా ఉన్నటువంటిది = తలవెంట్రుక)*

కృష్ణం (నల్లనిది) → *కృష్ణల (నల్లనిది = పూసల గురివింద)*

చండం (తీవ్రం = extreme) → *చండాలుడు (తీవ్రమైన స్వభావం గలవాడు)*

జట (జడ) → *జటిలం (జడల్లా చిక్కుముళ్ళు పడినది)*

తమం (చీకటి) → *తమాలం (చీకటిలా దట్టంగా ఉండేది = చాలా ముదురాకుపచ్చరంగు ఆకులు గల చీకటిచెట్టనే సముద్రతీరపు వృక్షం)*

రసం → *రసాలం (రసం గలది = మామిడిపండు)*

ధూమం (పొగ) → *ధూమలం (పొగవంటి రంగు = బూడిదరంగు, Grey color)*

పటం (వస్త్రం) → *పటలం (ఇంటి కప్పు = ఇంటిని కప్పే వస్త్రంలాంటిది)*

౩. ఆంగ్లంలో కొన్ని విశేషణాల్ని *'లేని'* **అనే అర్థంలో వాడతారు.** ఉదాహరణకి–

Aimless – Aim లేని

Baseless – Base లేని

Blameless – Blame లేని

Bloodless – Blood లేని

Boundless – Bounds లేని

Brainless – Brain లేని

Breathless – Breath లేని

Careless – Care లేని

Cheerless – Cheer లేని

Effortless – Effort లేని

Doubtless – Doubt లేని

ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి 'రహిత, అపేత, హీన, విహీన' అనే సమాస అవయవాల్ని నామవాచకంతో సమాసిస్తారు. వీటిల్లో 'హీన, విహీన' అనేవి నీచార్థకాలు. ఉదాహరణకి–

మానవులు లేని విమానం = మానవ రహిత విమానం (Unmanned aircraft)

రంగు లేని ద్రవం = వర్ణ రహిత ద్రవం (Colourless liquid)
విశ్వాసం లేని సేవకుడు = విశ్వాసరహిత సేవకుడు (Faithless servant)
చట్టంతో అదుపుకాని జనం = చట్టరహిత జనం (Lawless masses)
బుద్ధి లేని ఏల్బడి = బుద్ధిహీన పాలన (Tactless rule)
సిగ్గు లేని నడత = లజ్జాహీన ప్రవర్తన (Unabashed demeanor)
సంస్కారం లేని ధోరణి = సంస్కారహీన ధోరణి (Uncultured attitude)

కొన్నిటిని మాత్రం ఇంత బారుగా కాకుండా ఇంతకు ముందటి అధ్యాయాల్లో చెప్పినట్లు 'అ, నిర్, ని' అనే ఉపసర్గలతో క్లుప్తంగా అనువదించాల్సి ఉంటుంది. వీటిని చేర్చినప్పుడు కొన్నిసార్లు పదం నపుంసకలింగంగా మారడమే కాక పదానికి చివఱ 'క' ప్రత్యయం కూడా వస్తుంది. ఉదాహరణకి,

అంతం లేని = అనంత (infinite)
ఆకారం లేని = నిరాకార (formless)
కారణం లేని = అకారణ (irrational)
అవసరం లేని = అనవసర (needless)
ఆధారం లేని = నిరాధార (baseless)
సంతోషం లేని = నిస్తేజ (cheerless)
లక్ష్యం (జాగ్రత్త) లేని = నిర్లక్ష్య (careless)
సందేహం లేని = నిస్సందేహ (doubtless)
దయ లేని/ దయమాలిన = నిర్దయ (merciless)

౪. ఆంగ్లంలో కొన్ని విశేషణాల్ని *'కూడుకొన్న'* **అనే అర్థంలో వాడతారు.** ఉదాహరణకి–

Pithy – Pith (చేవ) తో కూడుకొన్న
Contemptuous – Contempt తో కూడుకొన్న
Consensual – Consensus తో కూడుకొన్న
Curvaceous – Curves తో కూడుకొన్న
Hazardous – Hazards తో కూడుకొన్న
Harmonious – Harmony తో కూడుకొన్న
Sensational – Sensation తో కూడుకొన్న
Fashionable – Fashion తో కూడుకొన్న
Tearful – కన్నీళ్ళతో కూడుకొన్న

Melodious – Melody తో కూడుకొన్న

(అ) ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి నామవాచకాన్ని ఈ క్రింది అవయవాలతో సమాసిస్తారు.

యుక్త, యుత = కలిసిన ; **అన్విత, సమన్విత** = పొందుపడిన ; **ఉపేత, సహిత** = తోడువచ్చిన, కూడుకొన్న ; **మిశ్ర** = కలగలిసిన ; **పూర్వక, పురస్సర** = ముందుపెట్టుకున్న, నడపబడుతున్న (led by, prompted by) **శాలి (శాలిని)** = ప్రకాశించే ; **ద్వితీయ** = రెండోది / రెండోవాడుగా కలిగిన.

ఉదాహరణలు :

లయ → *లయాన్విత* (rhythmic)
రాగం → *రాగయుక్త*
శైలి → *శైలీసమన్విత*
భక్తి → *భక్తియుత*
బాధ్యత → *బాధ్యతాయుత*
బలం → *బలోపేత*
సందర్భం → *సందర్భసహిత*
ప్రతిభ → *ప్రతిభాశాలి (ప్రతిభాశాలిని)*
ప్రజ్ఞాశాలి → *ప్రజ్ఞాశాలి (ప్రజ్ఞాశాలిని)*
జయం → *జయశాలి (జయశాలిని)*
భార్య → *భార్యాద్వితీయుడు*

(ఆ) ఇంత బారుగా చెప్పాల్సిన పని లేనప్పుడు ఈ అర్థంలోనే 'స' అనే ఉపసర్గని నామవాచకానికి ముందు వాడతారు. ఉదాహరణకి,

అభిప్రాయం → *సాభిప్రాయం (ఉద్దేశంతో కూడుకొన్న)*
ఆకారం → *సాకారం (ఆకారంతో కూడుకొన్న)*
ఆయుధం → *సాయుధ (ఆయుధాలతో కూడుకొన్న)*
కుటుంబం → *సకుటుంబం (కుటుంబంతో కూడుకొన్న)*
టీక → *సటీకం (టీకతో కూడుకొన్న)*
పరివారం → *సపరివారం (పరివారంతో కూడుకొన్న)*

'స' అనే ఉపసర్గని చేర్చినప్పుడు కొన్నిసార్లు పదం నపుంసకలింగంగా మారడమే కాక పదానికి చివఱ 'క' ప్రత్యయం

కూడా వస్తుంది. సామాన్య అవగాహనలో ఈ 'కలిగిన, కూడుకొన్న' అనే అర్థాలు సాధారణంగా పరస్పరం విజ్జోడవు తాయి.

౫. ఆంగ్లంలో కొన్ని విశేషణాల్ని *'నిండిన'* **అనే అర్థంలో వాడతారు.** ఉదాహరణకి–

Blissful – Bliss తో నిండిన
Colourful – Colours తో నిండిన
Troublesome – Troubles తో నిండిన
Irksome – Irks తో నిండిన
Doubtful – Doubt తో నిండిన
Eventful – Events తో నిండిన
Ferrous – ఇనుముతో నిండిన
Gassy – Gas తో నిండిన
Regretful – Regrets తో నిండిన
Vengeful – పగతో నిండిన

ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి నామవాచకాన్ని 'పూర్ణ, పూరిత, భరిత, మయ, భూయిష్ఠ, ఆవహ' **అనే అవయవాలతో సమాసిస్తారు.** ఉదాహరణకి–

అశ్రువులు → అశ్రుపూర్ణ
భక్తి → భక్తిపూర్ణ
భావం → భావపూర్ణ
మహత్త్వం → మహత్త్వపూర్ణ
ఆవేశం → ఆవేశపూరిత
కాంతి → కాంతిపూరిత
కుట్ర → కుట్రపూరిత
ద్వేషం → ద్వేషపూరిత
ద్రోహం → ద్రోహపూరిత
ప్రేమ → ప్రేమపూరిత
మోసం → మోసపూరిత
అవినీతి → అవినీతిమయం
జలం → జలమయం

బుఅద → *బుఅదమయం*

దుర్గంధం → *దుర్గంధభూయిష్ఠం*

సమాసం → *సమాసభూయిష్ఠం*

సుఖం → *సుఖావహం*

భీతి → *భీత్యావహం (భీతావహం అని వాడుతున్నారు)*

ఆశ → *ఆశావహం*

ముదం → *ముదావహం*

౬. ఆంగ్లంలో కొన్ని విశేషణాల్ని *'వంటి/లాంటి/పోలిన'* అనే అర్థంలో వాడతారు. ఉదాహరణకి–

Boyish – Boy లాంటి

Circular – Circle లాంటి

Bulbous – Bulb లాంటి

Bushy – bush లాంటి

Cynical – Cynic లాంటి

Demon-like – Demon లాంటి

Dreamy – Dream లాంటి

Elephantine – Elephant లాంటి

Fanatical – Fanatic లాంటి

Gaseous – Gas లాంటి

ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి నామవాచకాన్ని 'ఆదృశ, సదృశ, ప్రాయ, ఆభ, నిభ, సన్నిభ, నిర్విశేష, సమ, సమాన, తుల్య, కల్ప, ఉపమాన, ఉపమ' అనే అవయవాలతో సమాసిస్తారు. వీటిల్లో 'సదృశ, ప్రాయ' అనేవి ప్రచురతరం. ఉదాహరణకి–

ఆత్మహత్యాసదృశ = ఆత్మహత్య చేసుకోవడం లాంటి

భ్రాతృసదృశ = సోదరుడిలాంటి

ఆత్మాదృశ = తనలాంటి

మాదృశ = నాలాంటి

త్వాదృశ = నీలాంటి

అస్మాదృశ = మాలాంటి

యుష్మాదృశ = మీలాంటి

తాదృశ = అలాంటి
స్వప్నప్రాయ = స్వప్నంతో సమానమైన
పశుప్రాయ = పశువులతో సమానమైన
శర్కరాప్రాయ = పంచదారలాంటి
పుత్రికానిర్విశేష = కూతురితో సమానం
ద్వీపకల్పం = ద్వీపం లాంటి భూభాగం (Peninsula)

౭. ఆంగ్లంలో కొన్ని విశేషణాల్ని 'తగిన' అనే అర్థంలో వాడతారు. ఉదాహరణకి,

Acceptable – స్వీకరించదగిన, అంగీకరించదగిన, ఆమోదించదగిన
Accessible – అందుకోదగిన, ప్రాపించదగిన
Admirable – మెచ్చుకోదగిన, ప్రశంసించదగిన
Admissible – అనుమతించదగిన
Adorable – ఆరాధించదగిన
Air-worthy – వాయుయానానికి (డయనానికి) తగిన (డయనీయం, డయనార్హం, వాయుయానార్హం))
Audible – వినదగిన
Bailable – పూచీకత్తుకు తగిన
Beatable – మించదగిన
Flexible – వంగదగిన, వంచదగిన
Visible – చూడదగిన
Winnable – గెలవదగిన

(అ) ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి క్రియాధాతువుల (verbs) కి 'య, తవ్య/ ఇతవ్య, అనీయ' **అనే ప్రత్యయాల్ని ఉపయోగించాలి.** ఉదాహరణకి,

పరిష్కరించు – పరిష్కార్యం, పరిష్కర్తవ్యం, పరిష్కరణీయం
ధరించు – ధార్యం, ధర్తవ్యం, ధరణీయం
పరిహరించు (పోగొట్టు, తీసివేయు) – పరిహార్యం
వందించు (వందనం చేయు) – వంద్యం, వందితవ్యం, వందనీయం
విమర్శించు – విమర్శ్యం, విమృష్టవ్యం, విమర్శనీయం
అధిగమించు (మించు) – అధిగమ్యం, అధిగంతవ్యం, అధిగమనీయం
ద్వేషించు – ద్వేష్యం, ద్విష్టవ్యం, ద్వేషణీయం

క్రయించు (కొను) – క్రేయం, క్రేతవ్యం, క్రయణీయం
నిరూపించు – నిరూప్యం, నిరూపితవ్యం, నిరూపణీయం
ప్రదర్శించు – ప్రదర్శ్యం, ప్రదర్శితవ్యం, ప్రదర్శనీయం
లిఖించు – లేఖ్యం, లిఖితవ్యం, లేఖనీయం
గర్హించు – గర్హ్యం, గర్హితవ్యం, గర్హితవ్యం

విశేష పరిజ్ఞాన నిమిత్తం 14 వ అధ్యాయాన్ని పరికించవలసినది.

(ఆ) నామవాచకాలకైతే 'అర్హ, యోగ్య, ఆస్పద, ఉచిత, భాజన' **అనే సమాసావయవాలతో సమాసిస్తారు.** వీటిల్లో 'ఆస్పద' శబ్దం 'అవకాశమున్నటువంటిది' అనే అర్థంలో కూడా వాడబడుతోంది. ఉదాహరణకి,

అనుమతికి తగినది = అనుమతార్హం
ఆమోదానికి తగినది = ఆమోదయోగ్యం
సంతలో పెట్టడానికి తగినది = విపణియోగ్యం (Marketable)
ఎగతాళికి తగినది = పరిహాసభాజనం
జయించదగినది = జయాస్పదం
హాస్యానికి తగినది = హాస్యాస్పదం
ముద్రపడడానికి అవకాశమున్న వయసు (impressionable age) = ముద్రాస్పద వయసు
రోగాలు వచ్చే అవకాశమున్న ప్రదేశం = రోగాస్పద ప్రదేశం
యుద్ధం రావడానికి అవకాశమున్న పరిస్థితి = యుద్ధాస్పద పరిస్థితి
వాహనాలకు తగిన మార్గం (Motorable road) = వాహనయోగ్యం, వాహనోచిత మార్గం

౮. కొన్ని విశేషణాలు 'ఒకేదాన్ని కలిగిన' **అనే అర్థంలో వాడబడతాయి. ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి నామ వాచకానికి ముందు** 'స' **అనే ఉపసర్గని చేఱుస్తారు.** ఉదాహరణకి,

సవయస్కులు	=	ఒకే వయసు కలవాడు
సగోత్రులు	=	*ఒకే గోత్రానికి చెందినవారు*
సధర్మం	=	*ఒకే స్వభావం కలది*
సమనస్కులు	=	*ఒకే మనస్సు గలవారు (Likeminded)*
సనాగరులు	=	*ఒకే నగరానికి చెందినవారు*

౯. కొన్ని విశేషణాలు 'కలిసి ఒక పనిచేసిన/ చేసే' **అనే అర్థంలో వాడబడతాయి. ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి ఒక**

క్రియాజన్య నామవాచకానికి ముందు 'సహ' అనే ఉపసర్గని చేఱుస్తారు. ఉదాహరణకి,

కలిసి అధ్యయనం చేసినవాడు = సహాధ్యాయి / సహాధ్యయనుడు
కలిసి ధర్మాన్ని చరించేది = సహధర్మచారిణి
కలిసి వెళ్ళిపోవడం = సహగమనం
కలిసి చేయడం = సహకారం
కలిసి అనుభూతి చెందడం = సహానుభూతి
కలిసి బ్రతకడం = సహజీవనం

౧౦. కొన్ని విశేషణాలు 'అంతా/వఱకు' అనే అర్థంలో వాడబడతాయి. ఈ అర్థాన్ని ద్యోతకం చేయడానికి నామ వాచకానికి ముందు 'ఆ' అనే ఉపసర్గని చేఱుస్తారు. ఉదాహరణకి,

ఆజీవితాంతం = జీవితం చివఱి వఱకు, జీవితమంతా
ఆదివసం = పగలంతా, పగటివేళ జఱుగుతున్నంతవఱకు
ఆవర్షం = సంవత్సరమంతా
ఆపాలనం = పరిపాలనాకాలం పొడవునా

౧౧. ఆంగ్లంలో కొన్ని విశేషణాల్ని క్రియాధాతు జన్యమైన సమాస అవయవాలతో అనువదించాల్సి వస్తుంది.
ఉదాహరణకు–

Accident-prone – ప్రమాదాస్పద
All-time (high, low etc.) – సార్వకాల, సార్వకాలీన (పతనం ఉత్థానం మొ.)
Beneficial = లాభాన్నిచ్చే/కలిగించే – లాభదాయక, లాభప్రద
Calculated – బాగా లెక్కలు వేసుకొన్న / వేసుకొనే – సుగణిత
Carcinogenic = క్యాన్సర్ ని పుట్టించే / కలిగించే– రాజవ్రణకారక, రాజవ్రణజనక
Carnivorous = మాంసాల్ని తినే – మాంసఖాది
Coagulant = గడ్డకట్టించే – సంస్త్యాయక
Comatose = అపస్మారకంలో ఉన్న – అపస్మారకస్థ
Contagious = అంటుకునే – సంక్రామక
Coolant = చల్లబఱిచే – శీతకారి, శీతకారక
Cooperative = సహకరించే – సహకారి, సహకారక
Diurnal = పగటిపూట సంచరించే – దివసచర, దివసంచర, దినచర, దినంచర, దివసీన
Drought-ridden – కఱువుపీడిత

Effective = ప్రభావాన్ని కలిగించే తత్త్వం గల – ప్రభావశీల, ప్రభావకర, ప్రభావవంత
User-friendly – వాడుకరి సఖ / వాడుకరి-అనుకూల
Germicidal = క్రిముల్ని చంపే – క్రిమిసంహారక, క్రిమిహ, క్రిమిఘ్న
Grief-stricken – విచారగ్రస్త
Hallucinogenic = భ్రమల్ని కలిగించే – భ్రాంతికారక, భ్రాంతిజనక, భ్రాంతిప్రద, భ్రాంతికర
Humorous = నవ్వుపుట్టించే – హాస్యకర. హాస్యజనక
Labour-intensive = కార్మికులు కావాల్సిన – కార్మికాపేక్షం, కార్మిక సాపేక్షం
Capital-intensive = పెట్టుబడి కావాల్సిన – మూలధనాపేక్షం, మూలధన సాపేక్షం
London-bound – లండన్ కి వెళుతున్న (లండన్ నగరోన్ముఖ)
Painstaking = శ్రమ తీసుకోవాల్సిన – శ్రమాపేక్షం, శ్రమసాపేక్షం
Successful = జయాన్ని ఇచ్చే / ఇచ్చిన – జయప్రద
Nocturnal = రాత్రిపూట సంచరించే – రాత్రిచర, రాత్రించర, రాత్రీణ
Professional = నిపుణుడికి తగిన – నిపుణోచితం
Unprofessional = నిపుణుడికి తగనటువంటి – అనిపుణోచితం, నిపుణానుచితం
Water-proof = నీరు చొఱబడరాని (నీటినడ్డుకునే)– జలరోధి, జలదుర్గమం
Film-buff = చలనచిత్రాల్ని ఇష్టపడే – చిత్రప్రేమి, చిత్రప్రేమికుడు, చిత్రప్రియుడు
Foodie = భోజనాన్ని ఇష్టపడే – భోజనప్రియుడు

ఈ తెలుగు విశేషణాల్ని పైన కుడివైపున చూపిన విధంగా వేఱువేఱు క్రియాజన్యాలతో చిన్నసమాసాలుగా చేసి అనువదించాల్సి వస్తుంది. అందుకోసం ఈ క్రింద డు, ము,వు,లు లేకుండా ఇచ్చిన సమాస అవయవాల్ని వివిధ సందర్భాలకు సరిపోయేలా సమయస్ఫూర్తితో ఉపయోగించుకోవలసినది. ఇంకా అదనంగా కావాల్సివస్తే 14 వ అధ్యాయంలో చూడొచ్చు.

Trans

ఆంగ్లంలో Trans అనే ఉపసర్గ ఉంది. 'అతీతమైన, దాటిన, అవతలి' అనే అర్థాల్లో దాన్ని నామవాచకాల ముందు ఉపయో గిస్తారు. ఇలా ఉపయోగించినప్పుడు ఆ పదసమ్మేళనం విశేషణమవుతుంది. ఉదాహరణకి– Trans-national (జాత్యతీత- / జాతిక్రాంత-). దానికి సాటిగా మన దగ్గఱున్న ఉపసర్గ 'అతి'. కానీ దీన్నిప్పుడు మఱో అర్థంలో వాడుతున్నారు. అయితే 'అతీత/క్రాంత' అనే సమాసావయవాలతో Trans ని అనువదించడానికి చాలా వఱకు వీలుంది.

III. రెండుపదాలు గల విశేషణాల నిష్పాదనలో శీఘ్ర ఆచూకీ (quick reference) **కోసం పదాంత్య సమాసావయవాలు కొన్ని :**

అడ్డుకునే = రోధి, రోధక
అనే = వాది, వాదక, వక్త
అఱిచే = ఘోషక, ఆక్రోశక
అసహ్యించుకొనే = జుగుప్సక
అసహ్యించుకోబడిన = జుగుప్సిత
ఆడించే = విన్యాసక
ఆడించబడిన = విన్యస్త
ఆడే = క్రీడక, ఖేలక
ఆపే = స్తంభక, ప్రతిష్టంభక
ఆలోచించే = చింతక, ఆలోచక, యోచక, మీమాంసక
ఇచ్చే = ప్రద, దాయక, ప్రదాయక, దాత (తృ), ప్రదాత (తృ)
ఇవ్వబడిన = దత్త, ప్రదత్త
ఉంచబడిన = న్యస్త
ఉంచే = న్యాసక
ఉన్న = స్థిత, గత, స్థ
ఉపయోగపడే = ఉపయోగి, అర్థ, నిమిత్తక, హేతుక
ఎండగొట్టే = శోషక
ఎండే / ఎండిన = శుష్క
ఎక్కే = ఆరోహి
ఎదురుచూసే = ప్రతీక్షి, ప్రతీక్షక, నిరీక్షక, నిరీక్షి
ఎన్నుకునే = వరీత / వరీతృ
ఎఱిగిన / తెలిసిన = జ్ఞ, వేది
ఏడ్చే = శోచక
ఏడిపించే = విలాపక
ఏరే / ఏరుకొనే = ఉంఛక
ఏర్పఱిచే = విధాయి, విధాత (తృ)
ఓర్చుకొను = సహ, క్షమ
కట్టబడిన = నిర్మిత

కట్టుబడ్డ = బద్ధ, నిబద్ధ

కట్టే = నిర్మాయి, నిర్మాతృ

కలపబడిన = సంధానిత

కలిగించే = జనక, కర, కారక, కారి, కర్త

కలిపే = సంధాయి, సంధాయక, మేళక

కలిసే = మిళన

కలిసిన = మిళిత, మిశ్ర

కల్పించబడిన – కల్పిత

కల్పించే — కల్పక

కఱిగే = లీన

కాలిన/ కాల్చబడిన = దగ్ధ

కాలే = దహర

కాల్చే = దాహక

కొట్టే = తాడక, ప్రహారి

కొట్టబడిన= తాడిత, ప్రహృత

చూసే = దర్శి, ద్రష్ట, వీక్షక, అవలోకి

చూపే = దర్శక, ప్రదర్శక

చేసే = కర, కారక, కారి, కర్మి, కర్త

చేయబడిన =కృత

చంపే = హ, హంత, ఘ్న, ఘాతుక, సంహారి, సంహారక, మారి, మారక

చనిపోయిన = మృత, హత, పరేత

చదివే = అధ్యాయి, పాఠక

చల్లే = వికీర్ణి

చూసే = వీక్షక, దర్శి

జఱిగే =సంఘటి, సంభవ

జల్లే = వికీర్ణి

తగ్గించే = హ్రాసక

తగ్గించబడిన/ తగ్గిన =హ్రాసిత

తగ్గే = హ్రాసి

తడిసే = స్తేమక

తడిపే — సేచక

త్రాగే = సేవి

తిట్టే = దూషక, విమర్శక

తినే = భక్షక, ఖాది, ఆద, ఆహారి

తిప్పే = భ్రామక

తిప్పబడిన = భ్రామిత

తిరిగే = చర

(మనుషులు) తిరిగే = ఆటక

(వస్తువులు) తిరిగే = ఘూర్ణక

తీసుకొనే = గ్రాహి, గ్రహీత

తీసుకోబడ్డ =గృహీత

తృప్తిపడే = తృప్త

తృప్తిపఱచే = తర్పక

తొక్కే = అవమర్దక

తొలగించే = పరిహారి, పరిహర, పరిహారక

దాక్కునే = గూహక

దాచే = గోపక, గోపి

దాటే/ దాటించే = తారక

దిగే = అవరోహి

దిగిన = అవరూఢ

ద్వేషించే = ద్వేషి, ద్వేషక

ద్వేషించబడిన = విద్విష్ట

ధ్వనించే = ధ్వానక, స్వానక, నాదక, రావి

నడపబడే = చోదిత

నడిపే = చోదక

నవ్వే = హాసక, హాసి

నిలబడే/ నిలిచే = స్థాయి

నివసించే = వాసి, నివాసి, వాస్తవ్య

నిర్లక్ష్యం చేసే = ఉపేక్షి, ఉపేక్షక

పండే = ఫలి

పట్టుకొనే = గ్రాహక

పడిపోయే = అధఃపాతి

పడుకునే = శాయి, స్వాపి

పుట్టిన = జ, జన్య, జాత, భవ, సంభవ, ఉద్భవ

పుట్టించే = జనక

పుట్టించబడిన = జనిత

పిసికే = పీడక

పెఱిగిన/ పెంచబడిన = భృత

పెఱిగే = ఏధక, ఏధి

పెంచే = పరివర్ధక, వర్ధక, విస్ఫారక

పెంచబడిన = వర్ధిత, పరివర్ధిత, విస్ఫారిత

పొందే/ చేఱే = ఆపి, ప్రాపి

పొందబడిన = లబ్ధ, ఆప్త, ప్రాప్త

పొగిడే = ప్రశంసక

పోగొట్టే = అపహ, నిస్తారక

పోయిన = గత

పోయే = గామి

పోరాడే = సంఘర్షక, సంఘర్షి

ప్రభావం చూపించే = ప్రభావక

ప్రభావించబడిన = ప్రభావిత

ప్రయాణించే = ప్రయాయి, యాత్రిక

ప్రేరేపించబడే = ప్రేరిత, ప్రచోదిత

ప్రేరేపించే = ప్రేరక, ప్రచోదక

ప్రేలే/ ప్రేల్చే — విస్ఫోటక

ప్రేలిన/ ప్రేల్చబడిన – విస్ఫోటిత

బయటికి వచ్చిన = నిర్గత

బాధించబడిన = బాధిత

బాధించే = బాధక, బాధి

బోధించే = బోధక, ఉపదేశక, అధ్యాపక

మండే = ప్రజ్వలి, ప్రజ్వాలక

మాట్లాడే = భాషి, ప్రసంగి, వచస్క

మోయబడే = సంభృత

లేచే = ఉత్థాయి, ప్రతిబోధి

లేచిన – ఉత్థిత

లోపల ఉన్న = గత, అంతర్గత, స్థ

వండే = పాచక

వచ్చే = ఆగామి

వర్షించే = వర్షక, వర్షి

వాదించే = వాది, వాదక

వ్రాయబడిన = లిఖిత

వ్రాసే = లేఖక

వ్యాపించే = వ్యాపక

వ్యాపించిన = వ్యాప్త

వినే = శ్రావి, శ్రావక, శ్రోత, ఆకర్ణి, ఆకర్ణయిత

వెలిగే = ప్రకాశక

వెళ్ళే / పోయే = గామి

వెళ్ళిన = గత

వెళ్ళగొట్టే = బహిష్కారి, బహిష్కర, బహిష్కర్త, నిష్కాసక, నిష్కాసి

వెలికితీసే = నిష్కారి, నిష్కర, నిష్కర్త

వ్యక్తం చేసే = ద్యోతక

సేవచేసే / సేవించే = సంసేవి

సృజించే / సృష్టించే = స్రష్ట (స్రష్టృ), సర్గి, సర్జక

స్ఫురింపజేసే = స్ఫోరక

వీటిని ఇలా కాకుండా ఉపసర్గలతో కలిపి ఏకపదాలుగా వాడినా చాలా కొత్త పదాలు పుట్టుకొస్తాయి. ఉదాహరణకి–

ప్రతి = మళ్ళీ, ఎదురు

జన్ (జనించు) = పుట్టడం

జన్యం = పుట్టదగినది / పుట్టించదగినది

ప్రతిజన్యం = Renewable

ప్రతిజన్య శక్తివనరులు = Renewable energy resources

అభ్యాసకార్యములు

1. ఈ క్రింది విశేషణాలకి 'తర, తమ' ప్రత్యయాల్ని చేర్చి, వివిధ లింగాలకి అన్వయించి వాక్యాల్లో ప్రయోగించండి :

1. మధురం 2. సమీపం 3. విశదం 4. నిగూఢం 5. సులభం 6. జటిలం 7. రమణీయం 8. తీక్ష్ణం 9. భీకరం

10. ఇష్టం 11. మృదువు 12. ప్రియం 13. కోమలం 14. స్ఫుటం 15. స్పష్టం 16. కఠినం 17. అక్షయం 18. విహ్వలం 19. విక్లబం 20. లలితం.

II. ఈ క్రింది నామవాచకాలకి 'తర, తమ' ప్రత్యయాల్ని చేర్చి వాక్యాల్లో ప్రయోగించండి :

1. గురువు 2. పర్వతం 3. సరస్సు (సరస్) 4. మాత (తృ) 5. అమాత్యుడు 6. నగరం 7. గ్రంథం 8. దేవత 9. 10. విద్వాంసుడు (విద్వత్).

III. ఈ క్రింది పదాలకి 'ఉత్తమ, రాజ, రత్న, ప్రముఖ, ప్రకాండ, తల్లజ, సత్తమ, శ్రేష్ఠ' శబ్దాలలో సముచితమైనది ఏదో ఎంచుకొని దానితో సమాసించండి :

1. సచివుడు 2. తీర్థం 3. మంత్రి 4. పురోహితుడు 5. స్త్రీ 6. పౌరుడు 7. కవి 8. సేవకుడు 9. గృహం 10. మణి 11. కావ్యం 12. శూరుడు 13. సుభాషితం 14. నటుడు 15. పద్యం 16. భక్తుడు 17. కృషీవలుడు 18. వానరుడు 19. పక్షి 20. పురుషుడు 21. ఋతువు 22. సాధువు.

IV. ఈ క్రింది స్త్రీలింగ పదాల్ని 'మతల్లి' లేక 'మతల్లిక' అనే పదంతో సమాసించండి :

1. సోదరి 2. రాజ్ఞి 3. కవయిత్రి 4. అభినేత్రి 5. నటి 6. అవని 7. వల్లి 8. సుమనం (సుమనో) 9. ప్రభ 10. కవిత.

V.విశేషణాల్ని వాడకుండా, కేవలం నామవాచకాలనే సమాసిస్తూ ఈ క్రింది ఆంగ్ల పదబంధాల్ని అనువదించండి.

1. Academic excellence 2. Artistic masterpiece 3. Bridal make-up 4. Central minister 5. Civil society 6. Commercial capital 7. Communal clashes 8. Criminal mentality 9. Domestic violence 10. Electrical shock 11. Environmental damage 12. Fiscal deficit 13 Global warming 14. Honorary doctorate 15. Human bomb 16. Musical concert 17. Public relations 18. Residential zone 19. Romantic flavour 20. Royal palace 21. Vestigial organ 22. Western nations. (వీటికి సమాధానాలు కావాలంటే ఈ అధ్యాయం చివఱ చూడండి)

VI. ఈ క్రింది నామవాచకాలకి 'ఇక' అనే ప్రత్యయాన్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. భూమి 2. తరువు 3. పదార్థం 4. పాలన 5. కులం 6. చర్మన్ 7. వర్ణం 8. ప్రబంధం 9. జాతి 10. శైలి 11. గురువు 12. శిరస్ 13. సారస్వతం 14. వాహనం 15. అణువు 16. సింధువు 17. అంబువు 18. ముష్టి 19.

ఉపాస్తి 20. ప్రతినిధి 21. కపాలం 22. కరుణ 23. తంత్రం 24. మంత్రం 25. సంప్రదాయం 26. నగరం 27. శత్రువు 29. ముహూర్తం 30. ప్రపంచం 31. సమాజం 32. సంఘం 33. విమానం 34. నావ 35. వసువు (ధనం) 36. మండలం.

VII. ఈ క్రింది నామవాచకాల పదాది అచ్చుల్ని కేవలం వృద్ధిగా మార్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. మహిళ 2. వృక్షం 3. పుష్పం 4. సస్యం 5. చంద్రుడు 6. పవనం 7. శరీరం 8. శకటం (బండి) 9. ఋషి 10. ముని 11. విధి 12. కర్మన్ 13. దేవుడు 14. వికుంఠుడు 15. సికత (ఇసుక) 16. శ్రుతి 17. స్మృతి 18. ప్రకృతి 19. ఇంద్రుడు 20. ఇంధనం 21. ఋతువు 22. సేతువు 23. జంబూ (నేరేడు) 24. విద్యుత్ 25. గ్రీష్మం (వేసవి) 26. శశ్వత్ 27. గణం 28. ఉపనిషద్.

VIII. ఈ క్రింది నామవాచకాలకి 'య' అనే ప్రత్యయాన్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. యశస్ 2. నభస్ (ఆకాశం) 3. తథా (అలాగే) 4. మూలం 5. కాలం 6. నస్ (ముక్కు) 7. ఆయుష్ 8. స్వర్గం 9. గంధం 10. జాతి 11. వస్త్రం 12. తమస్ 13. ఉదరం 14. దిక్ (శ్) 15. పరిషద్ 16. అంతం 17. దివసం 18. నిట్ (శ్) (రాత్రి) 19. శాకం 20. పాకం 21. ధనం 22. పదం 23. మదం 24. హృద్ (గుండె) 25. సత్ (ఉన్నటువంటిది) 26. బ్రహ్మన్ 27. దివి 28. సంధి 29. గృహం 30. నవం 31. వాచస్పతి 32. జనుష్ (పుట్టుక).

IX. ఈ క్రింది నామవాచకాలకి 'ఈయ' అనే ప్రత్యయాన్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. వర్షం 2. మైత్రి 3. స్థానం 4. భాష 5. శాఖ 6. మనీష (మనస్సు) 7. వర్గం 8. తరంగం 9. మృత్స్న (మంచి మట్టి) 10. 11. మేషం 12. కీటకం 13. వైద్యం 14. పాలకుడు 15. భటుడు 16. లోహం 17. నాటకం 18. మిథునం (జంట) 19. పాఠశాల 20. సౌధం 21. హస్తం 22. గ్లౌ (చంద్రుడు).

X. ఈ క్రింది నామవాచకాలకి 'ఈన' అనే ప్రత్యయాన్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. అంతరంగం 2. అంతరిక్షం 3. మృగం 4. నాళం (గొట్టం) 5. క్రమం 6. సాగరం 7. అంబరం 8. అంతర్ (లోపల) 9. రోమం 10. నిగమం 11. బృందం 12. వత్సరం 13. వల్కలం (నార) 14. పరిసరం 15. పటలం (కప్పు) 16. ద్వారం 17. ఝరం (సెలయేఱు) 18. గహ్వరం (గుహ) 19. పల్లవం (చిగురు) 20. ఫలం 21. సమతలం 22. అంగం 23. సర్గం (సృష్టి) 24. గ్లౌ (చంద్రుడు).

XI. ఈ క్రింది నామవాచకాలకి 'ఏర' అనే ప్రత్యయాన్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. శాసనం 2. సుతుడు 3. కళ 4. పథం 5. పాదం 6. ఔషధం 7. కోశం 8. లింగం 9. సుమం 10. ఉదకం 11. ధనికుడు 12. యానం 13. కిరణం 14. భావం 15. యుద్ధం 16. సైన్యం 17. వచనం 18. రచన 19. హృదయం 20. బలం 21. బాలుడు.

XII. ఈ క్రింది నామవాచకాలకి 'ల' అనే ప్రత్యయాన్ని చేర్చి, విశేషణాల్ని నిష్పాదించి వాటిని వివిధ లింగాల్లోకి మార్చండి :

1. కేశం 2. లత 3. లోష్టం (మట్టి) 4. శూన్యం 5. సారం 6. భారం 7. క్షారం 8. ఛద్మ (మోసం) 9. కణం 10. మేఘం 11. పత్రం 12. మిత్రం 13. భంగం 14. శృంగం 15. ఘాసం (గడ్డి) 16. శిల 17. బాహువు 18. మృగం 19. ధ్వాంతం (చీకటి) 20. గణం.

XIII. ఈ క్రింది నామవాచకాలకి 'పరం' అనే సమాసావయవాన్ని చేర్చి ,విశేషణాల్ని నిష్పాదించి వాటిని మళ్ళీ ఇతర పదాలతో సమాసించండి :

1. విద్య 2. కులం 3. మతం 4. శాఖ 5. నైపుణ్యం 6. సేవ 7. దైవం 8. సాధన 9. సిబ్బంది 10. ప్రభుత్వం 11. వాణిజ్యం 12. దౌత్యం 13. శీలం 14. నిర్మాణం 15. వ్యవస్థ 16. సంస్థ 17. నిర్వహణ 18. యాజమాన్యం 19. మేధ 20. శృంగారం.

XIV. ఈ క్రింది నామవాచకాలకి 'క' అనే ప్రత్యయాన్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. తపస్ 2. వర్చస్ 3. శ్రేయస్ 4. కర్త (ర్తృ) 5. కర్మ 6. క్రియ 7. సువర్ణం 8. పర్ణం (ఆకు, ఈక్క) 9. ధైర్యం 10. శౌర్యం 11. దయ 12. భీతి 13. ముక్తి 14. జ్యోతిష్ 15. అనిలం (గాలి) 16. అనలం (అగ్ని) 17. సీమ 18. సౌందర్యం 19. చిత్రం 20. చిహ్నం 21. అంగారం (నిప్పుకణిక) 22. అటవి (అడవి).

XV. ఈ క్రింది నామవాచకాలకి 'మతుప్/ ఇని/ విన్/ స–' అనే ప్రత్యయాల్ని సందర్భానుసారంగా చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. కాంతి 2. శాంతి 3. వస్తువు 4. కీర్తి 5. రేతస్ (వీర్యం) 6. అనస్ (బండి) 7. ఉషస్ (ఉదయం) 8. తమస్ (చీకటి) 9. అర్చిష్ (మంట) 10. శోచిష్ (కాంతి) 11. రోచిష్ (కాంతి) 12. ధనుష్ (విల్లు) 13. అంధస్ (అన్నం) 14. ఉరస్ (ఱొమ్ము) 15. వక్షస్ (ఱొమ్ము) 16. అంహస్ (పాపం) 17. ఏనస్ (పాపం) 18. జలం 19. కల్మషం 20. అధికారం 21. స్నేహితులు 22. నిరూపణ 23. ఉపపత్తి (తర్కం) 24. మంత్రం 25. భార్య 26. పత్ని 27. ఆలోచన 28. హృదయం 29. ప్రేమ 30. కామం 31. అక్షరం 32. ప్రాసాదం (రాజభవనం) 33.

ప్రాకారం (ప్రహరీగోడ) 34. రోగం 35. శరీరం 36. పరిశ్రమం 37. వ్యాయామం 38. అభావం (లేమి) 39. లోపం 40. పాపం.

XVI. ఈ క్రింది నామవాచకాలకి 'రహిత, అపేత, హీన, విహీన' అనే ప్రత్యయాల్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. సారం 2. రసం 3. వివేకం 4. అందం 5. మార్దవం 6. మొహమాటం 7. అలంకారం 8. అహంకారం 9. వైభవం 10. శోభ 11. గుణం 12. సత్త్వం 13. ప్రతిభ 14. అవయవం 15. చలనం 16. ద్రవ్యం 17. కాగితం 18. ప్రత్యామ్నాయం 19. అవకాశం 20. అదృష్టం 21. శ్రమ 22. తెలివి 23. భావన 24. ఆలోచితం 25. ప్రణాళిక.

అదే విధంగా పైపదాలకే 'అ/అన్/నిర్/ నిస్' అనే ప్రత్యయాల్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి.

XVII. ఈ క్రింది నామవాచకాలకి 'యుక్త, యుత, అన్విత, సమన్విత, ఉపేత, సమేత, సహిత, మిశ్ర, పూర్వక, పురస్సర' అనే సమాసావయవాల్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. రాగం 2. భావం 3. బాధ్యత 4. ఓషధి 5. పదార్థం 6. ఆలాపం 7. బలం 8. టీక 9. తాత్పర్యం 10. ఆస్వాదన 11. వ్యాఖ్యానం 12. అర్థం 13. తేజస్ (తేజో) 14. ఓజస్ (ఓజో) 15. ఛందస్ (ఛందో) 16. పయస్ (పయో) (పాలు) 17. సేన 18. అభినయం 19. అనురాగం 20. వాత్సల్యం.

XVIII. ఈ క్రింది నామవాచకాలకి 'పూర్ణ, పూరిత, భరిత, మయ, భూయిష్ఠ, అవహ' అనే సమాస అవయవాల్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. భావోద్వేగం 2. ద్వేషం 3. కాలుష్యం 4. కశ్మలం 5. మలీమసం (మలినం) 6. దోషం 7. పరిమళం 8. సువాసన 9. ఆహ్లాదం 10. ఆనందం 11. హర్షం 12. దుఃఖం 13. శోకం 14. చింత 15. హేమం (బంగారం) 16. శిల 17. దారువు (చెక్క) 18. నేఅం 19. ఉత్సాహం 20. ఉద్రేకం.

XIX. ఈ క్రింది నామవాచకాలకి 'ఆదృశ, సదృశ, ప్రాయ, ఆభ, నిభ, సన్నిభ, నిర్విశేష, సమ, సమాన, తుల్య, కల్ప, ఉపమాన, ఉపమ' అనే సమాసావయవాల్ని చేర్చి విశేషణాల్ని నిష్పాదించండి :

1. ద్వీపం 2. మాత (తృ) 3. పిత 4. జామాత (అల్లుడు) 5. మానవుడు 6. వానరుడు 7. దేవత 8. రాజు 9. గురువు 10. శిష్యుడు 11. కుమారి 12. పుత్రుడు 13. అమృతం 14. స్వర్గం 15. ఇక్షువు (చెఱకు) 16. సూర్యుడు 17. వనం 18. కుసుమం 19. శిల 20. హాలాహలం 21. కాలకూటం 22. అగ్ని.

XX. ఈ క్రింది ఆంగ్ల పదబంధాల్ని అనువదించండి :

1. All–time record 2. Antibiotic medicine 3. Awe–struck 4. Battle–hardened 5. City–bred 6. Country–made 7. Cut–throat 8. Duty–bound 9. Duty–free 10. Duty–minded 11. Eco–friendly 12. Flight–ready 13. Fun–filled 14. Hand–held 15. Home–bound 16. Law–abiding 17. Leak–proof 18. Life–treatening 19. Long–proven 20. Man–made 21. Mentor–like 22. Motorable 23. Non–profit 24. Rebel–led 25. Record–breaking 26. Rule–compatible 27. Service–minded 28. Time–tested 29. Trigger–happy 30. User–friendly 31. Low–talent zone 32. High pressure zone 33. Industry–oriented 34. Test drive.

(వీటికి సమాధానాలు కావాలంటే ఈ అధ్యాయం చివఱ చూడండి)

V. అభ్యాసానికి సమాధానాలు

1. Academic excellence – విద్యాపారీణత
2. Artistic masterpiece – కళాకృతి
3. Bridal make–up – పెళ్ళిముస్తాబు (పెళ్ళి సింగారం)
4. Central minister – కేంద్రమంత్రి
5. Civil society – పౌరసమాజం
6. Commercial capital – వాణిజ్య రాజధాని
7. Communal clashes – మతకల్లోలాలు
8. Criminal mentality – నేరప్రవృత్తి
9. Domestic violence – గృహహింస
10. Electrical shock – విద్యుద్ ఘాతం
11. Environmental damage – వాతావరణ విధ్వంసం
12. Fiscal deficit – ద్రవ్యలోటు
13. Global warming – భూతాపం
14. Honorary doctorate – గౌరవ ప్రపట్టం
15. Human bomb – మానవ బాంబు
16. Musical concert – సంగీత కచేరి
17. Public relations – ప్రజాసంబంధాలు
18. Residential zone – నివాసప్రాంతం

19. Romantic flavour – శృంగార పరిమళం
20. Royal palace – రాజభవనం
21. Vestigial organ – అవశేష అవయవం (అవశేషాంగం)
22. Western nations – పశ్చిమ దేశాలు

XX అభ్యాసానికి సమాధానాలు

1. All–time record – సార్వకాల ప్రప్రథమత్వం
2. Antibiotic (medicine) – జీవఘ్నం, (జీవఘ్నౌషధం)
3. Awe–struck – అద్భుతావిష్ట
4. Battle–hardened – మహారథి
5. City–bred – పట్నకాపు
6. Country–made – నాటు (నాటు తయారీ)
7. Cut–throat – కుత్తుకలు ఉత్తరించుకొనే
8. Duty–bound – కర్తవ్యనిష్ఠుడైన
9. Duty–free – పన్నులేని (నిష్కరం)
10. Duty–minded – కర్తవ్యాత్ముడైన
11. Eco–friendly – పర్యావరణసఖం (పర్యా–సఖం)
12. Flight–ready – దయన సన్నద్ధం, డేష్యం
13. Fun–filled – సరదామయం
14. Hand–held – చేత్తో పట్టుకునే, హస్తధారితం
15. Home–bound – గృహోన్ముఖం
16. Law–abiding – చట్టనిబద్ధం, చట్టనిబద్ధుడైన
17. Leak–proof – స్రవణరోధి
18. Life–threatening – ప్రాణాపాయకరం
19. Long–proven – చిర నిరూపితం, చిర నిదర్శితం
20. Man–made – మానవకృతం
21. Mentor–like – గురునిర్విశేషుడైన, గురుతుల్యుడైన, గురుతుల్య–
22. Motorable – వాహనోచితం, వాహనయోగ్యం
23. Non–profit – లాభ నిరపేక్షం
24. Rebel–led – విప్లవకార పురోగమం
25. Record–breaking – అనిదంపూర్వం

26. Rule-compatible – నియమానుసారి, నిబంధనానుగుణం
27. Service-minded – సేవాభావుక / సేవాభావుకుడైన
28. Time-tested – కాలపరీక్షితం
29. Trigger-happy – తుపాకీరాముడైన
30. Knee-deep – మోకాటి లోతు (జానుదఘ్నం)
31. Low-talent zone – అల్పప్రతిభా మండలం / ప్రాంతం
32. High pressure zone – అధిక పీడన / ఒత్తిడి మండలం
33. Industry-oriented – పరిశ్రమోన్ముఖం, పరిశ్రమ లక్ష్యకం, పరిశ్రమ గమ్యకం, పరిశ్రమ ధ్యేయకం
34. Test drive – పరీక్షార్థ నడపకం

పదనిష్పాదన కళ

పన్నెండో అధ్యాయం

సమాస ఘటన ద్వారా నూతనపదాల నిష్పాదన

సమాసం అంటే ఏంటి ?

కొన్ని ప్రభేదాలున్నప్పటికీ, ప్రాథమికంగా సమాసమంటే ఒకటి కంటే ఎక్కువగా ఉన్న నామవాచక, విశేషణ శబ్దాల సమ్మేళనం. ఏ భాషలోనైనా పదం పక్కన పదాన్ని చేర్చి మాట్లాడడం వక్తృసౌలభ్యం. మన కాలపు భాషారంగంలో అన్ని ఇతర గ్రాంథిక మూలకాల మాదిరే సమాసాల పట్ల సైతం కృత్రిమంగా నిరసన వ్యాపింపజేయబడింది. ఇది మొదట సుదీర్ఘమైన, జటిల సంస్కృత సమాస ఘటనని నిరసించడంతో ఆరంభమై ఆ తరువాత అన్నిరకాల సమాస నిర్మాణాల్నీ వ్యతిరేకించే స్థాయికి ముదిరింది. సమాసాలు గ్రాంథికశైలి అనీ – అంటే అర్థం కాని శైలి అనీ, అవన్నీ సంస్కృతమేననీ, అవి లేకపోవడమే అచ్చమైన తెలుగు వ్యావహారికమనీ విస్తృతంగా ప్రచారమైంది. మాతృభాష యొక్క సహజలక్షణాల్లో ఒకటైన దానిపట్ల ఆ రకంగా జనంలో కృత్రిమంగా విరోధభావన ఉత్పాదించబడింది. అలా ఈ భావన కూడా వ్యావహారికవాదం వేసిన అనేకమైన వెఱ్ఱితలల్లో ఒకటిగా పరిణమించింది. కానీ ఈ అభిప్రాయం నిజం కాదని గమనించాలి. వీర వ్యావహారికవాదులు కూడా సమాసాల్ని సంపూర్తిగా పరిహరించి కలాన్ని కదపలేరు. సమాసపద్ధతిని విడనాడడం అంటే పదనిష్పాదన దుకాణాన్ని దాదాపుగా మూసుకున్నట్లే. ప్రపంచంలో సమాసాల్లేని భాషలు అరుదు.

ఇంగ్లీషులో సమాసాలు లేవా ?

ఈ ప్రస్తావన మీద ఇదివఱకే 2 వ అధ్యాయంలో కొంత చెప్పడం జఱిగింది. ఈనాడు వేలాదిగా అచ్చ ఇంగ్లీషు సమాసాలు వాడుకలో ఉన్నాయి. వ్యవహారసిద్ధమైన ఆంగ్ల సమాసరూపాల్ని గట్టిగా గుర్తుపెట్టుకుని వాడలేనివారికి భాష సరిగా రానట్లే విద్యావంత లోకంలో పరిగణన. ఉదాహరణకి,

Workload, mindset, area-specific, take-home salary, tax deductions, catchment area, man–animal encounters, win-win situation, one-to-one equation, cloudburst, sky-scraper, information technology-enabled services, high-priority area, minimum balance rule ఇత్యాది.

జర్మన్ లో సమాసాలు లేవా ?

జర్మన్ భాష పూర్తిగా సమాసాల మయం. సమాసాలు నేర్చుకోకుండా ఆ భాష మాట్లాడ్డమే అసాధ్యం. Wortbuch (నిఘంటువు), sprachweisenschaft (భాషాశాస్త్రం), dageszeitung (దినపత్రిక) మొదలైన రెండవయవాల సమాసాలే కాక సంస్కృతంలో మాదిరి పూర్తిపంక్తీ, అర్ధపంక్తీ ఆక్రమించుకునే సుదీర్ఘ సమాసాలకి సైతం ఆ భాషలో కొదవ లేదు. ఉదాహరణకి–

Betäubungsmittelverschreibungsverordnung *= Regulation requiring a prescription for an anesthetic. (ఆపరేషన్ మత్తుమందు కొనుగోలుకు ప్రిస్క్రిప్షన్ ఉండాలనే చట్టం)*
Donaudampfschifffahrtsgesellschaftskapitän *= Danube steamship company captain (డాన్యూబ్ ఆవిరినౌకా కంపెనీ తండేలు)*
Rechtsschutzversicherungsgesellschaften *= Legal protection insurance companies (శాసనిక రక్షణ బీమా కంపెనీలు)*
Rindfleischetikettierungsüberwachungsaufgabenübertragungsgesetz *= Beef labeling regulation & delegation of supervision law (గోమాంస ముద్రాంకన, నియంత్రణ మఱియు పర్యవేక్షణా అధికారదాన చట్టం)*

చైనీస్ లో సమాసాలు లేవా ?

చైనాభాషలో కూడా సమాసాలు నేర్చుకోలేకపోతే నోటికి తాళం వేసుక్కూర్చోవాల్సిందే. ఎందుకంటే ఆ భాషలో నూటికి 99 పదాలు సమాసాలే. రెండుపదాల్ని సమాసించి వాటి అర్థంతో స్వల్పసంబంధం మాత్రమే కలిగిన మూడో పదాన్ని నిష్పాదించడం ఈ భాష ప్రత్యేకత. మచ్చుకు ఈ క్రింది పదాలు చూడండి :

Zhong = మధ్య ; guo = రాజ్యం ; Zhongguo = చైనా
Mei = అందమైన ; guo = రాజ్యం ; Meiguo = అమెరికా
Hua = పువ్వు ; sheng = పుట్టినది ; huasheng = (పువ్వు నుండి పుట్టినది) వేరుసెనగ
Fei = కొవ్వు ; zao = నలుపు ; Feizao = సబ్బు
Xin = ఇంధనం ; shui = నీళ్ళు ; Xinshui = జీతం
Xiao = చిన్న ; shuo = మాటలు ; xiaoshuo = నవల
Di ping zian = Ground flat line (Horizon) = క్షితిజం
Fengyun = వాతావరణం ; renwu = మూర్తి ; Fengyun-renwu = Celebrity (జీవంత ప్రముఖుడు)

మన వ్యావహారికంలో సమాసాలు లేవా ?

తెలుగు కూడా పైభాషల్లాంటిదే. దీన్ని కూడా సమాసాలు లేకుండా మాట్లాడ్డమూ, వ్రాయడమూ కష్టమే. మన నిత్య వాడుకలో వందలాది సమాసాలున్నాయి. ఉదాహరణకి,

తల్లిదండ్రులు, పిల్లచేష్టలు, ముచ్చెమటలు, అచ్చుతప్పులు, పంటసాగు, పనిరోజులు, పనిఒత్తిడి, పనివేళలు, చవితి పండగ, చావుమేళం, పెళ్ళి ఏర్పాట్లు, పెండ్లి పిలుపు, మతిమఱుపు, వెలివేత, మేనకోడలు, తెలివితేటలు, పెంకుటిల్లు, పూరిపాక, వేగు చుక్క, సాగునీరు, పందిరిమంచం, కందిచేను, మామిడిపండు, జీడిమామిడి, ఆటవిడుపు, బాటసారి, ముందడుగు, ముం దంజ, వెనుకంజ, దూదిపింజ, బడిపంతులు, గుడిమాన్యం, చదువుసంధ్యలు, అదుపాజ్ఞలు ఇత్యాది.


ఇవి కాక, వందలాది సంస్కృత సమాసాలు సైతం జనసామాన్యపు వాడుకలో స్థిరపడిపోయాయి. మచ్చుకు,

ప్రేమకథ, ఏకధాటి, దేవాలయం, ఆవేశ కావేశాలు, కష్టసుఖాలు, ఇష్టాయిష్టాలు, ఉత్తరదిక్కు, సంతానభాగ్యం, రాజ యోగం, మీనమేషాలు, మహాపండితుడు, మానవప్రయత్నం, ధర్మదాత, గత సంవత్సరం, నష్టజాతకం, గర్వకారణం ఇత్యాది.

సమాసాలు చేసే మేలు

కనుక సమకాలీన పాత్రికేయులూ, ఇతర రచయితలూ సమాసాల్ని విడగొట్టి, ఆ విధంగా వాటి యొక్క అందమైన సంయుక్త స్వరూపాన్నీ, శ్రావ్యతనీ చెడగొట్టి తిరగవ్రాయను ఉద్యుక్తులు కావడం హర్షణీయం కాదు. సమాసాల్ని విడగొట్టి వ్రాస్తే, ఆ విడగొట్టిన పదస్వరూపాలు సమాసాలిచ్చే అర్థాన్నీ, అందాన్నీ, ఊపునీ, గౌరవనీయతనీ ఇవ్వవు. ఆ విధమైన నీరస, నిస్సాకార శైలికి 'వాడుకభాష' అని సునామకరణం (euphemism) చేయడం, అవి మాత్రమే అర్థమవుతా యంటూ బండవాదనకి దిగడం ఇంకా శోచనీయం. అది భాష గుఱించిన యథార్థాన్ని తిరగదిప్పడమే అవుతుంది. మాటలు నేర్చిన మనుషులు మాతృభాషని పదం పదంగా మాట్లాడరు. పదబంధాలుగా, వాక్యభాగాలుగా, వాక్యాలుగా మాట్లాడతారు. అలాగే గుర్తుపెట్టుకుంటారు కూడా. కనుక సమాసాలు భాషాస్వభావానికి అనుగుణంగా వాడుకలోకి వచ్చినవీ, అలాగే కొనసాగ గలిగినవే తప్ప అవి ఎవఱూ ఎవఱి మీదా రుద్దినవి కావు. ఇప్పుడు మనం వాడడం మానేసి నంత మాత్రాన భవిష్యత్తులో సరికొత్తగా పుట్టకుండా పోయేవీ కావు.

ఒకప్పుడు—అంటే 18వ శతాబ్దం వఱకూ ఇంగ్లీషులో కూడా సమాసాలు చేయకుండా పదాల మధ్య విభక్తిప్రత్యయాలూ, క్రియాపదాలూ చొప్పించి వ్రాసేవారు. ఆ పద్ధతిలో బారుబారు వాక్యభాగాలు తయారై, విసుగొచ్చి, సమాసాలుగా కలిపి



వ్రాయడం మొదలుపెట్టారు. ఉదాహరణకి ఆ రోజుల్లో ప్రచురించిన ఒక పుస్తకం పేరు ఇలా ఉంది: *A Treatise on Military Discipline in which is laid down and explained the Duty of the Officer and Soldier thro' Several Branches of the Service.*

ఇలాంటి పేర్లని పంక్తులు పంక్తులుగా పేర్చి టైటిల్ పుట మొత్తం నిండి పోయేలా పెద్దపెద్ద అక్షరాలతో ముద్రించేవారు. కానీ ఈ రోజుల్లో ఇంగ్లీషువాళ్ళేవఋా ఇంత పెద్ద పేర్లు పెట్టరు. పాతపద్ధతిలో పెట్టిన పేర్లు ఇంకా కొన్ని మిగిలిపోయినప్పటికీ టూకీగా పదం పక్కన పదాన్ని చేర్చి సమాసాలుగా వ్రాయడమే తాజా విలసనం. ఉదాహరణకి, సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వ సంస్థల పేర్లు కొన్ని చూడండి :

Natural Resources Conservation Service (NRCS)
Food Safety and Inspection Service (FSIS)
Cooperative State Research, Education and Extension Service (CSREES)
National Agricultural Statistics Service (NASS)
Grain Inspection, Packers and Stockyard Administration (GIPSA)
National Telecommunications and Information Administration (NTIA)

ప్రతికొత్త పరిభావనకీ విలక్షణమైన (unique) పేర్ల కోసం తడుముకో నవసరం లేకుండా సమాసాలు సౌలభ్యాన్ని అంది స్తాయి. అవి పాత పదాల మిశ్రమాలతోనే సరికొత్తదనాన్ని స్ఫురింపజేస్తాయి. పోలిక (Analogy) ని ఆధారంగా చేసు కొని, అంతకు ముందు భాషలో లేని పరిభావనల్ని సైతం అవి ప్రవేశపెడతాయి. అవి ప్రామాణికమై వ్యాపిస్తే, మాట్లాడే టప్పుడూ, వ్రాసేటప్పుడూ అభివ్యక్తి (expression) కోసం తడుముకునే పని లేకుండా, అవి సద్యఃస్ఫురణ కొచ్చి ధారా ళత (fluency) ని పెంపొందిస్తాయి. కొన్ని సమాసాలు జనంలో ప్రామాణికమూ, ప్రచురమూ ఐనప్పుడు, అవయవాలు వ్యవహారభ్రష్టమైనా సమాసాల రూపంలో అవి జీవించే ఉంటాయి. ఉదాహరణకి – కైవశం. ఇందులో 'వశం' ఒక్కటే ఇప్పుడు వాడుకలో ఉంది. 'కై' (చేయి) మాత్రం వ్యవహారభ్రష్టమైంది. కానీ 'వశం' అనే విడిపదంతో పాటు ఈ మొత్తం సమాసాన్నీ కూడా అదే అర్థంలో వాడుతున్నారు. కనుక సమాసరూపంలో 'కై' ఇప్పటికీ జీవించే ఉంది. అందుచేత సమా సాల్ని అనావశ్యకమని గానీ, పాతశైలి అని గానీ, పాండిత్యప్రకర్ష అని గానీ భావిస్తే అది అవివేచన, సమీపదృష్టీ అవు తుంది. తెలుగుభాష తనకి స్వాభావికంగా ఎప్పట్నుంచో ఉన్న సమాసశక్తిని ఇప్పటి అవసరాల కనుగుణంగా పూర్తిస్థాయి లో వినియోగించుకొని పరిపుష్టం కావాలి.

పదనిష్పాదన కళ

పదమూడో అధ్యాయం

సృజనశీలం (Creativity) **ద్వారా నూతనపదాల నిష్పాదన (అలాక్షణిక పద్ధతి)**

ఈ పుస్తకంలో అన్ని అధ్యాయాల్లోనూ, వ్యాకరణ సహాయంతో, తదనుగుణంగా కొత్తపదాల్ని ఎలా నిష్పాదించవచ్చునో చర్చించడం జఱిగింది. కానీ మానవ నాగరికతలో పదాలనేవి ప్రాథమికంగా ఒక నియమానికి లొంగి పుట్టినవి కావు. రాగ్రానూ, పోలికల (analogies) ద్వారా మఱికొన్ని కొత్తపదాల్ని కల్పించుకోవడాన్ని మనిషి అభ్యసించాక, వాటి మధ్య ఉమ్మడిగా ఉన్నలక్షణాల్ని గుర్తుపట్టి ఏర్పఱచుకున్నవి నియమాలు. వాటి సమాహారాన్నే తరువాతి కాలంలో వ్యాకరణమన్నారు. ఈ అధ్యాయంలో– సాంప్రదాయిక వ్యాకరణసూత్రాల్నీ, నియమాల్నీ పక్కన పెట్టి పదనిష్పాదన విహాయసంలో ఎలా ఱెక్కలు విప్పుకొని విహరించవచ్చో పరిశీలిస్తాం.

అయితే, ఈ సందర్భంగా ఒక మాట. దురదృష్టవశాత్తూ ఇలా ఊహల ప్రభంజనాన్ని ఉవ్వెత్తున ఉఱకలెత్తిస్తూ, స్వేచ్ఛగా, యథేచ్ఛగా ఆలోచించే మేధావారసత్వం మనకి లేదు. భారతీయులమైన మనం జ్ఞానం కంటే సమాజానికి ఎక్కువ బద్ధులం. ప్రతీ విషయాన్నీ సమాజదృష్టితో తప్ప మఱో రకంగా, ముఖ్యంగా జ్ఞానార్జనదృష్టితో ఆలోచించడం మనకు మొదట్నుంచీ అలవాటు లేదు. ఎంతమంది దేవతల్ని పూజించినా ఆచరణలో మాత్రం వాళ్ళందఱి కంటే గొప్పదేవత మనకు సమాజమే. దేవుడి క్కూడా అంత భయపడరు. మనవాళ్ళు ఏం చదివినా, ఏ వృత్తిలో ఉన్నా, సమాజవిలువలకే తప్ప దానికి అంకితం కారు. తద్ద్వారా ఇక్కడ సమాజప్రశంసలకి పాత్రమయ్యే బండలౌక్యానికీ, మోటుప్రవర్తనకీ తప్ప ఇహ దేనికీ విలువ లేదు. దానికి తోడు, దేనికైతే అలవాటుపడ్డామో అందుకు ఇసుమంత భిన్నంగా ఏం చేసినప్పటికీ కూడా, మఱుక్షణమే హోరాహోరీ ప్రపంచ యుద్ధాలైపోతాయి. దీని మూలాన మనలో ఏకకాలంలో రెండు పరస్పర విరుద్ధమైన ఆత్యంతిక మనస్తత్త్వాలు (extreme mentalites) సంప్రాప్తమయ్యాయి. అయితే మార్పునొల్లని ఛాందసం. లేకపోతే విదేశీ అయిన ప్రతీదాన్నీ ఆప్యాయంగా కౌగలించుకోవడం. సొంతబుఱ్ఱని స్వేచ్ఛగా ఉపయోగించడానికి అవకాశమివ్వని ఈ రెండూ తప్ప మూడోది ఎఱగరీ దేశస్థులు. అదొక వ్రాయబడని నేఱం కూడా! అందువల్ల ఈ వాతావరణంలో శాస్త్రాలూ, కళలూ, విజ్ఞానాలూ, కొత్త ఆలోచనలూ ఎదిగే అవకాశం లేక నశించిపోయాయి. కొన్ని మఱుగున పడిపోయాయి. లేదా, ఎదుగూ, బొదుగూ లేకుండా బోన్సాయి మొక్కల్లా మిగిలాయి. ఆఖరికి ప్రతీదీ విదేశాల నుంచి దిగుమతి చేసుకొని తెలుసుకోవాల్సిన దుఃస్థితి దాపరించింది.

ఈ నేపథ్యంలో వ్యాకరణ సూత్రాలకి దూరంగా, స్వేచ్ఛగా పదాల్ని నిష్పాదించే స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ సైతం ఇంగ్లీష్ లాంటి

విదేశీ భాషల వాతావరణం నుంచే పొందాల్సి వస్తుంది. వాటిని నమూనా (model) గా తీసుకుంటే తప్ప నిజంగా ఒక్క అడుగైనా ముందుకు పడని పరిస్థితి. మన సంఘపు ఆమోదముద్ర కూడా వారి సంప్రదాయానికే పడింది. కనుక ఇంగ్లీషు వారు స్వేచ్ఛామార్గంలో పదాల్ని కల్పించినప్పుడు వారు ఆ పనిని ఎన్నిరకాలుగా చేశారో గమనించాలి. ఇంగ్లీషువారు ముఖ్యంగా 5 స్వేచ్ఛాపద్ధతుల్లో అలాక్షణిక నిష్పాదనలు చేస్తున్నారు. అవి – 1. శిరోవాలనం (Blending or Port–manteau) 2. కర్తనం (Clipping) 3. ప్రత్యాహరణ (Acronymization) 4. నవగుణితం (Creative New Spelling) 5. నవసృజన (Novel Creation).

1. శిరోవాలనం (Blending or Portmanteau) :– ఒక పదపు తల (శిరస్సు) నీ, మఱో పదపు తోక (వాలం) నీ కలిపి ఒక కొత్త అర్థంలో మూడో పదాన్ని సిద్ధం చేయడమే శిరోవాలింపు. ఉదాహరణకి,

Glitter + Literati = Glitterati
(A group of glittering celebrities just like a group of famous men of letters)

Mock + Documentary = Mockumentary
(spoof documentary)

Gallop + Triumph = Galumph
(walk in a stomping, ungainly way)

Electric + Execute = Electrocute
(To kill by electrical current)

Smoke + Fog = Smog

Stagnation + Inflation = Stagflation
Car + Hijacking = Carjacking

Mock + Cocktail = Mocktail
(Cocktail with no alcohal)

Lion + Tiger = Liger
(Born to a male lion and and a female tiger)

Motor + Hotel = Motel

(A hotel by the wayside to serve the halting travellers who arrive by motor cars)

Web + log = Blog

ఇదే పద్ధతి ననుసరించి తెలుగులో నిష్పాదించదగ్గ పదాలు మచ్చుకు,

క్రీడ + మైదానం = క్రీదానం

వ్యాయామ + శాల = వ్యాశాల (లేక వట్టి 'వ్యా')

పర్యావరణ + సఖం = పర్యాసఖం

వాహన + కాలుష్యం = వాలుష్యం

జల + కాలుష్యం = జలుష్యం ఇత్యాది.

2. కర్తనం (Clipping) :– ఒక పదంలో గానీ, సమాసంలో గానీ ఒక అవయవాన్ని తొలగించి మిగిలిన భాగాన్ని పూర్తి అర్థంలో వాడడం. ఉదాహరణకి,

Rifle gun → *Rifle*
Hamburger → *Burger*
Rhinoceros → *Rhino*
Crocodile → *Croco*
United States of America → *America*
Magazine → *Mag*
Professor → *Prof*
Information → *Info*
Technology → *Tech*
Mathematics → *Maths*
Examination → *Exam*
Picture → *Pic*
Telephone → *Phone*
Cellullar phone → *Cell*
Mobile phone → *Mobile*
Facsimile → *Fax*

Photograph → *Photo*

తెలుగులో ఇలాంటివాటికి బహుకొద్ది ఉదాహరణలు మాత్రమే లభ్యమవుతున్నాయి. పదాన్ని విఱిచి అందులో ఒక భాగాన్ని వాడే అలవాటైతే మనకసలు లేనేలేదు. అది నేను సూచించే పద్ధతి కాదు. సమాసాల క్లుప్తీకరణకి మాత్రం ఉదాహరణలు :

స్తనశల్య పరీక్ష → *శల్యపరీక్ష*
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం → *ఆంధ్రప్రభుత్వం*
కోడిపుంజు → *పుంజు*
డబ్బులెక్క → *లెక్క*
గసగసాలు → *గసాలు*

3. **ప్రత్యాహరణ** (Acronymization/ Initialism) :- ఒక సమాసంలో గానీ, పదబంధంలో గానీ, వాక్యభాగంలో గానీ ఉన్న అనేక పదాల మొదటి మఱియు రెండో అక్షరాల్ని కలిపి ఒకే పదంగా తయారుచేయడం. ఉదాహరణకి,

Special Investigation Team → *SIT*
Self-Contained Underwater Breathing Apparatus → *Scuba*
RAdio Detection And Ranging → *Radar*
Light Amplification by Stimulated Emission of Radiation → *Laser*
Quasi-stellar radio source → *Quasar*
North Atlantic Treaty Organization → *Nato*
International Criminal Police Organization → *Interpol*
Acquired Immune Deficiency Syndrome → *AIDS*
Joint Photographic Experts Group → *JPEG*
Massachussetts Institute of Technology and Science → *MITS*

తెలుగువారు కూడా ఈ పద్ధతిని పుణికిపుచ్చుకున్నారు సంస్థల నామకరణం వఱకు ! కానీ వస్తువులకీ, పరిభావనలకీ ఈ పద్ధతిలో నామకరణం చేయడం మనలో ఇంకా మొదలుకావాల్సి ఉంది.

4. **నవగుణితం** (Creative New Spelling):- కొన్నిసార్లు పదాన్ని వ్రాసే విధానాన్ని, లేదా పలికే విధానాన్ని స్వల్పంగా మార్చడం ద్వారా కొత్తపదాల్ని కల్పిస్తున్నారు. ఇది ఎక్కువగా తయారీసంస్థల ముద్రాంక నామాల (brand-names) కోసం జఱుగుతోంది. ఉదాహరణకి: Mr.Kleen. వ్రాసినట్లే పలుకుతూ, పలికినట్లే వ్రాస్తూ ఉండే తెలుగు

లాంటి భాషల్లో పదం యొక్క గుణితాన్ని, లేదా ఉచ్చారణని మార్చి వ్రాయడం వీలుకాదు. అలా చేస్తే ఈ భాషలో అవబోధ్యత (understandbility) కే ఎసఱొస్తుంది. కానీ గతంలో ఉన్నపదాల ఉచ్చారణని స్వల్పంగా మార్చి కొత్త అర్థాల్లో ప్రయోగించిన సందర్భాలు లేకపోలేదు. వాటి గుఱించి ఇదివఱకే 3 వ అధ్యాయంలో ప్రస్తావించడం జఱిగింది.

5. నవసృజన (Novel Creation) :- కొన్నిసార్లు సంభాషకులూ, రచయితలూ అంతకుముందు భాషలో బొత్తిగా లేని పదాల్ని కొత్త అర్థంలో కల్పించి వాడతారు. ఆ పదాలు నిజంగా భాషలో ఉన్నాయో లేదో శ్రోతలకీ, పఠితలకీ తెలీదు గనుక బహుశా ఉండే ఉంటాయనే అభిప్రాయంలో వాటిని పుణికిపుచ్చుకొని వాడడం మొదలుపెడతారు. అలా అవి వ్యాప్తిలోకి వస్తాయి. ఇంగ్లీషులో ఈ తెఱగు పదాలు లెక్కకు మిక్కిలి. తెలుగులో కూడా కొన్ని లేకపోలేదు. కానీ అవి మాండలికాలుగా చెలామణి అవుతున్నాయి. సిగ్గుపఱిచే జీవన వాస్తవాల గుఱించిన పదాలు పాతబడి అభ్యంతరకరం కావడంతో వాటి స్థానంలో కొత్త తెలుగుపదాల్ని వాడుతున్నారు. ఐతే వీటి వాడుక వ్యక్తిగత సంభాషణలకీ, రహస్య సాహిత్యానికీ పరిమితమైంది. సర్వజాతులకీ సహజమైన ఈ మార్గం నాకు అన్ని పదనిష్పాదన పద్ధతుల కంటే కూడా అత్యంత ప్రీతికరమైనది. ఉదాహరణకి,

నప్పడం (తగి ఉండడం)
మటాషు (నాశనం)
తిను (*స్త్రీల మాండలికంలో ఇది లింగాతీత సర్వనామం*)
పోపు (తిరగమోత)
నీచు (మాంసం)
నాగా (సెలవు)
కేతిగాడు (నీచ కాపట్యాన్ని అవలంబించి బ్రతికేవాడు)
తింగర (తింగరి)

ఇవి పూర్వసాహిత్యంలో దర్శనమిచ్చే పదాలు కావు.



పదనిష్పాదన కళ

పధ్నాలుగో అధ్యాయం

ఉపయుక్త సంస్కృత క్రియాధాతువులూ, వాటి పదకుటుంబాలూ

నిజానికి తెలుగుభాష క్రియాధాతువుల (verb-roots) విషయంలో సంస్కృతం కంటే సుసంపన్నమైనది. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి సంపాదకత్వాన వెలువడ్డ **ఆంధ్ర క్రియాస్వరూప మణిదీపిక** అనే ఉద్గ్రంథంలో వేలాది తెలుగు క్రియాధాతువుల్ని లిపిబద్ధం చేశారు. సంస్కృతంలో ఉండడాpనికి 1800 ధాతువులున్నాయే గానీ వాటిల్లో మనకు వాస్తవంగా ఉపయుక్తమైనవీ, స్పష్టంగా అర్థమయ్యేవీ 300–400 కంటే ఎక్కువ లేవు. ఎక్కువశాతం ధాతువులు నిష్ప్రయోజనంగానే మిగిలిపోయాయి. కారణం– వాటి అసలు అర్థాలు ఏమిటై ఉంటాయి? అనేది కొమ్ములు తిరిగిన పండితులక్కూడా ఈరోజు అగమ్యగోచరమే. వాటన్నింటికీ *"గతౌ, శబ్దే, వ్యక్తాయాం వాచి, హింసాయామ్"* లాంటి అస్పష్టమైన నిర్వచనాలిచ్చారు పూర్వీకులు. తద్వారా సంస్కృత భాషకూ, ఇతర భారతీయ భాషలకూ ఉపకారం చేకూడలేదు. *గతౌ* (వెళ్ళడం) అంటే అది ఎలాంటి గతో తెలీదు. *హింసాయామ్* అంటే అది ఎలాంటి హింస? నఱకడమా? గిచ్చడమా? చంపడమా? ఏమీ తెలీదు. నిఘంటు నిర్మాణంలో మన ధోరణి ఇప్పటికీ ఇలాగే ఉంది. భవిష్యత్తులో నైనా భాషలోని ప్రతిపదాన్నీ విశదంగా, సమగ్రంగా, వర్ణనాత్మకంగా నిర్వచించడం అభిలషణీయం.

ఈ అధ్యాయపు ప్రయోజనం

అటువంటప్పుడు ఈ తెలుగుపుస్తకంలో సంస్కృత క్రియాధాతువుల కోసం ప్రత్యేకంగా ఓ అధ్యాయాన్నే కేటాయించడం ప్రయోజనకరమేనా? అని అడిగితే, ఈ అధ్యాయపు ప్రయోజనం– చదువరులకు సంస్కృతాన్ని బోధించడం గానీ, వారిని ఆ భాషలో పండితుల్ని చేయడం గానీ కాదని మనవి. ఇంకా, తెలుగుభాషని సంస్కృతపద బాహుళ్యంతో ముంచెత్తడమో, లేదా అందుకు ప్రోత్సహించడమో కూడా కాదు. తెలుగులో మర్యాదాకర పదజాలమూ, అమర్యాదాకర పదజాలమూ అని రెండురకాలున్నాయి. తెలుగుపదాల్ని ఉపయోగించి మర్యాదాకరమైన, లేదా తటస్థమైన భావవ్యక్తీకరణ చేయడం సాధ్యం కాని సందర్భాల్లో సంస్కృతపదాల్ని సైతం ఉపయోగించుకోవచ్చు. మఱో పక్క– తెలుగులో సమాసకల్పన ద్వారా భావ వ్యక్తీకరణ చేసే పద్ధతి ఒకటుంది. తెలుగుపదాల్నీ సంస్కృతపదాల్నీ మేళవించి వైరిసమాసాల్ని కల్పించడానికి మనం వ్యతిరేకం కాదు. కానీ 'కొన్ని సందర్భాల్లో' ఆ పద్ధతి పొసగదు. కర్ణకఠోరంగా భాసించవచ్చు.అటువంటప్పుడు సంస్కృత పదానికి సంస్కృతపదాన్నే జతచేయాలి. అలా చేయాలంటే, తెలుగుపదాలకు దీటైన సంస్కృత పదాలు కూడా తెలిసి ఉండాలి. కానీ మన విద్యావిధానంలో, మన వాతావరణంలో అది సాధ్యం కాదు. కనుక వాటిని పూర్వాయత్తం (ready-made)

గా ఇక్కడ ఇవ్వడం జఱుగుతోంది. అంటే, “ఈ పదానికి సంస్కృతంలో ఏమంటారు ?” అని సందేహం కలిగినప్పుడు ఈ పదజాలాన్ని శీఘ్ర ఆచూకీ (quick reference) నిమిత్తం వాడుకోవచ్చును. తెలుగులో ఉన్న క్రియాధాతువులకు పద కుటుంబాల్ని నిష్పాదించడం కష్టం. కొన్నిసార్లు అసాధ్యం కూడా! అందుకవసరమైన ప్రత్యయాలు తెలుగులో తగినన్ని లేకపోవడమే దీనిక్కారణం. ప్రత్యయాల లేమి మూలాన తెలుగు వీటి భావార్థాన్ని పొడవైన, విడివిడి పదబంధాలతో వ్యక్తీకరిస్తుంది. కనుక అత్యంత సరళమైన భావాల విషయంలో క్ప్తత కోసం సంస్కృత పదకుటుంబాల మీదే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

దీని పరిమితులు

ఇక్కడ ఇచ్చిన పదజాలానికి కొన్ని పరిమితులున్నాయని గమనించాలి. తెలుగుభాషకు సంస్కృత పదజాలంలో ఏ శబ్ద నిర్మాణాలు ఏ అర్థంలో అవసరమవుతాయో ఊహించి అవి మాత్రమే ఇచ్చాను తప్ప అన్నిరకాల నిర్మాణాల్నీ ఇవ్వలేదు. అలాగే వాడుకలో ఉన్న తెలుగు క్రియాధాతువుల్లో సుమారు 60–70 శాతం దాకానే ఇక్కడ ఇవ్వడం సాధ్యమైంది. వీటిని వీటి యథార్థ సంస్కృతరూపాల్లో కాక తెలుగులోకి తేబడ్డ తత్సమాల రూపంలో ఇవ్వడమైనది. వీలైనంతవఱకూ సంస్కృత వ్యాకరణ సూత్రాలకు లోబడే ఈ రూపాల్ని నిష్పాదించడం జఱిగింది. కానీ క్రియారూపాలు సందిగ్ధంగా ఉన్నచోట్లా, అవి తెలుగువారి లాక్షణికావగాహనకూ, ఉచ్చారణసామర్థ్యానికీ మించినచోట్లా కాస్త స్వతంత్రించి సరళీకరించడం జఱిగింది. సంస్కృతం కంటే తెలుగు సుసంపన్నమైన భాష కావడం వల్ల తెలుగులోని ప్రతి క్రియాధాతువుకూ సంస్కృతంలో సాటి మాట దొఱకదు. కనుక *‘కొన్నిసార్లు’* వాటిని సరికొత్తగా నిష్పాదించాల్సివచ్చింది, ఇప్పటికే ఉనికిలో ఉన్న ధాతువుల్నీ, ప్రత్యయాల్నీ, ఉపసర్గల్నీ విశేషణాల్నీ ఉపయోగించుకుంటూ !

వీటిని ఎలా, ఏ అర్థంలో బోధపఱచుకోవాలి ?

ఇక్కడ అందఱికీ తెలిసిన, ఆధునిక జనవ్యవహారంలో ఉన్న తెలుగు క్రియాధాతువుల్ని అకారాదిక్రమం (alphabetical order) లో ఇవ్వడం జఱిగింది. వాటికి ఎదురుగా వాటిని సంస్కృతంలో ఏమంటారో, ఎలా ప్రయోగిస్తారో చూపడం జఱిగింది. ఒక్కో ధాతువు యొక్క జన్యరూపాల ఆవళి (line of derivatives) ని దాని పదకుటుంబంగా భావించాలి. ఈ పదకుటుంబ సభ్యుల్ని మనకు అవసరమైనంత మేరకు ఎనిమిది రకాల కింద, ఎనిమిది అర్థాల్లో ప్రదర్శించాను. ఒక్కో రకానికీ ఒక్కో స్థిరమైన, అర్థవంతమైన వరుససంఖ్యని కేటాయించాను. ప్రతి క్రియాధాతువు కిందా ఉన్న జన్యరూపాల్ని ఈ చెప్పిన అర్థాల్లోనే బోధపఱచుకొని వాడాలి. కొన్నిసార్లు ఒకే రకం కింద రెండు, మూడు లేదా నాలుగు పదాల్ని కూడా ఇవ్వడమైనది. వీటిల్లో–

---

1. మొదటి రకం – ఇది క్రియ (verb). సంస్కృతంలో ఆ ధాతువుని వర్తమానకాలం (లట్) లో ప్రథమపురుష ఏకవచనంలో ఎలా వాడతారో చూపుతుంది. దీని వల్ల ఆ క్రియాధాతువు సంస్కృత వ్యాకరణంలో ఏ ప్రకరణానికి చెందినదో తెలుస్తుంది. **కనుక ఇది సామాన్య పాఠకులకూ, రచయితలకూ అవసరం లేదు.** కానీ జన్యరూపాల్ని మౌలికంగా నిర్ణయించేది ఈ రూపమే కనుక సమాచారం నిమిత్తం ఇవ్వబడింది.

---

2. రెండో రకం (అనమంతాలు) – ఇది నామవాచకం (noun). ఆ క్రియాధాతువు యొక్క నామరూపం. ఇది తెలుగులో *చేయు* అనే ధాతువుని ఎలాగైతే *చేయడం* అని పిలుస్తామో అలాంటిది. దీన్ని ఆంగ్లంలో Gerund form అంటారు.

ఉదా :- రుహ్ → రోహణం (అంకురించడం) ;
కృ → కరణం (చేయడం)
భూ → భవనం (ఉండడం)
నీ→ నయనం (నడిపించడం) మొ॥

కొన్నిసార్లు ధాతువుకు **'క'** ప్రత్యయం వచ్చి **'అణమ్'** తో పనిలేకుండానే ధాతువుకు నామవాచకం ఏర్పడుతుంది. వీటిని **'క-ప్రత్యయాంతాలు'** అంటారు.

ఉదా :- రుహ్ – రోహం
యుజ్ – యోగం
ముద్ – మోదం
వద్ – వాదం ఇత్యాది ॥

---

3. మూడో రకం – నామవాచకం. ఆ క్రియ యొక్క కర్త (subject) ని తెలుపుతుంది. ఈ భావాన్ని తెలపడం కోసం ఆంగ్లంలో సాధారణంగా verb చివఱ –er లేదా –or అని చేఱుస్తారు.

ఉదా :- వ్రాయు → వ్రాతరి = వ్రాసేవాడు.

ఈ రకం కింద ఒకే అర్థంలో మూడు రూపాలు ఇవ్వబడ్డాయి.

1. *రుహ్ → రోహకం (అంకురించేది)* – దీన్ని **'అక'** ప్రత్యయాంతరూపం లేక **అకాంతం** అంటారు.
2. *రోహి (న్)* – దీన్ని **ణిన్యంతం** అంటారు.
3. *రోహిత (తృ)* – దీన్ని **తృజంతం** అంటారు. సమాస మధ్యంలో ఇలాంటివాటిని **రోహితృ** అని ప్రయోగించాలి.

---

4. నాలుగో రకం – క్రియాజన్య – భూత – కర్మార్థక – విశేషణం (adjective) . అంటే ఆ క్రియ యొక్క కర్మ (object) ను తెలుపుతుంది. దీన్ని **'క్త'** ప్రత్యయరూపం లేక ***క్తాంతరూపం*** అంటారు. ఇది ఆంగ్లంలోని Past Participle రూపానికి సమానమైనది.

ఉదా :- చేయు → చేయబడినది.
రుహ్ → రోహితం (అంకురించినది)

---

5. **అయిదో రకం –** నామవాచకం. ఆ క్రియ చేయడానికి ఉపకరించే సాధనాన్ని లేదా పనిముట్టు (tool/ instrument)ని తెలుపుతుంది.

ఉదా – దువ్వు → దువ్వెన.
రుహ్ → రోహిత్రం (మొలకెత్తడానికి/ మొలకెత్తించడానికి సహాయపడే పనిముట్టు)

---

6. **ఆఱో రకం –** ఇది విశేషణం (adjective). ఆ క్రియ చేయదగిన (ఆ క్రియ యొక్క ప్రభావాన్ని/ ఫలితాన్ని అను భవించగల) వ్యక్తిని, వస్తువు (object) నీ తెలుపుతుంది. ఇవి ఆంగ్లంలో క్రియల చివఱ వచ్చే –able, -ible లాంటివి గల పదాల కోవకు చెందిన రూపాలు.

ఉదా – చేయు → చేయదగిన.

ఈ రకం కింద ఒకే అర్థంలో మూడు రూపాలు ఇవ్వబడ్డాయి.

1. రుహ్ → రుహ్యం (మొలకెత్తగలది, లేదా మొలకెత్తించదగినది) – దీన్ని **యదంతం** అంటారు.
2. రోహణీయం – దీన్ని **అనీయాంతం** అంటారు.
3. రోహితవ్యం / రూఢవ్యం – దీన్ని **తవ్యాంతం** లేదా **తవ్యదంతం** అంటారు.

ఈ పై మూడూ కాక, **కేలిమర్** అని ఇంకో ప్రత్యయం ఉంది. ఈ పుస్తకంలోని పదజాలంలో దాన్ని ఉపయోగించలేదు. కానీ దాన్ని కూడా ఇదే అర్థంలో వాడతారు. ఇది '+ఏలిమ' అనే రూపంతో క్రియాధాతువుకు చేఱుతుంది.

ఉదా :– పచ్ + ఏలిమ = పచేలిమం = త్వరగా ముగ్గే/ మాగే స్వభావం గలిగిన.

గమనిక:- అకర్మక క్రియాధాతువులకు పై ప్రత్యయాలు చేఱినప్పుడు 'కాగలిగినది' (ఆ అవకాశం ఉన్నటువంటిది) అని అర్థం.

ఉదా – శోణనం = ఎఱ్ఱబడడం. దీనికి కర్మ ఉండదు. కాబట్టి ఇది అకర్మక క్రియ. దీనికి యత్ ప్రత్యయం చేఱితే–
శోణ్యం = ఎఱ్ఱబడడానికి అవకాశమున్న/ ఎఱ్ఱబడగలిగిన.

---

7. ఏడో రకం (Present participle) – క్రియాజన్య – వర్తమాన – కర్త్రర్థక – విశేషణం . ఆ క్రియని ప్రస్తుతం చేస్తున్న వస్తువుని, వ్యక్తి (subject) ని సూచిస్తుంది.

ఉదా :– చేయు → చేస్తున్నవాడు.
రుహ్ → రోహంతం (మొలకెత్తుతూ ఉన్నది)

---

8. ఎనిమిదో రకం (Future participle) – క్రియాజన్య – భవిష్య – కర్త్రర్థక – విశేషణం . ఆ క్రియని భవిష్యత్తులో ఎవఱు చేయబోతున్నారో ఆ వస్తువుని, వ్యక్తి (subject) ని సూచిస్తుంది.

ఉదా – చేయు → చేయబోతున్నవాడు.
రుహ్ → రోహిష్యం (మొలకెత్తబోతున్నది)

వీటిని ఎలా ఉపయోగించుకోవాలి ?

సూటిగా తేటతెలుగు మాటలతో రోజువారీ పని జఱుగుతుందనుకున్నప్పుడు ఇక్కడ ఇచ్చిన పదజాలాన్ని ఉపయోగించడం మంచి పని కాదు. ఇవి కొన్ని ప్రత్యేక సందర్భాల కోసం ఉద్దేశించినవని మఱువరాదు. ముఖ్యంగా, శాస్త్ర, సాంకేతిక పదజాల నిష్పాదనకు ఇవి ఉపయోగపడతాయి. అదే విధంగా కవనాభిరుచీ, తద్ వ్యాసంగమూ గలవారికి సైతం పద వైవిధ్యమూ, శీర్షికలూ, లేదా పదక్రీడల నిమిత్తం ఇవి ఉపయోగపడతాయి.

ఇక్కడ ఇచ్చినవన్నీ నపుంసకలింగంలో ఇవ్వబడ్డాయని గమనించాలి. వీటిని సందర్భానుగుణంగా లింగాన్ని మార్చి వాడుకోవచ్చు. అలాగే 'శుద్ధధాతువులకు' అర్థానుగుణంగా ఉపసర్గల్ని జతచేర్చి, అర్థాన్ని స్వల్పంగా మార్చి కూడా వాడుకోవచ్చు. అలాగే **అ–** లేదా **అన్–** అనే ఉపసర్గల్ని వీటి ముందు చేర్చడం ద్వారా వ్యతిరేకార్థకాల్ని సైతం నిష్పాదించవచ్చు.

ఉదాహరణకు :– **నచ్చు – 1. రోచతే 2. రోచనం 3. రోచకం, రోచి (న్), రోచిత (తృ) 4. రుచితం 5. రోచని 6. రుచ్యం, రోచనీయం, రోచితవ్యం 7. రోచమానం 8. రోచిష్యం**

- పై జాబితాలో మూడో తరహా పదాల్ని 'రోచకుడు, రోచిక, రోచకి, రోచిని, రోచిత్రి' అని మార్చవచ్చు.
- అలాగే నాలుగో తరహా పదాన్ని 'రోచితుడు, రోచితురాలు, రోచిత' అని మార్చవచ్చు.
- ఆఱో తరహా పదాల్ని 'రోచనీయుడు, రోచనీయ, రోచనీయురాలు, రోచితవ్యుడు, రోచితవ్య, రోచితవ్యురాలు' అని మార్చవచ్చు.
- ఏడో తరహా పదాన్ని అని 'రోచమానుడు, రోచమాన, రోచమానురాలు' మార్చవచ్చు. రోహంతం లాంటి పదాలైతే, 'రోహంతి, రోహంతుడు' అని మార్చాలి.
- ఎనిమిదో తరహా పదాన్ని 'రోచిష్యుడు, రోచిష్య, రోచిష్యురాలు' అని మార్చవచ్చు.
- వీటికి వ్యతిరేకార్థకాలుగా 'అరోచిష్య' (నచ్చని స్త్రీ) మొదలైన రూపాల్ని నిష్పాదించవచ్చు.
- వీటికి **అతి** మొదలైన ఉపసర్గల్ని చేర్చి అర్థాన్ని స్వల్పంగా మార్చవచ్చు.
  ఉదా – అతిరోచిష్యుడు = విపరీతంగా నచ్చేవాడు.

ఇవి స్వయంగా జన్య (derivative) పదాలైనప్పటికీ మళ్లీ ఈ జన్యపదాల నుంచి సైతం మఱిన్ని జన్యపదాల్ని నిష్పాదించేందుకు ఆస్కారం ఉంది.

ఉదాహరణకు :-

రోచనానికి సంబంధించినది = రౌచనికం
రోచకుడికి సంబంధించినది = రోచకీయం
రోచకుడి గుణం = రోచకత్వం
రోచిత్రానికి సంబంధించినది = రౌచిత్రికం

అవసరమనుకున్న చోట్ల ప్రేరణార్థక రూపాల్ని కూడా ఇచ్చాను. ఇవ్వనివాటికి అభిజ్ఞుల్ని సంప్రదించవలసినది.

సంస్కృత ధాతువుల పదకుటుంబాలు

1. అంకురించు – 1. రోహతి 2. రోహణం, రోహం 3. రోహకం, రోహిత (తృ), రోహి (న్) 4. రోహితం 5. రోహణి, రోహిత్రం 6. రోహణీయం, రుహ్యం, రోహితవ్యం / రూఢవ్యం 7. రోహంతం 8. రోహిష్యం

2. అంగీకరించు – 1. అంగీకరోతి 2. అంగీకరణం, అంగీకారం 3. అంగీకారకం, అంగీకరం, అంగీకర్త (ర్తృ), అంగీకారి (న్) అంగీకృతం 5. అంగీకరణి 6. అంగీకరణీయం, అంగీకార్యం, అంగీకర్తవ్యం 7. అంగీకుర్వాణం 8. అంగీకరిష్యం

3. అంచనా వేయు/ అంచనా కట్టు – 1. పరిసంఖ్యాతి 2. పరిసంఖ్యానం, పరిసంఖ్య 3. పరిసంఖ్యాయకం, పరిసంఖ్యాయి (న్), పరిసంఖ్యాత (తృ) 4. పరిసంఖ్యాతం 5. పరిసంఖ్యాత్రం 6. పరిసంఖ్యేయం, పరిసంఖ్యాతవ్యం 7._______ 8. పరిసంఖ్యాస్యం

4. అంటు – 1. పృణక్తి 2. పర్చనం, పర్కం, పృక్తి 3. పర్చకం, పర్కి (న్), ప్రక్త (క్తృ) 4. పృక్తం 5. పర్చని 6. పృచ్యం, పర్చనీయం, ప్రక్తవ్యం 7._______ 8.________

5. అంటుకట్టు – 1. సంసర్జయతి 2. సంసర్జనం 3. సంసర్జకం, సంసర్జయిత (తృ) 4. సంసర్జితం 5. సంసర్జని, సంసర్జిత్రం 6. సంసర్జనీయం, సంసర్జయితవ్యం 7. సంసర్జయంతం 8. సంసర్జయిష్యం

6. అంటించు – 1. పర్చయతి 2. పర్చనం, పర్చ 3. పర్చకం, పర్చయిత (తృ), పర్చి (న్) 4. పర్చితం 5. పర్చని 6. పర్చనీయం, పర్చితవ్యం 7. పర్చయంతం 8. పర్చయిష్యం

7. అంతరించు – 1. నశ్యతి 2. నాశం, నాశనం, నష్టి 3. నాశకం, నాశి (న్), నంష్ట (ష్టృ) 4. నష్టం 5. నశిత్రం 6. నశ్యం, నాశనీయం, నష్టవ్యం 7. నశ్యంతం 8. నంక్ష్యం

8. అందుకొను – 1. ప్రాప్నోతి 2. ప్రాపణం, ప్రాప్తి 3. ప్రాపకం, ప్రాపి (న్), ప్రాపిత (తృ) 4. ప్రాప్తం 5. ప్రాపణి 6. ప్రాప్యం, ప్రాపణీయం, ప్రాప్తవ్యం 7. ప్రాప్నువంతం 8. ప్రాప్స్యం

9. అగు – 1. భవతి 2. భవనం, భావం 3. భావకం, భవిత (తృ), భావి (న్) 4. భూతం 5. భావని, భవిత్రం 6. భావ్యం, భవితవ్యం 7. భవంతం 8. భవిష్యం

ఇదే అర్థంలో :- 1. గవేషతే 2. గవేషణం, గవేష 3. గవేషకం, గవేషి (న్), గవేషిత (తృ) 4. గవేషితం 5. గవేషణి, గవేషిత్రం 6. గవేష్యం, గవేషణీయం, గవేషితవ్యం 7. గవేషమాణం 8. గవేషిష్యం

ఇదే అర్థంలో :- 1. మార్గయతే 2. మార్గణం, మార్గణ 3. మార్గకం, మార్గి (న్), మార్గయిత (తృ) 4. మార్గితం 5. మార్గణి, మార్గిత్రం 6. మార్గయితవ్యం, మార్గితవ్యం, మార్గణీయం 7. మార్గమాణం 8. మార్గిష్యం.

874. వెనకబడు – 1. తిరోగచ్ఛతి 2. తిరోగమనం, తిరోగతి 3. తిరోగామి (న్), తిరోగంత (తృ), తిరోగంతృకం 4. తిరోగతం 5. తిరోగమని, తిరోగంత్రం 6. తిరోగమ్యం, తిరోగమనీయం, తిరోగంతవ్యం 7. తిరోగచ్ఛంతం 8. తిరోగమిష్యం

875. వెనకేయు – 1. నిక్షిపతి 2. నిక్షేపణం, నిక్షేపం 3. నిక్షేపకం, నిక్షేపి (న్), నిక్షేపిత(తృ) 4. నిక్షిప్తం 5. నిక్షిపణి 6. నిక్షిప్యం, నిక్షేపణీయం, నిక్షిప్తవ్యం 7. నిక్షిపంతం 8. నిక్షేప్స్యం

876. వెలయు – చూ. ఆవిర్భవించు.

877. వెలిబుచ్చు – 1. వ్యనక్తి 2. వ్యంజనం, వ్యక్తి, అభివ్యక్తి, వ్యక్తి, వ్యంగం 3. వ్యంజకం, వ్యంజి (న్), వ్యంక్త (జ్క్తృ) 4. వ్యక్తం 5. వ్యంజని, వ్యక్త్రం 6. వ్యజ్యం, వ్యంగ్యం, వ్యంజనీయం, వ్యక్తవ్యం 7. వ్యజంతం 8. వ్యంక్ష్యం

878. వెలివేయు – 1. బహిష్కరోతి 2. బహిష్కరణం, బహిష్కృతి, బహిష్కారం 3. బహిష్కారకం, బహిష్కారి (న్), బహిష్కర్త (ర్తృ) 4. బహిష్కృతం 5. బహిష్కరణి, బహిష్కరిత్రం 6. బహిష్కార్యం, బహిష్కరణీయం, బహిష్కర్తవ్యం 7. బహిష్కుర్వాణం, బహిష్కుర్వంతం 8. బహిష్కరిష్యం

879. వెలుఁగు – 1. ద్యోతతే 2. ద్యోతనం, ద్యోతం, ద్యుతి 3. ద్యోతకం, ద్యోతి (న్), ద్యోతిత (తృ) 4. ద్యోతితం 5. ద్యోతని, ద్యోత్రం 6. ద్యోత్యం, ద్యోతనీయం, ద్యోతితవ్యం 7. ద్యోతమానం 8. ద్యోతిష్యం

880. వెలువడు – 1. నిర్గచ్ఛతి 2. నిర్గమనం, నిర్గమం, నిర్గతి 3. నిర్గామి (న్), నిర్గంత (తృ) 4. నిర్గతం 5. నిర్గమని, నిర్గంత్రం 6. నిర్గమ్యం, నిర్గమనీయం, నిర్గంతవ్యం 7. నిర్గచ్ఛంతం, నిర్గమంతం 8. నిర్గమిష్యం

881. వెల్లడిచేయు – 1. ప్రకటయతి 2. ప్రకటనం 3. ప్రకటకం, ప్రకటి (న్), ప్రకటయిత (తృ) 4. ప్రకటం, ప్రకటితం 5. ప్రకటని, ప్రకటిత్రం 6. ప్రకట్యం, ప్రకటనీయం, ప్రకటితవ్యం 7. ప్రకటయంత 8. ప్రకటయిష్యం

882. వెళ్ళగొట్టు – చూ. గెంటు.

883. వెళ్ళు – చూ. పోవు

884. వేచిచూచు – చూ. ఎదురుచూచు.

885. వేఁటాడు – 1. మృగయతే 2. మృగయ 3. మార్గకం, మార్గిత (తృ) 4. మార్గితం 5. మార్గణి 6. మృగ్యం, మార్గణీయం, మార్గితవ్యం 7. మృగమాణం 8. మృగయిష్యం

886. వేడుకచేయు – 1. ఉత్సునుతే 2. ఉత్సవం, ఉత్సవనం, ఉత్సుతి 3. ఉత్సావకం, ఉత్సవి (న్), ఉత్సోత (తృ) 4. ఉత్సుతం 5. ఉత్సవని, ఉత్సోత్రం 6. ఉత్సవ్యం, ఉత్సవనీయం, ఉత్సోతవ్యం 7. ఉత్సున్వానం 8. ఉత్సోష్యం

887. వేఁడుకొను – 1. ప్రార్థయతి 2. ప్రార్థనం 3. ప్రార్థకం, ప్రార్థి (న్), ప్రార్థయిత (తృ) 4. ప్రార్థితం 5. ప్రార్థని 6. ప్రార్థ్యం, ప్రార్థనీయం, ప్రార్థయితవ్యం 7. ప్రార్థయంతం 8. ప్రార్థయిష్యం

888. వేఁడెక్కు – 1. ఉష్ణీభవతి 2. ఉష్ణీభవనం 3. ఉష్ణీభావి (న్), ఉష్ణీభవకం ఉష్ణీభవిత (తృ) 4. ఉష్ణీభూతం 5. ఉష్ణీభవని, ఉష్ణీభవిత్రం 6. ఉష్ణీభవ్యం, ఉష్ణీభవనీయం, ఉష్ణీభవితవ్యం 7. ఉష్ణీభవంతం 8. ఉష్ణీభవిష్యం

889. వేణువు ఊదు - 1. వేణతి 2. వేణనం 3. వేణకం, వేణి (న్), వేణిత (తృ) 4. వేణితం 5. వేణని, వేణిత్రం 6. వేణ్యం, వేణనీయం 7. వేణంతం 8. వేణిష్యం

890. వేధించు – చూ. పీడించు.

891. వేపు – 1. భ్రజ్జతే 2. భ్రజ్జనం 3. భ్రజ్జకం, భ్రజ్జి (న్), భ్రజ్జిత (తృ) 4. భ్రజ్జితం 5. భ్రజ్జని, భ్రాష్ట్రం 6. భ్రజ్జ్యం, భ్రజ్జనీయం, భ్రజ్జితవ్యం 7. భ్రజ్జమానం 8. భ్రజ్జిష్యం

892. వేయు – 1. క్షిపతి 2. క్షేపం, క్షేపణం, క్షిప్తి 3. క్షేపకం, క్షేపి (న్), క్షేప్త (ప్తృ) 4. క్షిప్తం 5. క్షిపణి, క్షిప్త్రం 6. క్షిప్యం, క్షేపణీయం, క్షిప్తవ్యం 7. క్షిపంతం 8. క్షేప్స్యం

893. వేళ్ళాడు - 1. లంబతే 2. లంబనం 3. లంబకం, లంబి (న్), లంబిత (తృ) 4. లంబకం 5. లంబని 6. లంబ్యం, లంబనీయం, లంబితవ్యం 7. లంబమానం 8. లంబిష్యం

894. వైద్యం చేయు – చూ. నయం చేయు.

895. వ్యక్తీకరించు – 1. (అభి) వ్యనక్తి 2. (అభి) వ్యంజనం, (అభి) వ్యక్తి 3. (అభి) వ్యంజకం, (అభి) వ్యంజి (న్) 4. (అభి) వ్యక్తం 5. (అభి) వ్యంజని, (అభి) వ్యక్త్రం 6. (అభి) వ్యజ్యం, (అభి) వంజనీయం, (అభి) వ్యక్తవ్యం 7. (అభి) వ్యంజంతం 8. (అభి) వ్యక్ష్యం

ఇదే అర్థంలో- 1. ఆవిష్కరోతి 2. ఆవిష్కరణం, ఆవిష్కారం, ఆవిష్కృతి 3. ఆవిష్కరం, ఆవిష్కారి, ఆవిష్కర్త (ర్తృ) 4. ఆవిష్కృతం 5. ఆవిష్కరణి, ఆవిష్కరిత్రం 6. ఆవిష్కరణీయం, ఆవిష్కర్తవ్యం 7. ఆవిష్కుర్వాణం, ఆవిష్కుర్వంతం 8. ఆవిష్కరిష్యం

896. **వ్యతిరేకించు** – 1. వ్యతిరిచ్యతే 2. వ్యతిరేకం, వ్యతిరేచనం, వ్యతిరిక్తి 3. వ్యతిరేచకం, వ్యతిరేచి (న్) 4. వ్యతిరిక్తం 5. వ్యతిరేచని, వ్యతిరిక్త్రం 6. వ్యతిరిచ్యం, వ్యతిరేచనీయం, వ్యతిరిక్తవ్యం 7. వ్యతిరిచ్యమానం 8. వ్యతిరిక్ష్యం

ఇదే అర్థంలో- 1. విరుణద్ధి 2. విరోధనం, విరోధం 3. విరోధకం, విరోధి (న్), విరోద్ధ (ద్ధృ) 4. విరుద్ధం 5. విరోధని 6. విరోధ్యం, విరోధనీయం, విరోద్ధవ్యం 7. విరుంధంతం 8. విరోత్స్యం

897. **వ్యథచెందు** – 1. వ్యథతి 2. వ్యథ 3. వ్యాథకం, వ్యథి (న్), వ్యథిత (తృ) 4. వ్యథితం 5. వ్యథని 6. వ్యథ్యం, వ్యథనీయం, వ్యథితవ్యం 7. వ్యథంతం 8. వ్యథిష్యం

898. **వ్యభిచరించు** – చూ. అంకుచేయు, అంకాదు.

899. **వ్యయముచేయు** – 1. వ్యయీకరోతి 2. వ్యయీకరణం 3. వ్యయీకారి (న్), వ్యయీకర్త (ర్తృ) 4. వ్యయితం, వ్యయీకృతం 5. వ్యయీకరణి, వ్యయీకరిత్రం 6. వ్యయనీయం, వ్యయితవ్యం 7. వ్యయీకుర్వాణం, వ్యయీకుర్వంతం 8. వ్యయీకరిష్యం

900. **వ్యర్థముచేయు** – 1. వ్యర్థీకరోతి 2. వ్యర్థీకరణం 3. వ్యర్థీకారి (న్), వ్యర్థీకర్త (ర్తృ) 4. వ్యర్థీకృతం 5. వ్యర్థీకరణి, వ్యర్థీకరిత్రం 6. వ్యర్థీకార్యం, వ్యర్థీకరణీయం 7. వ్యర్థీకుర్వాణం, వ్యర్థీకుర్వంతం 8. వ్యర్థీకరిష్యం

901. **వ్యవసాయము చేయు** – 1. విలిఖతి 2. విలేఖం, విలేఖనం 3. విలేఖకం, విలేఖి (న్), విలేఖిత (తృ) 4. విలిఖితం 5. విలేఖని, విలేఖిత్రం 6. విలేఖ్యం, విలేఖనీయం, విలిఖితవ్యం 7. విలిఖంతం 8. విలేఖిష్యం

902. **వ్యవస్థ చేయు** – 1. వ్యవస్థాపయతి 2. వ్యవస్థాపనం, వ్యవస్థప్తి 3. వ్యవస్థాపకం, వ్యవస్థాపి (న్), వ్యవస్థాపయిత (తృ) 4. వ్యవస్థాపితం 5. వ్యవస్థాపని 6. వ్యవస్థాప్యం, వ్యవస్థాపనీయం 7. వ్యవస్థాపయంతం 8. వ్యవస్థాపిష్యం

903. **వ్యవహరించు** – 1. వ్యవహరతి 2. వ్యవహరణం, వ్యవహారం, వ్యవహృతి 3. వ్యవహారకం, వ్యవహారి (న్), వ్యవహర్త(ర్తృ) 4. వ్యవహృతం 5. వ్యవహరణి, వ్యవహరిత్రం 6. వ్యవహార్యం, వ్యవహరణీయం, వ్యవహర్తవ్యం 7. వ్యవహరంతం 8. వ్యవహరిష్యం

904. **వ్యాకరించు (నియమ నిబంధనలను ఏర్పఱచు)** – 1. వ్యాకరోతి 2. వ్యాకరణం, వ్యాకారం, వ్యాకృతి, వ్యాక్రియ 3. వ్యాకారకం, వ్యాకరం, వ్యాకారి (న్), వ్యాకర్త (ర్తృ) 4. వ్యాకృతం 5. వ్యాకరణి 6. వ్యాకార్యం, వ్యాకరణీయం, వ్యాక

ర్తవ్యం 7. వ్యాకుర్వాణం, వ్యాకుర్వంతం 8. వ్యాకరిష్యం

905. వ్యాకోచించు – 1. వ్యాకోచతి 2. వ్యాకోచం, వ్యాకోచనం 3. వ్యాకోచకం, వ్యాకోచి (న్), వ్యాకోచిత (తృ) 4. వ్యాకోచితం 5. వ్యాకోచని 6. వ్యాకోచ్యం, వ్యాకోచనీయం, వ్యాకోచితవ్యం 7. వ్యాకోచంతం 8. వ్యాకోచిష్యం

906. వ్యాఖ్యానించు – 1. వ్యాఖ్యాతి 2. వ్యాఖ్యానం, వ్యాఖ్య 3. వ్యాఖ్యాయకం, వ్యాఖ్యాయి (న్), వ్యాఖ్యాత (తృ) 4. వ్యాఖ్యాతం 5. వ్యాఖ్యాత్రం 6. వ్యాఖ్యేయం, వ్యాఖ్యాతవ్యం 7.______ 8. వ్యాఖ్యాస్యం

907. వ్యాపించు – 1. వ్యాప్నోతి 2. వ్యాపనం, వ్యాప్తి 3. వ్యాపకం, వ్యాపి (న్), వ్యాపిత (తృ) 4. వ్యాప్తం 5. వ్యాపని 6. వ్యాప్యం, వ్యాపనీయం, వ్యాపితవ్యం 7. వ్యాప్నువంతం 8. వ్యాపిష్యం

ఇదే అర్థంలో-1. శాఖతి 2. శాఖనం 3. శాఖకం, శాఖి (న్, శాఖిత (తృ) 4. శాఖితం 5. శాఖని, శాఖిత్రం 6. శాఖ్యం, శాఖనీయం, శాఖితవ్యం 7. శాఖంతం 8. శాఖిష్యం

908. వ్యాపారము చేయు – చూ. వ్యవహరించు.

909. వ్యామోహపడు – చూ, మోహించు.

910. వ్యుత్పత్తిచెప్పు/ వ్యుత్పత్తినిచ్చు – 1. వ్యుత్పాదయతి 2. వ్యుత్పాదనం, వ్యుత్పాదం, వ్యుత్పత్తి 3. వ్యుత్పాదకం, వ్యుత్పాది (న్), వ్యుత్పాదయిత(తృ) 4. వ్యుత్పాదితం 5. వ్యుత్పాదని, వ్యుత్పాదిత్రం 6. వ్యుత్పాద్యం, వ్యుత్పాదనీయం, వ్యుత్పాదయితవ్యం 7. వ్యుత్పాదయంతం 8. వ్యుత్పాదయిష్యం

911. వ్యూహం పన్ను – 1. ప్రకల్పతే 2. ప్రకల్పనం, ప్రక్ౢప్తి 3. ప్రకల్పకం, ప్రకల్పి (న్), ప్రక్ౢప్త (ప్తృ) 4. ప్రక్ౢప్తం 5. ప్రకల్పని, ప్రక్ౢప్త్రం 6. ప్రకల్ప్యం, ప్రకల్పనీయం, ప్రకల్పితవ్యం 7. ప్రకల్పమానం 8. ప్రక్ౢప్స్యం

912. వ్రాయు – 1. లిఖతి 2. లేఖనం, లేఖం 3. లేఖకం, లేఖి (న్), లేఖిత (తృ) 4. లిఖితం 5. లేఖని, లిఖిత్రం 6. లేఖ్యం, లిఖ్యం, లిఖనీయం, లిఖితవ్యం 7. లిఖంతం 8. లేఖిష్యం

913. శపించు – 1. శపతే 2. శపనం, శపథం, శాపం 3. శాపకం, శాపి (న్), శప్త (ప్తృ) 4. శప్తం 5. శపని 6. శప్యం, శపనీయం, శప్తవ్యం 7. శపంతం 8. శపిష్యం

914. శబ్దించు – చూ. చప్పుడుచేయు.

915. శమించు – చూ. ఉపశమించు.

916. శయనించు – చూ. పడుకొను.

917. శరణము వేఁడు – చూ. ఆశ్రయించు.

918. శాంతించు – చూ. ఉపశమించు.

919. శాసించు – 1. శాస్తి 2. శాసనం 3. శాసకం, శాసి(న్), శాసిత (తృ), శాస్త (స్తృ) 4. శాసితం 5. శాసని, శాస్త్రం 6. శిష్యం, శాసనీయం, శాసితవ్యం 7. శాసంతం 8. శాసిష్యం

920. శిక్షించు – 1. దండయతి 2. దండనం, దండం 3. దండకం, దండి (న్), దండయిత (తృ) 4. దండితం 5. దండని, దండిత్రం 6. దండ్యం, దండనీయం, దండయితవ్యం 7. దండయంతం 8. దండయిష్యం

921. శుభ్రముచేయు – 1. శోధయతి 2. శోధనం, శోధ 3. శోధకం, శోధి (న్), శోధయిత (తృ) 4. శోధితం 5. శోధని, శోధిత్రం 6. శోధ్యం, శోధనీయం, శోధయితవ్యం 7. శోధయంతం 8. శోధయిష్యం

922. శుశ్రూష చేయు – 1. పరిచరతి 2. పరిచరణం, పరిచర్య, పరిచారం 3. పరిచారకం, పరిచారి (న్), పరిచరిత (తృ) 4. పరిచరితం 5. పరిచరణి, పరిచరిత్రం 6. పరిచర్యం, పరిచరణీయం, పరిచరితవ్యం 7. పరిచరంతం 8. పరిచరిష్యం

923. శుష్కించు – చూ. ఎండు.

924. శృంగారించు (ముస్తాబు చేయు) – 1. ప్రసాధయతి 2. ప్రసాధనం 3. ప్రసాధకం, ప్రసాధి (న్), ప్రసాధయిత (తృ) 4. ప్రసాధితం 5. ప్రసాధని 6. ప్రసాధ్యం, ప్రసాధనీయం 7. ప్రసాధయంతం 8. ప్రసాధయిష్యం

925. శేషించు – చూ. మిగులు.

926. శోకించు – చూ. ఏడ్చు.

927. శోభించు – చూ. బాగుండు/ బావుండు.

928. శోషిల్లు – చూ. ఎండు.

929. శోషించు – చూ. ఎండు.

930. శ్రద్ధపెట్టు – 1. శ్రద్దధాతి 2. శ్రద్ధ, శ్రద్ధానం 3. శ్రద్ధాయి (న్), శ్రద్ధాత (తృ) 4. శ్రద్ధితం 5. శ్రద్ధాత్రం 6. శ్రద్ధేయం, శ్రద్ధాతవ్యం 7. శ్రద్దధంతం 8. శ్రద్ధాస్యం

931. శ్రమించు – చూ. కష్టపడు.

932. శ్లాఘించు – 1. శ్లాఘతే 2. శ్లాఘ, శ్లాఘన 3. శ్లాఘకం, శ్లాఘి (న్), శ్లాఘిత (తృ) 4. శ్లాఘితం 5. శ్లాఘని 6. శ్లాఘ్యం, శ్లాఘనీయం, శ్లాఘితవ్యం 7. శ్లాఘమానం 8. శ్లాఘిష్యం. ఇంకా చూ. పొగడు.

933. శ్వసించు – చూ. ఊపిరి తీసుకొను/ విడచు

934. శ్వాసించు – చూ. ఊపిరి తీసుకొను/ విడచు

935. షికారుచేయు/ షికారుకు వెళ్ళు – 1. విహరతి 2. విహరణం, విహారం, విహృతి 3. విహారకం, విహారి (న్), విహర్త 4. విహృతం 5. విహరణి, విహరిత్రం 6. విహార్యం, విహరణీయం, విహర్తవ్యం 7. విహరంతం 8. విహరిష్యం

ఇదే అర్థంలో:- 1. ఉద్యాతి 2. ఉద్యానం 3. ఉద్యాయి (న్), ఉద్యాత (తృ) 4. ఉద్యాతం 5. ఉద్యాత్రం 6. ఉద్యేయం, ఉద్యాతవ్యం 7. _____ 8. ఉద్యాస్యం

935. సంకరం చేయు - 1. సంకరోతి 2. సంకరణం, సంకరం, సంకారం, సంకృతి, సంక్రియ 3. సంకారకం, సంకరి (న్), సంకారి (న్), సంకర్త (ర్తృ), సంకృత్ 4. సంకృతం 5. సంకరణి, సంకరిత్రం 6. సంకార్యం, సంకరణీయం, సంకర్తవ్యం 7. సంకుర్వాణం, సంకుర్వంతం 8. సంకరిష్యం

937. సంకల్పించు – 1. సంకల్పతే 2. సంకల్పం, సంకల్పనం, సంక్ౢప్తం 3. సంకల్పకం, సంకల్పి (న్) 4. సంక్ౢప్తం, సంకల్పితం 5. సంకల్పని 6. సంకల్ప్యం, సంకల్పనీయం, సంకల్పితవ్యం 7. సంకల్పమానం 8. సంక్లప్స్యం

938. సంకోచించు – 1. సంకోచతి 2. సంకోచం, సంకోచనం 3. సంకోచకం, సంకోచి (న్), సంకోచిత (తృ) 4. సంకుచితం 5. సంకోచని 6. సంకోచ్యం, సంకోచనీయం, సంకోచితవ్యం 7. సంకోచంతం 8. సంకోచిష్యం

939. సంక్రమించు – 1. సంక్రమతే 2. సంక్రమణం, సంక్రమం, సంక్రామం, సంక్రాంతి 3 సంక్రామకం, సంక్రమి (న్), సంక్రమిత (తృ) 4. సంక్రాంతం 5. సంక్రమణి, సంక్రమిత్రం 6. సంక్రమ్యం, సంక్రమణీయం, సంక్రాంతవ్యం 7. సంక్రమమాణం 8. సంక్రమిష్యం

940. సంక్షేపించు – చూ. కుదించు.

941. సంగమించు – చూ. రమించు.

942. సంగ్రహించు – 1. సంగృహ్ణాతి 2. సంగ్రహం, సంగ్రహణం 3. సంగ్రాహకం, సంగ్రాహి (న్), సంగ్రహీత (తృ), సంగృహీతి 4. సంగృహీతం 5. సంగ్రహణి, సంగ్రహిత్రం 6. సంగ్రాహ్యం, సంగ్రహణీయం, సంగృహీతవ్యం 7. సంగృహ్ణాంతం 8. సంగ్రహిష్యం

943. సంఘర్షించు – చూ. కలహించు.

944. సంచరించు – చూ. తిరుగు (ఇటు, అటు).

945. **సంజ్ఞచేయు** – 1. సంజ్ఞాపయతి 2. సంజ్ఞాపనం, సంజ్ఞప్తి 3. సంజ్ఞాపకం, సంజ్ఞాపి (న్), సంజ్ఞాపయిత 4. సంజ్ఞాపితం 5. సంజ్ఞాపని 6. సంజ్ఞాప్యం, సంజ్ఞాపనీయం, సంజ్ఞాపయితవ్యం 7. సంజ్ఞాపయంతం 8. సంజ్ఞాపయిష్యం

ఇదే అర్థంలో:- 1. సంకేతయతి 2. సంకేతం, సంకేతనం 3. సంకేతకం, సంకేతి (న్), సంకేతయిత (తృ) 4. సంకేతితం 5. సంకేతని 6. సంకేత్యం, సంకేతనీయం, సంకేతితవ్యం 7. సంకేతయంతం 8. సంకేతయిష్యం

946. **సంతోషపడు** – 1. ఆనందతి 2. ఆనందం, ఆనందనం 3. ఆనందకం, ఆనంది (న్), ఆనందిత (తృ) 4. అనందితం 5. ఆనందని 6. ఆనంద్యం, ఆనందనీయం, ఆనందితవ్యం 7. ఆనందంతం 8. ఆనందిష్యం

947. సందేశమిచ్చు – 1. సందిశతి 2. సందేశం, సందేశనం, సందిష్టి 3. సందేశకం, సందేశి (న్), సందేష్ట (ష్టృ) 4. సందిష్టం 5. సందేశని, సందేశిత్రం 6. సందేశ్యం, సందేశనీయం, సందేష్టవ్యం 7. సందిశంతం 8._______

948. సందేహించు – 1. సందేగ్ధి 2. సందేహం, సందేహనం 3. సందేహకం, సందేహి (న్), సందేగ్ధ (గ్ధృ) 4. సందిగ్ధం 5. సందేహని 6. సందేహ్యం, సందేహనీయం, సందిగ్ధవ్యం 7. సందిహంతం 8. సంధేక్ష్యం

949. సంధానించు – 1. సందధాతి 2. సంధానం, సంధి 3. సంధాయకం, సంధాయి (న్), సంధాత (తృ) 4. సంహితం, సంధానితం 5. సంధాత్రం 6. సంధేయం, సంధాతవ్యం 7. సందధంతం 8. సంధాస్యం

950. సంధించు – చూ. సంధానించు.

951. సంధిచేయు – చూ. సంధానించు.

952. సంపర్కము చేయు – 1. సంపర్చతే 2. సంపర్చనం, సంపర్కం, సంపృక్తి 3. సంపర్చకం, సంపర్కి (న్), సంప్రక్త (క్తృ) 4. సంపృక్తం 5. సంపర్చని 6. సంపృచ్యం, సంపర్చనీయం, సంపృక్తవ్యం 7. సంపర్చమానం 8. సంప్రక్ష్యం

953. సంప్రదించు – 1. మంత్రయతే 2. మంత్రణం 3. మంత్రకం, మంత్రి (న్), మంత్రయిత (తృ) 4. మంత్రితం 5. మంత్రణి 6. మంత్ర్యం, మంత్రణీయం, మంత్రయితవ్యం 7. మంత్రయంతం 8. మంత్రయిష్యం

954. సంబోధించు – 1. సంబోధతి 2. సంబోధనం, సంబోధం, సంబుద్ధి 3. సంబోధకం, సంబోధి (న్), సంబోద్ధ (ద్ధృ) 4. సంబుద్ధం, సంబోధితం 5. సంబోధని 6. సంబోధ్యం, సంబోధనీయం, సంబోధితవ్యం 7. సంబోధంతం

8. సంబోధిష్యం

955. సంభవించు – 1. సంభవతి 2. సంభవనం, సంభవం, సంభూతి 3. సంభవకం, సంభావి (న్), సంభవిత (తృ) 4. సంభూతం 5. సంభవని, సంభవిత్రం 6. సంభావ్యం, సంభవనీయం, సంభవితవ్యం 7. సంభవంతం 8. సంభవిష్యం

956. సంభాషించు – 1. సంభాషతే 2. సంభాషణం, సంభాష 3. సంభాషకం, సంభాషి (న్), సంభాషిత (తృ) 4. సంభాషితం 5. సంభాషణి, సంభాషిత్రం 6. సంభాష్యం, సంభాషణీయం, సంభాషితవ్యం 7. సంభాషమాణం 8. సంభాషిష్యం

957. సంభోగించు – చూ. రమించు.

958. సంయమనము పాటించు – 1. సంయమతే 2. సంయమనం, సంయమం, సంయతి 3. సంయామకం, సంయమి(న్), సంయంత (తృ) 4. సంయతం 5. సంయమని, సంయంత్రం 6. సంయమ్యం, సంయమనీయం, సంయంతవ్యం 7. సంయమమానం 8. సంయమిష్యం

959. సంయోగించు – చూ. రమించు.

960. సంస్కరించు – చూ. దిద్దు.

961. సంహరించు – 1. సంహరతి 2. సంహరణం, సంహారం, సంహృతి 3. సంహారకం, సంహారి (న్), సంహర్త (ర్తృ) 4. సంహృతం 5. సంహరణి, సంహరిత్రం 6. సంహార్యం, సంహరణీయం, సంహర్తవ్యం 7. సంహరంతం 8. సంహరిష్యం

962. సడలు (to relax - *intransitive*) – 1. శ్లథతి 2. శ్లథనం 3. శ్లాథకం, శ్లథి (న్), శ్లథిత (తృ) 4. శ్లథితం, శ్లథం 5. శ్లథని, శ్లథిత్రం 6. శ్లథ్యం, శ్లథనీయం, శ్లథితవ్యం 7. శ్లథంతం 8. శ్లథిష్యం

963. సడలించు (to relax - *transitive*) – 1. శ్లాథయతి 2. శ్లాథనం 3. శ్లాథకం, శ్లాథి (న్), శ్లాథయిత (తృ) 4. శ్లాథితం 5. శ్లాథని 6. శ్లాథ్యం, శ్లాథనీయం, శ్లాథయితవ్యం 7. శ్లాథయంతం 8. శ్లాథయిష్యం

964. సన్నద్ధమగు – 1. సన్నహ్యతే 2. సన్నాహం, సన్నహనం, సన్నద్ధి 3. సన్నాహకం, సన్నాహి (న్) 4. సన్నద్ధం 5. సన్నహణి 6. సన్నహ్యం, సన్నహణీయం, సన్నద్ధవ్యం 7. సన్నహ్యమాణం 8. సన్నహిష్యం

965. సన్న్యసించు – 1. సన్న్యస్యతి 2. సన్న్యసనం, సన్న్యాసం, సన్న్యస్తి 3. సన్న్యాసకం, సన్న్యాసి (న్), సన్న్యసిత (తృ) 4. సన్న్యస్తం 5. సన్న్యసని, సన్న్యస్త్రం 6. సన్న్యస్యం, సన్న్యసనీయం, సన్న్యస్తవ్యం 7. సన్న్యస్యంతం 8. సన్న్యసిష్యం

966. సఫలమగు – 1. సఫలీభవతి 2. సఫలీభవనం, సఫలీభావం, సఫలీభూతి 3. సఫలీభావి (న్), సఫలీభవిత (తృ) 4. సఫలీభూతం 5. సఫలీభవని 6. సఫలీభవ్యం, సఫలీభవితవ్యం 7. సఫలీభవంతం 8. సఫలీభవిష్యం

967. సమకట్టు – 1. ఉద్యమతే 2. ఉద్యమనం, ఉద్యమం, ఉద్యతి 3. ఉద్యామకం, ఉద్యమి (న్), ఉద్యంత (తృ) 4. ఉద్యతం 5. ఉద్యమని, ఉద్యంత్రం 6. ఉద్యమ్యం, ఉద్యమనీయం, ఉద్యంతవ్యం 7. ఉద్యమమానం 8. ఉద్యమిష్యం

968. సమకూడు – 1. సంపద్యతే 2. సంపదనం, సంపత్తి 3. సంపదకం, సంపది (న్), సంపదిత (తృ) 4. సంపన్నం 5. సంపదని, సంపదిత్రం 6. సంపద్యం, సంపదనీయం, సంపదితవ్యం 7. సంపద్యమానం 8. సంపత్స్యం

969. సమర్థాడు – చూ. పుష్పించు.

970. సమర్థించు – 1. సమర్థయతి 2. సమర్థనం 3. సమర్థకం, సమర్థి (న్), సమర్థయిత (తృ) 4. సమర్థితం 5. సమర్థని 6. సమర్థ్యం, సమర్థనీయం, సమర్థయితవ్యం 7. సమర్థయంతం 8. సమర్థయిష్యం

971. సమర్పించు – 1. సమర్పయతి 2. సమర్పణం 3. సమర్పకం, సమర్పి (న్), సమర్పయిత (తృ) 4. సమర్పితం 5. సమర్పణి 6. సమర్ప్యం, సమర్పణీయం, సమర్పయితవ్యం 7. సమర్పయంతం 8. సమర్పయిష్యం

972. సమాప్తము చేయు – చూ. ముగించు.

973. సమాసం చేయు – 1. సమస్యతి 2. సమాసం, సమసనం, సమస్తి 3. సమాసకం, సమాసి(న్), సమసిత (తృ) 4. సమస్తం 5. సమసని, సమస్త్రం 6. సమస్యం, సమసనీయం, సమస్తవ్యం 7. సమస్యంతం 8. సమసిష్యం

974. సమాహారము చేయు – 1. సమాహరతి 2. సమాహరణం, సమాహారం, సమాహృతి 3. సమాహారకం, సమాహారి (న్), సమాహర్త 4. సమాహృతం 5. సమాహరణి, సమాహరిత్రం 6. సమాహార్యం, సమాహరణీయం, సమాహర్తవ్యం 7. సమాహరంతం 8. సమాహరిష్యం

975. సమ్మానించు – 1. సమ్మానయతి 2. సమ్మానం, 3. సమ్మాని (న్) 4. సమ్మితం, సమ్మానితం 5. సమ్మంత్రం 6. సమ్మాన్యం, సమ్మాననీయం, సమ్మానయితవ్యం 7. సమ్మానయంతం 8. సమ్మానయిష్యం

976. సమీకరించు – 1. సమీకరోతి 2. సమీకరణం, సమీకారం, సమీకృతి, సమీక్రియ 3. సమీకారకం, సమీకారి (న్), సమీకర్త (ర్తృ) 4. సమీకృతం 5. సమీకరణి, సమీకరిత్రం 6. సమీకార్యం, సమీకరణీయం, సమీకర్తవ్యం 7. సమీకుర్వాణం, సమీకుర్వంతం 8. సమీకరిష్యం

977. సమీక్షించు – 1. సమీక్షతే 2. సమీక్షణం, సమీక్ష 3. సమీక్షకం, సమీక్షి (న్), సమీక్షిత (తృ) 4. సమీక్షితం 5. సమీక్షణి, సమీక్షిత్రం 6. సమీక్ష్యం, సమీక్షణీయం, సమీక్షితవ్యం 7. సమీక్షమాణం 8. సమీక్షిష్యం

978. సమ్మతించు – చూ. అంగీకరించు.

979. సమ్మేళించు – 1. సమ్మేళయతి 2. సమ్మేళనం 3. సమ్మేళకం, సమ్మేళి (న్), సమ్మేళయిత (తృ) 4. సమ్మేళితం 5. సమ్మేళని, సమ్మేళిత్రం 6. సమ్మేళ్యం, సమ్మేళనీయం, సమ్మేళయితవ్యం 7. సమ్మేళయంతం 8. సమ్మేళయిష్యం

980. సరళీకరించు – 1. సరళీకరోతి 2. సరళీకరణం, సరళీకృతి 3. సరళీకారకం, సరళీకరం, సరళీకారి (న్), సరళీకర్త (ర్తృ) 4. సరళీకృతం 5. సరళీకరణి, సరళీకరిత్రం 6. సరళీకార్యం, సరళీకరణీయం, సరళీకర్తవ్యం 7. సరళీకుర్వాణం, సరళీకుర్వంతం 8. సరళీకరిష్యం

981. సరిచేయు – 1. సమ్యక్కరోతి 2. సమ్యక్కరణం, సమ్యక్ కృతి, సమ్యక్ క్రియ 3. సమ్యక్కారకం, సమ్యక్కారి (న్), సమ్యక్కర్త (ర్తృ) 4. సమ్యక్ కృతం 5. సమ్యక్కరణి, సమ్యక్కరిత్రం 6. సమ్యక్కార్యం, సమ్యక్కరణీయం, సమ్యక్కర్తవ్యం 7. సమ్యక్కుర్వాణం, సమ్యక్కుర్వంతం 8. సమ్యక్కరిష్యం

982. సరిచూచు – 1. సమాలోకతే 2. సమాలోకనం, సమాలోకం 3. సమాలోకి (న్), సమాలోకిత (తృ) 4. సమాలోకితం 5. సమాలోకని 6. సమాలోక్యం, సమాలోకనీయం, సమాలోకితవ్యం 7. సమాలోకమానం 8. సమాలోకిష్యం

983. సరితూగు – 1. సంతులతే 2. సంతులనం 3. సంతులకం, సంతులి (న్) 4. సంతులితం 5. సంతులని 6. సంతుల్యం, సంతులనీయం, సంతులితవ్యం 7. సంతులమానం 8. సంతులిష్యం

984. సరిదిద్దు – చూ. దిద్దు.

985. సరిపడు – 1. సంవదతి 2. సంవాదం 3. సంవాదకం, సంవాది (న్), సంవక్త (క్తృ) 4. సంవాదితం 5. సంవాదని, సంవాదిత్రం 6. సంవద్యం, సంవదనీయం, సంవక్తవ్యం 7. సంవదంతం 8. సంవదిష్యం

986. సరిపెట్టు – 1. అలందధాతి 2. అలంధానం 3. అలంధాయి (న్), అలంధాత (తృ) 4. అలంహితం 5. అలంధాత్రం 6. అలంధేయం, అలంధాతవ్యం 7. అలందధంతం 8. అలంధాస్యం

987. సరిపోవు – 1. అలంభవతి 2. అలంభావం, అలంభవనం, అలంభూతి 3. అలంభవకం, అలంభావి (న్), అలంభవిత (తృ) 4. అలంభూతం 5. అలంభవని, అలంభవిత్రం 6. అలంభవ్యం, అలంభవనీయం, అలంభవితవ్యం 7. అలంభవంతం 8. అలంభవిష్యం

988. సవాలుచేయు – 1. ప్రతిక్రోశతి 2. ప్రతిక్రోశం, ప్రతిక్రోశనం 3. ప్రతిక్రోశకం, ప్రతిక్రోశి (న్), ప్రతిక్రోశిత (తృ) 4. ప్రతిక్రుష్టం 5. ప్రతిక్రోశని 6. ప్రతిక్రుశ్యం, ప్రతిక్రుష్టవ్యం 7. ప్రతిక్రోశంతం 8. ప్రతిక్రోశిష్యం

989. సవరించు – చూ. దిద్దు.

990. సహకరించు – 1. సహకరోతి 2. సహకరణం, సహకారం, సహక్రియ, సహకృతి 3. సహకారకం, సహకారి (న్), సహకర్త (ర్తృ) 4. సహకృతం 5. సహకరణి, సహకరిత్రం 6. సహకార్యం, సహకరణీయం, సహకర్తవ్యం 7. సహ కుర్వాణం, సహకుర్వంతం 8. సహకరిష్యం

991. సహగమనము చేయు – 1. సహగచ్ఛతి 2. సహగమనం, సహగతి 3. సహగామిని, సహగంత్రి 4. సహగత 5. సహగమని 6. సహగమ్యం, సహగమనీయం, సహగంతవ్యం 7. సహగచ్ఛంతం 8. సహగమిష్యం

992. సహించు – 1. సహతే 2. సహనం 3. సహం, సోఢ (ఢృ) 4. సోఢం 5. సహని 6. సహ్యం, సహనీయం, సోఢవ్యం 7. సహమానం 8. సహిష్యం

993. సాకు – 1. పాలయతే 2. పాలనం 3. పాలకం, పాలి (న్), పాలయిత (తృ) 4. పాలితం 5. పాలని, పాలిత్రం 6. పాల్యం, పాలనీయం, పాలయితవ్యం 7. పాలమానం 8. పాలయిష్యం

994. సాగు – చూ. కొనసాగు.

995. సాగించు – చూ. కొనసాగించు.

996. సానపట్టు - 1. నికషతి 2. నికషణం 3. నికాషకం, నికషి (న్), నికషిత (తృ) 4. నికష్టం 5. నికషం 6. నికష్యం, నికషణీయం, నికష్టవ్యం 7. నికషంతం 8. నికషిష్యం

997. సాధించు – 1. సాధయతి 2. సాధనం 3. సాధకం, సాధి (న్), సాధయిత (తృ) 4. సాధితం 5. సాధని, సాధిత్రం 6. సాధ్యం, సాధనీయం, సాధయితవ్యం 7. సాధయంతం 8. సాధయిష్యతి

998. సిగ్గుపడు – 1. లజ్జతే 2. లజ్జ, లజ్జనం 3. లజ్జకం, లజ్జి (న్), లజ్జిత (తృ) 4. లజ్జితం 5. లజ్జని, లజ్జిత్రం 6. లజ్జ్యం, లజ్జనీయం, లజ్జితవ్యం 7. లజ్జమానం 8. లజ్జిష్యం

ఇదే అర్థంలో- 1. త్రపతే 2. త్రప, త్రపనం 3. త్రాపకం, త్రపి (న్), త్రపిత (తృ) 4. త్రపితం 5. త్రపని 6. త్రప్యం, త్రపనీయం, త్రపితవ్యం 7. త్రపమానం 8. త్రపిష్యం

ఇదే అర్థంలో- 1. వ్రీడ్యతి 2. వ్రీడ, వ్రీడనం 3. వ్రీడకం, వ్రీడి (న్), వ్రీడిత (తృ) 4. వ్రీడితం 5. వ్రీడని 6. వ్రీడ్యం, వ్రీడనీయం, వ్రీడితవ్యం 7. వ్రీడ్యంతం 8. వ్రీడిష్యం

999. సిద్ధమగు - 1. సజ్జతి 2. సజ్జనం 3. సజ్జం, సజ్జి (న్), సజ్జిత (తృ) 4. సజ్జితం 5. సజ్జని 6. సజ్జ్యం, సజ్జనీయం, సజ్జితవ్యం 7. సజ్జంతం 8. సజ్జిష్యం

1000. సిద్ధించు – 1. సిధ్యతి 2. సిద్ధి, సేధనం 3. సేధకం, సేధి (న్), సేధిత (తృ) 4. సిద్ధం 5. సేధని 6. సిధ్యం, సేధనీయం, సేద్ధవ్యం 7. సిధ్యంతం 8. సేత్స్యం

1001. సుఖించు – 1. సుఖీభవతి 2. సుఖీభవనం, సుఖీభావం 3. సుఖీభవకం, సుఖీభావి (న్), సుఖీభవిత (తృ) 4. సుఖీభూతం 5. సుఖీభవని, సుఖీభవిత్రం 6. సుఖీభవ్యం, సుఖీభవనీయం, సుఖీభవిత్రం 7. సుఖీభవంతం 8. సుఖీభవిష్యం

1002. సూచించు – 1. సూచయతి 2. సూచనం 3. సూచకం, సూచి (న్), సూచయిత (తృ) 4. సూచితం 5. సూచని 6. సూచ్యం, సూచనీయం, సూచయితవ్యం 7. సూచయంతం 8. సూచయిష్యం

1003. సూత్రీకరించు – 1. సూత్రీకరోతి 2. సూత్రీకరణం, సూత్రీకారం, సూత్రీకృతి, సూత్రీక్రియ 3. సూత్రీకారి (న్), సూత్రీకర్త (ర్తృ) 4. సూత్రీకృతం 5. సూత్రీకరణి, సూత్రీకరిత్రం 6. సూత్రీకార్యం, సూత్రీకరణీయం, సూత్రీకర్తవ్యం 7. సూత్రీకుర్వాణం, సూత్రీకుర్వంతం 8. సూత్రీకరిష్యం

1004. సేకరించు – 1. సంచినోతి 2. సంచయనం, సంచితి 3. సంచాయకం, సంచయి (న్), సంచేత (తృ) 4. సంచితం 5. సంచయని, సంచేత్రం 6. సంచేయం, సంచయనీయం, సంచేతవ్యం 7. సంచిన్వంతం, సంచిన్వానం 8. సంచేష్యం

1005. సేవచేయు - 1. సేవతే 2. సేవ 3. సేవకం, సేవి (న్), సేవిత (తృ) 4. సేవితం 5. సేవని, సేవిత్రం 6. సేవ్యం, సేవనీయం, సేవితవ్యం 7. సేవమానం 8. సేవిష్యం

ఇదే అర్థంలో- 1. భజతి 2. భజనం , భక్తి 3. భాజకం, భాజి (న్), భజిత (తృ) 4. భక్తం 5. భజని, భక్త్రం 6. భజ్యం, భజనీయం, భక్తవ్యం 7. భజంతం 8. భజిష్యం

ఇదే అర్థంలో – చూ. పరిచర్య చేయు.

1006. సైగచేయు – చూ. సంజ్ఞచేయు.

1007. సోకు – 1. సంక్రామతి 2. సంక్రమణం, సంక్రమం, సంక్రాంతి 3. సంక్రామకం, సంక్రమి(న్), సంక్రామి(న్), సంక్రమిత (తృ) 4. సంక్రాంతం 5. సంక్రమణి, సంక్రమిత్రం 6. సంక్రమ్యం, సంక్రమణీయం, సంక్రాంతవ్యం 7. సంక్రామంతం 8. సంక్రమిష్యం

1008. స్తుతించు – చూ. పొగడు

1009. స్నానం చేయు – 1. స్నాతి 2. స్నానం 3. స్నాయకం, స్నాయి (న్), స్నాని (న్), స్నాత (తృ) 4. స్నాతం 5.

స్నాత్రం 6. స్నేయం, స్నాతవ్యం 7.________ 8. స్నాస్యం

1010. స్నానం చేయించు – 1. స్నపయతి 2. స్నపనం, స్నప్తి 3. స్నపకం, స్నపి (న్), స్నపిత (తృ) 4. స్నపితం 5. స్నపని, స్నప్త్రం 6. స్నప్యం, స్నపనీయం, స్నపితవ్యం 7. స్నపయంతం 8. స్నపయిష్యం

1011. స్నానం చేయు (నది, చెఱువు, సముద్రం ఇత్యాదులలో) - 1. అవగాహతే 2. అవగాహం, అవగాహనం 3. అవగాహకం, అవగాహి (న్), అవగాహిత (తృ) 4. అవగాఢం 5. అవగాహని, అవగాహిత్రం 6. అవగాహ్యం, అవగాహనీయం, అవగాహితవ్యం 7. అవగాహమానం 8. అవగాహిష్యం

1012. స్నేహం చేయు – 1. సఖీభవతి 2. సఖీభవనం, సఖీభావం 3. సఖీభవకం, సఖీభావి (న్), సఖీభవిత (తృ) 4. సఖీభూతం 5. సఖీభవని, సఖీభవిత్రం 6. సఖీభవ్యం, సఖీభవనీయం, సఖీభవిత్రం 7. సఖీభవంతం 8. సఖీభవిష్యం

1013. స్పందించు (కదలాడు/ అల్లాడు) – 1. స్పందతే 2. స్పందనం, స్పందం 3. స్పందకం, స్పంది (న్), స్పందిత (తృ) 4. స్పందితం 5. స్పందని, స్పందిత్రం 6. స్పంద్యం, స్పందనీయం, స్పందితవ్యం 7. స్పందమానం 8. స్పందిష్యం

1014. స్పృశించు – చూ. తాకు.

1015. స్పష్టం చేయు – 1. విశదయతి 2. విశదనం 3. విశదకం, విశది (న్), విశదయిత (తృ) 4. విశదం, విశదితం 5. విశదని, విశదిత్రం 6. విశద్యం, విశదనీయం, విశదయితవ్యం 7. విశదయంతం 8. విశదయిష్యం

1016. స్మరించు – చూ. గుర్తుకు తెచ్చుకొను.

1017. స్రవించు – చూ. కాఱు.

1018. స్వీకరించు – చూ, తీసుకొను.

1019. హడావిడిపడు – చూ. తొందఱపడు.

1020. హత్తు/హత్తుకొను – 1. ఉపశ్లిష్యతి 2. ఉపశ్లేషం 3. ఉపశ్లేషకం, ఉపశ్లేషి (న్) 4. ఉపశ్లిష్టం 5. ఉపశ్లేషణి 6. ఉపశ్లిష్యం 7. ఉపశ్లిష్యంతం 8. ఉపశ్లేషిష్యం

1021. హరించు – 1. హరతి 2. హరణం, హారం, హృతి 3. హారకం, హరం, హారి (న్), హర్త (ర్తృ) 4. హృతం 5. హరణి, హరిత్రం 6. హార్యం, హరణీయం, హర్తవ్యం 7. హరంతం 8. హరిష్యం

1022. హర్షించు – 1. హృష్యతి 2. హర్షం, హర్షణం, హృష్టి 3. హర్షకం, హర్షి (న్), హర్షిత (తృ) 4. హర్షితం 5. హర్షణి 6. హృష్యం, హర్షణీయం, హృషితవ్యం 7. హృష్యంతం 8. హర్షిష్యం

1023. హింసించు – 1. హినస్తి 2. హింసనం, హింస 3. హింసకం, హింసి (న్), హింసిత (తృ) 4. హింసితం 5. హింసని, హింసిత్రం 6. హింస్యం, హింసనీయం, హింసితవ్యం 7. హింసంతం 8. హింసిష్యం

1024. హెచ్చు –చూ. పెఱుగు.

1025. క్షమించు – చూ. మన్నించు.

1026. క్షోభించు – చూ. కల్లోలమగు.

1027. పరిమితము చేయు – 1. పరిమాపయతి 2. పరిమాపనం 3. పరిమాపకం, పరిమాపి (న్), పరిమాపయిత (తృ) 4. పరిమాపితం 5. పరిమాపని 6. పరిమాప్యం, పరిమాపనీయం, పరిమాపయితవ్యం 7. పరిమాపయంతం 8. పరిమాపయిష్యం

కొన్ని పరిశిష్ట ధాతువులు

1028. గుండుగీయు/ గుండుకొట్టు – 1. ముండయతి 2. ముండనం 3. ముండకం 4. ముండితం 5. ముండని, ముండిత్రం 6. ముండ్యం, ముండనీయం, ముండితవ్యం 7. ముండయంతం 8. ముండయిష్యం

1029. చిక్కుకొని పోవు – 1. అవసంజతే 2. అవసంగం, అవసంజనం, అవసక్తి 3. అవసంజకం, అవసంజి (న్), 4. అవసక్తం 5. అవసంజని, అవసక్త్రం 6. అవసజ్యం, అవసంజనీయం, అవసక్తవ్యం 7. అవసంజమానం 8. అవసక్ష్యం

1030. మార్చు – 1. అన్యథాకరోతి 2. అన్యథాకరణం, అన్యథాకృతి 3. అన్యథాకరం, అన్యథాకారి, అన్యథాకర్త (ర్తృ) 4. అన్యథాకృతం 5. అన్యథాకరణి, అన్యథాకరిత్రం 6. అన్యథాకార్యం, అన్యథాకరణీయం, అన్యథాకర్తవ్యం 7. అన్యథా కుర్వాణం, అన్యథాకుర్వంతం 8. అన్యథాకరిష్యం

1031. మాసికలు వేయు (పాతబట్టలకు) - 1. వినివయతి 2. వినివయనం, వినివాయం, వినివీతి 3. వినివాయకం, విని వాయి (న్), వినివేత (తృ) 4. వినివీతం 5. వినివయని 6. వినివయనీయం, వినివేతవ్యం 7. వినివయంతం 8. విని వేష్యం.

1032. Copy వ్రాయు - 1. ప్రలిఖతి 2. ప్రలేఖనం, ప్రలేఖం 3. ప్రలేఖి (న్), ప్రలేఖకం, ప్రలేఖిత (తృ) 4. ప్రలిఖితం 5. ప్రలేఖని, ప్రలేఖిత్రం 6. ప్రలేఖ్యం, ప్రలేఖనీయం, ప్రలేఖితవ్యం 7. ప్రలిఖంతం 8. ప్రలేఖిష్యం

1033. Dictation వ్రాయు - 1. అనులిఖతి 2. అనులేఖనం, అనులేఖం 3. అనులేఖి (న్), అనులేఖకం, అనులేఖిత (తృ) 4. అనులిఖితం 5. అనులేఖని, ప్రలేఖిత్రం 6. అనులేఖ్యం, అనులేఖనీయం, అనులేఖితవ్యం 7. అనులిఖంతం 8. అనులేఖిష్యం

1034. Precis వ్రాయు - 1. అవలిఖతి 2. అవలేఖనం, అవలేఖం 3. అవలేఖి (న్), అవలేఖకం, అవలేఖిత (తృ) 4. అవలిఖితం 5. అవలేఖని, ప్రలేఖిత్రం 6. అవలేఖ్యం, అవలేఖనీయం, అవలేఖితవ్యం 7. అవలిఖంతం 8. అవలేఖిష్యం

1035. దిద్దివ్రాయు/ కొట్టివేసి మఱల వ్రాయు - 1. పరిలిఖతి 2. పరిలేఖనం, పరిలేఖం 3. పరిలేఖి (న్), పరిలేఖకం, పరిలేఖిత (తృ) 4. పరిలిఖితం 5. పరిలేఖని, ప్రలేఖిత్రం 6. పరిలేఖ్యం, పరిలేఖనీయం, పరిలేఖితవ్యం 7. పరిలిఖంతం 8. పరిలేఖిష్యం

1036. నమోదు (record) చేయు - 1. అభిలిఖతి 2. ఉపలేఖనం, అభిలేఖం 3. అభిలేఖి (న్), అభిలేఖకం, అభిలేఖిత (తృ) 4. అభిలిఖితం 5. అభిలేఖని, ప్రలేఖిత్రం 6. అభిలేఖ్యం, అభిలేఖనీయం, అభిలేఖితవ్యం 7. అభిలిఖంతం 8. అభిలేఖిష్యం

పదనిష్పాదన కళ

పదిహేనో అధ్యాయం

పునరుద్ధరణీయ పదజాలం

వాస్తవానికి ఈ ప్రస్తావన నూతన పదనిష్పాదన విభాగం క్రిందికి రాదు. కానీ ఉన్నది నశించిపోకుండా కాపాడుకోవడం కూడా లేనిదాన్ని గడించడంతో సమానం కనుకా, మనకి తెలీని ప్రతీదీ ఓ క్రొత్త కనుగోలే కనుకా, ఇక్కడ దీన్ని ఇలా ప్రత్యేకంగా అధ్యాయీకరించడం జఱిగింది.

తెలుగుభాషకి స్వతహాగా ఉన్న భావవ్యంజనాశక్తి అపారం. అయినప్పటికీ ఇది సూత్రప్రాయంగానే తప్ప ఆచరణలో అధికారభాషగా అమలుకావడం లేదు. పాఠశాలల దగ్గఱినుంచీ ఆంగ్లమే రాజ్యమేలుతోంది. మఱో పక్క మనలో లోతుగా పాతుకుపోయిన స్వభాషాద్వేషం, పరభాషావ్యామోహం. ఇలా ఛప్పన్న కారణాల్ని పురస్కరించుకొని తెలుగు పదసంపదా, వైశిష్ట్యమూ వెలుగులోకి రాకుండా నానాటికీ మఱుగున పడుతున్నాయి. మనం పాత తెలుగుగ్రంథాల్ని తిరగేసినప్పుడు నేటి జీవనావసరాలకి ఉపయుక్తమైన పదజాలం వాటిల్లో లెక్కకు మిక్కిలిగా కనిపిస్తుంది. దాన్నంతటినీ ఈనాటి వాడుకలోకి తీసుకొచ్చి పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిజానికి బ్రిటీషువారి కాలంలో కూడా తెలుగు అధికారభాషగా గానీ, బోధనాభాషగా గానీ లేదు. ఆ వాతావరణంలోనే చదువుకున్నప్పటికీ, మన తాతముత్తాతల తరంవారు తమకి తెలిసిన ఆంగ్లపదాలకి దీటుగా అనేక పాత తెలుగుపదాల్ని పునరుద్ధరించి ప్రయోగించారు. అదే ఈనాటి తెలుగు పత్రికాభాష అయింది. ఇజ్రాయిల్ దేశస్థులైతే ఏకంగా ఒక మృతభాష (హెబ్రూ) నే పునరుద్దరించి దాన్ని తమ దేశానికి అధికారభాషగా కూడా చేసుకున్నారు. (శుభ్రంగా బ్రతికున్న భాషనే తెగటార్చ సమకట్టినవాళ్ళతో పోలిస్తే వారి భాషా–సంస్కృతుల అభిమానం ఎంత మహోన్నతమో కదా) అటువంటప్పుడు మనం మన యొక్క జీవంత మాతృభాషకి చెందిన కొన్ని విలువైన పాతపదాల్ని పునరుద్ధరిస్తే తప్పేముంది? కొన్ని పదాలకి గ్రాంథికం అని ముందే పేరు పెట్టేసి, వాటిని ప్రజాసామాన్యానికి కృత్రిమంగా దూరం చేసి భాషని బీదరించడం తగదు. ఏదైనా వాడుక మీదే ఆధారపడి ఉంటుంది. వాడకపోతే అంతా గ్రాంథికమే. వాడుతూ పోతే అంతా వ్యావహారికమే. వాడుతున్నకొద్దీ ఆ పదాలు మనకి ఇంతకుముందుకన్నా ఎక్కువ సుపరిచితమూ, సద్యఃస్ఫోరకమూ అవుతాయి.

ఈ సందర్భంగా నా దృష్టికొచ్చిన కొన్ని పాత తెలుగుపదాల్ని ఇక్కడ ప్రదర్శిస్తున్నాను. ఇవి ఎక్కువభాగం పాత పుస్తకాల నుంచీ, నిఘంటువుల నుంచీ సేకరించినవి. అంతర్జాలం నుంచీ, మాండలిక వాడుకల నుంచీ సేకరించినవి కూడా కొద్ది ఉన్నాయి.

అంకణం – రెండు దూలాల మధ్యస్థలం

అంకనం – గుర్తువేయడం Branding.

అంచలం – కొంగు, చివఱ

అంతర్ముఖుడు – Introvert

అంతర్లాప – తనలోనే సమాధానం కూడా కలిగిన ప్రశ్న.

అందిక/అందుబడి – అందుబాటు

అంధాహి – విషం లేని పాము.

అంపఱ – బాణసమూహం

అంబారు పిడుజు – పశువుల రక్తం పీల్చే ఒక పురుగు

అకృష్టపచ్యం – దున్నకపోయినా పండే భూమి

అక్కళించు – పొట్ట వెన్నుకు అంటుకునేలా ఊపిరి బిగబట్టు

అగరి – విషానికి విఱుగుడు

అచ్చుకూటం – ముద్రణాలయం

అచ్ఛిద్రం – సందులేనిది, రంధ్రాలు లేనిది impervious, waterproof, airtight.

అట్టకం – మేడమీది గది

అట్టడి – కోట బురుజుమీది ఇల్లు

అట్టనం – పాటించకపోవడం, ఉల్లంఘన non-compliance

అడియాలం – ఆనవాలు, రుజువు. ఒక విషయాన్ని లేదా వ్యక్తిని గుర్తుపట్టడానికి ఉపకరించే identity card లాంటిది.

అడ్డకొడమ – చేపలు పట్టే ఒక సాధనం

అతిసాహిత్యం – రుచిగా ఉందని చెప్పి ఎక్కువగా భోజనం చేయడం

అత్రం – హస్తకవచం Gloves

అధివిన్న – మొదటి భార్య

అధివేత్త – ఒక భార్య ఉండగా మళ్ళీ పెళ్ళి చేసుకున్నవాడు

అధివేదనం – ఒక భార్య ఉండగా మళ్ళీ పెళ్ళి చేసుకోవడం

అధీతి – అధ్యయనం

అనుయోజనం – విచారణలో ప్రశ్నలు అడగడం Interrogation

అనుశ్రవం – తరతరాలుగా వినవస్తూన్న వృత్తాంతం Hearsay

అపటీక – ఆలోచనల్నిమఱుగుపఱచడం Reserved-ness

అపస్కరం – బండి యొక్క విడిభాగం Accessory

అవ్యళీకం – నిర్మలమైన మనస్సుతో కూడినది candid

అశిష్యం – నేర్పడానికి వీలుపడనిది

అనాహం – మలమూత్రబంధనం

ఇల్లడం – జాగ్రత్తగా భద్రపఱచమని ఇతరుల వద్ద ఉంచిన సొమ్ము, వస్తువులు మొ॥వి. (deposit)

ఉగ్రాణం – సామానులుంచే గది. Store room

ఉచ్చావచం – నానావిధాలైనది

ఉత్తానం – లోతులేనిది Shallow.

ఉత్తేజనం (ఉత్తేజించుట) – పదునుపెట్టడం

ఉత్థం – లేచినది, తొలగినది.

ఉద్దరి – ఏటవాలుగట్టు

ఉపరథ్య – చిన్నమార్గం Arterial road.

ఉరువిడి – వస్తుసమూహం

ఋక్థం – పిత్రార్జితం

ఎండువులు – ఎండలో ఆరబోసిన ధాన్యం

ఎక్కలి – ప్రవాహంలో కొట్టుకొచ్చిన ఇసుక

ఎగుబోద – ఱెక్కలొచ్చిన పక్షిపిల్ల

ఎడకారు – మాఘమాసం నుంచి జ్యేష్ఠమాసం లోపల పండే పంట

ఎలగోలు – ముందునడవడం

ఎలగోలు – వాన కుఱుస్తున్న చప్పుదు

ఎల్లాపి – దారిదొంగ

ఏలుకోటి – పాలితులు Subjects (Those who are ruled).

ఒగ్గం – ఏనుగుల్ని పట్టుకోవడం కోసం పెద్దగొయ్యి త్రవ్వి దాన్ని ఆకులూ మొదలైనవాటితో కప్పడం

ఓహటించు – వెనుదీయు

కంటలం (కవాడం) – ఎద్దుల మీద వేసే బరువైన సంచుల జత cargo.

కండ్రిక – భూఖండము A tract of land.

కందాయం – నాలుగుమాసాల కాలం

కందెన – చక్రాల బిగి సడలించడానికి వేసే నూనె. Lubricant

కక్కువాయి – దగ్గువ్యాధి

కట్టుక – గర్భస్రావం

కనుప్రొద్దులు – బిడ్డను కనాల్సిన నెల

కన్నెం – కోడి గుండెకాయ

కబ్బలి – కల్లమ్మేవాడు

కయాహం – బఱ్ఱెదూడ

కరోటం – బట్టలు పెట్టుకునే పెట్టె

కఱవాడి – ఎండుచేప

కఱి – పశుయోని

కలపకట్టె – కొయ్యకలం (wooden pen)

కలమరి – ఓడ ఎక్కి వెళ్ళే ప్రయాణికుడు Sailor.

కల్యవర్తం – ఉదయకాల ఉపాహారం Breakfast

కవిరి దినుసు – తాంబూలంతో పాటు వేసుకునే సువాసనపదార్థం

కసుబ – అధికారులుండే ప్రాంతం

కాకిసోమాల – Hysteria

కాపంతం – కుక్కని కట్టివేసే కొయ్య

కామ – గొడుగుపైన అమర్చే చిన్న ఇనపశలాక. చదివేటప్పుడు నిలిపివేసిన భాగం దగ్గఱ నిలువుగా వేసే గుర్తు.

కాయమానం – ఆకుటిల్లు, పూరిగుడిసె, పందిరి.

కారణికుడు – పరీక్ష చేసేవాడు

కిట్టించు – మోసం చేసే ఉద్దేశంతో, సరిపోలని లెక్కల్ని కృత్రిమంగా సరిపెట్టి చూపడం

కీతు – కొబ్బరాకుల చాప

కుటిలిక – తంటసం (వెంట్రుకల్ని పెరికే సాధనం)

కురువ – కొండ మీద పారే కాలువ ('కొండమీది దారి' అని కొన్నిచోట్ల)

కులుకం – నాలుకమీది పాచి

కువిందం – లోహాలకు మెఱుగుపెట్టే చూర్ణం

కూటస్థం – రూపాన్ని మార్చుకోకుండా స్థిరంగా ఉండేది Constant, as opposed to a variable.

కూటిముత్యం – కృత్రిమ ముత్యం, Cultured pearl

కొందుట – నజ్జునజ్జుగా నఱకడం

కొదుపుట – నమలకుండా మ్రింగడం

కొనటి – కురూపి, అంగవిహీనుడు

కొఱడు - ఇంద్రధనుస్సు

కొఱను – పక్షులు ఎర ఏఱుకొని తినే చోటు

కోటికాడు – గూఢచారి

కోరడి – కరగోడ, ఆవరణగా కట్టిన మట్టిగోడ

కోఱం – కొబ్బరి కోరే సాధనం

కోల్తల – యుద్ధసన్నాహం

కోలెమ్ము – వెన్నెముక

కోల్పులి – పెద్దపులి

కౌచు – చేపమీది పొట్టు

కౌటతక్షుడు – ఒకఱి క్రింద కాక స్వతంత్రంగా పనిచేసే వడ్రంగి Freelance carpenter

(వివరణ :– కుటీ–తక్షుడు = కుటి అంటే ఇల్లు. తన ఇంట్లోనే ఉండి చెక్కేవాడని శబ్దార్థం)

కౌద్రవీణం – ఆళ్ళు పండే పొలం

కౌసు – మాంసం

క్రంచఱగా – ఎడతెగకుండా, continuous గా

క్రాయు – ఉమ్మివేయు

క్రిక్క – వందిమాగధుడు, భట్రాజు

క్రీనీడ – అస్పష్టమైన నీడ

క్రీతం – కొనబడిన వస్తువు

క్రుంకుడు – సూర్యాస్తమయం

క్రేగంటి చూపు – కనుకొలకుల్లోంచి చూడ్డం

క్రేటుకొను – గొంతు సవరించుకొను

క్రేత - కొనేవాడు

క్రేపు – దూడ, పర్వతశిఖరం

క్రేవ – దిక్కు, ప్రక్కవైపు, పార్శ్వం

క్రైలు – ధాన్యాన్ని నూర్చి కొలవడం

క్రైలుదారు – ధాన్యాన్ని నూర్పించి కొలిచే అధికారి

క్రోవ (కోవ) – హారం, దండ

క్రోవి – గొట్టం

క్లీవం – ఆడా, మగా కానిది

క్లేదకం – తడిపేది

క్వాచిత్కం - అరుదుగా జఱిగేది, అఱుదుగా కనబడేది

గండమాల – థైరాయిడ్ సమస్య

గండూషించు – పుక్కిలించు

గిరక (గిలక) – నూతిరాట్నం

గిజరు – వంగ, మామిడి మొదలైన ఫలశాకాదుల్లో ఉండే పీచుతో కూడిన మెత్తని పదార్థం, కోడిగ్రుడ్డులోని పచ్చసొన

గీట్లబద్ద – రూళ్ళు కొట్టే స్కేలు

గుంటక – విత్తనాలు చల్లిన తరువాత పొలాన్ని చదునుచేసే సాధనం

గుండిగ – వెడల్పుమూతి గల లోహపాత్ర (డేగిసాలాంటిది)

గుండుగుత్త – సర్వహక్కులతోనూ ఇచ్చే గుత్తాధికారం

గుండ్ర – గ్రుడ్లగూబల అఱుపు

గుమి/గమి – గుంపు

గురుజు – తిరగటి కొయ్య

గులిమికదురు – చెవిలో గులిమి తీసుకునే పుల్ల

గూడుబండి – పైన కప్పువేసిన బండి

గృష్టి – ఒకే ఒక బిడ్డను కన్న స్త్రీ

గెలువం – విజయం

గ్రెమ్ముట – సాగగొట్టడం

గ్లాస్నువు – రోగి

చిమ్మనగ్రోవి – ద్రవాల్ని పిచికారీ చేసేందుకు ఉపయోగించే గొట్టం గల సాధనం

చిరంతనం/ చిరత్నం – చాలాకాలం నుంచి ఉన్నటువంటిది

చీవరం – బిచ్చగాడి వస్త్రం, rags

చెక్కెం – మజ్జ, marrow

చన్మఱ – స్తనాగ్రం చుట్టూ గుండ్రంగా ఆవరించి ఉండే దళసరి చర్మం areola

జామి – (ఇది సంస్కృత పదం) భార్య, చెల్లెలు, కూతురు, కోడలు ఇత్యాది కౌటుంబిక స్త్రీ

తఱిమెన – కొయ్యను యంత్రంతో నునుపు చేయడం Finishing

తెఱువాటు – దారిదోపిడి

తెఱకువ – వివేకం, జ్ఞానం

తొరపుట – వేణ్ణీళ్లని చల్లార్చడం

త్రిధాకరణం – మూడుముక్కలు చేయడం (అలాగే ద్విధాకరణం, చతుర్ధాకరణం మొ||)

దలపం – ముఖానికి అడ్డుగా (రక్షణగా) ధరించే త్రాణం

దళవాయి – సేనానాయకుడు

దుంబాలా – ఇనాం భూమి

దెంచనం - పెద్దఫిరంగి

దోర్బలం – కండబలం Muscle power

ద్వారి/ ద్వారదర్శి – వాకిటి కావలివాడు Gate-keeper

ద్వైవార్షికం – రెండు సంవత్సరాలకొకసారి జఱిగేది/ జఱిపేది biennial

ధూమిక – దట్టమైన మంచు Fog

నవగోజ – పెద్దగుడారము

నితాంతం – ఎడతెగనిది, నిరంతరం continuous

నియాతనం – క్రిందికి త్రోయడం

నిరుపహతం – ఏకాగ్రతాభంగం లేనిది undisturbed

నిరూహం – నిశ్చయించలేనిది Clueless

నిర్దేష్ట – నిర్దేశించేవాడు Director

నిర్యాతనం – అప్పును తిరిగి తీర్చడం

నిర్యాపణం – వెళ్ళగొట్టడం

నిస్తంద్రం – అలసట లేనిది, చులుకైనది, చొఱవగలది

నిహ్నుతం – మఱుగుపుచ్చబడినది Concealed

పంగటించు – కాళ్ళను పెడగా చాచి నడచు to stagger

పడిగ – ఉమ్మివేసే పాత్ర spittoon

పడిగల్లు – తుపాకిగుండు bullet

పలుగఱ – పండ్లపొడి

పల్లటింపు – అటూ ఇటూ ఎగుడుదిగుడుగా కదలడం Fluctuation

పస్పెవన్నె – పాటలవర్ణం Rose color

పాయకట్టు – ఒక నగరముతో చేఱిన గ్రామముల సమూహం, శివారు ప్రాంతం Suburban, metropolitan area

పిల్లం – తడిసిన కన్ను

పురోణి – చిన్న ఉత్తరం (జాబు) missive

పూటకాపు – ఇంత డబ్బిస్తే ఈ పని చేస్తానని ఒడంబడేవాడు Contract worker

పెడచెవి – చెవి వెనకభాగం

పెడనెల – తీర్పరి

పేరెం – గుఱ్ఱప్పరుగు race

పొక్కలి – మూడుఱాళ్లతో ఏర్పఱచిన పొయ్యి

పొరకటి – వాకిటి దగ్గఱి గోడ

ప్రండి – శుల్కం tariff

ప్రఘాణం/ప్రఘణం – వాకిటి పక్క గది

ప్రభాసిని – చర్మం యొక్క పైపొఱ epidermis

ప్రమ – యథార్థమైన జ్ఞానం, కొలత

ప్రమాత – యథార్థమైన జ్ఞానం గలవాడు

ప్రాతిభావ్యం – ఇంత డబ్బిస్తే ఈ పని చేస్తానని ఒప్పుకోవడం contract (ప్రాతిభావి = Contractor)

ఫక్కిక – అధ్యాయవిభాగం లేని ఏకాండీ గ్రంథం

బరాతం – ఆజ్ఞాపత్రం Ordinance

బిడాయించు – ఒకదానిలో మఱొకదానిని బిగించి మూయు

బిడారు - వర్తకసమూహం

బుసం – మీగడ తీసిన పెఱుగు

బూర్నీసు – మెత్తని కంబళి

బూల – తాటిమానులోని మెత్తటి భాగం

బొండెం – ముళ్ళతడిక
బొబి – ఓడలు తయారుచేసే చోటు Shipyard
బోడపత్రం – పూచీలేని దస్తావేజు
బ్రహ్మస్థలి – ఊరిమధ్యలో ఉన్న ప్రదేశం
బ్రిందు – ఇఱుకుచోటు
భారంగి – ఇతరుల్ని పోషించే స్త్రీ
భిస్సట – మాడిన అన్నం
భూకలం – స్వాధీనం కాని పెంకెగుఱ్ఱం
భ్రక్షం – తన తప్పును మఱుగుపఱచడం
మండకంచం – గోడలు గల కంచం (భోంచేసే పళ్లెం)
మండిగం – గడపకొయ్య (ద్వారబంధం)
మంథరువు – విసనకఱ్ఱ వీవడం వల్ల కలిగే గాలి
మందుపట్టడ – బాణసంచా (టపాసులు) తయారుచేసే శాల
మందవిసర్పం – మెల్లమెల్లగా ప్రాకేది
మటపల్లి – దేవాలయంలోని వంటిల్లు (ప్రస్తుతం దీనికి తమిళ శైలిలో 'పోటు' అని వాడుతున్నారు. కానీ తెలుగులో పోటు అనే మాటకు అర్థం వేఱు)
మడ – (నది లేదా సముద్రం యొక్క) ప్రవాహమార్గ పరిసరం
మణేదారు – అధికారి
మన్య – మెడ ఎముక
మఱిగ – ఱాచ్చిప్ప
మలప – దూడ చనిపోయాక కూడా పాలిచ్చే పశువు
మలారం – మట్టిగాజుల గుది
మలికారు – శీతాకాలం, రెండో పంట
మాడెం (మాండ్యం) – మండలాధిపతుల భూమి
మిడుచు – బొట్టుబొట్టుగా ద్రవాన్ని వదలు
మిళ్ళి/మిల్లి – చిన్ని చెంచా
మిళుసు – ఊరగాయని పెరుగులో కలిపి మళ్ళీ పోపువేసి చేసిన పచ్చడి. (దీన్ని ఇడ్లీలాంటి ఉపాహారాలకు ఆధరువుగా కలుపుకొని తింటారు)
ముక్కద్దం – కంటిఅద్దం, సులోచనం
ముచ్చిలిక – ఒడంబడిక పత్రం
మేడికోరు – కౌలురైతుకు వచ్చే ధాన్యభాగం
యుగపత్ – ఒకేసారి సంభవించే, ఏకకాలీనం Simultaneous

రవాయి – కృత్రిమరత్నం

రుక్క – చిన్నచీటీ slip

రెంటెం – రెండునేతలు నేసిన దళసరి వస్త్రం

రొండి – నడుం పక్కభాగం

రోజడం – రొప్పడం (వేగంగా ఎగశ్వాస, దిగశ్వాస తీసుకోవడం, కొన్నిసార్లు నోరు కూడా తెఱిచి) panting

లంపె – తోలు కోసే సాధనం, తాటాకులు కోసే సాధనం

లాపఱా – నీటితూముకు అడ్డంగా పెట్టే గండఱాయి

లాదడం – కట్టడంలో ఎడం ఏర్పడ్డచోట్ల ఇటుకలు అతికించడం

లావణం – కొత్త ఉద్యోగిపేరు పట్టికలో వ్రాసుకోవడం

లిక్కి – చిన్నకొడవలి

లుడుగు – ఎద్దుమెడలో కట్టే చిన్నగంట

లొడితిలి – చూపుడువేలికీ, బొటనవేలికీ మధ్య గల ప్రదేశం (దీనికే 'జుత్తిలి' అని నామాంతరం. 'జిట్టెడు' అని తెలంగాణ వాడుక)

లోప్త్రం – దొంగిలించిన సొత్తు spoils or booty

లోవరి – కక్ష్య

లోవి – కుండ

లోవైనం – లోగడ జఱిగిపోయినటువంటిది. చరిత్ర

లోహాభిసారం – చనిపోయిన వీరులకు జోహారులర్పించడం

వక్కాణం – సమాచారం

వడుసుడి – బలాత్కారంగా ఇచ్చుకోవాల్సివచ్చే ధనం

వది – అడవిజంతువుల్ని పట్టుకోవడం కోసం త్రవ్విన గొయ్యి boobytrap

వరకం – కఠినంగా పనిచేయించే శిక్ష Penal servitude

వర్ణాటుడు – భార్యాధనంతో జీవించేవాడు

వల్లం/వల్లువం – డబ్బుసంచి Purse

వల్లూరం – పందిమాంసం, ఎండుచేప

వాగ్మి(న్) – పదిమందిలో బాగా ఉపన్యసించగలవాడు Orator

వాగర్త – సముద్రతీరం beach (దీనికే మఱో తెలుగుపదం ఏనాదం/యానాదం)

విద్రవం – యుద్ధంలోంచి సైనికుడు పారిపోవడం desertion

విధుర – పంచదార కలిసిన పెరుగు

విధురుడు – భార్య పోయినవాడు a widower

వివిక్త – భర్తకి ఇష్టంలేని స్త్రీ

వివీతం – పశువులు మేసే ప్రదేశానికి వేసిన కంచె

విషూచి – కలరా

విసంవాదం – ముందు ఒప్పుకుని తరువాత లేదని వాదించడం

విస్తు – శరీరవాసన

విస్రం – పచ్చివాసన గలది

వృషస్యంతి – కాముకురాలు

వెద – విత్తనం, జంతుకామం

వెదావు – ఎద్దుతో కలవడానికి సిద్ధంగా ఉన్న ఆవు

వెలిదుక్కి – వానతడితో దున్నడం

వేగరి – సమాచారాన్ని తెలిపేవాడు, వార్తాహరుడు, హర్కారా

వేవిలి - దున్నని పొలం virgin land

వేశవారం – వంటకు కావాల్సిన వస్తువులు

వైకక్షకం – జందెంలా వేసుకునే దండ

వ్యాఘాతం – విఘ్నం, సంఘర్షణ contradiction

వ్యాపృతం – పనిలో ఉన్న busy

వ్యావర్తనం – వెనక్కి మఱలడం, మఱలిక relapse

వ్రైహేయం – వఱిపంటకు తగినది (భూమి)

శరవ్యం – గుఱిపెట్టదగిన లక్ష్యం

శిరాలుడు – ఉబ్బిన నరాలు గలవాడు

శీలనం – పరీక్షించడం

శుక్రలుడు – వీర్యవృద్ధి గలవాడు virile

శైక్షుడు – కొత్తగా చదవసాగిన శిష్యుడు beginner

శ్యావం – brown color

షాడబం – wine

సంగడం – వ్యాయామసాధనకై ఉపయోగించే గుండు, punch bag లాంటిది

సంగమడుగు – ఊరి దగ్గఱి సరస్సు

సంచకరం – క్రయవిక్రయాల్ని ఖాయం చేసుకోవడం కోసం ముందుగా చెల్లించే మొత్తం Advance

సన్ని – తుపాకీ చివఱ ఉండే కత్తి

సమాంసమీన – ప్రతిసంవత్సరమూ ఈనే ఆవు, ప్రతిసంవత్సరమూ వచ్చేది/జఱిగేది.

సరంగు – నావికుడు

సరీసృపం – ప్రాకే జాతికి చెందిన జంతువు Reptile

సర్వదుంబాలా – శిస్తు లేని భూమి

సవయస్కుడు – సమానవయస్సు గలవాడు

సాంద్రత – చిక్కదనం, దట్టం viscosity
సుంకరి – పన్నులు వసూలుచేసేవాడు
సున్తీ – Circumcision
సెర – కంటిలోని రేఖ
సొబను – ఆడగుఱ్ఱపు గర్భం
సౌప్తికం – నిద్రపోయినప్పుడు చంపడం
స్నానీయం – స్నానానికి ఉపయోగపడే వస్తువు/ పదార్థం/ సామగ్రి

ఇవి కేవలం మచ్చుతునకలే. ఇలాంటివి ఇంకా కోకొల్లలుగా ఉన్నాయి. అయితే నాగరికతాపరంగానూ, దేశకాల పరిస్థితుల చేతనూ నిరుపయోగంగా మారిన పదాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకి– *అంపఱ, క్రైలుదారు, దెంచనం, లాదడం, శరవ్యం, సర్వదుంబాలా* ఇత్యాది. ఇలాంటివి సమకాలీన పరిస్థితుల్లో వేటికి సరిపోతాయో పరిశీలించి వాటి పరంగా (కాస్త అర్థభేదంతో) ప్రయోగించడం అలవాటు చేసుకోవాలి. భౌతికార్థాలిచ్చే పదాల్ని ఆలంకారికంగా ప్రయోగించడానికి అవకాశముందేమో పరిశీలించాలి. ఉదాహరణకి, పై జాబితాలో *'నియాతనం' (క్రిందికి త్రోయడం)* అనే పదాన్ని demotion అనే అర్థంలో వాడడం లాంటివి. సమకాలీనంగా ప్రస్తుతం అందఱికీ తెలిసిన అర్థాల్లో స్థిరపడి వాడబడుతున్న జీవంత పదజాలాన్ని వేఱే అర్థాల్లో ప్రయోగించడం సాధ్యం కాదు. అలా చేయాలంటే, అర్థవంతమైన ప్రత్యయాలూ, ఉపసర్గలూ, సమాసఘటనా ప్రభృతిమార్పులతో వాటి శబ్దస్వరూపాన్ని ఎంతో కొంత రూపాంతరించాల్సి (modify చేయాల్సి) ఉంటుంది.



పదనిష్పాదన కళ

పదహారో అధ్యాయం

ప్రాథమిక సంస్కృత పదజాలం

తెలుగులై పుట్టిపెరిగిన ప్రతివారికీ ఎంతోకొంత సంస్కృతం వచ్చిఉంటుంది. వచ్చి ఉండాలి కూడా! మన జాతికి సంబంధించినంతవఱకూ తెలుక్కీ, సంస్కృతానికీ పెద్దగా తేడా పాటించరు. సంస్కృతంలో ఉన్న ప్రతిపదమూ కించిత్ స్వరభేదంతో తెలుగులో కూడా వాడుకోవడానికి అర్హమైనదే. ఆ రకంగా నాలుగింట ఓ వంతు సంస్కృత పదజాలం తెలుగులోకి వచ్చిచేఱిపోయింది. మన ఆధునిక తెలుగు భాషాసారస్వతాల నేపథ్యం గ్రాంథికభాషా సారస్వతాలు. అవి హెచ్చుపాలు సంస్కృత శబ్దసమాసభూయిష్ఠాలు. కనుక మన గుఱించి మనం తెలుసుకోవాలన్నా కాస్తో కూస్తో సంస్కృత పరిచయం తప్పనిసరి. ఒక దేశపు భాషే ఆ జాతి యొక్క ఆయువుపట్టు. ఆ భాష ఉన్నంతకాలమే ఆ జాతీ, దాని దేశమూ జీవించి ఉన్నట్లు లెక్క. అది నశిస్తే, ఆ జాతీ, దేశమూ రెండూ చరిత్రపుటల్లోంచి అదృశ్యమైనట్లే. ఆ భాష తెలీకపోతే ఆ జాతిని మనం సరిగా అర్థం చేసుకోలేం. ఇంగ్లీషు రాకుండా అమెరికాని, రష్యన్ తెలీకుండా రష్యానీ, అరబ్బీ నేర్చుకోకుండా అరేబియానీ అర్థం చేసుకోవడమంటే అది అఱకొఱగా అర్థం చేసుకోవడమే అవుతుంది. అది ఆయా జాతులకి అన్యాయం చేయడమే అవుతుంది. అలాగే సంస్కృతమయమైన ప్రాచీనాంధ్రగ్రాంథికశైలి తెలీకపోతే తెలుగుజాతిని సైతం సమగ్రంగా అధ్యయనం చేయలేం.

పదనిష్పాదన ప్రస్తావనకు సంబంధించినంతవఱకూ – సంస్కృతం అనివార్యం. దీనికి 3 కారణాలున్నాయి.

౧. సంస్కృతం తెలుక్కి దాదాపుగా సజాతీయభాష. వాక్యనిర్మాణం, సమాసఘటన, సంధికల్పన ఇత్యాదులలో రెంటికీ పోలికలున్నాయి. పదజాలం పరిచితపూర్వమే. ముఖ్యంగా ఉచ్చారణపద్ధతి.

౨. తెలుగులో కంటే సంస్కృతంలో పదనిష్పాదన సౌకర్యాలు మెండు. నిజానికి ఏ ఇతర భాషలో కన్నా (ఇంగ్లీషు కంటే కూడా) సంస్కృతంలోనే అవి ఎక్కువ. సంస్కృతానికి చాలా ఎక్కువ ప్రత్యయాలూ, ఉపసర్గలూ ఉన్నాయి. వివక్షిత అర్థాన్ని బట్టి పదస్వరూపాన్ని రకరకాలుగా మార్చుకోవడానికి ఆ వ్యాకరణం అనుమతిస్తోంది.

౩. దేశకాలాదుల దృష్ట్యా వైరి/ మిశ్రసమాసాల్ని ఎంత ఉదారంగా అనుమతించి ఆమోదముద్ర వేసినప్పటికీ కొన్ని కొన్ని సంస్కృత ప్రత్యయాల్నీ, సమాసావయవాల్నీ తెలుగుపదాలకి చేర్చలేం. అలా చేఱిస్తే ఆ పదనిర్మాణాల్లో శ్రావ్యత లోపించ

వచ్చు. సంధుల పరంగా సమస్యలు ఎదురుకావచ్చు. కనుక కొన్ని సర్వసాధారణ తెలుగుమాటలకు దీటైన సంస్కృతపదాలేంటో తెలిసి ఉండడం అవసరం.

౪. ఇక్కడ ఇస్తున్న సంస్కృత పదజాలం యథాతథంగా అభ్యసించడానికి కాదు. పాత అర్థాల్లో ఉన్న పాతపదాల్ని ఏ కొత్త పరిభావనల్ని వ్యక్తీకరించడానికి పనికొస్తాయో అంచనా వేసేందుకు సహాయం చేయడానికి మాత్రమే. ఆధునిక అవసరాలకు అనుగుణంగా వాడుకలో లేని పాతపదాల అర్థాల్ని కాస్త పరివర్తించి వాడుకోవడంలో తప్పులేదు. కాలక్రమంలో పదాల అర్థాలు ఎలా మారిపోతాయో తెలుసుకుంటే చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఇప్పుడు అరబిక్ అని వ్యవహరిస్తున్న భాషకు మొదట్లో పేరు లేదు. 'అరబ్' అనే ఎడారితెగప్రజల పేరు మీదుగా అ భాషకు 'అరబిక్' అని పేరొచ్చింది. నిజానికి ఆ తెగకు సైతం మొదట్లో పేరు ఉండేది కాదు. ఆ దేశం మేలుజాతిగుఱ్ఱాలకు ప్రసిద్ధి. అక్కణ్ణుంచే భారతదేశానికి గుఱ్ఱాలు దిగుమతి అవుతూ ఉండేవి. గుఱ్ఱాన్ని సంస్కృతంలో 'అర్వ' అంటారు. అదే 'అర్వ → అరబ → అరబ్' అయిందని కొందఱి ఊహ.

ఈ అధ్యాయంలో కొంత ప్రాథమిక సంస్కృత పదజాలం (తత్సమరూపంలో) ఇవ్వబడుతోంది. ప్రతి తెలుగుపద నిష్పాదకుడూ దీన్ని ఎంతోకొంత అభ్యసించాలి. ఇంతకుముందఱి అధ్యాయాల్లో వివరించబడిన వ్యాకరణ ప్రక్రియల సహాయంతో వీటిని మన ఊహలకి అనుగుణంగా మార్చుకుని కొత్తపదాల్ని సృష్టించేందుకు అవకాశాలు లెక్కకు మిక్కిలి.

I. ప్రకృతిసంబంధి పదాలు

౧. భూమి

భూమి – ధర, ధరిత్రి, ధరణి, క్షితి, సర్వంసహ, వసుమతి, వసుధ, వసుంధర, ఉర్వి, పృథివి, పృథ్వి, అవని, మేదిని, మహి

(భూమికి ఏకాక్షర పదాలు – భూ, జ్యా, కు, క్ష్మా)

మట్టి – మృత్, మృత్తిక, మృత్స్న, లోష్టం

మట్టిగడ్డ – లేష్టువు

దుమ్ము – ధూళి, పాంసువు, రజం (స్)

పొడి – చూర్ణం, క్షోదం

అన్ని పంటలూ బాగా పండే నేల – ఉర్వర

చవిటినేల – ఊషం, ఊషవంతం, ఊషరం

ఇంతవఱకూ ఎవఱూ దున్నని నేల – అప్రహతం Virgin land

బుఱదనేల – శాద్వలం, కచ్ఛం

నీళ్ళమయంగా ఉండే తడి ప్రాంతం – అనూపం
గడ్డిభూములతో నిండిన ప్రాంతం – నడ్వలం Steppe
మొఅం (గులకఱాళ్ళ) తో నిండిన నేల – శర్కరిలం
ఇసుకనేల – సైకతభూమి, సైకతిలం, సికతావంతం

౨. కొండలు

కొండ – అహార్యం, అద్రి, గిరి, గోత్రం, గ్రావం, అచలం, శైలం, పర్వతం
ఱాయి – పాషాణం, ప్రస్తరం, ఉపలం, అశ్మం, శిల, దృషత్
శిఖరం – కూటం, శృంగం
కొండచఱియ – ప్రపాతం, తటం, భృగువు
కొండ మీది సమతలభూమి (నెత్తం) – స్ను, ప్రస్థం, సానువు
కొండ కిందిభాగం – ఉపత్యక
జలపాతం – ప్రస్రవణం, ఝరం, నిర్ఝరం
కృత్రిమగుహ – దరి, కందరం
సహజగుహ – గహ్వరం
కొండమీదినుంచి జాఱిపడ్డ బండఱాయి – గండశిల
పూలతీగల పొదఱిల్లు – నికుంజం, కుంజం

౩. చెట్లు

అడవి – అటవి, అరణ్యం, విపినం, గహనం, కాననం, వనం
గొప్ప అడవి – అరణ్యాని
తోట – ఆరామం, నిష్కుటం, ఉపవనం, ఉద్యానం, ఆక్రీడం
వన్య – అనేకవనాల సమూహం
చెట్టు – వృక్షం, తరువు, అనోకహం, కుటం, సాలం, ద్రు, ద్రుమం
క్రమం తప్పకుండా పూచి, కాచే చెట్టు – అవంధ్యం, ఫలేగ్రహి
పూచి కాచే చెట్టు – వానస్పత్యం
పూయకుండానే కాచే చెట్టు – వనస్పతి
కాపూ, పూతా లేని చెట్టు – వంధ్యం, అఫలం, అవకేశి
ఎండి మోడైన చెట్టు – స్థాణువు, ధ్రువం, శంకువు
ఆకు – పత్త్రం, పలాశం, ఛదనం, ఛదం, దళం, పర్ణం

చిగురు – పల్లవం, కిసలయం

పువ్వు – సుమనం, పుష్పం, సూనం, ప్రసూనం, ప్రసవం, లతాంతం, కుసుమం, సుమం

పూవురేక – సుమదళం

మొగ్గ – కోరకం, కలిక, కుట్మలం, ముకుళం

తొడిమ – వృంతం

పూలగుత్తి – వల్లరి, మంజరి, గుచ్ఛం, స్తబకం, కుట్మలం

పూలతేనె – మకరందం

పుప్పొడి – పరాగం

అకరువు – కింజల్కం, కేసరం

వికసించిన పూవు/ పూచిన చెట్టు – ఫుల్లం, ప్రఫుల్లం, ఉత్ఫుల్లం, సంఫుల్లం, వ్యాకోచం, వికచం, స్ఫుటం, వికసితం

పచ్చికాయ – శలాటువు

పండు – ఫలం

ఎండుకాయ – వానం

పిందె – క్షారకం, జాలకం

తొక్క – త్వక్కు, త్వచం

గింజ – బీజం

కొమ్మ – విటపం, శాఖ

రెమ్మ – శిఫం, క్షుపం

తీగ – వల్లి, వ్రతతి. లత

దట్టమైన గుబురు గల మొక్క – వీరుధం, గుల్మిని, ఉలపం

చెట్టుబోదె – ప్రకాండం, స్కంధం

ఊడ – శిఫ, జట

చెట్టుమొదలు – బుధ్నం, మూలం

చెట్టు చిటారుభాగం – శిరోఽగ్రం

చెట్టులోని చేవ (సేగి) – సారం, మజ్జ

చెట్టునార – వల్కం, వల్కలం

కొయ్య (కట్ట/ చెక్క) – కాష్ఠం, దారువు

చెట్టుజిగురు – నిర్యాసం

చెట్టుతొఱ్ఱ – నిష్కుహం, కోటరం

కట్టె (లు) – ఇంధనం, ఇధ్మం, ఏధం, సమిధ

౪. రకరకాల చెట్ల పేర్లు

మొగలి – కేతకి

కుంకుడు – అరిష్టం, ఫేనిలం

మారేడు – బిల్వం, మాలూరం, శాండిల్యం, శైలూషం, శ్రీఫలం

జువ్వి – ప్లక్షం, జటి, పర్కటి

మఱ్ఱి – వటం, న్యగ్రోధం, బహుపాది (బహుపాదం)

టేకు – శ్రీపర్ణిక, కుముదిక, కుంభి, కైడర్యం, కట్ఫలం

గంగరావి – తూదం, తూలం, యూపం, బ్రహ్మణ్యం, బ్రహ్మదారువు

కడిమి – నీపం, ప్రియకం, కదంబం, హలిప్రియం

మద్ది – సాలం, సర్జం

గారచెట్టు – ఇంగుది, తాపసతరువు

బూరుగు – శాల్మలి, పిచ్ఛిల, పూరణి, మోచ,

కానుగు – కరజం, కరంజం, చిరిబిల్వం, నక్తమాలం

ఆముదపు – ఏరండం, వృడంబకం, ఉరుబూకం, రుచకం, చిత్రకం, పంచాంగుళం, మండం, వర్ధమానం

జమ్మి – శమి, సక్తుఫల, శివ

చిన్నజమ్మి – శమీరం

దేవదారువు – దారువు, భద్రదారువు, ద్రుకిలిమం, పీతదారువు, పూతికాష్ఠం, శక్రపాదపం, పారిభద్రకం

కరక – కాయస్థ, పూతన, హరీతకి, హైమవతి, రేచకి, శ్రేయసి

వేప –నింబం, సర్వతోభద్రం, పిచుమందం, మాలకం

అశోకం – వంజుళం

జిల్లేడు – అర్కం, వసుకం, గణరూపం, వికీరణం

ఉత్తరేణి – అపామార్గం. శైఖరికం, మయూరకం, ప్రత్యక్పర్ణి, కీశవల్లి, కిణిహి, కరమంజరి

గురువింద – కాకచించి, గుంజ, కృష్ణల

పల్లేరు – పలంకష, ఇక్షుగంధ, శ్వదంష్ట్ర, స్వాదుకంటకం, గోకంటకం, గోక్షురకం, వనశృంగాటం

జెముడు (Cactus) – సింహుండం, వజ్రద్రుమం, స్నుహి, సమంతదుగ్ధ, గుడ

వాము – అజామోద, ఉగ్రగంధ, బ్రహ్మదర్భ, యవానిక

ప్రత్తి – తుండికేరి, సముద్రాంత, కార్పాసి, బదర

గఱిక – దూర్వ, శతపర్విక

వెదురు – వంశం, త్వక్సారం, త్వచిసారం, కర్మారం, తృణధ్వజం, శతపర్వం (శతపర్వన్), యవఫలం, వేణువు, మస్కరం, తేజనం

ఱెల్లుకసవు – కాశం, ఇక్షుగంధం, పోటగళం

దర్భ – కుశం, కుథం, పవిత్రం
దూలగొండి / తీటకసింద – యాసం, యవాసం, దుఃస్పర్శం, ధన్వయాసం, కునాశకం, రోదని, కచ్చుర

౪. నీళ్ళు

నీరు – ఆపస్ (ఆపో), వార్, వారి, ఉదం, ఉదకం, కీలాలం, అంభస్ (అంభో), అర్ణస్ (అర్ణో), పాథస్ (పాథో)
తడి – తేమం, స్తేమం,
తడిసినది – స్తిమితం, క్లిన్నం, స్విన్నం
అల (కెఱటం) – తరంగం, ఊర్మి, వీచి
నీటిచుక్కలు – పృషత్ లు, బిందువులు,
తుంపరలు – విప్రుషాలు
చెఱువు – తటాకం, పద్మాకరం
ప్రకృతిసిద్ధంగా ఏర్పడ్డ పెద్ద మడుగు – జలాశయం, పుష్కరిణి, హ్రదం, సరస్, (సరో), కాసారం, సరసి
నుయ్యి – కూపం, ఉదపానం, అంధువు, ప్రహి
నడబావి (దిగుడుబావి) – వాపి
గుంట – గర్తం, అవటం
రంధ్రం – కుహరం, వివరం, బిలం, ఛిద్రం, నిర్వ్యథనం, రోకం, శ్వభ్రం, సుషి, సుషిర
నది – సింధువు, సరిత్, సరిత, తరంగిణి, వాహిని, శైవలిని, తటిని, హ్రాదిని, ధుని, స్రోతస్విని, స్రవంతి, నిమ్నగ, ఆపగ, కూలంకష, నిర్ఝరిణి, సరస్వతి
కాలువ – కుల్య
తూము (తూపరాణ) – జలనిర్గమం
నీటిని తోడే యంత్రం – నేమి, త్రిక
సముద్రం – అబ్ధి. అంభోనిధి, అకూపారం, పారావారం, ఉదన్వంతం, ఉదధి, జలధి, సింధువు, సరస్వంతం, అపాంపతి, కంధి, నదనదీపతి, రత్నాకరం
సుడిగుండం – ఆవర్తం
పెనుకెఱటాలు – ఉల్లోలాలు, కల్లోలాలు
దీవి (నెడిమ) – ద్వీపం, అంతరీపం
నదులూ, సముద్రాలూ ప్రవహించే దారి – పరీవాహం, పరీవాహకం
పులినం – ఇసుకదిబ్బ
బుఱద – నిషద్వరం, జంబాలం, పంకం, శాదం, కర్దమం
ఒడ్డు – తీరం, ప్రతీరం, కూలం, రోధస్ (రోధో), తటం
ఇసుక – సికత, వాలుక

ప్రవాహం – స్రోతస్ (స్రోతో)
వఱద — జలపూరం
నుఱుగు — ఫేనం, డిండీరం
పడవ — ఉడుపం, ప్లవం, కోలం
ఓడ — నౌ (నావ), తరణి, తరి, యానపాత్రం, పోతం
దోనె (పుట్టి) — ద్రోణి

౫. అగ్నీ, వాయువూ, ఆకాశమూ, మబ్బులూ, దిక్కులూ, గ్రహాలూ

ఆకాశం — ద్యావ (ద్యో), దివి, అభ్రం, వ్యోమం, అంబరం, నభస్ (నభో), అంతరిక్షం, గగనం, ఖం, వియత్, విహాయస్ (విహాయో), తారాపథం
దిక్కు — దిక్ (దిశ), కకుప్ (కకుభం), ఆశ, కాష్ఠ, హరిత్
తూర్పు – ప్రాచి (ప్రాక్) [తూర్పున పుట్టినది – ప్రాచీనం, లేదా ప్రాచ్యం]
పడమర — ప్రతీచి (ప్రత్యక్) [పడమట పుట్టినది – ప్రతీచీనం, లేదా ప్రతీచ్యం]
దక్షిణం — అవాచి (అవాక్), యామ్య [దక్షిణాన పుట్టినది అవాచీనం, లేదా అవాచ్యం]
ఉత్తరం — ఉదీచి (ఉదక్), [ఉత్తరాన పుట్టినది ఉదీచీనం, లేదా ఉదీచ్యం]
మూలదిక్కు — అపదిశం, విదిక్కు
పైన — ఉపరి
కింద — అధో
పక్కన — పార్శ్వం
అడ్డం — తిరశ్చీనం
నిలువు — ఊర్ధ్వం
సూర్యుడు — సూరుడు, అర్యముడు, ఆదిత్యుడు, దివాకరుడు, భాస్కరుడు, అహస్కరుడు, బ్రధ్నుడు, భానువు, విభావసువు.
చంద్రుడు — చంద్రమస్ (చంద్రమా), ఇందువు, విధువు, జైవాతృకుడు, సోముడు, గ్లావ, కళానిధి, రాజు.
బృహస్పతి — గురుడు, ధిషణుడు, వాచస్పతి
శుక్రుడు — కవి, కావ్యుడు, ఉశనసుడు (ఉశనస్), భార్గవుడు
అంగారకుడు — కుజుడు, భౌముడు, లోహితాంగుడు
బుధుడు — సౌమ్యుడు. రౌహిణేయుడు
శని — సౌరి, మందుడు, శనైశ్చరుడు
రాహువు — తముడు (తమస్), స్వర్భానువు, సైంహికేయుడు, విధుంతుదుడు
కేతువు — ధ్వజుడు, శిఖి
అగ్ని – వైశ్వానరుడు, వహ్ని, వీతిహోత్రుడు, ధనంజయుడు, జ్వలనుడు, కృశానువు, పావకుడు, అనలుడు,

హవ్యవాహనుడు, దమునసుడు (దమునస్), శిఖి, బర్హి (బర్హిష్)
సముద్రంలో ఉండే బడబానలం – ఔర్వం
అగ్నిజ్వాల (మంట) – కీల, అర్చి (అర్చిస్), హేతి, శిఖ
అగ్నికణం – స్ఫులింగం
బూడిద – భస్మం, భూతి, భసితం
అడవులలో చెలరేగే దావాగ్ని – దవం, దవాగ్ని
వాయువు (గాలి) – శ్వసనం, స్పర్శనం, మాతరిశ్వం (మాతరిశ్వన్), పృషదశ్వం, సమీరం, సమీరణం, మారుతం, మరుత్, వాతం, పవనం, పవమానం, ప్రభంజనం

౬. కాలవాచకాలూ, ఋతువులూ

కాలం – సమయం, దిష్టం, అనేహం (అనేహస్/ అనేహో)
నెలలో ౩౦ వ భాగం – తిథి
పగలూ, రాత్రీ కలిసిన 24 గంటల మొత్తం సేపు – అహోరాత్రం
పగలు – దినం, దివసం, అహం (అహన్), ఘస్రం, వాసరం
ప్రొద్దు – ప్రభాతం, ప్రత్యూషం, ప్రత్యుషం (ప్రత్యుషస్ – ప్రత్యుషో), అహర్ముఖం, కల్యం, ఉషస్సు (ఉషస్ –ఉషో)
సాయంకాలం – దినాంతం, సంధ్య, పితృప్రసువు (–ప్రసూ)
మధ్యాహ్నం – ప్రాహ్ణం, అపరాహ్ణం
ఉదయ, మధ్యాహ్న, సాయంకాలాలూ కలిపి – త్రిసంధ్యం
రాత్రి – శర్వరి, నిశ, నిశీథిని, నిట్టు (నిట్/నిశ్), త్రియామ, క్షణద, క్షప, విభావరి, తమస్విని, రజని, యామిని, తమి
కటికచీకటి గల రాత్రి – తమిస్ర
వెన్నెలరాత్రి – జ్యౌత్స్ని
వెన్నెల – జ్యోత్స్న, కౌముది, చంద్రిక
చీకటి – అంధకారం, ధ్వాంతం, తిమిరం, తమం (తమస్/ తమో)
కటికచీకటి – అంధతమసం, సంతమసం
కాస్త తక్కువ చీకటి – అవతమసం
రాత్రి మొదలయ్యే వేళ – ప్రదోషం, రజనీముఖం twilight
అర్ధరాత్రి (నడిరేయి) – నిశీథం
పూర్ణిమ – పౌర్ణమాసి, రాక
అమావాస్య – దర్శం, కుహువ (కుహూ)
గ్రహణం – ఉపరాగం
ఏడాది – వత్సరం, సంవత్సరం, శరత్తు (శరత్), సమా, హాయనం, అబ్దం, వర్షం

వేసవికాలం – గ్రీష్మం, ఊష్మకం, ఊష్మాగమం, నిదాఘం, ఉష్ణోపగమం, తపం (తపస్/ తపో)

వసంతఋతువు – సురభి

ఎండ – ఆతపం, ద్యోతం

ఎండమావి – మృగతృష్ణ, మరీచిక

వేడి – ఉష్ణం, ఊష్మం

వెలుగు – ప్రభ, రుచి, త్విషం, భాసం, ఛవి, ద్యుతి, దీప్తి, రోచి (రోచిష్), శోచి (శోచిష్)

కిరణం – ఉస్రం, మయూఖం, అంశువు, గభస్తి, ఘృణి, ఘృష్టి, భానువు, కరం, మరీచి, దీధితి, అర్చి (అర్చిష్), తేజం (తేజస్), ధామ (ధామన్), మహం (మహస్), విభ

వాన – వర్షం

వానకారు – ప్రావృట్టు (ప్రావృట్ /ప్రావృష్), ప్రావృషం

వానకాలానికి సంబంధించినది – ప్రావృషేణ్యం

మబ్బు – అభ్రం, మేఘం, వారివాహం, స్తనయిత్నువు, వలాహకం, ధారాధరం, జలధరం, తటిత్వంతం, వారిదం, జలదం, ఘనం, జీమూతం, ముదిరం, జలముచం

మబ్బుల పుంజం – కాదంబిని, మేఘమాల

ఉఱుము – స్తనితం, గర్జితం

మెఱుపు – శంప, శతహ్రద, హ్రాదిని, ఐరావతి, క్షణప్రభ, తటిత్, సౌదామిని, విద్యుత్, చంచల, చపల

పిడుగు – స్ఫూర్జథువు, వజ్రనిర్ఘోషం

మబ్బుల్లోని వెలుగు – మేఘజ్యోతి, ఇరమ్మదం

అనావృష్టి – అవగ్రహం

అతివృష్టి – ధారాసంపాతం, ఆసారం

వానచినుకు – శీకరం

వడగల్లు – వర్షోపలం, కరకం

చలికాలం – శీతకాలం, హేమంతం

మంచు – అవశ్యాయం, నీహారం, తుషారం, తుహినం, హిమం, ప్రాలేయం, మిహిక

మంచుతునకల ప్రవాహం – హిమాని Glacier

చల్లనిది – శీతం, శీతలం

౭. రంగులు

తెలుపు – ధవళం, శుక్లం, శ్వేతం, పాండురం, పాండువు, అవదాతం, సితం, వళక్షం, అర్జునం

నలుపు – కృష్ణం, అసితం, కాళం, శ్యామలం, మేచకం

పసుప్పచ్చ – పీతం, హారిద్రం, హరిద్రాభం

ఆకుపచ్చ – పాలాశం, హరితం, హరిత్

దట్టమైన ఎఱుపు – లోహితం, రోహితం, రక్తం

ఎఱ్ఱకలువవంటి ఎఱుపు – శోణం

గులాబీవర్ణం – పాటలం

మొక్కజొన్నపీచువంటి రంగు – కడారం, కపిల, పింగం, పిశంగం, కద్రువు, పింగళం

బ్రౌన్ కలరు – శ్యావం, కపిశం

బూడిదరంగు – ధూమవర్ణం

౧. జంతువులూ, పక్షులూ, క్రిమికీటకాలూ

జీవి – ప్రాణి, శరీరి, సత్త్వం, చేతనం, జన్మి, జంతువు, జన్యువు,

అడవిజంతువు – శ్వాపదం, వన్యసత్త్వం

జంతువు పిల్ల – శాబకం

తోక – పుచ్ఛం, వాలం, వాలధి, లాంగూలం, లూమం (లూమన్)

కొమ్ము – శృంగం

గిట్ట – శఫం, ఖురం, రింఖ

పొదుగు – ఊధం (ఊధస్), ఆపీనం

కోర – దంష్ట్ర

ఏనుగు – గజం, దంతి, దంతావళం, హస్తి, ద్విరదం, అనేకపం, ద్విపం, సింధురం, సామజం, కుంభి, మాతంగం, మదావళం, నాగం, కుంజరం, వారణం, కరి (కరిన్), ఇభం, స్తంబేరమం, పద్మి

ఆడ ఏనుగు – కరిణి, ధేనుక, వశ

ఏనుగుల మంద – యూథం

ఏనుగుపిల్ల – కలభం

సింహం – పంచాస్యం, హర్యక్షం, కేసరి, హరి, కణ్ఠీరవం

పులి – శార్దూలం, ద్వీపి, వ్యాఘ్రం

సివంగి – తరక్షువు, మృగాదనం

అడవిపంది – ఘృష్టి, కోలం, పోత్రి, కిరి, కిటి, ఘోణి, భూదారం

కోతి – కపి, ప్లవంగం, ప్లవగం, శాఖామృగం, వలీముఖం, మర్కటం, వానరం, కీశం, వనౌకం (వనౌకస్)

ఎలుగుబంటి – ఋక్షం, అచ్ఛం, భల్లం, భల్లూకం, భాలుకం

ఖడ్గమృగం – గండకం, ఖడ్గం

నక్క – భూరిమాయువు, గోమాయువు, సృగాలం, క్రోష్టువు, ఫేరువు, ఫేరవం, జంబుకం

ఆడనక్క – శివ

ఏదుపంది – శ్వావిధం (శ్వావిత్), శల్యం

తోడేలు – వృకం, వాతప్రమి, కోకం, ఈహామృగం

లేడి (జింక) – మృగం, కురంగం, వాతాయువు, హరిణం, ఏణం

కుందేలు (చెవులపిల్లి) – శశం, శశకం

జలజంతువులు – యాదస్సు (యాదస్/యాదో)

చేప – పృథురోమం (పృథురోమన్), మత్స్యం, ఝషం, మీనం, వైసారిణం, విసారం, శకులి

చేపపిల్ల – గడకం,

Shark – పాఠీనం

Whale – తిమింగలం

మొసలి – మకరం, శింశుమారం, గ్రాహం, నక్రం, కుంభీరం

ఎండ్రకాయ – కుళీరం, కర్కటకం (కర్కాటకం)

తాబేలు – కూర్మం, కమఠం, కచ్ఛపం

ఆడతాబేలు – ఢులి

ఏనుగుజలగ – దుర్నామ, దీర్ఘకోశిక

జలగ – జలౌకం (జలౌకస్/ జలౌకో)

నీటి ఉడుము – నిహాక, గోధిక

ఎఱ్ఱ (వానపాము) – మహీలత, గండూపదం, కించులకం

కప్ప – మండూకం, భేకం, వర్షాభువు, శాలూరం, ప్లవం, దర్దురం

ముత్యపు చిప్ప – ముక్తాస్ఫోటం, శుక్తి

శంఖం – కంబువు

పెంపుడుజంతువు/ పక్షి – ఛేకం, గృహ్యకం

కుక్క – శునకం, శ్వానం (శ్వా/శ్వన్) , సారమేయం, కుర్కురం, జాగిలం,

ఊరకుక్క – గ్రామసింహం

పిచ్చికుక్క – అలర్కం

వేటకుక్క – విశ్వకద్రువు

పిల్లి – బిడాలం, ఓతువు, మార్జాలం, పృషదంశకం

ఎలుక – మూషకం (మూషికం), ఆఖువు, ఉందురువు

చిట్టెలుక – గిరిక

చుంచెలుక – చుచుందరి, గంధమూషి

ఆవు – ధేనువు, గోవు (గో), సౌరభేయి, మాహా, మాహేయి, ఉస్ర, శృంగిణి, అర్జుని, అఘ్న్య, రోహిణి

దూడ – వత్సం

ఎద్దు – ఉక్షం (ఉక్షన్), భద్రం, బలీవర్దం, ఋషభం, వృషభం, వృషం, అనడుహం (అనడ్వాన్), సౌరభేయం, గవం

(గౌ)

ఆలమంద – గవ్యం

ఎద్దుల మంద – రౌక్షకం

అప్పుడే పుట్టిన దూడ – తర్ణకం

ఊళ్ళో యథేచ్ఛగా తిరిగే ఆబోతు – షండం, ఇట్వరం

గంగడోలు – సాస్న

మూపురం – కకుత్

పేడ – గోమయం, గోవిట్టు

కరీషం – పిడక

బండి/ నాగలి మొ॥వాటిని మోసే ఎద్దు – ధూర్వహం, ధుర్యం, ధౌరేయం, ధురీణం, ధురంధరం

గేదె (బఱ్ఱె/ ఎనుము) – మహిషం, లులాయం, వాహద్విషంతం, కాసరం, సైరిభం

గుఱ్ఱం – అశ్వం, ఘోటకం, వీతి, తురగం, తురంగం, తురంగమం, వాజి (వాజిన్), వాహం, అర్వం (అర్వన్), గంధర్వం, హయం, సైంధవం, సప్తి

ఆడగుఱ్ఱం (గోడిగ) – వామి, అశ్వ, బడబ

ఆడమేక – అజ, ఛాగి

మేకపోతు – మేషం, తుభం, ఛాగం, బస్తం, ఛగలకం, అజం

గొఱ్ఱె – మేండం, ఉరభ్రం, ఉరణం, ఊర్ణాయువు, వృష్ణి, ఏడకం

గాడిద – చక్రీవంతం, బాలేయం, రాసభం, గర్దభం, ఖరం

ఒంటె (లొట్టిపిట్ట) – ఉష్ట్రం, క్రమేళకం, మయం, మహాంగం

ఒంటెపిల్ల – కరభం

తొండ – సరటం, కృకలాసం

బల్లి – ముసలి, గృహగోధిక

పక్షి – ఖగం, విహంగం, విహంగమం, విహాయసం, శకుంతి, శకుంతం, శకుని, శకునం, ద్విజం, పతత్రి (పతత్రిన్), పత్రి (పత్రిన్), పతగం, పతంగం, పత్రరథం, అండజం, నగౌకం (నగౌకస్), వాజి (వాజిన్), వికిరం, వి, విష్కిరం, నీడోద్భవం, పిత్సంతం, నభసంగమం

ఱెక్క – పక్షం, వాజం, గరుత్తు (గరుత్), ఛదం, పత్రం, పతత్రం, తనూరుహం

ఱెక్క మొదలు – పక్షతి

పక్షిముక్కు – చంచువు, త్రోటి

గ్రుడ్డు – పేశీ, కోశం, అండం

పక్షిపిల్ల – పోతం, పాకం, అర్భకం, డింభం, పృథుకం

పక్షిగూడు – నీడం, కులాయం

డేగ – శశాదనం, పత్రి (పత్రిన్), శ్యేనం

గుడ్లగూబ – ఉలూకం, కాకారి, పేచకం, దివాంధం, కౌశికం, ఘూకం, దివాభీతం, నిశాటనం

పిచ్చుక – చటకం, కలవింకం

కొక్కెర – కృకణం, క్రకరం

తెల్లకొక్కెర – బలాక, బిసకంఠిక

కోయిల – కోకిల, వనప్రియం, పరభృతం, పికం

వానకోయిల – చాతకం, స్తోకకం, సారంగమ్

బెగ్గురు పులుగు – దార్వాఘాటం, శతపత్రకం

కాకి – కాకం, కరటం, అరిష్టం, బలిపుష్టం, ధ్వాంక్షం, వాయసం, మౌకళి

మాలకాకి – ద్రోణకాకం, కాకోలం

గ్రద్ద – దాక్షాయ్యం, గృధ్రం

చిలుక – కీరం, శుకం

పాలపిట్ట – చాషం, కికీదివి

కొంగ – క్రుంచం (క్రుజ్), క్రౌంచం

చక్రవాకం – కోకం

హంస – కలహంస, కలహంసం, కాదంబం, మరాళం, శ్వేతగరుత్తు (త్), మానసౌకం (స్)

గబ్బిలం – జతుక, అజినపత్ర, పరోష్ణి

నెమలి – మయూరం, బర్హిణం, నీలకంఠం, శిఖి, శిఖావళం, కేకి

నెమలిపురి – శిఖండం

నెమలి ఈక – పింఛం, బర్హం

కోడి – కుక్కుటం, కృకవాకువు, తామ్రచూడం, చరణాయుధం

పావురం – పారావతం

కృమి – చాలా చిన్నదైన పురుగు

కీటకం – కొంచెం పెద్దదైన పురుగు

ఈగ – మక్షిక

దోమ – మశకం

తేనెటీగ – సరఘ

అడవి ఈగ – దంశం

కందిరీగ – గండోలి, వరట

చిమట – భృంగారి, చీరి, చీరుక, ఝిల్లిక

మిడత – శలభం

తుమ్మెద – మధువ్రతం, మధుకరం, మధులిహం, పుష్పలిహం, మధుపాళి, ద్విరేఫం, భృంగం, షట్పదం, భ్రమరం, అళి,

ఇందిందిరం, చంచరీకం, రోలంబం, బంభరం
మిణుగురుపురుగు – ఖద్యోతం, జ్యోతిరింగణం
పాము – సర్పం, ఫణి (ఫణిన్), పృదాకువు, భుజగం, భుజంగం, భుజంగమం, అహి, అశీవిషం, విషధరం, వ్యాళం, కాకోదరం, ఫణి, దర్వీకరం, దందశూకం, బిలేశయం, ఉరగం, పన్నగం, భోగి, జిహ్మగం, పవనాశనం, పవనాశి, లేలిహానం, ద్విరసనం, కుంభీనసం
కొండచిలువ – అజగరం, తిలిత్సం, గోనసం
పాముపడగ – ఫణ, స్ఫట
పాము కుబుసం – కంచుకం, నిర్మోకం
పామువిషం – క్ష్వేళం, గరళం
పుట్ట – వల్మీకం, వామలూరువు, నాకువు
చీమ – పిపీలికం, హీర

II. పట్టణసంబంధి పదాలు

౧. ఊరు

పట్టణం – పూ, పురి, నగరి, పుటభేదనం
పేట – నిగమం
శాఖానగరం – ప్రధాన నగరానికి దగ్గర్లో దాని కంటే వేఱుగా ఏర్పడ్డ చిన్నపట్టణం Satellite township
వేశ్యలుండే పేట – వేశం
దుకాణం (కొట్టు) – ఆపణం, నిషద్య shop
అంగడివీధి – విపణి Market, downtown
ఊళ్ళోని మార్గం – రథ్య, ప్రతోళి, విశిఖ
మార్గం – అయనం, వర్త్మ, అధ్వం (అధ్వన్), పంథా, పదవి, సృతి, సరణి, పద్ధతి, పద్య, వర్తని, ఏకపది
బాగా లేని దారి – వ్యధ్వం, దురధ్వం, విపథం, కదధ్వం, కాపథం
నాలుగుదార్లు కలిసే కూడలి – శృంగాటకం , చతుష్పథం Crossroads
ఊళ్ళోని ప్రధాన రాజమార్గం – ఘంటాపథం Thoroughfare
సభాగృహం – శాల Town assembly
సభ – సమజ్య, పరిషత్తు (ద్), గోష్ఠి, సమితి, సంసద (ద్), ఆస్థాని, ఆస్థానం, సదం (స్)
సభికుడు – సభ్యుడు, సభాస్తారుడు, సదస్యుడు
మండువా ఇల్లు (చుట్టూ గదులుండి వాటి మధ్యలో ఖాళీస్థలమున్న భవనం) – చతుశ్శాల
మునులు కట్టుకునే ఆకుటిల్లు – పర్ణశాల, ఉటజం hermitage

బౌద్ధాలయం – చైత్యం, ఆయతనం
గుఱ్ఱాల శాల – అశ్వశాల, మందుర stables
ఎంజినీరింగ్ వృత్తులు చేసేవారి పనుల కొట్టం (Work shop) – ఆవేశనం, శిల్పిశాల
చలివేంద్రం – ప్రప, పానీయశాల
మద్యం తయారుచేసి అమ్మే కొట్టు – గంజ, మదిరాగృహం tavern
పురుటిల్లు – అరిష్టం, సూతికాగృహం labour room
పదిమంది గుమిగూడి వేడుకలు నిర్వహించే భవనం – మండపం
దేవతల/రాజుల భవనం – ప్రాసాదం mansion
రాజభవనం – సౌధం, ఉపకార్య, ఉపకారిక
అంతఃపురం – స్త్ర్యగారం, అవరోధనం, అవరోధం, శుద్ధాంతం seraglio or harem
ధనికుల భవనం – హర్మ్యం A castle
పల్లెటూరు – గ్రామం, సంవసథం
శివారుప్రాంతం – ఉపశల్యం suburb
గొల్లపల్లె – ఘోషం, ఆభీరపల్లి
బోయవారి పల్లె – పక్కణం
పొలిమేర, (గ్రామపు) సరిహద్దు – సీమ (సీమన్)

౨. ఇల్లు

ఇల్లు – గృహం, గేహం, ఉదవసితం, వేశ్మం (వేశ్మన్), సద్మం (సద్మన్), నికేతనం, నిశాంతం, వస్త్యం, సదనం, భవనం, అగారం, మందిరం, నికాయ్యం, నిలయం, ఆలయం, ధిష్ణ్యం, ఓకం (ఓకస్/ఓకో), నివసనం, స్థానం, అవసథం, వాస్తు, సంస్త్యాయం, ఉటజం, ధామ, నివేశం, నివేశనం, శరణం, క్షయం
ఇల్లు కట్టదగ్గ చోటు – వేశ్మభూమి
గోడ – భిత్తి, కుడ్యం
ఇటుక – ఇష్టిక
సున్నం – చూర్ణం
కప్పు – ఛది, పటలం
గచ్చు (కట్టిన నేల) – కుట్టిమం, స్థండిలం
కిటికీ – వాతాయనం, గవాక్షం
ద్వారం – ప్రతీహారం
కడప – దేహళి
అరుగు/ తిన్నె – వితర్ది, వేదిక

తలుపు – కవాటం, అరరం
గడియ – విష్కంభం, అర్గళం
మెట్టు (తాప) – ఆరోహణం, సోపానం
ఇంటిముందటి నడవ (Corridor) – ప్రఘాణం, ప్రఘణం, అళిందం

౩. ఇంటిలోని వస్తువులు

నిచ్చెన – నిశ్రేణి
చీపురు – సమ్మార్జని, శోధని
మంచం – పర్యంకం, తల్పం, ఖట్వ
పడక – శయ్య
పఱుపు – శయనీయం
దిండు (తలగడ) – ఉపధానం, ఉపబర్హం
బంతి – కందుకం, గేందుకం
దీపం – ప్రదీపం
కుర్చీ – పీఠం, ఆసనం
తమ్మపడిగ (ఉమ్మివేసే తొట్టి) – ప్రతిగ్రాహం, పతద్గ్రహం
దువ్వెన – కంకతిక, ప్రసాధని
అద్దం – ముకురం, దర్పణం, ఆదర్శం
విసనకఱ్ఱ – వ్యజనం, తాళవృంతకం, ధవిత్రం
కుండ – స్థాళి, ఉఖ, కుంభం, పిఠరం
ఊయల – డోల, ప్రేంఖ
రోకలి – అయోగ్రం, ముసలం
ఱోలు – ఉదూఖలం, ఉలూఖలం
చేట – ప్రస్ఫోటన, శూర్పం
జల్లెడ – చాలని, తితఉవు
గంప – కండోలం, పిటం
బుట్ట – స్యూతం, ప్రసేవం
చాప – కటం, కిలింజకం
వంటిల్లు – రసవతి, పాకస్థానం, మహానసం
పొయ్యి – అశ్మంతం, ఉద్ధానం, అధిశ్రయణి, అంతిక
కుంపటి – అంగారధాని, అంగారశకటి, హసంతి

బాణలి (బూర్లెమూకుడు) – భ్రాష్ట్రం, ఋజీషం
పెనం – కందువు, స్వేదని
నీళ్ళు కాచుకునే కాగు (డేక్సా) – అళింజరం, మణికం
నీళ్ళ కుండ – ఘటం, కుటం, నిపం
మూకుడు – శరావం
గిన్నె – కంసం
గరిటె (గంటె/ తెడ్డు) – దర్వి, కంబి, ఖజాక
కవ్వం – వైశాఖం, మంథం, మంథానం
త్రాడు – శుల్బం, వటారకం, వటి, రజ్జువు
ఉద్ఘాటనం – బావిలోంచి గానీ, చెఱువులోంచి గానీ నీళ్ళు తోడే ఏతాము లేదా గిలకలాంటి సాధనం
పెట్టె – పేటకం, పేట, మంజూష
చిన్నపెట్టె – పేటిక
చెప్పు – పాదుక, ఉపానహం (ఉపానత్), పాదువ
నవ్వారు – నధ్రి, వర్ధ్రి, వరత్ర
కత్తెర – కృపాణి, కర్తరి
కప్పు లేదా గ్లాసు – చషకం, సరకం
చిన్నపీట – పీఠిక

III. వ్యావసాయిక పదాలు

౧. పొలం

పొలం – క్షేత్రం
వఱి పండే నేల – కేదారం
రైతు – క్షేత్రాజీవుడు, కర్షకుడు, కృషీవలుడు, హాలికుడు
నాగలి – హలం, గోదారణం, సీరం
పశువుల కొట్టం – గోష్ఠం, గోస్థానకం

౨. పంటలు

వఱి – వ్రీహి
బియ్యం – తండులాలు

యవలు – శితశూకాలు

ఆళ్ళు – కోరదూషాలు, కోద్రవాలు

అడవిపెసలు – మకుష్టకాలు, మయుష్టకాలు, వనముద్గాలు

ఆవాలు – సర్షపాలు

నల్ల ఆవాలు – రాజిక, కృష్ణిక, ఆసురి

గోధుమలు – గోధూమాలు, సుమనాలు

అడవిగోధుమలు – గవేధువు, గవేధుక

కాఋమినుములు – యావకాలు, కుల్మాషాలు

సెనగలు – చణకాలు, హరిమంథకాలు

కొఱ్ఱలు – కంగువులు, ప్రియంగువులు

జనుము – భంగ, మాతులాని

ధాన్యం – వ్రీహి, స్తంబకరి

ధాన్యపు ముల్లు – కింశారువు

ధాన్యపు పొత్తు (కండె) – కణిశం

అఱవై రోజులకు పండే ధాన్యాలు – షష్టికాలు

తృణధాన్యాలు – నీవారాలు

తింత్రిణీకం – చింతపండు

మిరియాలు – వేల్లజం, మరీచం, కోలకం, కృష్ణం, ఊషణం

జీలకఱ్ఱ – జీరకం, జీరణం, అజాజి, కణా

నల్లజీలకఱ్ఱ – సుషవి, కారవి, పృథ్వి, పృథువు, కాలోపకుంచిక

అల్లం – ఆర్ద్రకం, శృంగబేరం

కొత్తిమెర/ ధనియాలు – ఛత్ర, వితున్నకం, కుస్తుంబురువు, ధాన్యాకం

శొంఠి – శుంఠి, మహౌషధం, విశ్వం, నాగరం, విశ్వభేషజం

ఇంగువ – హింగువు, సహస్రవేది, జతుకం, బాహ్లికం, రామఠం

పసుపు – కాంచని, పీత, హరిద్ర, వరవర్ణిని

సముద్రపుటుప్పు – లవణం, అక్షీబం, వశిరం

సైంధవ లవణం – శీతశివం, మాణిబంధం

పంచదార (చక్కెర) – శర్కర, సిత

జున్ను – కూర్చిక

పేలాలు – లాజలు

అటుకులు – పృథుకాలు, చిపిటకాలు

ఏలక్కాయలు (ఏలకులు) – ఏల, ఏలకి, పృథ్వీక, చంద్రబాల, నిష్కుటి, బహుళ,

సన్న ఏలకులు – సూక్ష్మోపకుంచిక, తుత్థ, కోరంగి, త్రిపుట, త్రుటి
మాచిపత్రి – గ్రంథిపర్ణం, శుకం, బర్హం, స్థౌణేయం, కుక్కురం
నువ్వులు – తిలలు

3. పూల చెట్లు

పొన్న – పున్నాగం, కేసరం, దేవవల్లభం
పారిజాతం – పారిభద్రం
మోదుగు – పలాశం, కింశుకం, పర్ణం, వాతపోథం
ఇప్ప – మధూకం, మధుద్రుమం, గుడపుష్పం, వానప్రస్థం, మధుష్ఠీవం
ఎఱ్ఱగన్నేరు – నిచుళం, హిజ్జలం
దిరిసెన – శిరీషం, కపీతనం, భండిలం
సంపెంగ – చంపకం, చాంపేయం, హేమపుష్పకం
మల్లె – మల్లిక, భూపది
అడవిమల్లె – ఆస్ఫోట
జాజి – జాతి, సుమనసం (సుమనస్), మాలతి
విరజాజి – సప్తల, నవమాలిక
మంకెన – రక్తకం, బంధూకం
పెద్దగోరింట – అమ్లానం, మహాసహ
చిన్నగోరింట – సహ, కుమారి, తరణి
దాసాని – ఉడుపుష్పం, జప
గన్నేరు – కరవీరం, ప్రతిహాసం, శతప్రాసం, చండాతం, హయమారకం
ఉమ్మెత్త – మదనం, మాతులం, ధుత్తూరం, కితవం, ధూర్తం, కనకం
మరువం – మరువకం, సమీరణం, ప్రస్థపుష్పం, ఫణిర్జకం
తక్కువ ఎఱుపూ, ఎక్కువ సుగంధమూ గల కలువపూవు – సౌగంధికం, కహ్లారం (కల్హార)
ఎక్కువ ఎఱ్ఱగా ఉండే చెంగలువ – హల్లకం, రక్తసంధ్యకం
కలువకూ, పద్మానికీ సామాన్యవాచకాలు = ఉత్పలం, కువలయం
నల్లకలువ – ఇందీవరం
తెల్లకలువ – కుముదం, కైరవం
తెల్లకలువతీగె – కుముదిని, కుముద్వతి
తామరపూవు – తామరసం, పద్మం, నళినం, అరవిందం, మహోత్పలం, సహస్రపత్రం, శతపత్రం, కమలం, కుశేశయం, పంకేరుహం, సారసం, సరసీరుహం, బిసప్రసూనం, రాజీవం, పుష్కరం, అంభోరుహం

తెల్లతామర – పుండరీకం
ఎఱ్ఱతామర – రక్తోత్పలం, కోకనదం
తామరతూడు – బిసం, మృణాళం, నళిని, పద్మిని
జలపుష్పాల దుంప – శాలూకం

౪. పండ్లూ, కూరగాయలూ

రావి – అశ్వత్థం, బోధిద్రుమం, పిప్పలం
వెలగ – కపిత్థం, దధిత్థం, గ్రాహి, మన్మథం
మేడి (అత్తి) – ఉదుంబరం, యజ్ఞాంగం, హేమదుగ్ధం
మునగ – శోభాంజనం, శిగ్రువు
మామిడి – ఆమ్రం, చూతం, రసాలం, సహకారం
రేగు – కర్కంధువ, బదరం, బదరి, కోలం, కోలి, ఘోంట, సౌవీరం
నారింజ – ఐరావతం, నాగరంగం
చింత – తింత్రిణి, చించ, అమ్లిక
జీడి – వీరవృక్షం, అరుష్కరం, అగ్నిముఖి, భల్లాతకి
ఉసిరి – ఆమలకి, తిష్యఫల, అమృత, వయస్థ
రాచ ఉసిరి (నేల ఉసిరి) – ఝట, తామలకి
పనస – పణసం, కంటకిఫలం
పొగడ – వకుళం
దానిమ్మ – దాడిమం
మాదీఫలం – ఫలపూరం, బీజపూరం, రుచకం, మాతులుంగం
ద్రాక్ష – మృద్వీక, గోస్తని, స్వాద్వి, మధురస
అరటి – కదళి, మోచ, రంభ, అంశుమత్ఫల, వారణబుస, కాష్ఠీల
పొట్ల – పటోలిక, జాలిక, జ్యోత్స్ని
తమలపాకు తీగె – తాంబూలవల్లి, తాంబూలి, నాగవల్లి
లవంగపు – త్వక్పత్రం, ఉత్కటం, భృంగం, త్వచం, చోదం, వరాంగకం
తాడి – తృణరాజం, తాళం
కొబ్బరి – నాళికేరం, లాంగలి (లాంగలిన్)
పోక – ఘోంట, పూగం, క్రముకం, గువాకం, ఖపురం
ఖర్జూరం – ఖర్జూరం
ఈత – ఖర్జూరి

నిమ్మ — జంబీరం, దంతశఠం, జంభం, జంభళం
గజనిమ్మ — లకుచం, లికుచం, డహువు
నేరేడు — జంబూఫలం
పొన్నగంటి కూర — బ్రాహ్మి, మత్స్యాక్షి, వయస్థ, సోమవల్లరి
దొండ — తుండికేరి, బింబిక, బింబం, రక్తఫల, పీలుపర్ణి
పాలకూర — జీవంతి, జీవని, జీవ, జీవనీయ, మధుస్రవ
ఎఱ్ఱ నీరుల్లి — పలాండువు, సుకందం
పచ్చని నీరుల్లి — లతార్కం, దుర్ద్రుమం
వెల్లుల్లి — మహౌషధం, మహాకందం, లశునం, గృంజనం, రసోనకం
కాకర — కారవేల్లం, కటిల్లకం
చేదుపొట్ల — కులకం, పటోలం, తిక్తకం, పటువు
గుమ్మడి — కూష్మాండం, కర్కారువు
దోస — ఉర్వారువు, కర్కటి
సొర (ఆనపకాయ) — తుంబి, అలాబువ
చేదుసొర — ఇక్ష్వాకువు, కటుతుంబి
కంద — కందం, అర్శోఘ్నం, సూరణం
తీగెబచ్చలి — కలంబి
దుంపబచ్చలి — ఉపోదకి
వంగ — వార్తాకం
చెఱకు — ఇక్షువు, పుండ్రకం, కాంతారకం

IV. మనుషులూ, వావివరుసలూ, వృత్తులూ, స్థితులూ, మనస్తత్త్వాలూ

౧. మనుషులు

మనుషులు — మానవులు, మనుష్యులు, మనుజులు, మర్త్యులు, నరులు, విశులు
గుంపు — సమూహం, నివహం, వ్యూహం, సందోహం, విసరం, వ్రజం, స్తోమం, ఓఘం, నికరం, వ్రాతం, వారం, సంఘాతం, సంచయం, సమవాయం, చయం, సంచయం, గణం, సంహతి, బృందం, నికురుంబం, కదంబకం, పూగం, వితానం, ప్రకరం, మండలం, చక్రం, చక్రవాళం, పటలం, జాలం, వర్గం, కులం, శ్రేణి, సమాజం, సంఘం, నికాయం, రాశి, కూటం, సమాహారం, పుంజం, ఉత్కరం
మగవాడు — పురుషుడు, పూరుషుడు, నరుడు, పుంసుడు, పుమానుడు పుమాంసుడు, పంచజనుడు

ఆడది – స్త్రీ, మహిళ, నారి, వనిత, అబల, అంగన, యోషిత్తు (యోషిత్), యోషిత, వధువు, సీమంతిని, వామ, ప్రతీపదర్శిని, కామిని, కాంత, ప్రమద, మానిని, లలన, నితంబిని, రమణి, రామ

గృహిణి – కుటుంబిని, పురంధ్రి, కులాంగన, కులపాలిక

ముత్తైదువ – చిరంటి, సువాసిని

పతివ్రత – సుచరిత, సుచరిత్ర, సతి, సాధ్వి

సమర్తాడని పడుచు – నగ్నిక

పెండ్లికాని పడుచు – కన్య, కుమారి

అశిశ్వి – పిల్లలు లేని స్త్రీ

అవీర – భర్తా, బిడ్డలూ లేని స్త్రీ

భర్తను పోగొట్టుకున్న స్త్రీ – విధవ, వితంతువు, విశ్వస్త

భర్త గల స్త్రీ – పతివత్ని, భర్తృమతి, సభర్తృక

రజస్వల – ఆత్రేయి, స్త్రీధర్మిణి, మలిని, పుష్పవతి, ఋతుమతి

ముట్లుడిగిన స్త్రీ – నిష్కళ, గతార్తవ, విగతార్తవ

గర్భిణి చూలాలు) – ఆపన్నసత్త్వ, గుర్విణి, అంతర్వత్ని

పసిబిడ్డ – ఉత్తానశయుడు, డింభుడు, స్తనపుడు, స్తనంధయి

బాలుడు – మాణవకుడు

యువకుడు – వయస్థుడు, తరుణుడు, యువ (యువన్),

ముదుసలివాడు – ప్రవయసుడు (ప్రవయస్ / ప్రవయో), స్థవిరుడు, వృద్ధుడు, జీనుడు, జీర్ణుడు, జరంతుడు (జరన్) వర్షీయసుడు (వర్షీయస్/ వర్షీయో), దశమి (దశమిన్), జ్యాయసుడు (జ్యాయస్/ జ్యాయో)

ముదుసలి స్త్రీ – ప్రవయస్క, స్థవిరి, వృద్ధ, జీన, జీర్ణ, జరంతి, వర్షీయసి, దశమిని, జ్యాయసి

౨. వావివరుసలు

తండ్రి – పిత (పితృ), తాతుడు, జనకుడు, జనయిత (జనయితృ)

తల్లి – మాత (మాతృ), జనయిత్రి, జనని, ప్రసువు (ప్రసూ)

సంతానం – అపత్యం, తోకం, సంతతి

కొడుకు – సుతుడు, పుత్రుడు, కుమారుడు, అత్మజుడు, తనయుడు, తనూజుడు, సూనువు

కూతురు – సుత, దుహిత (దుహితృ) పుత్రి, పుత్రిక, కుమారి, తనయ, తనూజ, ఆత్మజ

సోదరుడు – భ్రాత (భ్రాతృ)

అన్న – అగ్రజుడు, పూర్వజుడు

తమ్ముడు – అనుజుడు, జఘన్యజుడు, కనీయుడు, కనీయసుడు (కనీయస్/ కనీయో), యవీయుడు, యవీయసుడు (యవీయస్/ యవీయో)

సోదరుడి భార్య (వదిన) – ప్రజావతి
సోదరి – స్వస (స్వసృ), భగిని
అక్క – అగ్రజ, పూర్వజ
చెల్లెలు – అనుజ, అవరజ, అవర
తండ్రికి తండ్రి – పితామహుడు
పితామహుడి తండ్రి (ముత్తాత) – ప్రపితామహుడు
తల్లికి తండ్రి – మాతామహుడు
మాతామహుడి తండ్రి – ప్రమాతామహుడు
తండ్రికి తల్లి – పితామహి
తల్లికి తల్లి – మాతామహి
కొడుకు కొడుకు – పౌత్రుడు
పౌత్రుడి కొడుకు – ప్రపౌత్రుడు
పౌత్రుడి కూతురు – ప్రపౌత్రి
కొడుకు కూతురు – పౌత్రి
కూతురి కొడుకు – దౌహిత్రుడు
కూతురి కూతురు – దౌహిత్రి
మనవడు – నప్త (నప్తృ)
మనవరాలు – నప్త్రి
తల్లి సోదరుడు (మేనమామ) – మాతులుడు, మాతృవ్యుడు
తల్లిసోదరుడి భార్య (అత్త) – మాతులాని
తల్లి సోదరి (పిన్ని లేదా పెద్దమ్మ) – మాతృష్వస, (మాతృష్వసృ), మాతృవ్య
తండ్రి సోదరుడు బాబాయి లేదా పెదనాన్న) – పితృవ్యుడు
తండ్రి సోదరి (మేనత్త) – పితృష్వస (పితృష్వసృ), పితృవ్య
తండ్రిసోదరుడి కొడుకు – పితృవ్యజుడు cousin brother
(భారతదేశంలో 'కజిన్స్' అందఱూ సోదరులుగా పరిగణించబడరని ఈ ఇండియన్ ఇంగ్లీషువాడుక సూచిస్తుంది. ఎందుకంటే ఒక తరహా 'కజిన్స్' ని మనం వివాహోపయుక్తులైన బావలుగా, మఱదళ్ళుగా పరిగణిస్తాం. కనుక cousin brother అనే వాడుక ఆంగ్ల భాషలో లేకపోయినా ఈ సందర్భానికి మాత్రం దాన్ని ఆమోదించి వాడడమైనది)

తండ్రి సోదరుడి కూతురు – పితృవ్యజ cousin sister
తండ్రి సోదరి (మేనత్త) కొడుకు– పితృష్వస్రీయుడు
తండ్రిసోదరి కూతురు (మఱదలు) – పితృష్వస్రీయ
తల్లిసోదరుడి కొడుకు (బావ) – మాతులేయుడు

తల్లి సోదరుడి కూతురు (మఱదలు) – మాతులేయి

తల్లిసోదరి కొడుకు – మాతృష్వస్రీయుడు

తల్లిసోదరి కూతురు – మాతృష్వస్రీయ

సవతి – సపత్ని

సవతికొడుకు – వైమాత్రేయుడు, విమాతృజుడు

సోదరి కుమారుడు (మేనల్లుడు) – భాగినేయుడు

సోదరి కుమార్తె (మేనగోడలు) – భాగినేయి

భార్య – జాయ, కళత్రం, దార (దారాః), పత్ని, గేహిని, పాణిగృహీతి, ద్వితీయ, సహధర్మిణి

భర్త – పతి, ధవుడు, వల్లభుడు, దయితుడు, విభుడు

శ్వశురుడు – మామగారు

శ్వశురి – అత్తగారు

అల్లుడు – జామాత (జామాతృ)

కోడలు – స్నుష

భార్య సోదరుడు (బావమఱిది) – స్యాలకుడు

భార్య సోదరి (మఱదలు) – ననంద (ననందృ)

తోడల్లుడు – షడ్డకుడు

తోడికోడలు (ఏరాలు) – యాత (యాతృ)

భర్తసోదరుడు (మఱిది) – దేవరుడు, దేవ (దేవృ)

3. వృత్తులు

ఉద్యోగం – ఉపాధి, జీవనం, జీవనోపాయం, ఆజీవం, జీవిక, వార్త, వృత్తి,

జీతం – వర్తనం, వేతనం, భృతి

గడన – సంపాదనం, అర్జనం

ధనం – ద్రవ్యం, విత్తం, స్వాపతేయం, రిక్థం, ఋక్థం, ధనం, వసు, ద్రవిణం, ద్యుమ్నం, అర్థం, రై (రా), విభవం, హిరణ్యం (సంస్కృతంలో బంగారపు పర్యాయపదాలన్నీ ధనానికి పర్యాయపదాలుగా వాడతారు)

ఉపాధ్యాయుడు – గురువు, అధ్యాపకుడు, దేశికుడు, ఆచార్యుడు, ఉపదేష్ట, బోధకుడు, శిక్షకుడు

శిష్యుడు – శిష్యుడు, విద్యార్థి, అంతేవాసి, ఛాత్రుడు

ఇప్పుడిప్పుడే నేర్చుకోవడం మొదలుపెట్టినవాడు – శైక్షుడు Beginner

ఇప్పుడిప్పుడే నేర్చుకోవడం మొదలుపెట్టినవారి కోసం వ్రాసిన పుస్తకం – శైక్షకల్పం

ఇప్పటికే కొంత నేర్చుకోవడం వల్ల విద్యలో ముందున్నవారి కోసం వ్రాసిన పుస్తకం – ప్రశ్రుతకల్పం

తమందఱికీ ఒకే గురువు గల విద్యార్థులు – సతీర్థ్యులు, సహాధ్యాయులు Class-mates

యజ్ఞం చేయించేవాడు – అధ్వర్యువు, అగ్నీధ్రుడు, ఋత్విజుడు, యాజకుడు
యజ్ఞం చేసేవాడు – యజమానుడు, హోత (హోతృ)
బ్రహ్మచారి – వర్ణి (వర్ణిన్)
సన్న్యాసి – భిక్షువు, పరివ్రాట్, పరివ్రాజకుడు, కార్మంది, పారాశరి, మస్కరి
రాజు – మూర్ధాభిషిక్తుడు, రాజన్యుడు, రాట్టు (రాట్), విరాట్టు (విరాట్), పార్థివుడు, నృపుడు, భూపుడు, మహీక్షితుడు
అనేకదేశాలకు రాజైనవాడు – సమ్రాట్టు (సమ్రాట్) సార్వభౌముడు, చక్రవర్తి
చిన్నప్రాంతానికి రాజు – మండలేశ్వరుడు, మాండలికుడు
తనకంటే పెద్దరాజుకు లొంగిపోయి కప్పం కడుతున్న చిన్నరాజు – సామంతుడు vassal
మంత్రి (మంత్రిన్) – సచివుడు, ధీసచివుడు, అమాత్యుడు
ఉన్నతాధికారులు – కర్మసచివులు, మహామాత్రులు
పురోహితుడు – పురోధ (పురోధస్), పురోధసుడు
న్యాయమూర్తి – ప్రాడ్వివాకుడు, అక్షదర్శకుడు
వాకిటి కావలివాడు – ప్రతీహారుడు, ద్వారపాలకుడు, ద్వాస్థుడు
భటుడు – రక్షి (రక్షిన్) cop
గ్రామ సర్పంచి – స్థాయుకుడు
బహుగ్రామాలపై అధికారి – గోపుడు
టంకశాల అధికారి – నైష్కికుడు
అంతఃపురాధికారి – అంతర్వంశికుడు
అంతఃపురపు కావలివాడు – సౌవిదుడు, సౌవిదల్లుడు, స్థాపత్యుడు, కంచుకి
సేవకుడు – కింకరుడు, ప్రేష్యుడు, భృత్యుడు, దాసుడు, దాసేరుడు, దాసేయుడు, అనుజీవి, గోప్యకుడు, చేటకుడు, నియోజ్యుడు, భుజిష్యుడు, పరిచారకుడు
జ్యోతిష్కుడు – దైవజ్ఞుడు, జ్యౌతిషికుడు, సాంవత్సరుడు, గణకుడు, మౌహూర్తికుడు, మౌహూర్తుడు, నాక్షత్రికుడు, కార్తాంతికుడు
వ్రాయసకాడు/ గుమాస్తా– లేఖకుడు, లిపికుడు లిపికరుడు, లిపికారుడు, అక్షరచణుడు, అక్షరచుంచువు
దూత – సందేశహరుడు, వార్తాహరుడు
మావటివాడు – హస్తిపకుడు, గజారోహుడు, ఆధోరణుడు, నిషాది (నిషాదిన్)
సారథి – సూతుడు యంత (యంతృ), ప్రాజిత (ప్రాజితృ), క్షత్త (క్షత్తృ)
గుఱ్ఱపు రౌతు – ఆశ్వికుడు, సాది (సాదిన్), అశ్వారూఢుడు
సైనికుడు – భటుడు,
సైన్యాధిపతి – సేనాని
యోధుడు – శస్త్రాజీవుడు, కాండపృష్ఠుడు, ఆయుధీయుడు, ఆయుధికుడు, నైస్త్రింశికుడు
ముందు నడిచేవాడు – నాయకుడు, నేత, పురోగుడు, అగ్రేసరుడు, ప్రష్ఠుడు, అగ్రతస్సరుడు, పురస్సరుడు, పురోగముడు,

పురోగామి

భట్రాజు – మాగధుడు, వంది (వందిన్), స్తుతిపాఠకుడు, స్తోత్రపాఠి

ముష్టివాడు – యాచకుడు

వడ్డీవ్యాపారి – కుసీదికుడు, వార్ధుషికుడు, వార్ధుషి, వృద్ధ్యాజీవుడు

వంటవాడు – సూపకారుడు, వల్లవుడు, ఆరాళికుడు, ఆంధసికుడు, సూదుడు, ఔదనికుడు, గుణుడు

వంటింటి అధికారి – పౌరోగవుడు

గొల్లవాడు – గోపుడు, గోపాలుడు, గోపాలకుడు, గోసంఖ్యుడు, గోదుహుడు, ఆభీరుడు, వల్లవుడు

పశుసంపద గలవాడు – గోమంతుడు, గోస్వామి (గోస్వామిన్), గోమి (గోమిన్)

వ్యాపారి – వణిజుడు (వణిక్), వాణిజుడు, వైదేహకుడు, సార్థవాహుడు, నైగముడు, పణ్యాజీవుడు, ఆపణికుడు, క్రయవిక్రయకుడు

అమ్మేవాడు – విక్రేత (విక్రేతృ), విక్రయికుడు

కొనేవాడు – క్రేత (క్రేతృ)

గుమాస్తా – కరణుడు

వైద్యుడు – భిషజుడు (భిషక్), అంబష్ఠుడు, చికిత్సకుడు

విషవైద్యుడు – జాంగలికుడు

పశువైద్యుడు – జాంతవికుడు

పిచ్చికి వైద్యం చేసేవాడు - స్వాంతికుడు

వివిధ ఎంజినీరింగ్ పనివారు – కారువులు, శిల్పులు

ఆ పనివారి నాయకుడు – కులశ్రేష్ఠి (న్)

పూలదండలు గ్రుచ్చి అమ్మేవాడు – మాలికుడు, మాలాకారుడు

కుమ్మరి – కులాలుడు, కుంభకారుడు

సున్నప్పని చేసేవాడు – పలగండుడు, లేపకుడు

సాలె – తంతువాయుడు, కువిందుడు

దర్జీ – సౌచికుడు, తున్నవాయుడు

చిత్తరువులూ, బొమ్మలూ వ్రాసేవాడు – చిత్రకరుడు, చిత్రకారుడు, రంగాజీవుడు

చెప్పులు కుట్టేవాడు – పాదూకృత్తు (పాదూకృత్), చర్మకారుడు

లోహప్పనులు చేసేవాడు – లోహకారుడు, వ్యోకారుడు

కంసాలి (అగసాలి) – స్వర్ణకారుడు, నాడింధముడు, కళాదుడు, రుక్మకారుడు

వడ్రంగి – తక్ష (తక్షన్), తక్షణుడు, వర్ధకి, త్వష్ట, రథకారుడు, కాష్ఠతట్టు (–తట్ = తష్)

వడ్రంగుల శ్రేణికి గానీ, గ్రామ కాణాచికి గానీ కట్టుబడక స్వతంత్రంగా వడ్రంగప్పని చేసేవాడు – కౌటతక్షుడు

Freelance carpenter

మంగలి – నాపితుడు, దివాకీర్తి, నాపితుడు, క్షురి, ముండి, అంతావసాయి

చాకలి – రజకుడు, నిర్ణేజకుడు
కల్లమ్మేవాడు – శౌండికుడు, మండహారకుడు
మేకలు కాచేవాడు – అజాజీవి (న్), జాబాలుడు
మాయ చేసేవాడు – మాయాకారుకుడు, ప్రాతిహారకుడు
నాట్యకారుడు – శైలాలి (న్), శైలూషుడు, కృశాశ్వి (న్), భారతుడు
వేశ్య – వారవనిత, గణిక, రూపాజీవ, భోగిని
వేశ్యలను విటుల వద్దకు పంపే స్త్రీ – కుట్టని, శంభళి
దేశసంచారం చేసే నట గాయకజనం – చారణులు, కుశీలవులు
స్త్రీవేషాన్ని ధరించే పురుష నర్తకుడు – భ్రకుంసుడు, భ్రుకుంసుడు, భ్రూకుంసుడు
నాట్యగత్తె – నర్తకి, లాసిక
పక్షుల్ని వేటాడేవాడు – జీవాంతకుడు, శాకునికుడు
వలవేసి పట్టేవాడు – వాగురికుడు, జాలికుడు
జాలరి(బెస్త) – కైవర్తుడు, దాశుడు, ధ్వరుడు
మాంసం అమ్మేవాడు – వైతంసికుడు, కౌటికుడు, మాంసికుడు
కూలీవాడు – భృతకుడు, భృతిభుజుడు, కర్మకరుడు, వైతనికుడు
ధాన్యాదుల్ని రవాణా చేసేవాడు (పెఠిక) – వార్తావహుడు, వైవధికుడు
బరువులు మోసి జీవించేవాడు – భారవహుడు, భారికుడు
చిన్నప్పట్నుంచి ఉంచుకొని పెంచబడిన సేవకుడు (పెంపుడుబంటు) – పరాచితుడు, పరిస్కందుడు, పరజాతుడు, పరైధితుడు
బోయవాడు – వ్యాధుడు, మృగవధాజీవుడు, మృగయువు, లుబ్ధకుడు
దొంగ – చోరుడు, హారకుడు, ఐకాగారికుడు, స్తేనుడు, దస్యువు, తస్కరుడు, మోషకుడు, ప్రతిరోధి (న్), పరాస్కంది (న్), పాటచ్చరుడు, మలిమ్లుచుడు

౪. మనఃస్థితులూ, మనస్తత్త్వాలూ

స్థితి – అవస్థ, దశ, సంస్థానం
స్వభావం – సంసిద్ధి, ప్రకృతి, శీలం, నిసర్గ, నిసర్గం
సంతోషం – ముదం (ముత్), ప్రీతి, ప్రమదం, ప్రమోదం, ఆమోదం, సమ్మదం, హర్షం, ఆనందం, ఆనందథువు, శర్మ, శాతం, సుఖం
శ్రేష్ఠవాచకాలు – మతల్లిక, మచర్చిక, ప్రకాండం (ప్రకాండుడు), ఉద్ఘం (ఉద్ఘుడు), తల్లజం (తల్లజుడు)
అదృష్టం – సుదైవం, దిష్టం, భాగధేయం, భాగ్యం, నియతి, విధి
మనోనిశ్చయం – చిభావత్తాభోగం, మనస్కారం, నిర్ణయం

చర్చ – సంఖ్య, విచారణ

ఆలోచన – యోచన, అధ్యాహారం

సంశయం – సందేహం, అనుమానం, ద్వాపరం, విచికిత్స

నాస్తికత – మిథ్యాదృష్టి

అపకారం – వ్యాపాదం, ద్రోహం

భ్రమ – భ్రాంతి, మిథ్యామతి

అంగీకారం – సంవిదం (సంవిత్), ఆగువ (ఆగూ), ప్రతిజ్ఞానం, ప్రతిశ్రవం, ఆశ్రవం, సంశ్రవం, అభ్యుపగమం

అజ్ఞానం – అవిద్య

జాలి – కారుణ్యం, కరుణ, ఘృణ, కృప, దయ, అనుకంప, అనుక్రోశం

నవ్వు – హాసం, హాస్యం

ఘోరమైనది – భైరవం, దారుణం, భీషణం, భీష్మం, భయానకం, భయంకరం, ప్రతిభయం

ఉగ్రం – రౌద్రం

భయం – దరం, త్రాసం, భీతి, భీ, సాధ్వసం

అవమానం – అనాదరం, పరాభవం, పరిభవం, పరీభవం, తిరస్క్రియ, తిరస్కారం, రీఢ, అవమానన, అవజ్ఞ, అవహేళనం, అసూర్క్షణం

సిగ్గు – మందాక్షం, హ్రీ, త్రప, వ్రీడ, లజ్జ, అపత్రప

(వీటిల్లో త్రప, వ్రీడ అనేవి పురుష ముఖావలోకనం చేత స్త్రీలకు కలిగే సిగ్గును సూచిస్తాయి. హ్రీ అనేది తప్పులు చేయడానికి గల సంకోచాన్ని తెలుపుతుంది, inhibition)

ఓర్పు – క్షాంతి, తితిక్ష, సహనం, క్షమ

పరధనాభిలాష – అభిధ్య

మంచి ఉన్నా దాన్ని చెడుగా చేసి మాట్లాడడం – అసూయ

ఓర్వలేనితనం – ఈర్ష్య, అక్షాంతి

శత్రుత్వం – శాత్రవం, వైరం, విరోధం, ద్వేషం

దుఃఖం – మన్యువు, శోకం, శుచం (శుక్/శుచ్), పీడ, బాధ, వ్యథ, ఆమనస్యం, కష్టం, కృచ్ఛ్రం, ఆభీలం

ప్రేమ/స్నేహం – ప్రియత, హార్దం, స్నేహం

స్త్రీపురుషుల మధ్య ఉండేది – అనురాగం

పెద్దలకు పిన్నలయందు ఉండేది – వాత్సల్యం

నమ్మకం – విస్రంభం, విశ్వాసం, ప్రత్యయం

తనకుచితమైన ధర్మం నుంచి చలించడం – భ్రేషం, భ్రంశం

న్యాయం – యుక్తం, ఔపయికం

కోరిక – ఇచ్ఛ, కాంక్ష, స్పృహ, ఈహ, తృట్టు (తృట్/తృష్), తృషం, వాంఛ, లిప్స, కామం, కామన, మనోరథం,

దోహదం, అభిలాష, తర్షం
అదే పనిగా ఒకదానిని కోరడం — లాలస
ఒకదానికి మరగడం (addiction) – లౌల్యం, లోలత్వం లంపటత్వం
మనోవ్యథ — ఆధి
యాతన — కారణ
తహతహ — ఉత్కంఠ, ఉత్కలిక
ఉత్సాహం — కార్యాసక్తి
మోసం — కపటం, వంచన, వ్యాజం, దంభం, ఉపధి, ఛద్మ, కైతవం, కుసృతి, నికృతి, శాఠ్యం, ధౌర్త్యం
ఏమరుపాటు — ప్రమాదం, ప్రమత్తత, అనవధానత
అపూర్వవస్తువును గానీ, అనుభవాన్ని గానీ కోరడం — కుతూహలం, కౌతూహలం, కుతుకం, కౌతుకం
స్త్రీపురుషుల సరసాలు — ద్రవం, కేళి, పరీహాసం, క్రీడ, లీల, నర్మం (నర్మన్)
నెపం — వ్యాజం, అపదేశం, లక్ష్యం
హడావుడి — సంవేగం, సంభ్రమం
తృప్తి — సౌహిత్యం, తర్పణం, తృప్తి
ఎప్పుడూ పురుషసంగమాన్ని అభిలషించే స్త్రీ — వృషస్యంతి, కాముకి
అక్రమసంబంధాలు గల స్త్రీ — పుంశ్చలి, ధర్షణి, బంధకి, అసతి, కులట, ఇత్వరి, స్వైరిణి, పాంసుల
తెలివి గల స్త్రీ — ప్రాజ్ఞ, ధీమతి, చతుర
దిగంబరి — నగ్నిక, కోటవి
పండితుడు — విద్వాంసుడు (విద్వాన్), విద్వానుడు, విపశ్చితుడు (విపశ్చిత్), దోషజ్ఞుడు, సంతుడు (సన్), సుధీ, కోవిదుడు, బుధుడు, ధీరుడు, మనీషి(న్), జ్ఞుడు, ప్రాజ్ఞుడు, సంఖ్యావంతుడు (సంఖ్యావత్), కవి, ధీమంతుడు (ధీమత్), సూరి, కృష్టి, లబ్ధవర్ణుడు, విచక్షణుడు
దూరం ఆలోచించేవాడు — దూరదర్శి, దీర్ఘదర్శి
చదువు పూర్తిచేసినవాడు — సమావృత్తుడు
వ్రతభంగమైనవాడు – అవకీర్ణి
తనకు పట్టనట్లుగా ఉండేవాడు (indifferent) – ఉదాసీనుడు
మౌనం వహించినవాడు — తూష్ణీంభావి Silent, mute
వేగం గలవాడు — తరస్వి(న్), త్వరితుడు, ప్రజవి, జవనుడు
బలవంతుడు — ఊర్జస్వలుడు, ఊర్జస్వి(న్), బలి
జయిస్తేనే గానీ తిరిగిరామని ఒట్టుపెట్టుకున్నవాడు — సంశప్తకుడు
తానే వీరుడని భావించేవాడి మనోభావం – అహోపురుషిక
తానే ముందుండాలనే ఉత్సాహం — అహంపూర్విక
నేనంటే నేనని ముందుకు రావడం — అహమహమిక

శుభం చేసేవాడు – క్షేమంకరుడు, అరిష్టతాతి, శివతాతి, శివంకరుడు
పుణ్యాత్ముడు – సుకృతి(న్), ధన్యుడు
దొడ్డమనసు గలవాడు – మహేచ్ఛుడు, మహాశయుడు, హృదయాళువు, సుహృదయుడు
నేర్పరి – ప్రవీణుడు, నిపుణుడు, అభిజ్ఞుడు, విజ్ఞుడు, నిష్ణాతుడు, శిక్షితుడు, వైజ్ఞానికుడు, కృతముఖుడు, కృతి, కుశలుడు, కోవిదుడు
పూజ్యుడు – ప్రతీక్ష్యుడు
సందేహంలో ఉన్నవాడు – సాంశయికుడు
దానశీలి – వదాన్యుడు, స్థూలలక్షుడు, దానశౌండుడు, బహుప్రదుడు
దీర్ఘాయుష్మంతుడు – జైవాతృకుడు
శాస్త్రం తెలిసినవాడు – అంతర్వాణి
పరీక్షించేవాడు – కారణికుడు
వరాలిచ్చే దేవుడు/దేవి – వరదుడు/వరద, సమర్ధకుడు/సమర్ధకి
సంతోషంలో ఉన్నవాడు – హర్షమాణుడు, వికుర్వాణుడు, ప్రమనుడు (ప్రమనస్/ ప్రమనో), ప్రమనస్కుడు
బాధలో ఉన్నవాడు – దుర్మనుడు (దుర్మనస్/ దుర్మనో), దుర్మనస్కుడు, విమనుడు (విమనస్/ విమనో), విమనస్కుడు, అంతర్మనుడు (అంతర్మనస్/ అంతర్మనో) అంతర్మనస్కుడు
ఆత్రంగా ఉన్నవాడు – ఉత్కుడు, ఉన్మనుడు (ఉన్మనస్/ ఉన్మనో) ఉన్మనస్కుడు
మనసులో కల్మషం లేనివాడు – దక్షిణుడు, సరళుడు, ఉదారుడు
త్యాగమూ, భోగమూ రెండూ గలవాడు – సుకళుడు
ఒకదానియందు ఆసక్తుడు – ప్రసితుడు, తత్పరుడు
ప్రసిద్ధుడు – ప్రతీతుడు, ప్రథితుడు, ఖ్యాతుడు, విత్తుడు, విజ్ఞాతుడు, విఖ్యాతుడు, విశ్రుతుడు, కృతలక్షణుడు, ఆహితలక్షణుడు
ధనికుడు – శ్రీమంతుడు, లక్ష్మీవంతుడు, లక్ష్మణుడు, శ్రీలుడు, ఇభ్యుడు, ఆఢ్యుడు, ధని(న్), అధికర్ధి, సమృద్ధుడు
దరిద్రుడు – అకించనుడు, నిర్ధనుడు, నిఃస్వుడు, దుర్విధుడు, దుర్గతుడు. అశ్రీకుడు
కుటుంబాసక్తుడు (family man) – అభ్యాగారికుడు
అందమైన శరీరం గలవాడు – సింహసంహననుడు
స్థితప్రజ్ఞుడు – నిర్ధార్యుడు
తండ్రిపోలికలు ఎక్కువగా గలవాడు – మనోజవసుడు
స్నేహశీలి (affable) – స్నిగ్ధుడు, వత్సలుడు
జాలిగుండె గలవాడు – దయాళువు, కారుణికుడు, కృపాళువు, సురతుడు
స్వతంత్రుడు – అపావృతుడు, స్వైరి, స్వచ్ఛందుడు, నిరవగ్రహుడు
పరాధీనుడు – పరతంత్రుడు, పరాధీనుడు, పరవంతుడు, నాథవంతుడు, అధీనుడు, నిఘ్నుడు, ఆయత్తుడు, అస్వచ్ఛందుడు, గృహ్యకుడు

ఆలస్యంగా పనిచేసేవాడు – దీర్ఘసూత్రుడు, చిరక్రియుడు Red–tapist
ఆలోచించకుండా పనిచేసేవాడు – జాల్ముడు, అసమీక్ష్యకారి
చాలా నెమ్మదిగా పనిచేసేవాడు – కుంతుడు
సోమరి – మందుడు, తుందుడు, పరిమృజుడు, అలసుడు, శీతకుడు, అనుష్ణుడు
అనాయాసంగా పనిచేసేవాడు – కర్మక్షముడు, అలంకర్మీణుడు
పనికి పూనుకున్నవాడు – క్రియావంతుడు
ఫలితం ఉన్నా లేకపోయినా పనిచేసే స్వభావం గలవాడు – కార్ముడు, కర్మశీలుడు
ఫలోదయం వఱకు పని చేసే దీక్ష గలవాడు – కర్మశూరుడు, కర్మఠుడు
ప్రతిఫలం పుచ్చుకుని పనిచేసిపెట్టేవాడు – కర్మణ్యభుజుడు, కర్మకరుడు (కూలీ)
కూలి అడక్కుండా పనిచేసేవాడు – కర్మకారుడు
ఆకలివేసినవాడు – బుభుక్షితుడు, క్షుధితుడు, అశనాయితుడు
ఇతరులు వండుకున్న అన్నాన్ని తినేవాడు – పరాన్నభుజుడు, పరపిండాదుడు
తిండిపోతు – ఘస్మరుడు, అద్మరుడు
జీవితానికో లక్ష్యమూ, ఆదర్శమూ లేకుండా ఊరికే జీవించడమే పనిగా గలవాడు – ఔదరికుడు
ఇతరుల సంగతి పట్టించుకోకుండా తన పొట్ట మాత్రం నింపుకునేవాడు – ఆత్మంభరి, కుక్షింభరి, స్వోదరపూరకుడు
ఇది తగును, ఇది తగదు అనకుండా ఏది పడితే అది తినేవాడు – సర్వాన్నీనుడు, సర్వభోజి
ఆశపోతు – గృధ్నుడు, గర్ధనుడు, లోలుపుడు
పిచ్చిపట్టినవాడు – ఉన్మాది, సోన్మాదుడు, ఉన్మదిష్ణువు
అహంకారి – అహమ్యువు, అవినీతుడు, సముద్ధతుడు, గర్వి (న్), అవలిప్తుడు, స్మయి(న్), స్మయవంతుడు
మత్తెక్కినవాడు – మత్తుడు, శౌండుడు, ఉత్కటుడు, క్షీబుడు
కాముకుడు – కమితుడు, అనుకుడు, కమ్రుడు, కమిత (కమితృ), కామయిత (తృ), అభికుడు, ఆభీకుడు, కమనుడు, కామనుడు
అణకువ గలవాడు – విధేయుడు, వినీతుడు, ఆశ్రవుడు, వశ్యుడు, ప్రణేయుడు, నిభృతుడు, ప్రశ్రితుడు
దిట్టతనం (గడుసుదనం) గలవాడు (aggressive) – ధృష్టుడు, ధృష్ణువు, వియాతుడు
మెతకమనిషి – శాలీనుడు
సృజనాత్మక మేధావి – ప్రగల్భుడు
ఆశ్చర్యపోయినవాడు – విస్మితుడు, విలక్షుడు
దిగులుపడినవాడు – అధీరుడు, కాతరుడు
పిఱికివాడు – త్రస్నువు, భీరువు, భీరుకుడు, భీలుకుడు
లేనిది వస్తుందని ఆశిస్తున్నవాడు – ఆశంసువు, ఆశంసిత (ఆశంసితృ)
పుచ్చుకునే (స్వభావం గల) వాడు (receptive, recipient) – గ్రహయాళువు, గ్రహీత (తృ)
శ్రద్ధ గలవాడు – శ్రద్ధాళువు, శ్రద్దధానుడు

పడేవాడు – పతయాళువు, పాతుకుడు

సిగ్గరి/ బిడియం గలవాడు/ మొహమాటస్థుడు – లజ్జాశీలుడు, అపత్రపిష్ణువు

మ్రొక్కేవాడు/ నమస్కారం చేసేవాడు – వందారువు

హింసాపరుడు/ చంపే స్వభావం గలవాడు – శరారువు, ఘాతుకుడు, హింస్రుడు, నృశంసుడు, క్రూరుడు, పాపుడు

పెంపొందేవాడు/ పెంపొందుతున్నవాడు – వర్ధమానుడు, వర్ధనుడు, వర్ధిష్ణువు

ఎత్తుకు ఎగసేవాడు – ఉత్పతిష్ణువు, ఉత్పతిత (తృ)

అలంకరించే/ అలంకరించుకునేవాడు – మండనుడు, అలంకరిష్ణువు

(ఒకటి) కాగలవాడు – భూష్ణువు, భవిష్ణువు, భవిత (తృ) [ఈ పదాల్ని స్వతంత్రంగా కాక వేఱే ఏదైనా విశేష్యంతో కలిపి ప్రయోగించాలి. ఉదా :– ఛాత్రీభవిష్ణువు – శిష్యుడు కాగోరేవాడు ఇత్యాది]

ప్రవర్తించేవాడు – వర్తిష్ణువు, వర్తనుడు

[పైదానిలాగే వర్తిష్ణు శబ్దాన్ని కూడా ఇతరపదాల తరువాత, ముఖ్యంగా అవ్యయాల తరువాత కలిపి ప్రయోగించాలి. ఉదా :– ప్రియం వర్తిష్ణువు – ఇష్టమయ్యేలా నడచుకునేవాడు. వర్తనుడనే పదాన్ని మటుకు ఏదైనా ఓ విశేషణానికి తరువాత, సమాసం లో చివఱి అవయవంగా ప్రయోగించవచ్చు. ఉదా :– ఋజువర్తనుడు – ముక్కుసూటిగా నడచుకునేవాడు]

తిరస్కరించేవాడు – నిరాకరిష్ణువు, క్షిప్నువు

గాఢమైనది (దట్టమైనది) – స్నిగ్ధం, సాంద్రం, మేదురం

తెలిసినవాడు – జ్ఞాత (తృ), విదురుడు, విందువు

సమర్థుడు – దక్షుడు, చతురుడు, కుశలుడు, పేశలుడు, పటువు, క్షముడు, ఉత్థానుడు, ఉష్ణుడు

వికసించే స్వభావం గలది – వికస్వరం

వ్యాపించే (పఱచుకునే) స్వభావం గలది – విసృత్వరం, విసృమరం, ప్రసారి, విసారి

ఓర్చుకునేవాడు – సహిష్ణువు, సహనుడు, క్షంత (తృ), తితిక్షువు, క్షమిత (తృ), క్షమి (న్)

కోపించేవాడు – క్రోధనుడు, కోపి, కోపనుడు, అమర్షణుడు

మహాకోపిష్ఠి – చండుడు

మేలుకుని ఉండేవాడు – జాగరూకుడు, జాగరిత (తృ)

కునికిపాట్లుపడేవాడు – ఘూర్ణితుడు, ప్రచలాయితుడు

నిద్రపోతు – స్వప్నజుడు (స్వప్నక్/ స్వప్నజ్), శయాళువు, నిద్రాళువు

పెడమొహంగా ఉన్నవాడు – పరాఙ్ముఖుడు, పరాచీనుడు (స్త్రీ. పరాఙ్ముఖి, పరాచి)

తలొంచుకున్నవాడు – అవాంచుడు (అవాక్/ అవాజ్), అధోముఖుడు (స్త్రీ. అవాఙ్ముఖి, అవాచి)

దేవతల్ని పూజించేవాడు – దేవద్రీచుడు (దేవద్ర్యజ్) (స్త్రీ. దేవద్రీచి)

అన్నిదిక్కులా వ్యాపించినవాడు – విష్వద్రీచుడు (విష్వద్ర్యజ్) (స్త్రీ. విష్వద్రీచి)

ఒకటితో కలిసి వెళ్ళేవాడు – సధ్రీచుడు (సధ్ర్యజ్) (స్త్రీ. సధ్రీచి)

అడ్డంగా నడిచేవాడు – తిరీచుడు (తిర్యజ్) (స్త్రీ. తిరీచి. నపుం. తిరీచం)
వాగేవాడు – వదుడు, వదావదుడు, వాచాలుడు, జల్పాకుడు, వాచాటుడు
బాగా ప్రసంగించేవాడు – వాగీశుడు, వాక్పతి, వాగ్మి, వావదూకుడు
బహిరంగంగా ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడుతున్నవాడు – ఉపన్యాసకుడు
తియ్యగా మాట్లాడేవాడు – ప్రియంవదుడు, శ్లక్ష్ణుడు
అనిష్టాలు మాట్లాడేవాడు – దుర్ముఖుడు, అబద్ధముఖుడు, ముఖరుడు
అర్థం కాకుండా మాట్లాడేవాడు – లోహలుడు, అస్ఫుటాలాపి
కటువుగా అశుభాలు మాట్లాడేవాడు – గర్హ్యవాది, కద్వదుడు
నాంది పలికేవాడు – నాందీవాది, నాందీకరుడు
ప్రతిస్పందన లేనివాడు – జడుడు
మాట్లాడడం రానివాడు – అనేడమూకుడు
కావాలని, లేదా తన స్వభావరీత్యా మాట్లాడకుండా ఊరుకునేవాడు – తూష్ణీకుడు, తూష్ణీంశీలుడు, తూష్ణీంభావి
వెళ్ళగొట్టబడ్డవాడు – నిష్కాసితుడు, అవకృష్టుడు
ధిక్కరించబడినది – ధిక్కృతం, అపధ్వస్తం, ఆత్తగంధం, అభిభూతం
తిరస్కరించబడ్డవాడు – ప్రత్యాఖ్యాతుడు, ప్రత్యాదిష్టుడు, నిరస్తుడు, నిరాకృతుడు, తిరస్కృతుడు, నికృతుడు, విప్రకృతుడు
మోసపోయినవాడు – వంచితుడు, విప్రలబ్ధుడు
అభ్యంతరపెట్టబడినది – అధిక్షిప్తం, ఆక్షిప్తం, ప్రతిక్షిప్తం
చొప్పించబడినది – ప్రక్షిప్తం
బంధించబడినవాడు – బద్ధుడు, కీలితుడు, సంయతుడు
ఆపదలో ఉన్నవాడు – ఆపన్నుడు, విపన్నుడు
శత్రుభయాదుల వల్ల స్వదేశం నుంచి పారిపోయినవాడు – కాందిశీకుడు
నేఱారోపణ రుజువై నిందించబడ్డవాడు (convicted) – ఆక్షారితుడు, క్షారితుడు, అభిశస్తుడు, అభిశంసితుడు
దేనిలోనూ నిలకడ లేనివాడు (Unsettled vagabond) – సంకసుకుడు
జనాన్ని చంపేవాడు (Arsonist) – ఆతతాయి
వ్యసనపరుడు – వ్యసని, వ్యసనార్తుడు, ఉపరక్తుడు
భయశోకాదుల చేత మనశ్శరీరాలు స్వాధీనంలో లేనివాడు – విక్లబుడు, విహ్వలుడు, వ్యాకులుడు, విహస్తుడు, వివశుడు
కశ్యుడు – కొరడాదెబ్బలకు తగినవాడు
చంపదగినవాడు – వధ్యుడు
విషంతో చంపదగినవాడు – విష్యుడు
సత్ప్రవర్తన గలవాడు – శిశ్విదానుడు
చెడ్డవాడు – దుర్జనుడు, కుజనుడు, దుష్టుడు, దుర్మార్గుడు, ఖలుడు
తప్పులనే ఎంచేవాడు – దోషైకదృశుడు (దోషైకదృక్), దోషైకదర్శనుడు, పురోభాగి

కానరాకుండా అపకారం చేసేవాడు – శఠుడు, నికృతుడు, అనృజువు
చాడీలు చెప్పేవాడు – కర్ణేజపుడు, పిశునుడు, సూచకుడు
మోసగాడు – ధూర్తుడు, వంచకుడు, కపటి(న్)
నీచుడు/ అల్పుడు – హీనుడు, తుచ్ఛుడు, జాల్ముడు, క్షుల్లకుడు, క్షుద్రుడు, అపశదుడు
మూర్ఖుడు – అజ్ఞుడు, మూఢుడు, యథాజాతుడు, వైధేయుడు, బాలిశుడు
పిసినారి – కదర్యుడు, కృపణుడు, క్షుద్రుడు, కింపచానుడు, మితంపచుడు
అడుక్కునేవాడు – యాచకుడు, వనీపకుడు, మార్గణుడు, అర్థి
తపస్వి – తాపసుడు, పారికాంక్షి (న్)
మౌనవ్రతం గల సాధకుడు – మౌని (న్), ముని, వాచంయముడు
సత్యవ్రతాన్ని పాటించే తత్త్వదర్శి – ఋషి
ఇంద్రియనిగ్రహం గల సాధకుడు – యతి, దాంతుడు

V. శరీరావయవాలు

శరీరం – దేహం, గాత్రం, వపువు (వపుష్), సంహననం, వర్ష్మం (వర్ష్మన్), విగ్రహం, కాయం, మూర్తి, తనువు (తనూ/ తనుష్)

౧. శరీరం బయట కనిపించే భాగాలు

అవయవం – అంగం, ప్రతీకం, అపఘనం, భాగం
ఇంద్రియం – హృషీకం, విషయి
చర్మం – త్వచం (త్వక్/త్వచ్), అసృగ్వర
మొహం – ముఖం, వదనం, ఆస్యం, వక్త్రం, ఆననం (సంస్కృతంలో నోటిక్కూడా ఇవే వాడతారు.)
తల – శిరం (శిరస్), శీర్షం, ఉత్తమాంగం, మస్తకం, మూర్ధం (మూర్ధన్)
తలవెంట్రుకలు – కేశాలు, శిరోజాలు, శిరోరుహాలు, కచం, వాలాలు, కుంతలాలు, చికురాలు, కైశ్యం
కొప్పు – ధమ్మిల్లం, కేశవేశం
స్త్రీల జడ – వేణి, ప్రవేణి
సన్న్యాసుల/ బ్రహ్మచారుల జడ – సట
ముచ్చిలి (మాడు) – బ్రహ్మరంధ్రం
పుర్రె – కపాలం, కర్పరం, కరోటి, శిరోస్థి
అస్థిపంజరం – కంకాళం

నుదురు (నొసలు) – అలికం, ఫాలం, లలాటం, గోధి
కనుబొమలు – భ్రుకుటి, భ్రూకుటి, భ్రువు (భ్రూ)
కన్ను – నయనం, నేత్రం, లోచనం, ఈక్షణం, చక్షువు (చక్షుష్), అక్షి, దృశం (దృక్/దృశ్), దృష్టి, అంబకం
కనుకొలకు – అపాంగం, కటాక్షం
కనుఱెప్ప – పక్ష్మం
కంటిపాప – తారక, కనీనిక pupil
చెవి – కర్ణం, శ్రోత్రం, శ్రుతి, శ్రవణం, శ్రవం (శ్రవస్), శబ్దగ్రహం
ముక్కు – ఘోణ, నాస, నాసిక, ఘ్రాణం
చెక్కిలి – గండం, కపోలం
దౌడ/ దవడ – హనువు, తాలువు, కాకుదం
గడ్డం – చిబుకం
పెదవి – దశనవాసం (–వాసస్), రదనచ్ఛదం
పైపెదవి – ఓష్ఠం
కింది పెదవి – అధరం
సెలవి (పైపెదవీ, క్రింది పెదవీ కలిసే కొస) – సృక్వి
మీసాలూ, గడ్డాలూ – శ్మశ్రువులు
మెడ – గ్రీవం (గ్రీవన్), శిరోధి, కంధర
ఱొమ్ముపైన, మెడకి ఇఱువైపులా ఉన్న ఎముకలు (collar bones) – జత్రువులు
పెడతల – అవటువు, ఘాట, కృకాటిక
భుజం – భుజం
రెండుభుజాల మధ్యప్రదేశం (సందిలి) – క్రోడం
బాహువు – ప్రవేష్టం, దోషం (దోష్)
చంక – కక్షం, బాహుమూలం
చేయి – హస్తం, పాణి, కరం, శయం
మోచేయి – కపోణి, కూర్పరం
భుజం నుంచి మోచేతి వఱకు – ప్రగండం
మోచేతి నుంచి మణికట్టు వఱకు – ప్రకోష్ఠం
మణికట్టు నుంచి మిగతా చేతి వెలుపలి భాగం – కరభం
మణికట్టు – మణిబంధం
వ్రేలు – అంగుళి, కరశాఖ
గోరు – నఖం, నఖరం, కరరుహం, పునర్భవం
బొటనవేలు – అంగుష్ఠం

చూపుడువేలు — తర్జని, ప్రదేశిని
మధ్యవేలు — మధ్యమ
ఉంగరపు వేలు — అనామిక
చిటికెనవేలు – కనిష్ఠిక
వేలికణుపులు — అంగుళిపర్వాలు
చాచిన వేళ్ళు గల అరచేయి — చపేటం, ప్రతలం, ప్రహస్తం
పిడికిలి — నికుబ్జం, ప్రసృతి
దోసిలి — అంజలి
పిడిమూర — ముష్టి
ఱొమ్ము — ఉరం (ఉరస్), వక్షం (వక్షస్), వత్సం
చన్ను — స్తనం, కుచం, ఉరోజం, వక్షోజం, పయోధరం
చనుమొనలు — చూచుకం, స్తనాగ్రం, కుచాగ్రం
వీపు – పృష్ఠం
మూపు (వీపు పైభాగం) — స్కంధం, భుజశిరం (–శిరస్)
బరులు (చంకల క్రింది భాగాలు) — పార్శ్వాలు
పొట్ట — ఉదరం, కుక్షి, తుందం, జఠరం, పిచండం
కడుపులోని బిడ్డ — భ్రూణం (embryo)
బొడ్డు — నాభి
పొత్తికడుపు – వస్తి
నడుము — మధ్యం, మధ్యమం, అవలగ్నం, వలగ్నం
పురుషుల మొల — కటం, శ్రోణిఫలకం
స్త్రీల మొల – జఘనం
పిఱుదు — నితంబం
మర్మావయవము — ఉపస్థం, ఉపస్థ
యోని — భగం, మదనాలయం
పురుషాంగం — శిశ్నం, మేఢ్రం, శేఫం (శేఫస్), మేహనం, మదనదండం
వృషణం — అండం, అండకోశం, ముష్కం
వీర్యం — రేతం (రేతస్), బీజం, ఇంద్రియం, తేజం (తేజస్) sperm
మర్మావయవానికీ, గుదానికీ మధ్య ప్రదేశం — సీవని perinium
ఆసనద్వారం — గుదం, అపానం, పాయువు
గజ్జలు (పొత్తికడుపూ, తొడలూ కలిసే చోట్లు) — వంక్షణాలు
మోకాలు — జానువు, అష్ఠీవత్తు

తొడ (మోకాళ్ళ పైభాగాలు) – ఊరువు, అంకం, సక్థి

పిక్క (calf – మోకాళ్ళ కింద కాళ్ళ వెనక ఉండే లావుపాటి భాగం) – జంఘ (తెలంగాణలో కొందఱు పిక్కని తొడ అనే అర్థంలో వాడతారు. కాని ఆ రెండూ ఒకటి కావు)

చీలమండ – గుల్ఫం, ఘుటిక

పాదం – పదం (పత్), చరణం, అంఘ్రి

మీగాళ్ళు – ప్రపదం, పాదాగ్రం

మడమ – పార్ష్ణి

పుట్టుమచ్చ – పిప్లువు, జడులం, తిలకం, కాలకం, తిలకాలకం,

౨. శరీరం లోపలి భాగాలు

మాంసం – తరసం, మాంసం, పిశితం, పలలం, క్రవ్యం, ఆమిషం, జాంగలం

నెత్తురు – రుధిరం, అసృజం (అసృక్/ అసృజ్), లోహితం, అస్రం, రక్తం, క్షతజం, శోణితం

గుండె – హృదం, హృది (హృత్/ హృద్), హృదయం

గుండెలోకి రక్తం ప్రవేశిస్తూ, నిర్గమిస్తూ ఉండే ద్వారాలు – హృదయకవాటాలు

మంచిరక్తాన్ని మోసుకెళ్లే రక్తనాళికలు – ధమనులు

చెడురక్తాన్ని మోసుకెళ్ళే రక్తనాళికలు - సిరలు

తీపి పదార్థాల్ని జీర్ణం చేసే రసాలను స్రవించే గ్రంథి – క్లోమం (క్లోమన్), తిలకం

మెదడు – మస్తిష్కం, గోర్దం

ప్రేగు – ఆంత్రం, పురీతత్తు (పురీతత్)

Spleen – ప్లీహం (ప్లీహన్)

కాలేయం – కాలఖండం, యకృత్తు (యకృత్)

కండరం (tendon) – స్నాయువు, వస్నస

నరాలు – నాడులు

క్రొవ్వు – మేదస్సు (మేదస్), వప

ఎముక – కీకసం, కుల్యం, అస్థి

వెన్నెముక – పృష్ఠాస్థి, కశేరుక

పక్కటెముక – పర్శుక

నాలుక – జిహ్వ, రసజ్ఞ, రసన

పన్ను – దంతం, దత్తు (దత్), దశనం, రదనం

౩. శరీరధర్మాలు

ఆహారం – భోజనం, జగ్ధి, జేమనం, నిఘసం, న్యాదం
సంభోగం — మైథునం, వ్యవాయం, నిధువనం, గ్రామ్యధర్మం, సురతం
ఆవులింత — జృంభణం, జృంభం
నిద్ర — నిద్ర, శయనం, స్వాపం, సుషుప్తి, సంవేశం
కల – స్వప్నం
మెలకువ — ఉత్థానం, జాగరణం, జాగృతి
సంతానోత్పత్తి – ప్రజననం
పెఱుగుదల — అభ్యుదయం, వర్ధనం, ఏధనం
మరణం — పంచత, పంచత్వం, కాలధర్మం, అంతం, దిష్టాంతం, అత్యయం, నిధనం, నాశం, మృత్యువు, దీర్ఘనిద్ర, ప్రమీలనం
శోష — తంద్రి, ప్రమీల
వణుకు — వేపథువు, కంపం
ఒళ్ళు గగుర్పొడవడం — రోమాంచం, రోమహర్షణం

౪. శరీర దోషాలూ, మలినాలూ

మలినం — కిట్టం, మలం, మలీమసం, కచ్చరం
పైత్యం — మాయువు, పిత్తం
కఫం — శ్లేష్మం (న్)
చొంగ — లాల, సృణీక, స్యందిని
ఉమ్మి — నిష్ఠీవనం, నిష్ఠీవం
పుసి — దూషిక
కన్నీరు — అశ్రువు, అస్రువు, అస్రం, రోదనం,
గులిమి (గుబిలి) — సింజూషం
చీమిడి – శింఖాణం
చెమట — స్వేదం, ఘర్మజలం, నిదాఘం
మూత్రం — ప్రస్రావం
మలం — పురీషం, ఉచ్చారం, అవస్కరం, శమలం, శకృత్తు, వర్చస్కం, విష్ఠ, విట్టు (విట్ / విష్)
ముట్టురక్తం — ఆర్తవం

౨౫. విలక్షణాలూ, వికృతులూ, వైకల్యాలూ, రోగాలూ

బక్క (సన్న) వాడు — ఛాతుడు, అమాంసుడు, దుర్బలుడు

బలమైనవాడు — మాంసలుడు, అంసలుడు

లావుపాటివాడు — తుందిలుడు, తుందిభుడు, తుంది, పిచండిలుడు, స్థూలకాయుడు

చప్పిడిముక్కువాడు— అవటీటుడు, అవనాటుడు, అవభ్రటుడు

బుఱ్ఱముక్కువాడు – ఖురణసుడు

ముడతలుపడ్డ చర్మం గలవాడు — వలినుడు, వలిభుడు

వికలాంగుడు — పోగండుడు

పొట్టివాడు — ఖర్వుడు, హ్రస్వుడు

దొడ్డికాళ్ళవాడు — ఊర్ధ్వజ్ఞువు, ఊర్ధ్వజానువు

వీపు వంకర చేత వంగిపోయినవాడు — కుబ్జుడు, గడులుడు

మఱుగుజ్జు — పృశ్ని

బట్టతలవాడు — ఖల్వాటుడు

మెల్లకంటివాడు — వలిరుడు, కేకరుడు

గ్రుడ్డి — అంధుడు

చెవిటి — బధిరుడు, ఏడుడు

కుంటివాడు — పంగువు, ఖంజుడు, ఖోడుడు

జబ్బు — రుజం, రుజ, ఉపతాపం, రోగం, రుగ్ణత, వ్యాధి, గదం, ఆమయం

రోగి — వ్యాధితుడు, అపటువు, గ్లానుడు, గ్లాస్నువు, ఆమయావి, ఆతురుడు, అభ్యమితుడు, అభ్యాంతుడు

ఆరోగ్యం — అనామయం

ఆరోగ్యవంతుడు — వార్తుడు, నిరామయుడు, కల్యుడు

జబ్బునుంచి కోలుకున్నవాడు — ఉల్లాఘుడు

వైద్యుడు — రోగహారి, అగదంకారుడు, అగదంకరుడు, భిషజుడు (భిషక్), చికిత్సకుడు

మందు — భేషజం, ఔషధం, భైషజ్యం, అగదం, జాయువు

క్షయ — యక్ష్మ, శోషం

జలుబు — పీనసం, ప్రతిశ్యాయం

తుమ్ము — క్షుతం, క్షవం

దగ్గు — కాసం, క్షవథువు

వాపు – శోఫం, శోథం, శ్వయథువు

చర్మం మీది మచ్చలు — కిలాసం, సిధ్మ

గజ్జి — కచ్చువ (కచ్చూ), పామం. పామ, విచర్చిక

దురద – కండువ (కండూ), ఖర్జువ (ఖర్జూ), కండూయ, కండూతి
బొబ్బ – విస్ఫోటం, పిటకం
పుండు – వ్రణం, ఈర్మం, అరుష్షు
సెగ్గడ్డ – నాడీవ్రణం
బొల్లి – శ్విత్రం
ఎఱ్ఱబొల్లి – కోకం, మండలకం
మొలలు – దుర్నామకం, అర్శం, అర్శ (అర్శస్/ అర్శో)
అతిసారం – గ్రహణి, ప్రవాహిక
కక్కులు/ డోకులు – ప్రచ్ఛర్దిక, వమి, వమథువు
Abscess – విద్రధి
Fistula – భగందరం
బట్టతల – ఇంద్రలుప్తకం
బోదకాలు (ఏనుగుకాలు) – శ్లీపదం
మూత్రపిండాల్లో ఱాళ్ళు – మూత్రకృచ్ఛ్రం, అశ్మరి
దద్దుర్లు – దద్రువులు
ఆకలి – అశనాయ, బుభుక్ష, క్షుత్తు (త్)
దాహం – ఉదన్య, పిపాస, తృట్టు (తృట్/ తృష్), తర్షం
ముసలితనం – జర, వార్ధకం, వార్ధక్యం, స్థావిర్యం, విస్రస
యౌవనం – తారుణ్యం

VI. వివిధ పదార్థాలు

౧. వండనివి

అమృతం – పీయూషం, సుధ
కుంకుమ – కాశ్మీరికం, అగ్నిశిఖం, వరం, బాహ్లికం, పీతనం, పిశునం, ధీరం, లోహితం
లక్క – లాక్ష, రాక్ష, జతువు, యావం, అలక్తం, ద్రుమామయం
అగరు – వంశకం, అగురువు, రాజార్హం, క్రిమిజం, జోంగకం
నల్ల అగరు – కాలాగురువు
కస్తూరి – మృగనాభి, మృగమదం
కర్పూరం – హిమవాలుకం, సితాభ్రం, ఘనసారం

చందనం – గంధసారం, మలయజం, భద్రశ్రీ

హరిచందనం – తైలపర్ణికం, గోశీర్షం

ఎఱ్ఱచందనం – తిలపర్ణి, పత్రాంగం, రంజనం, కుచందనం

మైపూత – వర్ణకం, విలేపనం

లోహం (Metal) – తైజసం

బంగారం – స్వర్ణం, సువర్ణం, కనకం, హిరణ్యం, హేమం (హేమన్), హాటకం, తపనీయం, శాతకుంభం, గాంగేయం, భర్మం (భర్మన్), కర్బురం, చామీకరం, జాతరూపం, మహారజతం, కాంచనం, రుక్మం, కార్తస్వరం, జాంబూనదం, అష్టాపదం.

రత్నం – మణి, వారిజం

పగడం, విద్రుమం – ప్రవాళం

వెండి – రజతం, రూప్యం, దుర్వర్ణం, ఖర్జూరం, శ్వేతం

రాగి – తామ్రం, తామ్రకం, శుల్బం, మ్లేచ్ఛముఖం, ద్వ్యష్టం, వరిష్ఠం, ఉదుంబరం

ఇనుము – లోహం, అయస్సు (అయస్/ అయో), కాలాయసం, శస్త్రకం, తీక్ష్ణం, అశ్మసారం

ఇనప త్రుప్పు – మండూరం, సింహాణం

ఇత్తడి – ఆరకూటం, రీతి

గాజు (glass) – కాచం

పాదరసం – పారదం, చపలం, రసం, సూతం,

సీసం – నాగం, సీసం, యోగేష్టం, వప్రం

తగరం – త్రపువు, పిచ్చటం

మైలుతుత్తం – తుత్థాంజనం, శిఖిగ్రీవం, మయూరకం, కర్పరి

దూది – పిచువు, తూలం

దారం – సూత్రం

మైనం – మధూచ్ఛిష్టం, సిక్థకం

విషం – క్ష్వేళం, గరళం

విషాల్లో రకాలు – హాలాహలం (హలాహలం), కాకోలం, కాలకూటం, సౌరాష్ట్రికం, శౌక్లికేయం, బ్రహ్మపుత్రం, ప్రదీపనం, దారదం, వత్సనాభం

౨. వండినవి

వంటకం – భిస్స, భక్తం, అంధం (అంధస్, అన్నం, మోదనం, దీదివి

భోజనం – ఆహారం, జగ్ధి, జేమనం, నిఘసం, న్యాదం

ఊరగాయ – అవదంశం

పాలు – దుగ్ధం,క్షీరం, పయస్సు (పయస్/ పయో)

జున్నుపాలు – పీయూషం

పయస్యం – పాలతో చేసిన తిండిపదార్థం (milk product)

పాయసం – పరమాన్నం

పెఱుగు – దధి

మజ్జిగ – దండాహతం, కాలశేయం, గోరసం, తక్రం, ఉదశ్విత్తు (త్), మథితం

మీగడ – మండం, మస్తువు

వెన్న – నవనీతం, మ్రక్షణం

గొడుగెత్తిన పెఱుగు – ఆమిక్ష *(ఇది గాలితోనూ, కఱుడుగట్టిన బుడగలతోనూ, దుర్వాసనతోనూ కూడి తినడానికి పనికిరాకుండా ఉంటుంది. చాలా వేడిగా ఉన్న పాలని తొందఱపడి తోడుపెడితే ఇలా జఱుగుతుంది)*

మజ్జిగపులుసు – తేమనం, నిష్ఠానం

ఉప్పు – లవణం

మరమరాలు – ధానాలు

పిండివంట – పూపం, అపూపం, పిష్టకం

ముద్ద – గ్రాసం, కబళం

ఎంగిలి – ఫేల

కల్లు – సుర, హలిప్రియ, హాల, పరిస్రుత్తు (త్), పరిస్రుత, వారుణి, వరుణాత్మజ, గంధోత్తమ, ప్రసన్న, ఇర, కాదంబరి, మదిర, కశ్యం

ఇప్పపూలతో చేసిన కల్లు – మధ్వాసవం, మాధవకం, మధువు

ద్రాక్షసారా – మార్ద్వీకం

వివిధ పదార్థాల్ని కలిపి చేసిన సారా – మైరేయం, ఆసవం, శీధువు

నోటివాసనను ఇంపుగా చేసే పదార్థం – ఆమోది Mouth freshener

VII. సాధనాలూ, ఆయుధాలూ

వీణ – వల్లకి, విపంచి, పరివాదిని

మద్దెల – మృదంగం, మురజం

ఢక్క – యశం (స్), పటహం

పెద్దడప్పు – భేరి, దుందుభి

తప్పెట – ఆనకం

పిల్లనగ్రోవి – వేణువు

వల – ఆనాయం, జాలం

వలత్రాడు – శణసూత్రం,

చేపల బుట్ట – కువేణి, మత్స్యాధాని

గాలం – బడిశం

నేలను త్రవ్వే సాధనం – ఖనిత్రం, అవదారణం

కొడవలి – దాత్రం, లవిత్రం

పశువుల మెడకు కట్టే పలుపుతాడు – యోక్త్రం

పశువుల్ని కట్టే కొయ్య – శివకం, కీలకం

దర్భాసనం – బృసి

మృగచర్మం – అజినం, కృత్తి

వింజామర – చామరం

సింహాసనం – భద్రాసనం

గొడుగు – ఛత్రం, ఆతపత్రం

భృంగారం – బంగారుబిందె

బంధనార్థం మెడకు వేసే ఇనపగొలుసు – అందుకం, నిగళం

అంకుశం – సృణి

వాహనాల్ని లాగే పెంపుడుజంతువుల్ని తోలే ముల్లుకఱ్ఱ – తోత్రం, తోదనం, ప్రాజనం

